మన సమగ్ర
ప్రజావాణి
తెలుగు డైలీ
RNI NO:TGTEL/25/A5443
MANA SAMAGRA PRAJAVANI TELUGU DAILY

రాజన్న సిరిసిల్ల	గురువారం	29.10.2026	సంపుటి : 01	సంచిక : 299	పేజీలు : 12	వెల : 2/-
RAJANNA SIRICILLA	THURSDAY	29.10.2026	Volume : 01	Issue :299	Pages : 12	Cost : 2/-

Wanted Reporters
తెలుగు రాష్ట్రాలలో దిగ్విజయంగా నడుపబడుతున్న
ప్రజావాణి దిన పత్రిక మరియు మన ప్రజావాణి NEWS TV చానల్
నందు పనిచేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా
విలేఖరులు కావలెను
(కొత్తవారికి అవకాశం, అనుభవం కల వారికి ప్రాధాన్యత)
Ph: 9440032006

కేంద్ర ఉద్యోగులకు
3 శాతం డీఏ పెంపు

48.54 లక్షల మంది ఉద్యోగులు, 68.71 లక్షల మంది పెన్షనర్లకు లబ్ధి

న్యూఢిల్లీ,అక్టోబర్ 28 : కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు కేంద్ర ప్రభుత్వం తీపికబురు అందించింది. కరవు భత్యం (డీఏ), కరవు ఉపశమనం (డీఆర్)ను 3 శాతం పెంచుతూ కేంద్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన బుధవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుతం 60 శాతంగా ఉన్న డీఏ, డీఆర్ తాజా పెంపుతో 63 శాతానికి చేరనున్నాయి. ఈ పెంపు 2026 జూలై 1 నుంచి అమల్లోకి వస్తుంది. దేశవ్యాప్తంగా సుమారు 48.54 లక్షల మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, 68.71 లక్షల మంది పెన్షనర్లు ప్రయోజనం పొందనున్నారు. ఈ నిర్ణయంతో ప్రభుత్వ ఖజానాపై ఏడాదికి రూ.10,016.10 కోట్ల అదనపు భారం పడనుంది. పెరిగిన ధరల ప్రభావం నుంచి ఉద్యోగులు, పెన్షనర్లకు కొంత ఉపశమనం కల్పించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు కేంద్రం మిగతా2లో...

కరువును సమిష్టిగా
ఎదుర్కొందాం!

అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలి

ముందస్తు చర్యలు చేపడుతున్నాం.. కేంద్రానికి ఇప్పటికే నివేదిక పంపించాం

అవసరమైతే ఢిల్లీకి అఖిలపక్ష బృందం

విపక్షాల సూచనలను పరిగణనలోకి తీసుకుంటాం: ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

హైదరాబాద్,అక్టోబర్ 28 : ఎల్‌నినో ప్రభావంతో తెలంగాణలో ఏర్పడిన కరువు పరిస్థితులను అందరం కలిసికట్టుగా ఎదుర్కొందామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అఖిలపక్ష నేతలకు విజ్ఞప్తి చేశారు. కరువు నివారణకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని ముందస్తు చర్యలు చేపడుతోందని తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ఆయన అధ్యక్షతన ఎల్‌నినో మిగతా2లో...

అప్రమత్తంగా
ఉండండి..

- తాగునీటి సమస్య రానివ్వొద్దు!

ఎల్‌నినో నేపథ్యంలో అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు

క్యూర్ ఏరియాలో మురుగునీటి శుద్ధి కేంద్రాలు వందశాతం పనిచేయాలి

భవన నిర్మాణాలు, పార్కులు, రోడ్ల శుభ్రతకు శుద్ధి చేసిన నీటినే వినియోగించాలి

శుద్ధి చేసిన నీటి సరఫరాపై నిరంతర పర్యవేక్షణ.. నవంబర్ 1 నుంచి ఆదేశాల అమలు

హైదరాబాద్,అక్టోబర్ 28 : ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో తాగునీటి సరఫరా విషయంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి ఉన్నతాధికారులను ఆదేశించారు. హైదరాబాద్ నగరంలో ఎట్టి పరిస్థితుల్లోనూ తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని జలాశయాల్లో నీటి నిల్వలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. తాగునీటి సరఫరా, మురుగునీటి శుద్ధి కేంద్రాల నిర్మాణం, శుద్ధి చేసిన నీటి వినియోగంపై బుధవారం హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ

వనరుల అభివృద్ధి కేంద్రంలో సీఎం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ క్యూర్ ఏరియాలోని మురుగునీటి శుద్ధి కేంద్రాలు (ఎస్టీపీలు) వందశాతం సామర్థ్యంతో మిగతా2లో...

ఓటరు జాబితాలో పేరుంటే మళ్లీ ఫారం6 ఎందుకు?

- ఎన్నికల సంఘాన్ని ప్రశ్నించిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ,అక్టోబర్ 28 : ఢిల్లీలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై సుప్రీంకోర్టు కీలక ప్రశ్నలు లేవనెత్తింది. గతంలో ఓటర్లుగా నమోదైన వారి పేర్లు తొలగించినప్పుడు, మళ్లీ ఫారం6 సమర్పించాలని ఎందుకు కోరుతున్నారని ఎన్నికల సంఘాన్ని ప్రశ్నించింది. సాధా రణంగా కొత్తగా ఓటరుగా నమోదు చేసుకునేవారు ఫారం6 ఉపయోగిస్తారని ధర్మాసనం గుర్తుచేసింది.ప్రధాన న్యాయ మూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని మిగతా2లో...

ఏపీలో పరిషత్ ఎన్నికలు
వాయిదా!

● నవంబర్ 5న ఎంపీటీసీ, జడ్పీటీసీ పోలింగ్

● 7వ తేదీన ఓట్ల లెక్కింపు.. ఎన్నికల సంఘం షెడ్యూల్‌లో మార్పులు

అమరావతి,అక్టోబర్ 28 : ఆంధ్రప్రదేశ్‌లో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల షెడ్యూల్‌లో రాష్ట్ర ఎన్నికల సంఘం కీలక మార్పులు చేసింది. నవంబర్ 3న నిర్వహించాల్సిన పోలింగ్‌ను నవంబర్ 5కు వాయిదా వేసింది. అదే రోజు జరగాల్సిన ఓట్ల లెక్కింపును నవంబర్ 7కు మార్చింది. ఈ మేరకు ఎన్నికల సంఘం బుధవారం ప్రకటన విడుదల చేసింది. ఎన్నికల నిర్వహణలో సిబ్బంది కొరత, ఇతర ఏర్పాట్ల పరంగా ఇబ్బందులు తలెత్తకుండా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. **మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్‌లోనూ మార్పులు** ఇప్పటికే పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్‌లో ఎన్నికల సంఘం మార్పులు చేసింది. మిగతా2లో...

ఉద్యోగులు ఏఐపై అవగాహన
పెంచుకోవాలి

- ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు సాంకేతికతను వినియోగించాలి: భట్టి విక్రమార్క

2లో

వణికిస్తున్న అర్నాబ్
తుపాను!

పంటలకు తీవ్ర నష్టం.. అప్రమత్తమైన అధికార యంత్రాంగం

2లో

మోడీ ఫాసిస్టు పాలనకు నూకలు చెల్లే రోజులు దగ్గర్లోనే!

● ఎన్ని అడ్డంకులు సృష్టించినా ఢిల్లీ వెళ్లి తీరుతాం: మహేశ్‌కుమార్ గౌడ్ ● ప్రత్యేక రైళ్లు కేటాయించకపోవడంపై కాంగ్రెస్ నేతల ఆగ్రహం

హైదరాబాద్,అక్టోబర్ 28 : మోడీ ఫాసిస్టు పాలనకు నూకలు చెల్లే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. నవంబర్ 1న ఢిల్లీలో నిర్వహించనున్న 'ఓట్ బచావోదేశ్ బచావో' నిరసన కార్యక్రమానికి వెళ్లేందుకు మిగతా2లో...

రాష్ట్రంలో ఎమర్జెన్సీ
తరహా పాలన!

సబితా ఇంద్రారెడ్డి హౌస్ అరెస్టుపై హరీశ్‌రావు ఖండన

ప్రజల గొంతు నొక్కడం సరికాదు: నిరంజన్‌రెడ్డి

హైదరాబాద్,అక్టోబర్ 28: మూసీ ప్రజాభిప్రాయ సేకరణకు వెళ్లకుండా మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డిని గృహ నిర్బంధం చేయడంతో పాటు, ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్, బీఆర్ఎస్ నేత కార్తిక్‌రెడ్డిని అరెస్టు చేయడాన్ని బీఆర్ఎస్ఎల్పీ ఉపనేత, మాజీ మంత్రి టి. హరీశ్‌రావు తీవ్రంగా ఖండించారు. ప్రతిపక్ష నేతలను నిర్బంధిస్తూ రాష్ట్రంలో ఎమర్జెన్సీ తరహా పాలన సాగించడం సిగ్గుచేటని బుధవారం విడుదల చేసిన ప్రకటనలో విమర్శించారు.

మిగతా2లో...

అప్రమత్తంగా ఉండండి..

(మొదటి పేజీ తరువాయి)

పనిచేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. శుద్ధి చేసిన నీటిని వృథా చేయకుండా వివిధ అవసరాలకు వినియోగించేలా సమగ్ర ప్రణాళిక రూపొందించాలని సూచించారు. భవిష్యత్తులో నీటి అవసరాలు పెరిగే అవకాశాలను దృష్టిలో పెట్టుకుని ఇప్పటి నుంచే తగిన ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు. **భవన నిర్మాణాల్లో శుద్ధి చేసిన నీటినే వాడాలి** సచివాలయం, ముఖ్యమంత్రి కార్యాలయం, ఔటర్ రింగ్ రోడ్డు, మెట్రో రైలు పరిధి, ఇతర ప్రభుత్వ కార్యాలయాల్లో పచ్చదనం నిర్వహణకు శుద్ధి చేసిన నీటిని వినియోగించాలని సీఎం సూచించారు. పబ్లిక్ పార్కుల నిర్వహణ, రోడ్ల శుభ్రతకు కూడా శుద్ధి చేసిన నీటినే ఉపయోగించాలని ఆదేశించారు. భవన నిర్మాణాల్లో శుద్ధి చేసిన నీటిని వినియోగించాలనే నిబంధనను కచ్చితంగా అమలు చేయాలని స్పష్టం చేశారు. ప్రైవేటు మురుగునీటి శుద్ధి కేంద్రాల ఏర్పాటును ప్రోత్సహించాలని, డేటా కేంద్రాలకు కూడా శుద్ధి చేసిన నీటిని సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎస్టీపీల నిర్వహణకు సౌర విద్యుత్తును వినియోగించే అవకాశాలను పరిశీలించాలని సంబంధిత అధికారులకు తెలిపారు. శుద్ధి కేంద్రాల్లో ఆధునిక సాంకేతిక ప్రమాణాలను పాటించాలని, నీటి నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడకూడదని స్పష్టం చేశారు. **శుద్ధి కేంద్రాలపై నిరంతర పర్యవేక్షణ** ప్రతి మురుగునీటి శుద్ధి కేంద్రం వద్ద ప్రత్యేక అధికారిని నియమించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. అన్ని కేంద్రాలను కమాండ్ కంట్రోల్ కేంద్రంతో అనుసంధానించి, వాటి పనితీరును నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. శుద్ధి చేసిన నీటిని సరఫరా చేసే ట్యాంకర్లను గుర్తించి పర్యవేక్షించేందుకు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలని తెలిపారు. ఈ నీటి వినియోగంపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని, శుద్ధి చేసిన నీటి సరఫరా కోసం ప్రత్యేక టోల్‌ఫ్రీ నంబర్‌ను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎస్టీపీల నిర్వహణ, శుద్ధి చేసిన నీటి వినియోగానికి సంబంధించి నవంబర్ 1 నుంచి ఆదేశాలు అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టం చేశారు. ప్రస్తుతం 26 మురుగునీటి శుద్ధి కేంద్రాల నుంచి శుద్ధి చేసిన నీటిని పచ్చరంగు ట్యాంకర్ల ద్వారా పంపిణీ చేస్తున్నట్లు జలమండలి అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. వినియోగదారుల నుంచి కేవలం రవాణా ఛార్జీలు మాత్రమే వసూలు చేస్తున్నామని, నీటిని ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. **సమీక్షలో ఉన్నతాధికారులు** ఈ సమీక్షా సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ముఖ్యమంత్రి కార్యాలయ కార్యదర్శి మాణిక్‌రాజ్, పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్, సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ సృజన, మల్కాజిగిరి మున్సిపల్ కమిషనర్ వినయ్‌కృష్ణారెడ్డి, జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి, టీజీఎస్‌పీడీసీఎల్ ఎండీ జితేష్ వి. పాటిల్, కాలుష్య నియంత్రణ మండలి సభ్య కార్యదర్శి రవి, సమాచార పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ ముకుందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కరువును సమిష్టిగా ఎదుర్కొందాం!

(మొదటి పేజీ తరువాయి)

ప్రభావం, వర్షాభావ పరిస్థితులపై అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుత విపత్కర పరిస్థితుల్లో రాజకీయ విమర్శలకు తావివ్వకుండా ప్రజా ప్రయోజనాలే లక్ష్యంగా అన్ని పార్టీలు ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. **కేంద్రానికి నివేదిక.. అవసరమైతే ఢిల్లీకి అఖిలపక్షం** రాష్ట్రంలో నెలకొన్న కరువు పరిస్థితులపై కేంద్ర ప్రభుత్వానికి ఇప్పటికే నివేదిక పంపించామని భట్టి విక్రమార్క వెల్లడించారు. అవసరమైతే అఖిలపక్ష ప్రతినిధి బృందాన్ని ఢిల్లీకి తీసుకెళ్లి తెలంగాణకు రావాల్సిన సహాయంపై కేంద్రాన్ని కోరుతామని తెలిపారు. సమావేశంలో వివిధ పార్టీల నేతలు చేసిన సూచనలను నమోదు చేసుకున్నామని, సాధ్యమైన మేరకు వాటిని ప్రభుత్వ కార్యాచరణలో భాగంగా అమలు చేసేందుకు ప్రయత్నిస్తామని చెప్పారు. ఎల్‌నినో ప్రభావంపై గతంలో శాసనసభలో చర్చించామని, శాస్త్రవేత్తలు, నిపుణులతో సంప్రదింపులు జరిపామని వివరించారు. కరువు పరిస్థితులపై అధ్యయనం చేసేందుకు ప్రభుత్వం కమిటీని ఏర్పాటు చేసిందని, ప్రజల్లో అవగాహన కల్పించేందుకు చర్యలు చేపట్టిందని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో ఎదురయ్యే పరిస్థితులను ముందుగానే అంచనా వేసి అవసరమైన సన్నద్ధతతో ఉన్నామని తెలిపారు. **తాగునీరు, పశువుల మేతకు ప్రాధాన్యం** దేశవ్యాప్తంగా వర్షపాతం లోటు ఉండటంతో పాటు ఎగువ రాష్ట్రాల్లోనూ వర్షాలు తక్కువగా కురవడం వల్ల ప్రాజెక్టుల్లోకి నీటి ప్రవాహాలు తగ్గాయని భట్టి విక్రమార్క ఆందోళన వ్యక్తం చేశారు. రిజర్వాయర్లలో అందుబాటులో ఉన్న నీటి నిల్వలను దృష్టిలో ఉంచుకుని వనరులను సమర్థంగా వినియోగించుకునేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. వర్షాభావ ప్రభావాన్ని తగ్గించేందుకు శాఖలవారీగా సమన్వయంతో చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు.

రాష్ట్రంలో ఎమర్జెన్సీ తరహా పాలన!

(మొదటి పేజీ తరువాయి)

రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు కాంగ్రెస్ ప్రభుత్వం కరువు బారిన పడిన రైతులను, కష్టాల్లో ఉన్న ప్రజలను ఆదుకోవడం మానేసి, మూసీ ప్రక్షాళన పేరుతో రూ. 1.50 లక్షల కోట్లు ఖర్చు చేస్తామని చెప్పడం ఏమిటని హరీశ్‌రావు ప్రశ్నించారు. కరువు బాధిత రైతులను ఆదుకోవడంపై చూపాల్సిన శ్రద్ధను ప్రభుత్వం చూపడం లేదని విమర్శించారు. **రైతులకు ఎకరాకు రూ. 50 వేల పరిహారం ఇవ్వాలి** మూసీ ప్రజాభిప్రాయ సేకరణకు వెళ్లకుండా తనను, తన కుమారుడిని గృహ నిర్బంధం చేయడంపై మాజీ మంత్రి పి. సబితా ఇంద్రారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులను ఆదుకోకుండా మూసీ ప్రాజెక్టుకు రూ. 1.40 లక్షల కోట్లు ఖర్చు చేస్తామనడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కరువు బారిన పడిన రైతులకు ఎకరాకు రూ. 50 వేల పరిహారం చెల్లించాలని, కాళేశ్వరం నీటిని వినియోగించి పంటలను కాపాడాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నిర్బంధాలకు పాల్పడినా ప్రజా సమస్యలపై బీఆర్ఎస్ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. **ప్రజాభిప్రాయ సేకరణ అందరితో జరపాలి** ప్రజాభిప్రాయ సేకరణ పేరుతో ప్రజల గొంతు నొక్కడం సరికాదని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. సబితా ఇంద్రారెడ్డి, ఇతర బీఆర్ఎస్ నేతల అరెస్టులను అక్రమంగా అభివర్ణించారు. మూసీ ప్రజాభిప్రాయ సేకరణ విషయంలో ప్రభుత్వం విభజించి పాలించే విధానాన్ని అనుసరిస్తోందని విమర్శించారు. ప్రజలందరితో ఒకేసారి అభిప్రాయ సేకరణ జరపాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ తప్పులకు ప్రజాక్షేత్రంలో శిక్ష తప్పదని హెచ్చరించారు.

12 మంది ఐఏఎస్ అధికారుల బదిలీలు

- జయేష్ రంజన్‌కు పర్యావరణ శాఖ
- వికాస్ రాజ్‌కు ఇంధన శాఖ బాధ్యతలు

హైదరాబాద్, అక్టోబర్ 28 : తెలంగాణ రాష్ట్రంలో పరిపాలనా సౌలభ్యం, శాఖల నిర్వహణ అవసరాల దృష్ట్యా ప్రభుత్వం 12 మంది ఐఏఎస్ అధికారులను బదిలీ చేసింది. పలువురు అధికారులకు అదనపు బాధ్యతలు అప్పగించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీలు, నియామకాలు తక్షణమే అమల్లోకి వస్తాయని పేర్కొన్నారు. సీనియర్ ఐఏఎస్ అధికారి జయేష్ రంజన్‌ను పర్యావరణం, అటవీ, శాస్త్ర సాంకేతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా నియమించారు. పర్యావరణ పరిరక్షణ శిక్షణ, పరిశోధన సంస్థ (ఈపీటీఆర్ఐ) డైరెక్టర్ జనరల్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. రవాణా, రోడ్లు, భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఉన్న వికాస్ రాజ్‌ను ఇంధన శాఖకు బదిలీ చేశారు. ఇంధన శాఖలో పనిచేస్తున్న నవీన్ మిట్టల్‌ను పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్య శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా నియమించారు. ఏ. వాణిప్రసాద్‌కు తెలంగాణ పురావస్తుశాఖ డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. శైలజా రామయ్యర్‌ను రెవెన్యూ శాఖలో దేవాదాయ విభాగం ప్రభుత్వ ముఖ్య కార్యదర్శిగా నియమించారు. కే. ఇలంబర్తిని రవాణా, రహదారులు, భవనాల శాఖ కార్యదర్శిగా నియమించి, రవాణా శాఖ కమిషనర్ బాధ్యతలు కూడా అప్పగించారు. ఆయన పశుసంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్యశాఖల కార్యదర్శిగా అదనపు బాధ్యతల్లో కొనసాగుతారు. హెచ్ఎండీఏ మెట్రోపాలిటన్ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్‌కు మెట్రోపాలిటన్ ఏరియా, పట్టణాభివృద్ధి శాఖ కార్యదర్శిగా, జీహెచ్ఎంసీ, సైబరాబాద్, మల్కాజిగిరి పురపాలక సంస్థల ప్రత్యేక అధికారిగా అదనపు బాధ్యతలు అప్పగించారు. రాహుల్ బొజ్జాకు గిరిజన సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి బాధ్యతలు అదనంగా ఇచ్చారు. ఆయన వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ బాధ్యతల్లోనూ కొనసాగుతారు. మహిళా, శిశు సంక్షేమం, దివ్యాంగుల సంక్షేమ శాఖ ప్రత్యేక కార్యదర్శిగా శృతి ఓఝాను నియమించారు. ఎస్. సంగీత సత్యనారాయణను ఆ శాఖ డైరెక్టర్‌గా నియమించారు. మహమ్మద్ ముషారఫ్ అలీ ఫారూఖీని ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్‌గా నియమించి, తెలంగాణ రైతు విద్యుత్తు పంపిణీ సంస్థ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. టీజీఎస్‌పీడీసీఎల్ సీఎండీ జితేష్ వి. పాటిల్‌కు తెలంగాణ పునరుత్పాదక ఇంధన అభివృద్ధి సంస్థ ఉపాధ్యక్షుడు, నిర్వహణ సంచాలకుడిగా అదనపు బాధ్యతలు ఇచ్చారు. పదవీ విరమణ నేపథ్యంలో ఎం. దానకిశోర్‌ను గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా తిరిగి నియమించారు.

నేడు ఢిల్లీకి సీఎం రేవంత్‌రెడ్డి

- ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ ప్రచార కార్యక్రమంలో పాల్గొననున్న ముఖ్యమంత్రి

హైదరాబాద్, అక్టోబర్ 28 : ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి గురువారం ఢిల్లీకి బయలుదేరి వెళ్లనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిం చనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ ప్రచార కార్యక్రమంలో ఆయన పాల్గొంటారు. డిసెంబర్ 7 నుంచి 9 వరకు భారత్ ఫ్యూచర్ సిటీలో జరగనున్న ఈ సదస్సు ద్వారా తెలంగాణలో పెట్టుబడుల అవకాశాలను పారిశ్రామికవేత్తలు, అంతర్జాతీయ ప్రతినిధులకు వివరించనున్నారు. ఇదిలా ఉండగా, నవంబర్ 4న హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించనున్న సదర్ ఉత్సవానికి హాజరుకావాలని శ్రీ కృష్ణ సదర్ సమ్మేళనం ఉత్సవ కమిటీ ప్రతినిధులు సీఎం రేవంత్‌రెడ్డిని ఆహ్వానించారు. ఈ మేరకు గురువారం ఆహ్వాన పత్రిక అందజేశారు. కార్యక్రమంలో కమిటీ ఛైర్మన్, మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్, రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్, యాదాద్రి బోర్డు సభ్యురాలు ఈశ్వరమ్మ యాదవ్, మేడ్చల్ డీసీసీ అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ఉద్యోగులకు 3 శాతం డీఏ పెంపు

(మొదటి పేజీ తరువాయి)

వెల్లడించింది. **గ్రామీణాభివృద్ధికి రూ. 7,395 కోట్ల పథకం** ప్రధానమంత్రి వికసిత్ గ్రామ స్వరాజ్ యోజనకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఐదేళ్లలో రూ. 7,395.55 కోట్ల వ్యయంతో 202627 నుంచి 203031 వరకు ఈ పథకాన్ని అమలు చేయనున్నారు. దేశవ్యాప్తంగా 2.78 లక్షలకు పైగా గ్రామీణ స్థానిక సంస్థలకు ప్రయోజనం చేకూరనుంది. **కంటైనర్, క్రీడా వస్తువుల తయారీకి ప్రోత్సాహం** దేశీయ కంటైనర్ తయారీ పరిశ్రమను బలోపేతం చేసేందుకు రూ. 10 వేల కోట్ల ప్రోత్సాహక పథకానికి ఆమోదం తెలిపారు. అలాగే క్రీడా వస్తువుల తయారీ రంగ అభివృద్ధికి రూ. 1,856.67 కోట్లతో ఖేలో ఇండియా పథకాన్ని అమలు చేయనున్నారు. ఈ నిర్ణయాలతో దేశీయ తయారీ రంగం, గ్రామీణ స్థానిక సంస్థల అభివృద్ధికి ఊతం లభించనుంది.

ఓటరు జాబితాలో పేరుంటే మళ్లీ ఫారం6 ఎందుకు?

(మొదటి పేజీ తరువాయి)

ధర్మాసనం విచారణ సందర్భంగా, చిరునామా మార్పులు, ఓటరు వివరాల సవరణలకు సాధారణంగా ఫారం8 ఉపయోగిస్తారని పేర్కొంది. పిటిషనర్ల తరఫున న్యాయవాది ప్రశాంత్ భూషణ్ వాదిస్తూ, ఢిల్లీలో ముసాయిదా ఓటర్ల జాబితా నుంచి సుమారు 43 లక్షల మంది పేర్లు తొలగించారని తెలిపారు. గతంలో ఓటర్లుగా నమోదైనవారిని తిరిగి చేర్చేందుకు ఫారం6 కోరడం వల్ల సమస్యలు తలెత్తుతున్నాయని అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎన్యుమరేషన్ ఫారాలను గడువు ముగిసిన తర్వాత కూడా స్వీకరించే అంశాన్ని పరిశీలించాలని సుప్రీంకోర్టు సూచించింది. తుది ఓటర్ల జాబితా సిద్ధమయ్యే వరకు అర్హులైనవారు తమ వివరాలు సమర్పించేందుకు అవకాశం కల్పించాలని పేర్కొంది. ఈ ప్రక్రియపై ప్రజలకు అర్థమయ్యే భాషలో విస్తృత అవగాహన కల్పించాలని ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది. తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది.

ఏపీలో పరిషత్ ఎన్నికలు వాయిదా!

(మొదటి పేజీ తరువాయి)

అక్టోబర్ 28న జరగాల్సిన పోలింగ్‌ను నవంబర్ 1కు, అక్టోబర్ 30న నిర్వహించాల్సిన ఓట్ల లెక్కింపును నవంబర్ 3కు మార్చింది. దీంతో నవంబర్ 3న మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ ఒకే రోజు నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో ఎన్నికల నిర్వహణకు అవసరమైన పోలీసు సిబ్బంది, ఇతర సిబ్బంది అందుబాటును దృష్టిలో ఉంచుకుని పరిషత్ ఎన్నికల తేదీలను సవరించినట్లు సమాచారం. **తాజా షెడ్యూల్ ప్రకారం ఎన్నికలు** స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియను కొనసాగించాలని సుప్రీంకోర్టు ఆదేశించిన నేపథ్యంలో ఎన్నికల సంఘం ఈ మార్పులు చేసింది. తాజా షెడ్యూల్ ప్రకారం నవంబర్ 5న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ నిర్వహించనున్నారు. నవంబర్ 6న అవసరమైన చోట రీపోలింగ్ చేపట్టనున్నారు. నవంబర్ 7న ఓట్ల లెక్కింపు నిర్వహించి ఫలితాలను ప్రకటించనున్నారు. ఎన్నికల తేదీల మార్పుతో అధికారులు ఏర్పాట్లను సమన్వయం చేసుకునేందుకు అవకాశం కలగనుంది. అభ్యర్థులు, రాజకీయ పార్టీలు సవరించిన షెడ్యూల్‌కు అనుగుణంగా తమ ఎన్నికల కార్యక్రమాలను రూపొందించుకోవాల్సి ఉంటుంది.

మోడీ ఫాసిస్టు పాలనకు నూకలు చెల్లే రోజులు దగ్గర్లోనే!

(మొదటి పేజీ తరువాయి)

ప్రత్యేక రైళ్లు కేటాయించకపోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా ఢిల్లీకి వెళ్లి నిరసనను విజయవంతం చేస్తామని స్పష్టం చేశారు. **దక్షిణ మధ్య రైల్వే కార్యాలయం ఎదుట ధర్నా** ఢిల్లీలో నిర్వహించనున్న నిరసన కార్యక్రమానికి వెళ్లేందుకు ప్రత్యేక రైళ్లు కేటాయించాలని కాంగ్రెస్ నేతలు దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్‌ను కోరారు. ఇందుకు నిరాకరించడంతో బుధవారం సికింద్రాబాద్‌లోని జీఎం కార్యాలయం ఎదుట కాంగ్రెస్ నాయకులు మెరుపు ధర్నా చేపట్టారు. మహేశ్‌కుమార్ గౌడ్‌తో పాటు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు ఆందోళనలో పాల్గొన్నారు. అనంతరం పలువురు నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. **బస్సుల్లో ఢిల్లీకి తరలింపు** ప్రత్యేక రైళ్ల కోసం ఆరు రోజుల ముందే దరఖాస్తు చేసినప్పటికీ చివరి నిమిషంలో తిరస్కరించారని మహేశ్‌కుమార్ గౌడ్ విమర్శించారు. నిరసన కార్యక్రమానికి వెళ్లకుండా అడ్డుకునేందుకే ఇలా చేస్తున్నారని ఆరోపించారు. అయినప్పటికీ తెలంగాణ నుంచి భారీ సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు ఢిల్లీకి తరలివెళ్తారని తెలిపారు. ఇందుకోసం అవసరమైన బస్సులు, ఇతర సౌకర్యాలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో జరిగే నిరసనను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

వణికిస్తున్న అర్నాబ్ తుపాను!

- పంటలకు తీవ్ర నష్టం.. అప్రమత్తమైన అధికార యంత్రాంగం

హైదరాబాద్, అక్టోబర్ 28 : అర్నాబ్ తుపాను ప్రభావంతో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురుస్తున్నాయి. దీంతో వరి పంట నేలకొరగగా, పత్తి, మొక్కజొన్న, మిర్చి పంటలకు నష్టం వాటిల్లింది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సరాసరి 10.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులతో పరిస్థితిని సమీక్షించి ప్రజల భద్రతకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో విద్యాసంస్థలకు సెలవు ప్రకటించగా, ఖమ్మం జిల్లాలో పరిస్థితులను బట్టి సెలవులు ప్రకటించాలని అధికారులు ఆదేశించారు. గోదావరి పరివాహక, లోతట్టు ప్రాంతాల్లో అప్రమత్తత పెంచి సహాయక బృందాలను సిద్ధంగా ఉంచారు. ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని, విద్యుత్ తీగలు, పాత గోడలు, పెద్ద చెట్లకు దూరంగా ఉండాలని అధికారులు సూచించారు. పంట నష్టానికి పరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు.

ఉద్యోగులు ఏఐపై అవగాహన పెంచుకోవాలి

హైదరాబాద్, అక్టోబర్ 28 : మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా ప్రభుత్వ ఉద్యోగులందరూ కృత్రిమ మేధస్సు (ఏఐ)పై అవగాహన పెంచుకోవాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సూచించారు. ఏఐ సాధనాలను సమర్థవంతంగా వినియోగించుకొని ప్రభుత్వ పనులను వేగవంతం చేయడంతోపాటు ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కోరారు. హైదరాబాద్‌లోని ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో బుధవారం ప్రణాళికా శాఖ, టీజీ మ్యాథ్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఏఐ సాక్షమ్' కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉత్తర్వుల గుర్తింపు, నివేదికల తయారీ, సమాచార విశ్లేషణ, ప్రజల సమస్యల పరిష్కారం వంటి పనుల్లో కృత్రిమ మేధస్సు ఉపయోగపడుతుందని తెలిపారు. రైతుల దరఖాస్తులు త్వరగా పరిష్కారం కావడం, పింఛనుదారులకు అవసరమైన సమాచారం సులభంగా అందడం వంటి ప్రయోజనాలు ప్రజలకు కలగాలని పేర్కొన్నారు.

విద్యుత్ డిమాండ్‌ను అంచనా వేయడం, పరికరాల్లో లోపాలను ముందుగానే గుర్తించడం, అభివృద్ధి పనుల్లో జాప్యానికి కారణాలను విశ్లేషించడం వంటి అంశాల్లోనూ ఏఐని వినియోగించుకోవచ్చని చెప్పారు. అయితే ఏఐ సాధనాలను ఉపయోగించేటప్పుడు సమాచార భద్రత, కచ్చితత్వం, బాధ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు. ఏఐ ద్వారా లభించిన సమాచారాన్ని అధికారికంగా వినియోగించే ముందు ధ్రువీకరించుకోవాలని సూచించారు. ప్రభుత్వ శాఖల్లో ఏఐ వినియోగానికి అనువైన పనులను గుర్తించి, తొలుత ప్రయోగాత్మకంగా అమలు చేసి ఫలితాల ఆధారంగా విస్తరించాలని భట్టి విక్రమార్క కోరారు.

పెనుగంచిప్రోలులో హోరాహోరీగా ఎన్నికల ప్రచారం

పెనుగంచిప్రోలు, అక్టోబర్ 28 మన ప్రజావాణి పెనుగంచిప్రోలు గ్రామంలోని 3వ సెగ్మెంట్ జడ్పీటీసీ అభ్యర్థి మార్కపూడి గాంధీకి, ఎంపీటీసీ అభ్యర్థి మునిబోయిన వెంకట నరసమ్మకు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని రాష్ట్ర మాజీ బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ చేని కుమారి కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ హయాంలోనే మహిళలకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చారని, అనేక సంక్షేమ పథకాలతో ఆదుకున్నారని అన్నారు. కూటమి ప్రభుత్వంలో మహిళలపై దాడులు జరుగుతున్నాయని, నామినేషన్ల సమయంలో మహిళల పట్ల అనుచితంగా ప్రవర్తించారని విమర్శించారు. అరాచక పాలన పోవాలంటే వైఎస్ జగన్మోహన్ రెడ్డి నాయకత్వాన్ని బలపరచాలని పిలుపునిచ్చారు. ఈ ప్రచార కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ ఉపాధ్యక్షులు చేని రాంబాబు, మాజీ వైస్ ప్రెసిడెంట్ బానిసా పాపారావు, మాజీ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ సముద్రాల లక్ష్మణరావు, మాజీ దేవస్థానం డైరెక్టర్ కేరళ నరసింహారావు, గ్రామ పార్టీ అధ్యక్షులు గుడిమెట్ల శంకర్, చేని ఆంజనేయులు, చేని నాగలక్ష్మి, మల్లేబోయిన హనుమంతరావు, సోషల్ మీడియా సెక్రెటరీ కంచి రాఘవులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా ప్రచార కార్యక్రమంలో ఎం పి అంబికా లక్ష్మి నారాయణ

అనంత పురం బ్యూరో అక్టోబర్ 28 ప్రజా వాణి అనంతపురం నగరంలోని 13వ వార్డు పరిధిలో బ్రాహ్మణ వీధి, తిలక్ రోడ్, గాంధీ బజార్ తదితర ప్రాంతాల్లో నిర్వహించిన ఇంటింటి ఎన్నికల ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నాను. ఈ సందర్భంగా కూటమి బీజేపీ మేయర్ అభ్యర్థి అజయ్ బాబు యాదవ్ ని, 13వ డివిజన్ కార్పొరేటర్ అభ్యర్థి కుర్లపల్లి విజయ్ కుమార్ ని భారీ మెజారిటీతో గెలిపించాలని స్థానిక ఓటర్లను అభ్యర్థించాను. ఈ వార్డులో స్థానికులు ఘనంగా స్వాగతం పలికారు. ప్రజల సంక్షేమం, నగర అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని తెలియజేశాను. అనంతపురం నగరంలో రహదారుల అభివృద్ధి, డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదల, మౌలిక వసతుల కల్పనతో పాటు పరిశుభ్రతకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని వివరించాను. ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తూ, నగరాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కూటమి అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని కోరాను. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు శబరి విశ్వబ్రాహ్మణ డైరెక్టర్ రంగాచారి , మాజీ కార్పొరేటర్ మల్లికార్జున వ్యాపారవేత్త బాలసుబ్రహ్మణ్యం కరీముల్లా, అస్లాం భాష , రాజాచారి, పిన్ని నాగరత్నం , స్థానిక కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

పెద్దమ్మగుడిలో ప్రత్యేక పూజలు.. నిత్య అన్నదానానికి రూ.1,00,116 విరాళం...

- కొత్తగూడెం కార్పొరేషన్ పాల్వంచ 6వ డివిజన్ కార్పొరేటర్ డాక్టర్ బి.ఎస్ రావు
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహణ..

పాల్వంచ, అక్టోబర్ 28 (మన ప్రజావాణి): తెలంగాణ రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని పాల్వంచ 6వ డివిజన్ కార్పొరేటర్ ప్రజావైద్యులు డాక్టర్ బి.ఎస్ రావు ఆధ్వర్యంలో శ్రీ కనకదుర్గ దేవస్థానం (పెద్దమ్మగుడి)లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో జీవిస్తూ, ప్రజాసేవలో మరిన్ని విజయాలు సాధించాలని అమ్మవారిని ప్రార్థించారు. అనంతరం పెద్దమ్మగుడిలో నిర్వహిస్తున్న నిత్య అన్నదాన కార్యక్రమానికి డాక్టర్ బి.ఎస్. రావు రూ.1,00,116 (ఒక లక్ష నూట పదహారు రూపాయలు) విరాళంగా అందజేశారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రజల ఆశీస్సులతో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించి, రాష్ట్ర అభివృద్ధికి, ప్రజాసేవకు మరింత కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రజా వైద్యులు డాక్టర్ బి.రవి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు ఊకంటి గోపాల్‌రావు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు జాల జానికిరెడ్డి, కొత్తగూడెం సంజయ్‌నగర్ ఉపసర్పంచ్ వడ్డేం సతీష్ కుమార్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు భువనసుందర్ రెడ్డి, పెద్దమ్మగుడి మాజీ చైర్మన్ బాలినేని నాగేశ్వరరావు, దొప్పలపూడి సురేష్‌బాబు, ధర్మసోత్ ఉపేందర్ నాయక్, చౌగాని పాపారావు గౌడ్, డాక్టర్ రవి, పోగుల లక్ష్మి, సర్పంచ్ లావుడ్యా పూర్ణ, బావ్‌సింగ్, సర్పంచ్ అనిత, బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి..

- చదువుతోపాటు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి..
- రెడ్ క్రాస్ జిల్లా ఉపాధ్యక్షులు దస్తీరం..

మన ప్రజావాణి జుక్కల్ ఆర్ సి ప్రతినిధి అక్టోబర్ 28 విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ, చదువుతోపాటు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కామారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు దస్తిరం అన్నారు.. నషా ముక్త్ భారత్ అభియాన్ లో భాగంగా బుధవారం రోజున జుక్కల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.. జుక్కల్ ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షులు డోంగ్లే ఉమాకాంత్ పటేల్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి దస్తీరం ముఖ్య అతిథిగా హాజరయ్యారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్తు పదార్థాల అలవాటు చదువుతోపాటు ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చుపుతుందని తెలిపారు.. ఒత్తిడికి గురైనప్పుడు ఆటలు పాటలు, స్నేహితులతో గడపడం ద్వారా ఉపశమానం పొందాలి తప్ప మత్తు పదార్థాలకు అలవాటు పడకూడదని సూచించారు. డ్రగ్స్ కు దూరంగా ఉంటూ దేశాన్ని మత్తు పదార్థాల రహితంగా మార్చేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు.. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించి, అవగాహన ర్యాలీ నిర్వహించారు.. ఈ కార్యక్రమంలో జిల్లా రెడ్ క్రాస్ ఉపాధ్యక్షులు దస్థిరాం, జుక్కల్ మండలం అధ్యక్షులు ఉమాకాంత్ పటేల్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, కళాశాల ఉపాధ్యాయులు, సాయిలు, నాగరాజు, రమేష్, సంతోష్, తదితరులు ఉపాధ్యాయుల బృందం విద్యార్థులు పాల్గొన్నారు..

కూటమి నేతల్లో ఓటమి భయం

- అధికారాన్ని అడ్డుపెట్టుకుని గెలవాలన్న కుయుక్తులు
- పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా చూడాల్సిన బాధ్యత కలెక్టర్, ఎస్పీలదే
- రెండున్నరేళ్లుగా అనంతపురం ఎమ్మెల్యే దౌర్జన్యాలతో విసుగెత్తిన ప్రజలు
- ఏ డివిజన్‌కు వెళ్లినా వైఎస్ఆర్‌సీపీకి అపూర్వ ఆదరణ
- రెండున్నరేళ్లుగా ప్రభుత్వ ఆస్పత్రి విస్తరణ పనులు ఎందుకు పూర్తి చేయలేదు?
- మాయమాటలతో ప్రజలను మభ్యపెడుతున్న మంత్రి సత్యకుమార్ యాదవ్
- అనంతపురంలో ఎమ్మెల్యే అరాచకాలపై ఏనాడైనా స్పందించారా?
- ప్రజలకు ఏ కష్టం వచ్చినా అండగా నిలిచింది వైఎస్ఆర్‌సీపీనే
- ఎన్నికల ప్రచారంలో వైసీపీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి
- మేయర్ అభ్యర్థి రమేష్‌గౌడ్‌తో కలిసి 44, 42, 40, 41డివిజన్లలో ప్రచారం

అనంతపురం బ్యూరో అక్టోబర్ 28. ప్రజా వాణి అనంతపురం కార్పొరేషన్ ఎన్నికల్లో కూటమి నేతలకు ఓటమి భయం పట్టుకుందని వైఎస్ఆర్‌సీపీ అనంతపురం జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలిచినా రెండున్నరేళ్లలోనే ప్రజాప్రతినిధుల చేసిన అరాచకాలను ప్రజలు గుర్తించారని తెలిపారు. బుధవారం నగరంలోని 44, 42, 40, 41 డివిజన్లలో వైసీపీ మేయర్ అభ్యర్థి రమేష్ గౌడ్‌తో కలిసి ఆయా డివిజన్ల కార్పొరేటర్ అభ్యర్థులు నిహార్‌రెడ్డి, లోకనాథ్‌రెడ్డి, లీలావతి, హేమావతి తరఫున ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కూటమి పాలనా వైఫల్యాలను వివరించారు. ఈ ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా అనంత మాట్లాడుతూ కూటమి పాలనపై ప్రజల్లో వ్యతిరేకత వచ్చిందని, దీన్ని గ్రహించే అలజడి సృష్టించాలని కుయుక్తులు పన్నుతున్నారని తెలిపారు. అనంతపురం నగర పాలక సంస్థ మేయర్‌తో పాటు 62 డివిజన్లకు నవంబర్ 1వ తేదీన పోలింగ్ జరగనుందని, ఈ క్రమంలో వ్యవస్థలను అడ్డుపెట్టుకుని ఎలాగైనా గెలవాలన్న లక్ష్యంతో కూటమి నేతలు ముందుకు వెళ్తున్నారని తెలిపారు. జిల్లా కేంద్రమైన అనంతపురంలో రెండున్నరేళ్లుగా దోపిడీ రాజ్యం కొనసాగుతోందని చెప్పారు. ప్రభుత్వ వైఫల్యాలపై ప్రతిపక్షంగా తాము పోరాటం చేస్తున్నామని గుర్తు చేశారు. నగరంలో అధికార పార్టీ నేతలు కబ్జాలకు తెగబడుతుంటే ప్రజలకు అండగా నిలబడ్డామని తెలిపారు. ప్రజలకు రక్షణగా ఉండాల్సిన ప్రజాప్రతినిధులు భక్షకులుగా మారిపోయారని విమర్శించారు. ఈ ఎన్నికల్లో ప్రజల తీర్పు వ్యతిరేకంగా వస్తుందని గ్రహించి వ్యవస్థలను చేతుల్లోకి తీసుకుంటున్నారని తెలిపారు. 2014 నుంచి 2019 వరకు.. 2024 నుంచి ఇప్పటి వరకు కేంద్రం, రాష్ట్రంలో ఎన్డీయే కూటమే అధికారంలో ఉందని.. ఈ సమయంలో వాళ్లు ఏం అభివృద్ధి చేశారని ప్రశ్నించారు. కార్పొరేషన్ ఎన్నికల్లో రిగ్గింగ్ చేసి గెలవాలని మంత్రి సత్యకుమార్ ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. జిల్లా కేంద్రంలో ఇప్పటి వరకు ఎక్కడా శాంతి భద్రతల సమస్యలు రాలేదని.. పోలింగ్ కూడా ప్రజాస్వామ్యబద్ధంగా జరిగేలా జిల్లా కలెక్టర్, ఎస్పీలు ప్రత్యేక చొరవ చూపాలని కోరారు. ఏ అధికారి అయినా కూటమి నేతలకు కీలుబొమ్మలుగా మారితే తస్మాత్ జాగ్రత్త అని హెచ్చరించారు. ఒక పార్టీకి అనుకూలంగా ఉంటామనే రీతిలో వ్యవహరిస్తే చూస్తూ ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. కార్పొరేషన్ ఎన్నికల సందర్భంగా బీజేపీ ప్రకటిస్తున్న హామీలు, వాగ్దానాలు చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని తెలిపారు. వైసీపీని గెలిపిస్తే ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా ఉన్న సమయంలో కేంద్రంతో తనకున్న పరిచయాలతో అనంతపురం ప్రభుత్వ సర్వజనాస్పత్రి విస్తరణ పనులను రూ.300 కోట్లతో శ్రీకారం చుట్టామని గుర్తు చేశారు. అందుకు అవసరమైన స్థలాలు సేకరించి నిర్మాణాలు కూడా చేపట్టామని తెలిపారు. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎందుకు ఆస్పత్రి విస్తరణ పనులు నిలిచిపోయాయో వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ సమాధానం ఇవ్వాలన్నారు. ఈ పనులను అతీగతీలేకుండా వదిలేసి ఇప్పుడు అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ అంటే ప్రజలు నమ్మే పరిస్థితి లేదని తెలిపారు. రెండున్నరేళ్లుగా అనంతపురం ఎమ్మెల్యే దౌర్జన్యాలు చేస్తుంటే ప్రజలకు ఎందుకు అండగా ఉండలేకపోయారని ప్రశ్నించారు. ప్రజలు విజ్ఞతతో ఆలోచించి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరారు. మరోసారి మోసపోతే అనంతపురం నగరం అక్రమార్కుల చేతుల్లోకి వెళ్తుందని తెలిపారు. అనంతపురం నగర అభివృద్ధి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందని అన్నారు. మేయర్ అభ్యర్థి రమేష్‌గౌడ్‌తో పాటు 62 డివిజన్లలో వైసీపీ, సీపీఐ అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

పొగాకు కు యువత దూరంగా ఉండాలి

- పొగాకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ,చేయించిన
- డి యం హెచ్ ఓ .డా.కట్టా వెంకటేశ్వర్లు
- టోభాకో ఫ్రీ యూత్ కాంపెయిన్ 4ానుజెండా ఊపి ర్యాలీ ప్రారంభించిన డి యం హెచ్ ఓ డా. కట్టా వెంకటేశ్వర్లు

అనంత పురం బ్యూరో అక్టోబర్ 28 ప్రజా వాణి జాతీయ పొగాకు నియంత్రణ కార్యక్రమంలో భాగంగా టొబాకో ఫ్రీ యూత్ కార్యక్రమాన్ని బుధవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.కట్టా వెంకటేశ్వర్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం నందు ప్రారంభించారులి. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం నుండి తెలుగు తల్లి విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు
అక్టోబర్ 28 వ తేదీ నుండి డిసెంబర్ 27 వ తేదీ వరకు పొగాకు వ్యతిరేకంగా ప్రజలలో ముఖ్యంగా యువతకు అవగాహన కల్పిస్తామని ఈ సందర్భంగా తెలిపారు .
సిగరెట్టు మరియు ఇతర పొగాకు సంబంధింత ఉత్పత్తుల యొక్క వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాల గురించి వివరించారు. ప్రజలందరూ మంచి ఆహారపు అలవాట్లను అలవర్చుకోవాలని పొగాకు మరియు వాటి ఉత్పత్తులకు దూరంగా ఉంటూ క్యాన్సర్ వంటి భయానిక వ్యాధులు రాకుండా నివారించవచ్చు అన్నారు. ఈ సందర్భంగా పొగాకు వినియోగానికి వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. ప్రభుత్వ మరియు ప్రైవేటు విద్యాసంస్థల పరిధిలో ఉన్న దుకాణాలలో సిగరెట్ మరియు ఇతర పొగాకు ఉత్పత్తుల పై నిషేధం ఉందన్నారు. అతిక్రమించిన వారిపై చట్టం ప్రకారం చర్య తీసుకోవడం జరుగుతుందన్నారు. జిల్లా పొగాకు నియంత్రణ కార్యక్రమ నిర్వహణ అధికారి డాక్టర్.. విష్ణుమూర్తి మాట్లాడుతూ, పొగాకు వ్యతిరేకంగా ప్రజలకు అవగాహన కల్పిస్తూ,, 60 రోజులలో 400 పాఠశాలలును పొగాకు రహిత విద్యాసంస్థలుగా అమలు చేయాలని తెలియజేశారు . రాబోవు సంవత్సరకాలంలో 30 పొగాకు రహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు.,, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, పోలీస్, విద్యాశాఖ, ఎక్సైజ్, పంచాయతీరాజ్ , మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ , సహకారంతో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే 15 నుంచి 24 సంవత్సరముల వయసు పిల్లలలో ప్రతి ఎనిమిది మందిలో ఒకరు సిగరెట్ ఇతర పొగాకు సంబంధిత ఉత్పత్తులను వాడుతున్నారని చెప్పారు. ఇలా యువత మారకద్రవ్యాలకు అలవాటు పడడం వల్ల దేశ భవిష్యత్తు అగమ్య గోచరం కానుంది. సిగరెట్ వాడడం వలన మనిషి యొక్క అవయవాలపై ప్రభావం చూపించి క్యాన్సర్ కు ముఖ్యంగా నోరు, గొంతు, ఊపిరితిత్తులు , జీర్ణాశయ మరియు జననేంద్రియ అవయవ క్యాన్సర్ కు కారణమవుతున్నాయి. అలాగే బహిరంగ ధూమపానము చేసిన మరియు ప్రభుత్వ కార్యాలయాల పరిధిలోని 100 గజాల లోపు ఎవరైనా దుకాణాలలో పొగాకు ఉత్పత్తులను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుంది మరియు జరిమానారూ:200 కూడా విధించడం జరుగుతుంది పొగాకు ఉత్పత్తులపై ఎటువంటి ప్రచారం నిర్వహించ రాదని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లాలి పొగాకు నియంత్రణ సోషల్‌లి వర్కర్ బి. శ్రీరాములు మాట్లాడుతూ ధూమపానం మరియు ప్యాసివ్ స్మోకింగ్ వలన వల్ల గర్భవతులైన మహిళలు ఆరోగ్యవంతమైన సంతానాన్ని పొందలేరని తెలియజేశారు, పర్యావరణాన్ని పొగాకు ఉత్పత్తుల వినియోగం నుండి రక్షించాలని అది అందరి బాధ్యత అని తెలియజేశారు ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్స్ , డా. విజయలక్ష్మి, డాక్టర్ ప్రసన్న భారతి పరిపాలన అధికారి డా. మనోజ్ కుమార్, డాక్టర్ శ్రీనివాసరెడ్డి,డెమో సిబ్బంది, నాగరాజు , లక్ష్మీనారాయణ, , మరియు జిల్లా పొగాకు నియంత్రణ సోషల్ వర్కర్ శ్రీరాములు ఎన్సీడీ సిబ్బంది జిల్లా ఫ్లో రోసిస్ కన్సల్టెంట్ ఆంజనేయులు , ప్రేమ్ కిషోర్, , మౌనిక, శశికల పాల్గొన్నారు.

అమర రాజా గ్రూప్ ఆధ్వర్యంలో డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్షలు అవసరమైన వారికి ఉచితంగా కళ్లద్దాల పంపిణీ -- సుమారు 200 మందికి వైద్య పరీక్షలు

తిరుపతి, అక్టోబర్ 28: ఉద్యోగుల ఆరోగ్యం, భద్రతతో పాటు సంస్థకు రవాణా సేవలు అందించే లారీలు, కంటైనర్లు, ఇతర భారీ వాహనాల డ్రైవర్ల సంక్షేమానికి అమర రాజా గ్రూప్ ప్రత్యేక ప్రాధాన్యతనిస్తోంది. ఇందులో భాగంగా గ్రూప్ లాజిస్టిక్స్ విభాగం ఆధ్వర్యంలో, తిరుపతిలోని ఎస్వీ అరవింద్ కంటి ఆసుపత్రి వైద్య బృందం సహకారంతో కరకంబాడి తయారీ ప్లాంట్‌లో డ్రైవర్ల కోసం ఉచిత కంటి పరీక్ష శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో సుమారు 200 మంది డ్రైవర్లు కంటి పరీక్షలు చేయించుకోగా, కంటి చూపు సమస్యలు ఉన్నట్లు గుర్తించిన వారిలో అవసరమైన వారికి ఉచితంగా కళ్లద్దాలను పంపిణీ చేశారు. డ్రైవర్ల ఆరోగ్యమే రహదారి భద్రతకు కీలకం రవాణా రంగంలో డ్రైవర్లు కీలక పాత్ర పోషిస్తారని, వారు వస్తువులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడంలో కంటి చూపు, ఆరోగ్య పరిస్థితి ఎంతో ముఖ్యమని అమర రాజా గ్రూప్ ఇంటిగ్రేటెడ్ బిజినెస్ సప్లై చైన్ హెడ్ భరత్ స్వామినాథన్ పేర్కొన్నారు. డ్రైవర్లు నిరంతరం రహదారులపై ప్రయాణిస్తూ అప్రమత్తంగా విధులు నిర్వహించాల్సి ఉంటుందని, ఈ క్రమంలో కంటి చూపులో సమస్యలు ఉంటే వాటిని ముందుగానే గుర్తించి తగిన వైద్య సహాయం పొందడం అవసరమని తెలిపారు. డ్రైవర్ల ఆరోగ్య పరిరక్షణతో పాటు రహదారి భద్రతను పెంపొందించాలనే ఉద్దేశంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు. కంటి పరీక్షల ద్వారా సమస్యలను గుర్తించి, అవసరమైన వారికి ఉచితంగా కళ్లద్దాలు అందించడం సంతోషకరమని అన్నారు. డ్రైవర్ల సంక్షేమానికి ఉపయోగపడే ఇటువంటి ఆరోగ్య కార్యక్రమాలను భవిష్యత్తులోనూ కొనసాగిస్తామని వెల్లడించారు.
రాజన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాలు
అమర రాజా గ్రూప్ సహకారంతో రాజన్న ఫౌండేషన్ వివిధ సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తోంది. సమాజంలోని వివిధ వర్గాల ఆరోగ్యం, సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని చేపడుతున్న కార్యక్రమాల్లో భాగంగా డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్ష శిబిరాన్ని ఏర్పాటు చేశారు. సంస్థకు రవాణా సేవలు అందించే డ్రైవర్ల ఆరోగ్య అవసరాలను గుర్తించి, వారికి అవసరమైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు.
ఈ కార్యక్రమంలో అమర రాజా గ్రూప్ బిజినెస్ హెచ్ఎస్ఈ విభాగం అధిపతి డాక్టర్ సురేష్ కుమార్, హెచ్ఆర్ షేర్డ్ సర్వీసెస్ అధిపతి కె. నళినీ కుమార్, రాజన్న ఫౌండేషన్ అధిపతి రాళ్లపల్లి సతీష్, లాజిస్టిక్స్ విభాగం అధిపతి వి. సులోచన, సీనియర్ మేనేజర్ చక్రధర్ నలమ్, మేనేజర్ కె. చంద్ర భాస్కర్ తదితరులు పాల్గొన్నారు. ఎస్వీ అరవింద్ కంటి ఆసుపత్రికి చెందిన వైద్య బృందం డ్రైవర్లకు కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి తగిన సూచనలు అందించింది.
అక్టోబర్ 30న చిత్తూరులో మరో ఉచిత కంటి పరీక్ష శిబిరం
డ్రైవర్ల ఆరోగ్య పరిరక్షణ కార్యక్రమాన్ని మరింత విస్తరించడంలో భాగంగా అక్టోబర్ 30న చిత్తూరులోని అమర రాజా గ్రోత్ కారిడార్ (ఏఆర్‌జీసీ)లో మరో ఉచిత కంటి పరీక్ష శిబిరాన్ని నిర్వహించనున్నారు. ఈ శిబిరంలోనూ తిరుపతిలోని ఎస్వీ అరవింద్ కంటి ఆసుపత్రి వైద్య బృందం సేవలందించనుంది. డ్రైవర్లకు కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వైద్య సలహాలు అందించడంతో పాటు, అర్హులైన వారికి ఉచిత కళ్లద్దాలు పంపిణీ చేయనున్నారు. డ్రైవర్ల ఆరోగ్యం, వాహనాల సురక్షిత ప్రయాణం, రహదారి భద్రతకు ప్రాధాన్యతనిస్తూ అమర రాజా గ్రూప్ చేపడుతున్న ఈ కార్యక్రమాలు రవాణా రంగంలో పనిచేస్తున్న సిబ్బంది సంక్షేమానికి తోడ్పడనున్నాయి.

బెజ్జంకి మండల యాదవ సంఘం నూతన అధ్యక్షులకు ఎమ్మెల్యే హరీశ్ రావు సత్కారం

బెజ్జంకి, అక్టోబర్ 28 (ప్రజావాణి) సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండల యాదవ సంఘం నూతన అధ్యక్షుడిగా నియమితులైన నలువాల స్వామి యాదవ్, యువజన అధ్యక్షుడిగా నియమితులైన కల్లూరి అజయ్ యాదవ్‌లను మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ యాదవ సంఘం నాయకులు ఐక్యంగా ఉంటూ సంఘం అభివృద్ధికి, సామాజిక వర్గం అభ్యున్నతికి కృషి చేయాలని సూచించినట్లు పేర్కొనవచ్చు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన నాయకులు సంఘాన్ని మరింత బలోపేతం చేస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీహరి యాదవ్, జిల్లా అధ్యక్షుడు ఐలయ్య యాదవ్, యువజన అధ్యక్షుడు రాము యాదవ్, వివిధ గ్రామాల యాదవ సంఘం అధ్యక్షులు, జిల్లా కార్యవర్గ సభ్యులు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పాకాల మహిపాల్ రెడ్డి, రాష్ట్ర నాయకులు లింగాల లక్ష్మణ్, శ్రీనివాస్ గుప్తా, పీఏసీఎస్ మాజీ వైస్ చైర్మన్ బండి రమేష్ యాదవ్, మ్యాకల శ్రీకాంత్ యాదవ్, బీఆర్ఎస్ బీసీ సెల్ అధ్యక్షుడు కల్లూరి రవి, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

పెనగడప ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ అంకిత్

- అర్నాబ్ తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో గర్భిణీలకు ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి.
- రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలి.
- వైద్య సిబ్బందిలు సమయపాలన పాటించాలి..

భద్రాద్రి జిల్లా బ్యూరో అక్టోబర్ 28 (మన ప్రజావాణి): జిల్లాలో అర్నాబ్ తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో భారీవర్షాలు కురిసే అవకాశం ఉన్నందున వైద్యాధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ అంకిత్ సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఉన్న గర్భిణీ మహిళలు, ముఖ్యంగా ప్రసవ సమయం దగ్గరపడిన గర్భిణీలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, అవసరమైన వారిని సమీపంలోని సురక్షిత ప్రాంతాల్లో ఉన్న ఆరోగ్య కేంద్రాలు లేదా సబ్ సెంటర్లకు ముందుగానే తరలించే ఏర్పాట్లు చేయాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. బుధవారం రోజు చుంచుపల్లి మండలంలోని పెనగడప ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ అంకిత్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో అందిస్తున్న వైద్య సేవలు, సిబ్బంది హాజరు, రోగులకు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. సిబ్బంది హాజరు రిజిస్టర్ తో పాటు మందుల నిల్వలు, వాటిని భద్రపరిచే స్టోర్ రూమ్‌ను తనిఖీ చేసి, వైద్య సేవల నిర్వహణపై సంబంధిత సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వాతావరణ మార్పులు, వర్షాల నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల్లో వైరల్ జ్వరాలతో పాటు డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జ్వర లక్షణాలతో ఆసుపత్రికి వచ్చే రోగులకు అవసరమైన వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించి, వ్యాధులను గుర్తించి సకాలంలో చికిత్స అందించాలని ఆదేశించారు. ప్రతి రోగికి నాణ్యమైన వైద్య సేవలు అందించడం వైద్యులు, సిబ్బంది ప్రధాన బాధ్యత అని స్పష్టం చేశారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అన్ని రకాల అవసరమైన మందులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, మందుల నిల్వలను ఎప్పటికప్పుడు పరిశీలించాలని సూచించారు. ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు వర్షాల కారణంగా భవనంలో ఎక్కడైనా నీటి లీకేజీలు ఏర్పడితే వెంటనే మరమ్మతులు చేయించాలని ఆదేశించారు. తుఫాన్ ప్రభావంతో అత్యవసర వైద్య సేవలకు అంతరాయం కలగకుండా అవసరమైన ఏర్పాట్లు ముందుగానే చేసుకోవాలని సూచించారు. వైద్యులు, వైద్య సిబ్బంది విధులకు నిర్ణీత సమయానికి హాజరై తమకు కేటాయించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. రోగులకు వైద్య సేవలు అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వకూడదని స్పష్టం చేశారు. ఆసుపత్రిలో వైద్య సేవల నాణ్యత, రోగులకు అందుతున్న సౌకర్యాలు, సిబ్బంది పని తీరుపై నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ తనిఖీలో మెడికల్ ఆఫీసర్ హరీష్, స్టాఫ్ నర్స్, ఫార్మసిస్ట్ సుభద్ర, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

టెలికాం నగర్ అభివృద్ధికి ప్రత్యేక చొరవ.. అసంపూర్తి పనులు పూర్తి చేస్తాం: పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ

- యూజీడీ పనుల పూర్తి, రోడ్ల మరమ్మతులు, పార్కుల అభివృద్ధికి హామీ

గచ్చిబౌలి: అక్టోబర్ 28 ప్రజావాణి గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని టెలికాం నగర్ కాలనీలో నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించి, మౌలిక వసతులను మరింత మెరుగుపరిచేందుకు పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ ప్రత్యేక చొరవ చూపారు. కాలనీలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై సీనియర్ నాయకుడు గణేష్ ముదిరాజు ఆధ్వర్యంలో టెలికాం నగర్ కాలనీ వాసులు బుధవారం వివేకానంద నగర్‌లోని గాంధీ కార్యాలయంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు మాట్లాడుతూ.. టెలికాం నగర్ అభివృద్ధికి గాంధీ గతంలో విశేష కృషి చేశారని, కాలనీలో అనేక మౌలిక వసతులు కల్పించారని కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుతం అసంపూర్తిగా మిగిలిపోయిన భూగర్భ డ్రైనేజీ (యూజీడీ) పనులను పూర్తి చేయాలని, దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని, కాలనీలోని పార్కులను అభివృద్ధి చేసి ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని కోరారు. కాలనీ అభివృద్ధికి పూర్తి సహకారం కాలనీ వాసుల విజ్ఞప్తిపై పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ సానుకూలంగా స్పందించారు. టెలికాం నగర్ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని భరోసా ఇచ్చారు. అసంపూర్తిగా ఉన్న డ్రైనేజీ పనులను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని, అవసరమైన చోట రోడ్లను పునరుద్ధరించి ప్రజలకు సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందిస్తామని తెలిపారు. అలాగే కాలనీలోని పార్కులను అభివృద్ధి చేసి, పచ్చదనంతో నిండిన ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మౌలిక వసతుల సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. గచ్చిబౌలి డివిజన్ సమగ్ర అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానని గాంధీ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టెలికాం నగర్ కాలనీ వాసులు సుస్మిత, రామారావు, దత్తు, నరేంద్ర, రాంబాబు, గంగ, కోటేశ్వరరావు, కృష్ణారావు, విజయలక్ష్మి, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద వైద్య చికిత్సకు రూ.2 లక్షల సీఎం సహాయ నిధి

- బాధిత కుటుంబానికి మంజూరు పత్రం అందజేసిన PAC చైర్మన్ ఆరెకపూడి గాంధీ

శేరిలింగంపల్లి, అక్టోబర్ 28 (ప్రజావాణి): నిరుపేదలకు వైద్య చికిత్స భారంగా మారకూడదనే లక్ష్యంతో ప్రభుత్వం అందిస్తున్న ముఖ్యమంత్రి సహాయ నిధి ఆపదలో ఉన్న కుటుంబాలకు ఆర్థిక భరోసాగా నిలుస్తోందని ౹ాజ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పేర్కొన్నారు. శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని పాపిరెడ్డి కాలనీకి చెందిన శ్రీమతి చాగంటి పూలకు అత్యవసర వైద్య చికిత్స నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్ (జవీ=ఖీ–౹ాజ) ద్వారా మంజూరైన రూ.2 లక్షల ఆర్థిక సహాయానికి సంబంధించిన మంజూరు పత్రాన్ని ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆరెకపూడి గాంధీ మాట్లాడుతూ, పేద ప్రజలకు ముఖ్యమంత్రి సహాయ నిధి గొప్ప వరమని అన్నారు. అనారోగ్యంతో బాధపడుతూ, వైద్య చికిత్సకు అవసరమైన ఆర్థిక స్థోమత లేని నిరుపేదలకు ఈ నిధి ఎంతో తోడ్పాటునందిస్తోందని తెలిపారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం పనిచేస్తోందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అర్హులైన బాధితులకు వైద్య చికిత్స కోసం ఆర్థిక సహాయం అందించేందుకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఆపదలో ఉన్న కుటుంబాలకు సీఎం సహాయ నిధి ఆర్థిక భరోసా కల్పిస్తోందని, అత్యవసర వైద్య చికిత్సల సమయంలో పేదలకు అండగా నిలుస్తోందని గాంధీ వివరించారు.

తమ వైద్య చికిత్సకు ఆర్థిక సహాయం అందేలా సహకరించిన PAC చైర్మన్ ఆరెకపూడి గాంధీకి బాధిత కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో నాయకులు సంజీవరెడ్డి, నాయినేని చంద్రకాంత్ రావు, రాధాబాయి తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీలో సత్తా చాటిన చౌక్కా వైశాలి

- రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

అశ్వారావుపేట, అక్టోబర్ 28 (మన సమగ్ర ప్రజావాణి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేట మండలం ఉట్లపల్లి గ్రామానికి చెందిన చౌక్కా వైశాలి కబడ్డీ క్రీడలో అద్భుత ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించింది. పెనుబల్లి మండలంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 9వ తరగతి అభ్యసిస్తున్న వైశాలి, ఇటీవల ఖమ్మంలో జరిగిన పీఎం శ్రీ (రవీ వా౨=×) జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొని తన ఆటతీరుతో అందరినీ ఆకట్టుకుంది. మొత్తం 40 జట్లు హోరాహోరీగా తలపడిన ఈ టోర్నమెంట్‌లో వైశాలి ప్రాతినిధ్యం వహించిన జట్టు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ విజయం అనంతరం జిల్లా విద్యాశాఖ అధికారి డి. వాసంతి చేతుల మీదుగా ఆమె జట్టు ట్రోఫీని అందుకుంది. జిల్లా స్థాయిలో సత్తా చాటిన వైశాలి, నవంబర్ 3న హైదరాబాద్‌లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక కావడం విశేషం. సాధారణ కుటుంబ నేపథ్యం నుంచి వచ్చిన వైశాలి తండ్రి చర్చ్ పాస్టర్‌గా సేవలందిస్తుండగా, తల్లి గృహిణిగా ఉన్నారు. ఈ కుటుంబంలో ముగ్గురు అక్కాచెల్లెళ్లలో వైశాలి చిన్నది కావడం గమనార్హం. ఇటీవలే ఈమె పెద్ద అక్క చౌక్కా వాసంతికి ఎంబీబీఎస్ సీటు లభించగా, ఇప్పుడు వైశాలి క్రీడల్లో రాష్ట్రస్థాయికి ఎంపిక కావడం ఆ కుటుంబంలో రెట్టింపు ఆనందాన్ని నింపింది. కుటుంబసభ్యుల ప్రోత్సాహంతో చదువుతో పాటు క్రీడల్లోనూ దూసుకెళ్తున్న వైశాలి, తన పట్టుదలతో తోటి విద్యార్థులకు ఆదర్శంగా నిలుస్తోంది. వైశాలి సాధించిన ఈ ఘనత పట్ల గ్రామస్థులు, పాఠశాల ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తూ, రాష్ట్రస్థాయి పోటీల్లోనూ విజయం సాధించి జిల్లాకు మంచి పేరు తెవాలని ఆకాంక్షించారు.

నీరుకుళ్ళ గ్రామంలో ఎంఎస్ఎఫ్ నూతన గ్రామ కమిటీ ఏర్పాటు

ప్రజావాణి ఆత్మకూరు: అక్టోబరు 27 మహాజననేత పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఈ రోజు నీరుకుళ్ళ గ్రామంలో ఎంఎస్ఎఫ్ నూతన గ్రామ కమిటీని ఏర్పాటు చేశారు. నీరుకుళ్ళ గ్రామశాఖ ఎంఆర్‌పీఎస్ అధ్యక్షుడు అర్షం అనిల్ మాదిగ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంఆర్‌పీఎస్ మాజీ ఆత్మకూరు మండల అధ్యక్షుడు నాద్దునూరి రఘు మాదిగ, ఎంఎస్ఎఫ్ అధికార ప్రతినిధి అర్షం సుధాకర్ మాదిగ హాజరయ్యారు. విశిష్ట అతిథులుగా ఎంఆర్‌పీఎస్ ఆత్మకూరు మండల అధ్యక్షుడు కోడెపాక రాజు మాదిగ, ఉపాధ్యక్షుడు అర్షం సునీల్ మాదిగ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా నూతన గ్రామ కమిటీని ఎన్నుకున్నారు.

ఎంఎస్ఎఫ్ నీరుకుళ్ళ గ్రామ నూతన కమిటీ

అధ్యక్షుడు: అర్షం పవన్ మాదిగ

అధికార ప్రతినిధి: రేణికుంట్ల శివరాజ్ మాదిగ

ఉపాధ్యక్షులు: అర్షం రేవంత్ మాదిగ, అర్షం శ్రవణ్ మాదిగ

ప్రధాన కార్యదర్శి: అర్షం రంజిత్ మాదిగ

కార్యదర్శి: నాగారపు అభినయ్ మాదిగ

సహాయ కార్యదర్శి: అర్షం రాజు మాదిగ

కోశాధికారి: అర్షం జయంత్ మాదిగ

కార్యవర్గ సభ్యులు: అర్షం లోకేష్ మాదిగ, ఒడ్డెపెల్లి ప్రేమ్ చరణ్, ఒడ్డెపెల్లి ప్రభు తేజ, అర్షం నాగరాజు.

నూతనంగా ఎన్నికైన కమిటీ గ్రామంలో విద్యార్థుల సమస్యల పరిష్కారానికి, యువత అభ్యున్నతికి, మహాజన నేతృత్వంలో సామాజిక న్యాయం సాధనకు కృషి చేయాలని ఈ సందర్భంగా నాయకులు ఆకాంక్షించారు.

మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పుట్టినరోజు సందర్భంగా ఉచిత మెగా వైద్య శిబిరం

- ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే జారె

దమ్మపేట, అక్టోబర్ 28 (మన సమగ్ర ప్రజావాణి) రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణం సమాచార మరియు పౌర సంబంధాల శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని దమ్మపేట మండల కేంద్రంలోని శ్రీ వినాయక ఫంక్షన్ హాల్‌లో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు రాష్ట్ర మాజీ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మువ్వా విజయబాబు సారథ్యంలో వారి కుమారుడు ధనుష్ ప్రణవ్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌కు చెందిన ఇండస్ ఇంటర్నేషనల్ స్కూల్ సహకారంతో ఈ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గౌరవ ఎమ్మెల్యే జారె ఆదినారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరంలో పాల్గొని కార్యక్రమ నిర్వాహకులను అభినందించారు ప్రజలకు ఆరోగ్య సేవలు అందుబాటులోకి తీసుకురావడంలో ఇటువంటి శిబిరాలు ఉపయోగకరంగా ఉంటాయని పేర్కొన్నారు. మందలపల్లి సాయిబాబా మందిరంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఆ తర్వాత మందలపల్లి సెంటర్‌లో యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కేక్ కటింగ్ కార్యక్రమంలో పాల్గొని జన్మదిన వేడుకల్లో భాగస్వాములయ్యారు. ఈ కార్యక్రమాల్లో మండల ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ నాయకులు యువజన కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సూపర్ ఎల్‌నినో పరిస్థితులను ఎదుర్కొనేందుకు సమష్టి కార్యాచరణ

- యాసంగిలో వరికి బదులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలి
- రైతుల సంక్షేమం, తాగునీటి సరఫరాకు ప్రాధాన్యత: మంత్రి శ్రీధర్ బాబు

ప్రజావాణి జిల్లా ప్రతినిధి పెద్దపల్లి అక్టోబర్ 28 పెద్దపల్లి: సూపర్ ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని రైతుల సంక్షేమం, తాగునీటి సరఫరా, విద్యుత్ అవసరాలపై ముందస్తు ప్రణాళికతో సమష్టిగా కార్యాచరణ చేపట్టాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అధికారులను ఆదేశించారు. బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు, జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్, డీసీపీ రాంరెడ్డితో కలిసి ఎల్‌నినో పరిస్థితులపై సంబంధిత శాఖల అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. యాసంగి సీజన్‌లో వరి సాగును తగ్గించి, తక్కువ నీటితో పండే పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు, నూనెగింజలు, మొక్కజొన్న వంటి ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. భూగర్భ జలాలు తగ్గుతున్న నేపథ్యంలో అందుబాటులో ఉన్న నీటిని సమర్థంగా వినియోగించుకోవాలని తెలిపారు. జిల్లాలోని అన్ని గ్రామాలు, పట్టణాల్లో రానున్న ఏడాది పాటు నిరంతర తాగునీటి సరఫరాకు ముందస్తు ప్రణాళికలు రూపొందించాలని, నీటి పొదుపుపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. ప్రధానమంత్రి సూర్య ఘర్ పథకం ద్వారా సోలార్ ప్యానెళ్ల ఏర్పాటును ప్రోత్సహించాలని, ప్రజాప్రతినిధులు తమ ఇళ్లపై సోలార్ ప్యానెళ్లు ఏర్పాటు చేసుకొని ప్రజలకు ఆదర్శంగా నిలవాలని సూచించారు. ప్రభుత్వ విప్ విజయరమణారావు మాట్లాడుతూ యాసంగిలో వరి సాగును ప్రోత్సహించకుండా ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. రైతులకు మద్దతు ధర అందేలా ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలను సిద్ధం చేయాలని సూచించారు.

జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ జిల్లాలో వర్షాభావ పరిస్థితుల కారణంగా భూగర్భ జలాలు తగ్గుతున్నాయని తెలిపారు. యాసంగిలో నీటి వినియోగం తక్కువగా ఉండే పంటలను ప్రోత్సహించడంతో పాటు తాగునీటి సరఫరాకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అన్నయ్య గౌడ్, రామగుండం మేయర్ మహంకాళి స్వామి, మున్సిపల్ చైర్మన్లు, మార్కెట్ కమిటీ చైర్మన్లు, సింగిల్ విండో చైర్మన్లు, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

గాగిల్లాపూర్‌లో సీసీ కెమెరాల ఏర్పాటుపై అవగాహన

- గ్రామ భద్రతకు సీసీ కెమెరాలు కీలకం- ఎస్సై తోట తిరుపతి

బెజ్జంకి, అక్టోబర్ 28 (ప్రజావాణి) సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండల పరిధిలోని గాగిల్లాపూర్ గ్రామంలో నేరాల నియంత్రణ, ప్రజల భద్రతే లక్ష్యంగా సీసీ కెమెరాల ప్రాముఖ్యతపై బెజ్జంకి ఎస్సై తోట తిరుపతి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమంనిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై తోట తిరుపతి మాట్లాడుతూ గ్రామాల్లో దొంగతనాలు, ఇతర నేరాలను అరికట్టడంలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. నేరాలు జరిగినప్పుడు నిందితులను సులభంగా గుర్తించేందుకు సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. గ్రామంలోని ప్రధాన కూడళ్లు, వీధుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

జైపూర్ పవర్ ప్లాంట్‌లో 'ఆక్టోపస్' మాక్ డ్రిల్

జైపూర్ , అక్టోబరు 27,మన సమగ్ర ప్రజావాణి: రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని జైపూర్ ఎస్‌టీపీపీ పవర్ ప్లాంట్‌లో తెలంగాణ రాష్ట్ర 'ఆక్టోపస్' (అక్టోపస్) యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్ ఆధ్వర్యంలో బుధవారం ఉగ్ర నిరోధక మాక్ డ్రిల్ నిర్వహించారు. రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, ఆక్టోపస్ సీనియర్ అధికారుల ప్రత్యక్ష పర్యవేక్షణలో కమాండోలు అత్యాధునిక ఆయుధాలతో ఈ సమర విన్యాసాలు చేపట్టారు.?ఈ సందర్భంగా సీపీ అంబర్ కిషోర్ ఝా మాట్లాడారు. జనసమ్మర్ద ప్రాంతాలతో పాటు దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నుముకగా నిలిచే విద్యుత్ ప్రాజెక్టులు, భారీ పరిశ్రమలనే లక్ష్యంగా చేసుకుని ఉగ్రవాదులు లేదా అసాంఘిక శక్తులు దాడికి తెగబడే అవకాశం ఉందన్నారు. ఇలాంటి కీలక ప్రాజెక్టులపై ఆకస్మిక దాడులు జరిగినప్పుడు స్థానిక భద్రతా బలగాలు సత్వరమే స్పందించకపోతే తీవ్ర నష్టం వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అత్యవసర పరిస్థితుల్లో శత్రుమూకలను ఏవిధంగా మట్టుబెట్టాలి, ప్రాజెక్టును ఎలా రక్షించుకోవాలనే అంశాలపై భద్రతా సిబ్బందికి ప్రాక్టికల్ అవగాహన కల్పించడమే ఈ మాక్ డ్రిల్ ముఖ్య ఉద్దేశమని సీపీ వివరించారు. ఇటువంటి విన్యాసాల వల్ల భద్రతా ఏర్పాట్లలోని లోటుపాట్లను ముందుగానే గుర్తించి సరిదిద్దుకోవచ్చని తెలిపారు. అలాగే స్థానిక పోలీసులు, ప్లాంట్ భద్రతను చూసే సీఐఎస్ఎఫ్ బలగాలు, ప్రాజెక్టు అధికారుల మధ్య పరస్పర సమన్వయం మరింత మెరుగవుతుందన్నారు. ఈ విన్యాసాల్లో మంచిర్యాల డీసీపీ ఎ.భాస్కర్, జైపూర్ ఏసీపీ ఆర్.వెంకటేశ్వర్లు, సీఐ నవీన్ కుమార్, ఎస్ఐ భూమేష్, ఆక్టోపస్ కమాండోలు, సీఐఎస్ఎఫ్ సిబ్బంది, స్థానిక పోలీసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

స్వచ్ఛందంగా రక్తదానం చేసి ప్రాణాలు నిలపాలి

● సీపీ అంబర్ కిషోర్ ఝా

జైపూర్, అక్టోబరు 28,మన సమగ్ర ప్రజావాణి:రక్తదానం ప్రాణదానంతో సమానమని, ఆపదలో ఉన్నవారికి అండగా నిలిచేందుకు ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా ముందుకొచ్చి రక్తదానం చేయాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా పిలుపునిచ్చారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకుని జైపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం నిర్వహించిన రక్తదాన శిబిరానికి మంచిర్యాల డీసీపీ ఎ.భాస్కర్ తో కలిసి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా సీపీ మాట్లాడారు. అత్యవసర పరిస్థితుల్లో రక్తం దొరక్క అల్లాడే బాధితులకు రక్తదాతలు అందించే రక్తం ప్రాణరక్షణగా మారుతుందన్నారు. సమాజానికి ఎంతో మేలు చేసే ఇటువంటి సేవా కార్యక్రమాల్లో యువత భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. ఆరోగ్యంగా ఉన్న ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా రక్తదానం చేయడం వల్ల శరీరానికి కూడా మేలు జరుగుతుందని, ఈ విషయమై ప్రజల్లో అవగాహన పెరగాల్సిన అవసరం ఉందన్నారు.
?శిబిరంలో పాల్గొని రక్తదానం చేసిన ఎస్ఐ భూమేష్ తో పాటు పలువురు పోలీస్ అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామ సర్పంచ్, యువకులను ఈ సందర్భంగా సీపీ అభినందించి ప్రశంసించారు.ఈ కార్యక్రమంలో జైపూర్ ఏసీపీ ఆర్.వెంకటేశ్వర్లు, సీఐ నవీన్ కుమార్, ఎస్ఐ భూమేష్, స్థానిక ప్రజాప్రతినిధులు, పోలీస్ సిబ్బంది, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారుద

నిరుపేద కుటుంబానికి బియ్యం వితరణ

● బియ్యం వితరణ చేసిన కౌన్సిలర్ కల్లూరి రేణుక-రాజు

సిరిసిల్ల, ప్రజావాణి సిరిసిల్ల పట్టణం 36 వ వార్డు సుందరయ్య నగర్ కు చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన కన్నా రమేష్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ తన వంతు సహాయంగా 50 కిలోల బియ్యం అందజేసిన మానవత్వం చాటుకున్నారు.ఈ కార్యక్రమంలో ఆడెపు సత్య నారాయణ,గడ్డం వెంకటేష్,కోడూరి మల్లేశం, లింగంపెల్లి దేవయ్య, బోయిని శ్రీనివాస్, గోక లక్ష్మి రాజం, బింగి శ్రీధర్, బొల్లి అంబదాస్,ఆడెపు విఠల్, పెంటయ్య కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

యువతిని ప్రేమ పేరుతో వేధించిన వ్యక్తి అరెస్ట్

● నిందితుడిపై రౌడీషీట్ తెరుస్తాం ● సిరిసిల్ల డీఎస్పీ నాగేంద్ర చారి

ఎల్లారెడ్డిపేట, ప్రజావాణి ఎల్లారెడ్డిపేట మండలానికి చెందిన ఓ యువతిని ప్రేమ పేరుతో గత కొన్ని రోజులుగా వెంటాడుతూ, అసభ్యకరంగా ప్రవర్తించిన జుబేర్ (ఎల్లారెడ్డిపేట)పై పోలీసులు కేసు నమోదు చేసి అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సిరిసిల్ల డీఎస్పీ కే. నాగేంద్ర చారి తెలిపారు.నిందితుడు జుబేర్‌పై గతంలో హుజూరాబాద్‌లో పోక్సో కేసు నమోదైందని, ఆ కేసులో జైలుకు వెళ్లి వచ్చినట్లు డీఎస్పీ పేర్కొన్నారు. అతని నేర ప్రవర్తనను పరిగణనలోకి తీసుకొని రౌడీషీట్ తెరవనున్నట్లు వెల్లడించారు.ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఉద్వేగాలకు లోనుకాకుండా సంయమనం పాటించాలని, పోలీసు శాఖకు సహకరించాలని కోరారు. ఎవరూ చట్టాన్ని అతిక్రమించి ప్రవర్తించవద్దని హెచ్చరించారు.ఇక్కడ రూరల్ సీఐ వెంకటేష్, ఎస్సై రమేష్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాల సంగెం మండల మాదిగ విద్యార్థులుతో సమావేశం

అక్టోబర్ 28.ప్రజావాణి న్యూస్ /సంగెం పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మాదిగ విద్యార్థులు యువకులతో సమావేశం ఏర్పాటు చేసి పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ ఉద్యమ చరిత్రను వర్గీకరణ అవశ్యకతను వివరించి ఎంఆర్పీఎస్ సాధించి పెట్టిన సంక్షేమ పథకాలను వివరించి అనంతరం మాదిగ విద్యార్థి సమైఖ్య (MSF) నూతన కమిటీనీ ఏకగ్రీవంగా ఎన్నిక చేయడం జరిగింది.ఈ సమావేశానికి సంగెం మండల ఇంచార్జి కోడూరి రాజు మాదిగ అధ్యక్షత వహించారు. ఎంఎస్ఎఫ్ నూతన కమిటీ అధ్యక్షులు మెట్టిపెల్లి ప్రభాస్ మాదిగ ఇంటర్,అధికార ప్రతినిధి మెట్టుపల్లి దినేష్ ఇంటర్ ,ప్రధాన కార్యదర్శి మెట్టి పెల్లి రిత్విక్ మాదిగ,రాజ్ ఇంటర్,ఉపాధ్యక్షులు బొజ్జ కార్తికేయ మాదిగ ఇంటర్,ఇమ్మడి రిషి ఇంటర్మీడియట్ లను ఏకగ్రీవంగా ఎన్నిక చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు చిర్ర సునీల్ మాదిగ తదితరులు పాల్గొన్నారు .

ఇందిరమ్మ గృహప్రవేశ వేడుకల్లో పాల్గొన్న డీసీసీ అధ్యక్షులు పట్లోళ్ల చంద్రశేఖర్ రెడ్డి

నారాయణఖేడ్ నియోజక వర్గం:- (ప్రజావాణి) ఇంచార్జ్ మదుసుదన్ నాగల్‌గిద్ద: నారాయణఖేడ్ నియోజకవర్గంలోని నాగల్‌గిద్ద మండలం ఎర్రబొగూడ గ్రామ పంచాయతీ పరిధిలో ఎస్సీ సెల్ అధ్యక్షులు స్వామిదాస్ సోదరుడు రేణుక--సురేష్ దంపతుల ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సంగారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షులు పట్లోళ్ల చంద్రశేఖర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, నూతన గృహంలోకి అడుగుపెట్టిన కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా పట్లోళ్ల చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. పేదవాడి సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. సొంత ఇంటితో పేద కుటుంబాలకు భద్రత, ఆత్మగౌరవం లభిస్తాయని అన్నారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాజు, సర్పంచ్, కౌన్సిలర్ బీ. రాజు ముదిరాజ్, ఎస్సీ సెల్ అధ్యక్షులు జైరాజ్, కృష్ణ, అమృత్, నర్సింలు, మాజీ ఎంపీటీసీ అర్జున్, లబ్ధిదారుల కుటుంబ సభ్యులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు స్వయం ఉపాధితో ఆర్థిక స్వావలంబన సాధించాలి

● శిక్షణలో నేర్చుకున్న నైపుణ్యాలను సద్వినియోగం చేసుకోవాలి

నంగునూరు, అక్టోబర్ 28 (ప్రజావాణి):మహిళలు స్వయం ఉపాధి రంగంలో రాణిస్తూ ఆర్థిక స్వావలంబన సాధించాలని అదనపు డీఆర్డీఓ సుధీర్ సూచించారు. నంగునూరు గ్రామంలో ఈడీఐఐ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన మహిళలకు బుధవారం సర్టిఫికెట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు అధికారులు సర్టిఫికెట్లు అందజేశారు.అదనపు డీఆర్డీఓ సుధీర్ మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదగడం ద్వారా కుటుంబ అభివృద్ధితోపాటు సమాజ అభివృద్ధికి తోడ్పడగలరని పేర్కొన్నారు. గ్రామ సర్పంచి సనదుల బాల పోచయ్య మాట్లాడుతూ మహిళలు స్వయం ఉపాధి

అవకాశాలను అందిపుచ్చుకొని సాధికారత సాధించాలని ఆకాంక్షించారు. లీడ్ బ్యాంక్ మేనేజర్ హరిబాబు మాట్లాడుతూ మహిళలు వ్యాపారాలు ప్రారంభించేందుకు అవసరమైన ఆర్థిక సహకారం అందించడానికి బ్యాంకులు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు.ఈడీఐఐ ప్రాజెక్టు అధికారి ఎడ్మండ్ భూపతి మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న నైపుణ్యాలను సద్వినియోగం చేసుకొని మహిళలు స్వయం ఉపాధి రంగంలో ముందుకు రావాలని సూచించారు. మార్కెట్ అవసరాలకు అనుగుణంగా వ్యాపారాలను అభివృద్ధి చేసుకుంటూ ఆర్థికంగా స్థిరపడాలని అన్నారు. శిక్షణ ద్వారా మహిళల్లో ఆత్మవిశ్వాసం పెరిగి, కొత్త ఉపాధి అవకాశాలను సృష్టించుకునేందుకు మార్గం సుగమమవుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో నాబార్డ్ ప్రతినిధి నిఖిల్ రెడ్డి, ఐటీ శాఖ సీఈఓ మల్లేష్, ఈడీఐఐ ప్రతినిధి రాకేష్, ఏపీఎం శ్రీనివాస్, కృష్ణయ్య (భారత ప్రభుత్వ కన్సల్టెంట్), సీసీ సేనాపతి, కార్యదర్శి నితీష్ కుమార్, వీఓ సభ్యులు, గ్రామ మహిళలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య, మెరుగైన వసతులు కల్పించాలి - జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

జయశంకర్ భూపాలపల్లి బ్యూరో అక్టోబర్ 28(మన ప్రజావాణి):- బుధవారం గన్‌పూర్ మండల కేంద్రంలోని పీఎం శ్రీ తెలంగాణ మోడల్ స్కూల్ మరియు జూనియర్ కళాశాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా పాఠశాల, కళాశాలలో విద్యాబోధన తీరు, విద్యార్థుల హాజరు, మౌలిక వసతులు, ప్రయోగశాలల నిర్వహణను పరిశీలించారు. వివిధ తరగతులను సందర్శించి విద్యార్థులతో మాట్లాడి ఉపాధ్యాయుల బోధనా తీరును అడిగి తెలుసుకున్నారు.సైన్స్, గణితం, సాంఘిక శాస్త్రాలతో పాటు హెల్త్‌కేర్, రిటైల్ ఒకేషనల్ కోర్సుల తరగతులను పరిశీలించారు. విద్యార్థుల హాజరు శాతంపై ఆరా తీస్తూ, అన్ని తరగతుల్లో వంద శాతం హాజరు నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. ముఖ గుర్తింపు (ఫేస్ అటెండెన్స్) తప్పనిసరి అని స్పష్టం చేశారు.
పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం, హాస్టల్ వసతులు, ల్యాబ్ సౌకర్యాలను పరిశీలించారు. ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్లు తదితర విద్యుత్ పరికరాలు సక్రమంగా పనిచేసేలా

చూడాలని, మరమ్మతులు అవసరమైన వాటిని వెంటనే బాగు చేయించాలని సూచించారు.విద్యార్థులతో ముచ్చటించిన కలెక్టర్ వారి భవిష్యత్ లక్ష్యాలను అడిగి తెలుసుకున్నారు. డాక్టర్లు, నర్సులు తదితర ఉన్నత స్థాయిలకు చేరుకోవాలనే లక్ష్యంతో

క్రమశిక్షణ, పట్టుదలతో చదువుకోవాలని సూచించారు. చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ కనబరచాలని ప్రోత్సహించారు.
ఈ తనిఖీలో తహసీల్దార్ రాజేశ్వర రావు, ప్రిన్సిపాల్ తిరుపతి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్ అవసరాలకు భైంసా పట్టణం సిద్ధం!

■ 2040 లక్ష్యంగా మాస్టర్ ప్లాన్ రూపకల్పన
■ రహదారులు, విద్యా, వైద్య, వాణిజ్య రంగాలకు ప్రాధాన్యం
■ అభ్యంతరాలు, సూచనలు స్వీకరిస్తాం: కలెక్టర్ భవేశ్ మిశ్రా

నిర్మల్ జిల్లా ప్రజావాణి బ్యూరో,అక్టోబర్ 28:-భైంసా పట్టణాన్ని భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చేసేందుకు సమగ్ర మాస్టర్ ప్లాన్ రూపొందిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా వెల్లడించారు. పట్టణంలో పెరుగుతున్న జనాభాను దృష్టిలో ఉంచుకొని మౌలిక వసతుల కల్పనకు ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు.2040 నాటికి పట్టణ ప్రజలకు అవసరమైన సదుపాయాలను ముందుగానే గుర్తించి,వాటి అభివృద్ధికి తగిన ప్రణాళికలు సిద్ధం చేయడమే లక్ష్యమన్నారు. బుధవారం భైంసా మున్సిపల్ కార్యాలయంలో మాస్టర్ ప్లాన్‌పై రెండో కన్సల్టేటివ్ వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, పట్టణ అభివృద్ధికి సంబంధించిన ముసాయిదా మాస్టర్ ప్లాన్‌పై వివిధ వర్గాల అభిప్రాయాలను సేకరిస్తున్నట్లు చెప్పారు. గతంలో కలెక్టరేట్‌లో తొలి సంప్రదింపుల సమావేశం నిర్వహించామని, ప్రస్తుతం ప్రజాప్రతినిధులు, అధికారులు, సంబంధిత వర్గాల నుంచి సూచనలు స్వీకరిస్తున్నట్లు వివరించారు. ముసాయిదాపై ఏవైనా అభ్యంతరాలు లేదా సందేహాలు ఉంటే అధికారులకు తెలియజేయాలని సూచించారు.
ప్రస్తుతం భైంసా పట్టణ జనాభా సుమారు 60 వేల వరకు ఉందని,రాబోయే సంవత్సరాల్లో జనాభా పెరిగే అవకాశాలను దృష్టిలో ఉంచుకొని పట్టణ విస్తరణకు అనుగుణంగా మౌలిక వసతులు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.రహదారుల అభి

వృద్ధి, విద్యాసంస్థలు, ఆసుపత్రులు, పార్కులు, క్రీడా మైదానాలు, నివాస ప్రాంతాల ఏర్పాటుతో పాటు పారిశ్రామిక, వాణిజ్య కార్యకలాపాలకు తగిన స్థలాలను గుర్తించడం మాస్టర్ ప్లాన్‌లో ముఖ్యమైన అంశాలని పేర్కొన్నారు. పట్టణాభివృద్ధి కోసం రూపొందించే మాస్టర్ ప్లాన్ ప్రజలకు ఉపయోగకరంగా ఉండాలని ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, పట్టణ ప్రజల భాగస్వామ్యంతో ప్రణాళికను రూపొందిస్తే మెరుగైన ఫలితాలు సాధించవచ్చని అభిప్రాయపడ్డారు. పట్టణంలోని నివాస, వాణిజ్య, పారిశ్రామిక

ప్రాంతాల అభివృద్ధిని సమతుల్యంగా చేపట్టాలని సూచించారు. మాస్టర్ ప్లాన్ అమలుతో భవిష్యత్‌లో పట్టణ ప్రజలకు మెరుగైన రవాణా, విద్యా, వైద్య సదుపాయాలు అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. వర్క్‌షాప్‌లో డైరెక్టరేట్ ఆఫ్ టౌన్ ప్లానింగ్ అండ్ కంట్రీ ప్లానింగ్ అసిస్టెంట్ డైరెక్టర్ అశ్విని పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ముసాయిదా మాస్టర్ ప్లాన్‌ను వివరించారు. పట్టణంలోని పారిశ్రామిక, వాణిజ్య, నివాస జోన్లకు సంబంధించిన పటాలను, భవిష్యత్ అభివృద్ధి ప్రతిపాదనలను సమావేశంలో వివరించారు.ముసాయిదా ప్రణాళికపై పాల్గొన్న వారు లేవనెత్తిన సందేహాలకు సమాధానాలు ఇచ్చారు. ఈ కార్యక్రమం లో మున్సిపల్ చైర్మన్ దత్తాత్రి, వైస్ చైర్మన్ బీబీ కుతీజా సిద్ధిఖీ, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఏఎస్పీ సాయి కిరణ్, మున్సిపల్ కమిషనర్ సంతోష్ కుమార్, కౌన్సిల్ సభ్యులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాపాలనను అపహాస్యం చేసే అధికారులపై సీఎంకు ఫిర్యాదు చేస్తాం

● ప్రజా సమస్యలను పట్టించుకోని అధికారుల తీరును సహించేది లేదు
● చిన్మయి మార్గ్‌లో ఇంకుడు గుంత ఆక్రమణపై చర్యలు తీసుకోవాలి: జంగాల శ్రీరామ్ యాదవ్

మల్కాజిగిరి ప్రతినిధి (ప్రజావాణి) అక్టోబరు 27) ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ప్రజాపాలనకు చెడ్డపేరు తీసుకువచ్చే అధికారులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఫిర్యాదు చేస్తామని కాంగ్రెస్ పార్టీ మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా ఉపాధ్యక్షులు జంగాల శ్రీరామ్ యాదవ్ హెచ్చరించారు. ప్రజా ప్రభుత్వంలో ప్రజల సమస్యలకు అధికారులు ప్రాధాన్యత ఇవ్వాలని, కాంగ్రెస్ పార్టీకి చెడ్డపేరు వచ్చేలా వ్యవహరిస్తే సహించేది లేదని స్పష్టం చేశారు.మల్కాజిగిరి జోనల్ పరిధిలోని మల్కాజిగిరి--మిర్జాలగూడ డివిజన్ చిన్మయి మార్గ్‌లో ప్రజా ప్రయోజనాల కోసం ఏర్పాటు చేసిన ఇంకుడు గుంతను ఆక్రమించి ప్రహరీ గోడ నిర్మించిన వారిపై చర్యలు తీసుకోవాలని మూడు వారాల క్రితం ప్రజావాణిలో ఫిర్యాదు చేసినప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని ఆయన ఆరోపించారు. ఈ

సమస్య పరిష్కారం కోసం ప్రతి వారం ప్రజావాణికి వచ్చి ఫిర్యాదు చేస్తున్నా సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ విషయాన్ని పరిశీలించిన మల్కాజిగిరి జోనల్ కమిషనర్, టౌన్ ప్లానింగ్ ఏసీపీ శ్రీనివాస్‌కు ఆదేశాలు జారీ చేసి, అక్రమ నిర్మాణాన్ని తొలగించి ఇంకుడు గుంతను యథావిధిగా కొనసాగించాలని సూచించినట్లు శ్రీరామ్ యాదవ్ తెలిపారు. అయినప్పటికీ ఆదేశాలు అమలు కాకపోవడంపై ప్రజావాణిలో అధికారులను నిలదీసినట్లు పేర్కొన్నారు.

ప్రజా సంక్షేమానికి ఉపయోగపడే ఇంకుడు గుంతలను పరిరక్షించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని, వాటిని ఆక్రమణలకు గురిచేస్తే భవిష్యత్తులో మరిన్ని ఆక్రమణలకు అవకాశం ఏర్పడుతుందని ఆయన అన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకోవాలని, ఇంకుడు గుంతను కాపాడాలని డిమాండ్ చేశారు.
ప్రజా సమస్యలను పరిష్కరించకుండా నిర్లక్ష్యం వహించే అధికారుల వ్యవహారశైలిని ఉపేక్షించబోమని, అవసరమైతే స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి ముఖ్యమంత్రికి నేరుగా ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. ప్రతిపక్ష నాయకులతో కుమ్మక్కై ప్రజా ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకువచ్చేలా కొందరు అధికారులు వ్యవహరిస్తున్నారని ఆరోపించిన ఆయన, ప్రజల పక్షాన నిలబడి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. మైనంపల్లి హనుమంతరావు సహకారంతో ప్రజా సంక్షేమ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తామని జంగాల శ్రీరామ్ యాదవ్ స్పష్టం చేశారు.

గురువారం,
అక్టోబర్ 29, 2026
మన పత్రిక ప్రజావాణి తెలుగు డైలీ

గంగకత్వ కాలువ ఆధునీకరణకు రూ.37 కోట్లు తీసుకొచ్చిన జగ్గారెడ్డి, నిర్మల

- 11 గ్రామాల్లో 3,300 ఎకరాల ఆయకట్టుకు ప్రయోజనం
- 2028 జూన్ నాటికి పనులు పూర్తి చేయడమే లక్ష్యం
- నవంబర్‌లో మంత్రుల చేతుల మీదుగా శంకుస్థాపన..
- కాలువను పరిశీలించి ఈత కొట్టిన జగ్గారెడ్డి

మన ప్రజావాణి। అక్టోబర్ 28 ।సదాశివపేట। జిల్లా ప్రతినిధి ఏడో నిజాం కాలంలో నిర్మించిన గంగకత్వ ప్రాజెక్టు కాలువ ఆధునీకరణకు రూ.37 కోట్ల నిధులు మంజూరు కావడంతో రైతుల్లో ఆశలు చిగురించాయి. కాలువ ఆధునీకరణ పనులు పూర్తయితే 11 గ్రామాల్లోని 3,300 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి గంగకత్వ ప్రాజెక్టును సందర్శించి సాగునీటి శాఖ అధికారులతో పాటు ఆయకట్టు గ్రామాల రైతులు, స్థానిక నాయకులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ.. గంగకత్వ కాలువ ఆధునీకరణకు నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దామోదర రాజనర్సింహ, వివేక్ వెంకటస్వామికి కృతజ్ఞతలు తెలిపారు. రెండేళ్ల క్రితమే కాలువ ఆధునీకరణకు నిధులు మంజూరు చేయాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కోరినట్లు వెల్లడించారు. అధికారులతో పలుమార్లు సమీక్షలు నిర్వహించి నిధుల మంజూరుకు కృషి చేసినట్లు చెప్పారు.

తాను ఎమ్మెల్యేగా లేకపోయినా రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని రూ.37 కోట్ల నిధులు తీసుకువచ్చానని తెలిపారు. ఏడో నిజాం కాలంలో నిర్మించిన కాలువను ఆధునీకరించే అవకాశం రావడం సంతోషంగా ఉందన్నారు. రైతులకు పూర్తిస్థాయిలో సాగునీరు అందించడమే లక్ష్యంగా పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు. కాంట్రాక్టర్ల ప్రయోజనాల కంటే రైతుల అవసరాలకే ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు.

11 గ్రామాల్లో 3,300 ఎకరాలకు సాగునీరు

సదాశివపేట మండలం సూరారం గ్రామ పరిధిలోని గంగకత్వ ప్రాజెక్టు కాలువ సుమారు 16 కిలోమీటర్ల మేర విస్తరించి ఉందని, ఈ కాలువకు 28 చెరువులు అనుసంధానమై ఉన్నాయని జగ్గారెడ్డి వివరించారు. కాలువ ఆధునీకరణతో చివరి ఆయకట్టు వరకు నీరు చేరేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కాలువ లైనింగ్, దెబ్బతిన్న ప్రాంతాల మరమ్మతులు, సీసీ లైనింగ్, తూముల పునరుద్ధరణ, వంతెనల వెడల్పు పెంపు వంటి పనులపై సమీక్షించారు. కాలువ వెంట తనిఖీలకు ఉపయోగపడే దారిని పునరుద్ధరించాలని, నీరు వృథా కాకుండా చెరువులకు సక్రమంగా చేరేలా చర్యలు చేపట్టాలని సూచించారు.

లీకేజీల నివారణకు చర్యలు

కాలువల పరిస్థితిపై ఆయకట్టు గ్రామాల రైతులు పలు సమస్యలను జగ్గారెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. వర్షాకాలంలో కాలువలు తెగిపోతున్నాయని చందాపూర్ గ్రామస్థులు తెలిపారు. మిలిగిరిపేట పరిధిలో వాగుల్లో పూడిక తొలగించాలని కోరారు. కాలువల దుస్థితి కారణంగా నీరు గ్రామాల్లోకి వస్తోందని పొట్పల్లి గ్రామస్థులు వివరించారు.

ప్రాజెక్టు చివరి భాగంలో ఉన్న యెన్కేపల్లికి సాగునీరు అందడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధాన కాలువ తూము వద్ద లీకేజీలతో నీరు వృథా అవుతోందని తెలిపారు. ఆత్మకూరు పరిధిలో లీకేజీలను అరికట్టి చెరువులకు నీరు మళ్లించాలని, అంకెన్‌పల్లిలో కాలువ ఆకృతిని సవరించి గట్లను బలోపేతం చేయాలని కోరారు. రైతులు తెలిపిన సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, అవసరమైన పనులకు అంచనాలు రూపొందించాలని జగ్గారెడ్డి అధికారులకు సూచించారు.

వాగుపై ఏడు చెక్‌డ్యామ్‌ల నిర్మాణానికి ప్రతిపాదనలు

గంగకత్వ ప్రాజెక్టు ఆధునీకరణతో పాటు వాగుపై ఏడు ప్రాంతాల్లో చెక్‌డ్యామ్‌ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు జగ్గారెడ్డి తెలిపారు. వికారాబాద్ జిల్లా మర్పల్లి ప్రాంతం నుంచి గంగకత్వకు వచ్చే వాగును అభివృద్ధి చేస్తే నీటి ప్రవాహం పెరిగే అవకాశం ఉందా అనే అంశంపై అధికారులతో చర్చించారు.

వాగు, ప్రాజెక్టులో పూడిక తొలగింపునకు ప్రతిపాదనలు రూపొందించాలని సూచించారు. ప్రాజెక్టులో ఆరు నుంచి ఏడు అడుగుల మేర పూడిక తొలగించే అవకాశం ఉందని అధికారులు తెలపడంతో, సాంకేతికంగా సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని కోరారు. కొల్కూరు--నిజాంపూర్ మధ్య మంజీరా బ్యాక్‌వాటర్ కారణంగా పంటలు మునిగిపోతున్నాయని రైతులు వివరించారు. ఈ సమస్య పరిష్కారానికి చెక్‌డ్యామ్ నిర్మాణ సాధ్యాసాధ్యాలను పరిశీలించి అంచనాలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు.

2028 జూన్ నాటికి పనులు పూర్తి చేయడమే లక్ష్యం

నవంబర్‌లో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దామోదర రాజనర్సింహ, వివేక్ వెంకటస్వామి చేతుల మీదుగా పనులకు శంకుస్థాపన జరిగేలా కృషి చేస్తానని జగ్గారెడ్డి తెలిపారు. డిసెంబర్‌లోపు టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించినట్లు చెప్పారు.

2028 జూన్ నాటికి పనులు పూర్తి చేసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రాజెక్టును ప్రారంభించేలా ప్రణాళిక రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. డిసెంబర్‌లో మరోసారి ప్రాజెక్టును సందర్శించి పనుల పురోగతిని సమీక్షిస్తానన్నారు.

నిధుల మంజూరుకు కృషి చేయడం తన బాధ్యతని, శంకుస్థాపన, ప్రారంభోత్సవ కార్యక్రమాలను అధికారులు ప్రోటోకాల్ ప్రకారం నిర్వహిస్తారని పేర్కొన్నారు. చిన్నప్పటి నుంచి ఈ వాగుతో తనకు అనుబంధం ఉందని, తన భార్య స్వగ్రామం తాటిపల్లి కావడంతో తరచూ ఇక్కడికి వచ్చేవాడినని గుర్తుచేసుకున్నారు.

ప్రాజెక్టు సందర్శనలో భాగంగా జగ్గారెడ్డి గంగకత్వ కాలువను పరిశీలించడంతో పాటు కాలువలో డైవ్ చేసి ఈత కొట్టారు.

మంచాల మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలి

బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు చీరాల రమేష్ , ఏర్పుల చంద్రయ్య, బి ఎన్ జ్ఞానేశ్వర్, మాట్లాడుతూ ఈరోజు ప్రభుత్వం ప్రకటించిన కరువు మండలాల జాబితాలో మంచాల మండలం లేక పోవడం దురదృష్టకరం,ప్రభుత్వం కరువు మండలాల జాబితాలో నగర శివారు మండలాలు గండిపేట, రాజేంద్రనగర్, సరూర్ నగర్,అబ్దుల్లాపూర్ ,బాలాపూర్ మరియు మహేశ్వరం లాంటి వ్యవసాయం చేయని ప్రాంతాలను కరువు మండలాలుగా ప్రకటించి ,తీవ్ర దుర్భిక్షాన్ని ఎదుర్కొంటున్న అత్యంత వెనుకబడిన,ప్రధానంగా వ్యవసాయాధారిత/ఎలాంటి ఉపాధి అవకాశాలు లేని మంచాల మండలం మాత్రం కరువు మండలంగా ప్రకటించక పోవడాన్ని BRS పార్టీ తీవ్రంగా ఖండించింది ఇట్టి విషయాన్ని పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వం,సంభరిత రెవిన్యూ ,వ్యవసాయాధికారులు స్థానిక రైతులు,ప్రజాప్రతినిధులతో చర్చించి సమగ్ర నివేదిక తయారు చేసి ప్రభుత్వానికి పంపాలని,వెంటనే మంచాల మండలాన్నీ కరువు ప్రాంతంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు స్థానిక MLA గారు నిర్లక్ష్యాన్ని వీడి సమయోచితంగా అధికారులకు తగిన ఆదేశాలు ఇచ్చి,సత్వరమే ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించాలన్నారు మండలానికి అనేక రకాలుగా జరుగుతున్న అన్యాయాన్ని నిరసిస్తూ స్థానిక వీ=ా గారికి వినతి పత్రాన్ని అందజేశారు ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి మండలాన్ని వెంటనే కరువు మండలముగా ప్రకటించాలని మరొక్కసారి డిమాండ్ చేశారు ఈ కార్యక్రమములో బుస్సు పుల్లారెడ్డి,జంగారెడ్డి,రఘుతి, బద్రీనాథ్ గుప్తా గంట విజయ్ ప్రకాష్ రెడ్డి,బొడ్డు నాగరాజు,పుదుతల నాగరాజు,నోముల బాలరాజు,కరుణాకర్ రెడ్డి,పున్నంరాము, మల్లప్ప,నారీ యాదయ్య,ఆకారం కృష్ణ,హనుమంతు, తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమస్యల పరిష్కారానికి ఐకేపీ సిబ్బంది చొరవ!

- ఆధార్ లింకింగ్ కారణంగా ఇతర బ్యాంకు ఖాతాల్లో జమ అయిన నగదు..
- రైతులకు భరోసా కల్పిస్తున్న సీసీ విట్టల్, ధడవాయి విలాస్, ఆపరేటర్ భోజన్న

నిర్మల్ జిల్లా ప్రజావాణి బ్యూరో, కుబీర్, అక్టోబర్ 28: రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వారి సమస్యలను పరిష్కరించేందుకు ఐకేపీ సిబ్బంది చొరవ చూపుతున్నారు. నిర్మల్ జిల్లా కుబీర్ మండలం పల్సి గ్రామ ఐకేపీ సబ్ సెంటర్‌లో జొన్నల విక్రయాలకు సంబంధించి కొంతమంది రైతుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ కాకపోవడంతో తలెత్తిన సమస్యపై ఐకేపీ సీసీ విట్టల్, ధడవాయి విలాస్, ఆపరేటర్ భోజన్న ప్రత్యేకంగా దృష్టి సారించారు. రైతులకు రావాల్సిన నగదు చెల్లింపుల్లో జాప్యానికి గల కారణాలను గుర్తించి, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిసింది. రైతులు తమ జొన్నలను ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించిన అనంతరం, వారు అందించిన బ్యాంకు ఖాతాల్లో నగదు జమ కాకపోవడంతో ఆందోళనకు గురయ్యారు. అయితే కొంతమంది రైతుల బ్యాంకు ఖాతాలకు ఆధార్ అనుసంధానం మరో బ్యాంకు ఖాతాతో ఉండటంతో, పంట విక్రయాలకు సంబంధించిన నగదు వారు అందించిన ఖాతాలో కాకుండా, అదే రైతు పేరుతో ఆధార్‌కు అనుసంధానమైన మరో బ్యాంకు ఖాతాలో జమ అయినట్లు గుర్తించారు. దీంతో రైతులకు చెల్లింపుల విషయంలో సందేహాలు తలెత్తాయి. ఈ పరిస్థితిని గుర్తించిన ఐకేపీ సీసీ విట్టల్, ధడవాయి విలాస్, ఆపరేటర్ భోజన్న రైతులకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను తెలుసుకుంటున్నారు. బ్యాంకు ఖాతాలు, ఆధార్ అనుసంధానం, నగదు జమకు సంబంధించిన వివరాలను పరిశీలిస్తూ, సంబంధిత అధికారుల సహకారంతో సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నారు. రైతులు ఆందోళన చెందవద్దని, వారి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరలోనే పరిష్కారం లభించేలా చర్యలు తీసుకుంటామని భరోసా కల్పిస్తున్నట్లు సమాచారం. ఇటీవల జొన్న కొనుగోళ్ల చెల్లింపులపై కొన్ని ఆరోపణలు వెలువడిన నేపథ్యంలో, రైతులకు వాస్తవ పరిస్థితిని వివరించి, వారి సందేహాలను నివృత్తి చేయాల్సిన అవసరం ఉందని స్థానికంగా చర్చ జరుగుతోంది. రైతులకు అందాల్సిన నగదు ఏ ఖాతాలో జమ అయిందనే విషయాన్ని బ్యాంకు లావాదేవీల ద్వారా నిర్ధారించడంతో పాటు, చెల్లింపులకు సంబంధించిన సమస్యలను పరిష్కరించేందుకు ఐకేపీ సిబ్బంది చర్యలు తీసుకుంటున్నారు. రైతుల సంక్షేమమే లక్ష్యంగా కొనుగోలు కేంద్రాల్లో పారదర్శకంగా వ్యవహరించడంతో పాటు, చెల్లింపుల విషయంలో ఎదురయ్యే సమస్యలను గుర్తించి పరిష్కరించడం ముఖ్యమని రైతులు అభిప్రాయపడుతున్నారు. పల్సి గ్రామంలో జొన్నలు విక్రయించిన రైతులందరికీ చెల్లింపుల వివరాలను స్పష్టంగా తెలియజేసి, ఎవరికైనా నగదు అందకపోతే సంబంధిత బ్యాంకు, అధికారుల సమన్వయంతో సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

మొత్తంగా, రైతుల బ్యాంకు ఖాతాలకు ఆధార్ అనుసంధానం కారణంగా ఏర్పడిన చెల్లింపుల సమస్యలను పరిష్కరించేందుకు ఐకేపీ సీసీ విట్టల్, ధడవాయి విలాస్, ఆపరేటర్ భోజన్న చేస్తున్న ప్రయత్నాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. రైతులకు రావాల్సిన నగదు అందేలా సంబంధిత అధికారులు త్వరితగతిన చర్యలు తీసుకోవాలని, చెల్లింపులపై నెలకొన్న సందేహాలకు పూర్తి స్థాయిలో స్పష్టత ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

కేటీఆర్ ను విమర్శించే స్థాయి నీకులేదు

- కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరు వెంకట్ పై అగ్రహం.
- తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన కేటీఆర్ పై దూషణలా..?
- బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకులు కంచర్ల రవి గౌడ్ హెచ్చరిక.

రాజన్న సిరిసిల్ల, ప్రజావాణి కేటీఆర్ పై వ్యక్తి దూషణలు చెయ్యడం సరి కాదని బి అర్ ఎస్ వి రాష్ట్ర నాయకులు కంచర్ల రవి గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ భవనంలో నిర్వహించిన మీడియా సమావేశంలో బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకులు కంచర్ల రవి గౌడ్ మాట్లాడుతూ.... కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరు వెంకట్‌పై తీవ్రస్థాయిలో మండిపడ్డారు.బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై బల్మూరు వెంకట్ వ్యక్తిగత విమర్శలు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. కేటీఆర్ స్థాయిని, ఆయన చేసిన అభివృద్ధిని వివరించే స్థాయి బల్మూరు వెంకట్‌కు లేదని విమర్శించారు. తెలంగాణ ఐటీ రంగాన్ని అభివృద్ధి చేసి, రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామిగా నిలిపేందుకు కృషి చేసిన నాయకుడు కేటీఆర్ అని కొనియాడారు.తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన కేటీఆర్‌పై వ్యక్తిగతంగా మాట్లాడటం సిగ్గుచేటని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో విఫలమైందని, ప్రధాన ప్రతిపక్షంగా బీఆర్ఎస్ ప్రజల పక్షాన నిలబడి ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తుంటే, సమాధానం చెప్పాల్సిన బాధ్యతను విస్మరించి వ్యక్తిగత విమర్శలకు దిగడం సరికాదని మండిపడ్డారు.

గతంలో హుజూరాబాద్ ఉప ఎన్నికలో బల్మూరు వెంకట్‌కు డిపాజిట్ కూడా దక్కలేదని గుర్తుచేస్తూ, ఇతర నాయకులపై విమర్శలు చేసే ముందు తన రాజకీయ పరిస్థితిని ఆత్మపరిశీలన చేసుకోవాలని హితవు పలికారు.

రాష్ట్రంలో ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాల్సిన ప్రభుత్వం, ప్రజలకు ఇచ్చిన హామీల అమలును పక్కనపెట్టి రాజకీయ నాయకులపై విమర్శలు, వ్యక్తిగత దూషణలకే ప్రాధాన్యత ఇస్తోందని విమర్శించారు.కేటీఆర్‌పై వ్యక్తిగత విమర్శలు చేస్తే బీఆర్ఎస్ నాయకులుగా, కేటీఆర్ అభిమానులుగా చూస్తూ ఊరుకోబోమని కంచర్ల రవి గౌడ్ హెచ్చరించారు. రాజకీయ విమర్శలు విధానాలు, ప్రజా సమస్యల ఆధారంగా ఉండాలి కానీ వ్యక్తిగత దూషణలకు దిగడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు: మట్టె శ్రీనివాస్, ఆరెల్లి వినయ్, చెట్టిపెల్లి హరీష్, కల్యాడపు వినయ్, కుర్ర విష్ణు, కాసర్ల మణి శర్మ, కోయేటి జశ్వంత్, కంకణాల సాయి తేజ తదితరులు పాల్గొన్నారు.

హుజరాబాద్‌లో ఘనంగా చలో ఢిల్లీ పోస్టర్ ఆవిష్కరణ

- హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఒడితల ప్రణవ్ బాబు హుజురాబాద్ మునిసిపల్ చైర్మన్ రొంటాల సుహాసిని
- జిల్లా యూత్ కాంగ్రెస్ కార్యదర్శి సజ్జద్ మహమ్మద్ ఆధ్వర్యంలో హుజురాబాద్‌లో చలో ఢిల్లీ ఓటు బచావో దేశ్ బచావో కార్యక్రమాం

హుజురాబాద్ ప్రజావాణి అక్టోబర్:28 కరీంనగర్ జిల్లా యూత్ కాంగ్రెస్ కార్యదర్శి సజ్జద్ మహమ్మద్ ఆధ్వర్యంలో హుజురాబాద్‌లో చలో ఢిల్లీ ఓటు బచావో దేశ్ బచావో కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఘనంగా ఆవిష్కరించడం జరిగింది. ఈ కార్యక్రమానికి విచ్చేసిన హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఒడితల ప్రణవ్ బాబు హుజురాబాద్ మునిసిపల్ చైర్మన్ రొంటాల సుహాసిని చేతుల మీదుగా పోస్టర్‌ను ఆవిష్కరించారుఈ సందర్భంగా ఒడితల ప్రణవ్ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టడానికి మరియు యువతను పెద్దఎత్తున భాగస్వామ్యం చేయడానికి ఈ ‘చలో ఢిల్లీ’ కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందని పేర్కొన్నారు. పార్టీ శ్రేణులు, యూత్ కాంగ్రెస్ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారుఈ కార్యక్రమంలో కరీంనగర్ డిసిసి ఉపాధ్యక్షులు మొలుగూరి సదయ్య, కరీంనగర్ డిసిసి అధికార ప్రతినిధి నేరెళ్ల మహేందర్, హుజురాబాద్ మున్సిపల్ కౌన్సిలర్లు సొల్లు సునీత బాబు, వెంకటస్వామి నాయక్, పొనగంటి మల్లయ్య, బోయినపల్లి ఉమాపతి రావు, గంట కిరణ్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ హుజురాబాద్ నియోజకవర్గ అధ్యక్షులు చల్లూరి రాహుల్, యూత్ కాంగ్రెస్ కరీంనగర్ జిల్లా కార్యదర్శి లు రేవంత్, గంగారపు మహేష్, యూత్ కాంగ్రెస్ యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి తెలకుంట్ల ప్రశాంత్ పాతకాల ప్రవీణ్, సామల రాజిరెడ్డి, కిట్టు రెడ్డి, ప్రణయ్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

తహశీల్దార్ కార్యాలయ ఉప తహశీల్దార్ మహేందర్ గారికి ఘన వీడ్కోలు..

- ములుగు ఆర్డీవో కార్యాలయానికి బదిలీపై వెళ్తున్న సందర్భంగా వీడ్కోలు సభ
- పాల్గొన్న బీఆర్ఎస్ మండల అధ్యక్షులు గంప రాంబాబు మరియు నాయకులు

వెంకటాపురం (నూగురు), అక్టోబర్ 28 (ప్రజావాణి): వెంకటాపురం తహశీల్దార్ కార్యాలయంలో ఉప తహశీల్దార్‌గా విధులు నిర్వర్తించి, తాజాగా ములుగు రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీవో) కార్యాలయానికి బదిలీపై వెళ్తున్న మహేందర్ గారికి తహశీల్దార్ కార్యాలయంలో ఘనంగా వీడ్కోలు పలికారు. వెంకటాపురం మండల భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్టీ అధ్యక్షులు గంప రాంబాబు ఆధ్వర్యంలో ఈ ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహేందర్ గారిని శాలువాతో సత్కరించి, ఆత్మీయంగా వీడ్కోలు పలికారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు గంప రాంబాబు మాట్లాడుతూ.. “తహశీల్దార్ కార్యాలయంలో విధులు నిర్వహించిన కాలంలో మహేందర్ గారు ఎంతో నిజాయితీగా, బాధ్యతాయుతంగా వ్యవహరించారు. ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటూ, రైతులు మరియు పేద ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించడంలో ఆయన ప్రత్యేక చొరవ చూపారు. ప్రజా సేవలో అంకితభావంతో పనిచేసే ఇలాంటి అధికారులు ఉండడం గర్వకారణం. నూతన ప్రాంతంలోనూ ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తూ మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలి” అని ఆకాంక్షించారు.ఈ వీడ్కోలు కార్యక్రమంలో తహశీల్దార్ కార్యాలయ సిబ్బందితో పాటు బీఆర్ఎస్ పార్టీ నాయకులు గడ్డం వివేక్, మంచర్ల నాగేశ్వరావు, బట్ట నాగేందర్, కుశం దుర్గాప్రసాద్, ఎక్కిబోయిన సాయికిరణ్, నెల్లూరు వెంకన్నబాబు, తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని మహేందర్ గారికి శుభాకాంక్షలు తెలిపారు.

తంగళ్లపల్లిని కరువు మండలంగా ప్రకటించాలి

- బీజేపీ మండల అధ్యక్షుడు వెన్నమనేని శ్రీధర్ రావు డిమాండ్

తంగళ్లపల్లి ప్రజావాణి అక్టోబర్ 28 తంగళ్లపల్లి మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ బీజేపీ మండల అధ్యక్షుడు వెన్నమనేని శ్రీధర్ రావు ఆధ్వర్యంలో మానేరు బ్రిడ్జి వద్ద ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా శ్రీధర్ రావు మాట్లాడుతూ.. మండలంలో 11/6 ప్యాకేజీ కాలువ పనులను పూర్తి చేయాలని గతంలో రైతులతో కలిసి పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించగా, పనులు పూర్తి చేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందన్నారు. అయితే ఇప్పటివరకు ఆ హామీ అమలు కాలేదని విమర్శించారు.రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం వెంటనే తంగళ్లపల్లి మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను నిర్లక్ష్యం చేస్తే రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి సూరుకొంటి తిరుపతి రెడ్డి, మహిళా మోర్చా మండల అధ్యక్షురాలు గుర్రం అనసూర్య, మహేందర్, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి కోస్ని వినయ్ యాదవ్, జంగం కిషన్, జిందం సంతోష్, నక్క అశోక్, ఆత్మకూరి ముత్యం, మ్యాకల సురేష్, గొట్టం సందీప్ రెడ్డి, బొజ్జ తిరుపతి, మెహర్ కృష్ణ, కాబోజు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇబ్రహీంలుకు ఆల్ ఇండియా అంబేద్కర్ సంఘం నాయకుల నివాళులు

బాన్సువాడ మండలం ఇబ్రహీంపేట్ గ్రామంలో ఇటీవల మృతి చెందిన గ్రామ అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు చెట్లూరి పెద్ద సాయిలు తండ్రి చెట్లూరి ఇబ్రహీంలు చిత్రపటానికి ఆల్ ఇండియా అంబేద్కర్ సంఘం నాయకులు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బంగారు మైసయ్య, బాన్సువాడ డివిజన్ అధ్యక్షుడు దేశాయిపేట్ ప్రశాంత్ కుమార్, ఏఎంసీ మాజీ చైర్మన్ ఎన్. నరసింహులు, మన్నె చిన్న సాయిలు, కర్రీ మోహన్, పరిమళ సాయిలుతో పాటు ఇబ్రహీంపేట్ అంబేద్కర్ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్ర రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం జాయింట్ సెక్రటరీగా సాగర్ల శివరావు

చిలుకూరు,అక్టోబర్ 28 (ప్రజావాణి): రాష్ట్ర రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం జాయింట్ సెక్రటరీగా చిలుకూరు మండలం అర్లేగూడెం గ్రామ రేషన్ డిలర్ సాగర్ల శివరావు నియమితులయ్యారు. తెలంగాణ రాష్ట్ర రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు నాయకోటి రాజు ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా ప్రకటించిన నూతన కార్యవర్గంలో శివరావుకు ఈ బాధ్యతలు అప్పగించారు. శివరావు నియామకం పట్ల చిలుకూరు మండల రేషన్ డీలర్లు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు అభినందనలు తెలిపారు. జిల్లా రేషన్ డీలర్ల అధ్యక్షుడు కనుమర్లపూడి శ్రీనివాసరావు, కార్యదర్శి ఖాజా మొయినుద్దీన్, కోదాడ ఐఎంజీ ప్రెసిడెంట్ ఆంజనేయులు, మండల రేషన్ డీలర్ల అధ్యక్షుడు పూర్ణచంద్రరావు, మండల ట్రెజరర్ నాగేశ్వరరావు,రెమిడాల ఆనందరావు, తిపిరిశెట్టి దశరథ, గూగులోతు నాగేశ్వరరావు, గజ్జి వెంకటేశ్వర్లు, నక్క నాగరాజు, శ్రీను, వెంకయ్య,వై.సత్యం, వేమూరి పద్మావతి కృష్ణయ్య తదితరులు శివరావుకు శుభాకాంక్షలు తెలిపారు.రాష్ట్రస్థాయి కార్యవర్గంలో బాధ్యతలు చేపట్టిన శివరావు రేషన్ డీలర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని వారు ఆకాంక్షించారు. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర కమిటీకి సాగర్ల శివరావు కృతజ్ఞతలు తెలిపారు.

నకిలీ సీడ్ తో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ఫర్టిలైజర్ షాప్ ముందు ధర్నా

పరకాల పట్టణంలోని విక్రమ్ ట్రేడర్స్ ఎరువుల దుకాణం ముందు వరి రైతులు ఆందోళన

ప్రజావాణి శాయంపేటపరకాల పట్టణంలోని ఫర్టిలైజర్ షాప్ లో వరంగల్ 44 సిద్ది రకం వరి విత్తనాలు నకిలీవి ఇవ్వడం వల్ల తీవ్రంగా నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేశారు శాయంపేట మండల్ చెందిన మూడు గ్రామాల రైతులు సుమారు 150 ఎకరాల్లో ఈ విత్తనాలు వేశామని అన్నారు ఎకరానికి రూ. 50 వేల వరకు పెట్టుబడి పెట్టినా ఇప్పటి వరకు పంట గొలుసు కూడా వేయలేదనివాపోయారు. నకిలీ విత్తనాలు విక్రయించిన దుకాణ యజమానిపై చర్యలు తీసుకోవాలని,నష్టపోయినరైతులందరికీ నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ దుకాణం ముందు బైఠాయించి నిరసన తెలిపారు. వెంటనే వ్యవసాయ అధికారులు స్పందించి పంట నష్టాన్ని అంచనా వేసి న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు.

పసర ZPHS.. చదువులోనే కాదు.. ఆటల్లోనూ నంబర్ వన్

- **హైదరాబాద్ కు పసర బిడ్డలు.. రాష్ట్ర స్థాయికి హర్షిత్, శివనందు..**
- **పసర విద్యార్థుల విజయ పరంపర.. పీఎం శ్రీ క్రీడల్లో ప్రభంజనం.**
- **గురువు కవిత కృషి.. శిష్యుల ఘన విజయం.**

ములుగు జిల్లా ప్రతినిధి (ప్రజావాణి):-ములుగు జిల్లా, గోవిందరావుపేట మండలంపసర జడ్పీహెచ్ఎస్ పాఠశాల అంటేనే విజయాలకు కేరాఫ్ అడ్రస్ అని మరోసారి రుజువైంది. పీఎం శ్రీ జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో పసర విద్యార్థులు సత్తా చాటి, పాఠశాల పతాకాన్ని రెపరెపలాడించారు.జిల్లా స్థాయి పోటీల్లో అండర్-14 కబడ్డీ విభాగంలో ప్రథమ స్థానం సాధించి అందరి ప్రశంసలు అందుకున్నారు. అండర్-14 ఖో-ఖో, అండర్-17 వాలీబాల్, అండర్-17 ఖో-ఖో విభాగాల్లో ద్వితీయ స్థానంలో నిలిచి తమ ప్రతిభను చాటారు.ఈ విజయాలతో నవంబర్ 5, 6 తేదీల్లో హైదరాబాద్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు పసర పాఠశాల నుండి కబడ్డీ విభాగంలో జాడి హర్షిత్, కోకిల శివనందు ఎంపిక కావడం విశేషం.విద్యార్థుల ఈ ఘన విజయం వెనుక వ్యాయామ ఉపాధ్యాయిని శ్రీమతి మారబోయిన కవిత గారి నిరంతర కృషి, శిక్షణ ఎంతో ఉందని ప్రధానోపాధ్యాయులు కొమరపాలెం సమేశ్వరరావు, ఇన్చార్జి ప్రధానోపాధ్యాయిని కర్ర జయశ్రీ గార్లు హర్షం వ్యక్తం చేశారు. విజేతలను ఉపాధ్యాయ బృందం ఘనంగా అభినందించింది.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

- **చేర్యాల మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ బోయిని శ్రీనివాస్**

మద్దూరు అక్టోబర్28, ప్రజా వాణి,ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్నా వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం సద్వినియోగం చేసుకోవాలని చేర్యాల మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ బోయిని శ్రీనివాస్ అన్నారు.బుదవారం మండలంలోని నర్సాయపల్లి గ్రామ స్వర్ణ వి ఓ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మండల సర్పంచుల ఫోరమ్ గ్రామ సర్పంచ్ శనిగరం సత్యనారాయణతో కలిసి కొబ్బరి కాయ కొట్టి ఆయన ప్రారంబించారు.ఈ కార్యక్రమంలో మాజీ చైర్మెన్ రమేష్ రెడ్డి,మాజీ డైరెక్టర్ రాంరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షులు తోడంగల భాస్కర్, గ్రామ శాఖ అద్యక్షులు ముస్త్యాల బాబు, రామ్ రెడ్డి,ప్రశాంత్,శనివారం కనకయ్య, సి సి సుమలత,గ్రామ వి ఓ సంఘం అధ్యక్షులు పి.నవనీత,కార్యదర్శి మంజుల, వి ఓ ఏ స్రవంతి,కోశాధికారి సుశీల,శివకుమార్,శ్రీలత,రైతులు ఇర్రి సుధాకర్ రెడ్డి, మొకు కనకరెడ్డి, ఇర్రి ధర్మారెడ్డి, హమాలీ కార్మికులు పాల్గొన్నారు.

పేద ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సీపీఐ పార్టీ పోరాటం

- **భగత్ సింగ్ నగర్ కాలనీ పట్టాలు రానివారికి వెంటనే ఇవ్వాలి:-**
- **కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు**

మేడిపల్లి అక్టోబర్ 28(మన ప్రజావాణి) ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు సిపిఐ పార్టీ ముందుంటుందని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు.మేడిపల్లి మండలం, బోడుప్పల్ సర్కిల్,10వ, డివిజన్ లో భగత్ సింగ్ నగర్ కాలనీ మేడిపల్లి మండల సిపిఐ పార్టీ కార్యదర్శి రచ్చ కిషన్ అధ్యక్షతన జరిగిన,ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిపిఐ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు,రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఎస్ బోస్,జిల్లా కార్యదర్శి ఉమా మహేష్ పాల్గొని సిపిఐ పార్టీ జెండాను రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ఎగురవేశారు.భగత్ సింగ్ నగర్ కాలనీ పర్యటించి ప్రజల జీవన విధానాన్ని పరిశీలించారు.కాలనీలో నివసిస్తున్న ప్రజలకు ప్రభుత్వం మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ సీపీఐ పార్టీ రాష్ట్ర కార్యదర్శి,కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కాలనీ వాసులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కాలనీలో నెలకొన్న సమస్యలను స్థానిక ప్రజలు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. కాలనీ అభివృద్ధికి ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టి,ప్రజలకు అవసరమైన అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ,వీధి దీపాలు, తాగునీటి సౌకర్యం కల్పించాలని కోరారు. అదేవిధంగా ఇప్పటివరకు ఇంటి పట్టాలు పొందని అర్హులైన పేదలకు ప్రభుత్వం పట్టాలు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు.పేద ప్రజల హక్కుల పరిరక్షణ, మౌలిక సదుపాయాల కల్పన,అర్హులైన నిరుపేదలకు న్యాయం జరిగే వరకు సీపీఐ పార్టీ ప్రజల పక్షాన నిలబడి పోరాటం కొనసాగిస్తుందని పార్టీ నాయకులు పేర్కొన్నారు.ప్రజా సమస్యల పరిష్కారం, పేదల సంక్షేమం,కాలనీల సమగ్ర అభివృద్ధి కోసం సీపీఐ పార్టీ నిరంతరం కృషి చేస్తుంది.ప్రభుత్వం స్పందించి భగత్ సింగ్ నగర్ కాలనీ ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు జి దామోదర్ రెడ్డి,జిల్లా కార్యవర్గ సభ్యులు జె లక్ష్మి,కే ధర్మేందర్,సత్య ప్రసాద్,సిపిఐ పార్టీ నాయకులు వీబి బాలరాజ్,నర్సింహ్మా, సిహెచ్ మాధవి,జి నాగరాజు,కే ప్రమీల, దండు రమేష్,ఈశ్వర్,జై చంద్ర,కే మహాలక్ష్మి,ఎండి అన్వర్,ఇస్తారి,సోమరాజు, ముడి మార్టిన్,రామకృష్ణ, మొగులయ్య,యాదగిరి, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ వైస్ చైర్మన్ జూపల్లి రమేష్ బాబు ఆధ్వర్యంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జన్మదిన వేడుకలు

- **కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన మున్సిపల్ వైస్ చైర్మన్ జూపల్లి రమేష్ బాబు, కాంగ్రెస్ నాయకులు**

ప్రజావాణి భద్రాద్రి జిల్లా ప్రతినిధి అక్టోబర్ 28 భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట: తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జన్మదిన వేడుకలను అశ్వారావుపేట మున్సిపాలిటీలోని మున్సిపల్ వైస్ చైర్మన్ జూపల్లి రమేష్ బాబు నివాసంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధుల సమక్షంలో కేక్ కట్ చేసి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయన నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ప్రజలకు సేవలందిస్తూ వర్ధిల్లాలని భగవంతుడిని ప్రార్థించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో ప్రజాపాలన ప్రభుత్వంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కీలక పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేయడంలో ఆయన విశేష కృషి చేస్తున్నారని పేర్కొన్నారు.ముఖ్యంగా రాష్ట్రంలోని నిరుపేద కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలులో మంత్రి కీలకంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. పేద, మధ్యతరగతి కుటుంబాల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ, అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేస్తున్నారని అన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి, సంక్షేమంతో పాటు మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని పేర్కొన్నారు.తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కలిసి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని నాయకులు ప్రశంసించారు. పేద ప్రజలకు అండగా నిలుస్తూ, వారి సంక్షేమం కోసం పనిచేస్తున్న నాయకుడిగా ఆయన ప్రజల మన్ననలు పొందుతున్నారని తెలిపారు. భవిష్యత్తులోనూ ప్రజలకు మరిన్ని సేవలందిస్తూ, రాష్ట్ర అభివృద్ధిలో మరింత కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షించారు.మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని అశ్వారావుపేటలో నిర్వహించిన ఈ వేడుకల్లో కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొని తమ అభిమానాన్ని చాటుకున్నారు.ఈ కార్యక్రమంలో అశ్వారావుపేట మండల కాంగ్రెస్ అధ్యక్షులు చిన్నంశెట్టి సత్యనారాయణ, ఆత్మ కమిటీ చైర్మన్ సుంకవల్లి వీరభద్రరావు. స్టేట్ యూత్ కమిటీ అధ్యక్షులు జూపల్లి కోదండ వెంకట రామారావు, జిల్లా నాయకులు తుమ్మ రాంబాబు, కాంగ్రెస్ నాయకులు జూపల్లి ప్రమోద్, కాసాని పద్మశేఖర్, నంద్రు రమేష్, కానూరి మోహన్ రావు, తాడేపల్లి రవి, వెలుపుల సత్యనారాయణ, కర్ణాటక శ్రీను, సర్పంచ్ కుంజా శ్రీను, గుజ్జా సంకూర్ రావు అశ్వారావుపేట మున్సిపల్ కౌన్సిలర్లు మిండా హరిబాబు, నార్లపాటి దివాకర్, కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికులకు హైపవర్ వేతనాలు అమలు చేయాలి

- **వేతనాలు,అలవెన్సుల వ్యత్యాసాలను తొలగించాలి.**
- **కాంట్రాక్టు కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మద్దెల శ్రీనివాస్ డిమాండ్.**

గోదావరిఖని,మన సమగ్ర ప్రజావాణి అక్టోబరు 28 సింగరేణి బొగ్గ గనుల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు న్యాయబద్ధంగా అందాల్సిన వేతనాలు, ఇతర ప్రయోజనాల విషయంలో తగిన న్యాయం చేయాలని తెలంగాణ కాంట్రాక్టు కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మద్దెల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. కోల్ ఇండియాలో అమలవుతున్న హైపవర్ కమిటీ వేతన విధానంపై అధ్యయనం చేసి, సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని యాజమాన్యాన్ని కోరారు.

సింగరేణి పరిధిలోని ఓపెన్‌కాస్ట్ గనులు,భూగర్భ గనులు,కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్లు,ఇతర విభాగాల్లో కాంట్రాక్టు కార్మికులు వివిధ పనులు నిర్వహిస్తున్నారని తెలిపారు.బొగ్గ ఉత్పత్తి, ఓవర్‌బర్డెన్ తొలగింపు, యంత్రాల నిర్వహణ, రవాణా తదితర పనుల్లో వారి శ్రమ కీలకమన్నారు. ఇంతటి ప్రాధాన్యమైన పనులు చేస్తున్న కార్మికులకు వేతనాలు, అలవెన్సులు,ఇతర ప్రయోజనాల విషయంలో న్యాయం జరగాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

వేతనాల వ్యత్యాసాలపై స్పష్టత ఇవ్వాలి

కోల్ ఇండియా,సింగరేణి సంస్థల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల వేతనాల మధ్య వ్యత్యాసాలు ఉన్నాయని కార్మిక సంఘం పేర్కొంటోంది.నైపుణ్యం, పని స్వభావం,బాధ్యతలు, అమల్లో ఉన్న నిబంధనలను పరిగణనలోకి తీసుకొని వేతనాలను సమీక్షించాలని శ్రీనివాస్ కోరారు.కాంట్రాక్టు కార్మికులకు వర్తించే కనీస వేతనాలు, కరువు భత్యం,ఇతర అలవెన్సులను నిబంధనల ప్రకారం చెల్లించాలని డిమాండ్ చేశారు.కోల్ ఇండియాలో అమలవుతున్న వేతన విధానాలను పరిశీలించి, సింగరేణిలోనూ అర్హులైన కార్మికులకు మెరుగైన వేతన ప్రయోజనాలు కల్పించే అంశాన్ని యాజమాన్యం పరిశీలించాలన్నారు.గనుల్లో పనిచేసే కార్మికులకు వర్తించే ప్రత్యేక అలవెన్సులు,బోనస్,ఇతర ఆర్థిక ప్రయోజనాలపై స్పష్టత ఇవ్వాలని శ్రీనివాస్ కోరారు.సంబంధిత చట్టాలు,ప్రభుత్వ ఉత్తర్వులు,ఒప్పందాల ప్రకారం కార్మికులకు అందాల్సిన ప్రయోజనాలను సకాలంలో చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు.కాంట్రాక్టు కార్మికుల సమస్యల పరిష్కారానికి యాజమాన్యం,కార్మిక సంఘాల మధ్య చర్చలు నిర్వహించాలని సూచించారు.వేతనాల చెల్లింపులో పారదర్శకత పాటిస్తూ,కార్మికులకు అందుతున్న వేతనాలు, అలవెన్సుల వివరాలను స్పష్టంగా తెలియజేయాలని కోరారు.సింగరేణి అభివృద్ధిలో కాంట్రాక్టు కార్మికుల శ్రమను గుర్తించి,వారి సంక్షేమానికి ప్రాధాన్యమివ్వాలని మద్దెల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతనం,న్యాయమైన పారితోషికం,కార్మిక హక్కుల పరిరక్షణ కోసం కార్మికులంతా ఐక్యంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు.కాంట్రాక్టు కార్మికుల వేతన సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం స్పందించి, నిబంధనలకు అనుగుణంగా న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

పాలకులు మారుతున్నారు.. పంచాయతీ భాగ్యం మారడం లేదు!

- **వర్షం వస్తే కురుస్తుంది.. ఎండ వస్తే మండుతుంది!**
- **ధర్మారం తండా గ్రామపంచాయతీ పట్టిన 'శిథిల' శని.**
- **బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్న సిబ్బంది, పాలకవర్గం**

కేసముద్రం, అక్టోబర్ 28, ప్రజావాణి.ప్రభుత్వాలు మారుతున్నాయి.. పాలకులు మారుతున్నారు.. కానీ మా తండా పంచాయతీ భవనం రాత మాత్రం మారడం లేదు అంటూ మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం ధర్మారం తండా గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నామని పాలకులు చెప్పుకుంటున్నా, క్షేత్రస్థాయిలో పరిస్థితి దానికి భిన్నంగా ఉందనేందుకు ధర్మారం తండా గ్రామపంచాయతీ భవనమే సజీవ సాక్ష్యంగా నిలుస్తోంది.

ప్రమాదపు అంచున పంచాయతీ పాలన!

ధర్మారం తండా గ్రామపంచాయతీ భవనం ప్రస్తుతం రేకుల షెడ్డులో అత్యంత శిథిలావస్థకు చేరుకుంది. భవనం పైకప్పు పెచ్చులు ఊడిపోతూ ఎప్పుడు కూలుతుందో తెలియని భయానక స్థితిలో ఉంది. వర్షం పడితే చాలు.. భవనం లోపల ఛత్రం పట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. కార్యాలయ రికార్డులు, కంప్యూటర్లు తడిసిపోకుండా ప్లాస్టిక్ కవర్లు కప్పి కాపాడుకోవాల్సి వస్తోందని సిబ్బంది వాపోతున్నారు. ఇక ఎండకాలం వస్తే భవనం లోపల కూర్చోలేక చుక్కలు చూస్తున్నామని, సిబ్బందితో పాటు వివిధ పనుల నిమిత్తం వచ్చే గ్రామస్థులు సైతం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

పాలకులకు ధర్మారం తండా ప్రజలు విజ్ఞప్తి

కొత్త భవనం నిర్మించాలని స్థానిక పాలకవర్గం, ప్రజలు ఎన్నోసార్లు ఉన్నతాధికారులకు,ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు సమర్పించినా ఫలితం శూన్యమైంది.సమస్య తెలిసినా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని తండా ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఏ క్షణంలోనైనా భవనం కుప్పకూలి పెద్ద ప్రమాదం జరిగే అవకాశం ఉన్నందున, సంబంధిత ఉన్నతాధికారులు తక్షణమే స్పందించాలని ధర్మారం తండా ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికైనా కాలయాపన చేయకుండా కొత్త గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేసి, తండా ప్రజల కష్టాలను తీర్చాలని కోరుతున్నారు.

కుల్కచర్లలో కాంగ్రెస్‌లోకి భారీ చేరికలు: ఎమ్మెల్యే డాక్టర్ టి. రామ్మోహన్ రెడ్డి సమక్షంలో పార్టీలో చేరిన బీఆర్ఎస్ సర్పంచ్, బీజేపీ నాయకులు

పరిగి /కుల్కచర్ల:ప్రజావాణి,అక్టోబర్ 28:కుల్కచర్ల మండలంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలపడింది. మండల కేంద్రంతో పాటు పలు గ్రామాలకు చెందిన బీఆర్ఎస్, బీజేపీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. పరిగి ఎమ్మెల్యే, టీపీసీసీ శిక్షణ కమిటీ చైర్మన్ డాక్టర్ టి. రామ్మోహన్ రెడ్డి (టీఆర్ఆర్) సమక్షంలో వీరంతా కాంగ్రెస్ పార్టీలో చేరారు.పటేల్ చెరువు తండాకు చెందిన బీఆర్ఎస్ సర్పంచ్ శాంతి తుల్జారాం తన అనుచరులతో కలిసి కాంగ్రెస్ గూటికి చేరగా, బీజేపీ కిసాన్ మోర్చా ఎగ్జిక్యూటివ్ సభ్యుడు ఏదుల సంతోష్ గౌడ్ కూడా భారీ సంఖ్యలో కార్యకర్తలతో కలిసి పార్టీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే టి. రామ్మోహన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

సంక్షేమ పాలనకు ఆకర్షితులై చేరికలు

ఈ సందర్భంగా పార్టీలో చేరిన నాయకులు మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేపడుతున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నట్లు స్పష్టం చేశారు. పరిగి నియోజకవర్గ ప్రగతి కోసం ఎమ్మెల్యే డాక్టర్ టి. రామ్మోహన్ రెడ్డి అహర్నిశలు శ్రమిస్తున్నారని, ఆయన నాయకత్వంలో నియోజకవర్గం వేగంగా అభివృద్ధి చెందుతుందనే నమ్మకంతోనే ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు.

కార్యకర్తలకు తగిన గుర్తింపు: ఎమ్మెల్యే టి. రామ్మోహన్ రెడ్డి

అనంతరం ఎమ్మెల్యే డాక్టర్ టి. రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమం, నియోజకవర్గ సమగ్రాభివృద్ధే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకెళ్తోందని అన్నారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన, ప్రజలకు మెరుగైన పాలన అందించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. కాంగ్రెస్ విధానాలు నచ్చి పార్టీలోకి వస్తున్న ప్రతి నాయకుడికి, కార్యకర్తకు పార్టీలో సముచిత గౌరవం, గుర్తింపు ఉంటాయని ఆయన భరోసా ఇచ్చారు.

తంగళ్లపల్లి విద్యుత్ సెక్షన్ కార్యాలయం, సబ్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎస్ఈ

తంగళ్లపల్లి ప్రజావాణి అక్టోబర్ 28 రాజన్న సిరిసిల్ల జిల్లా ఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ బుధవారం తంగళ్లపల్లి మండలంలోని విద్యుత్ సెక్షన్ కార్యాలయం, 33/11 కేవీ సబ్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు.మొదట సెక్షన్ కార్యాలయంలో ఉద్యోగుల హాజరును పరిశీలించారు. అనంతరం సబ్‌స్టేషన్‌ను సందర్శించి బ్రేకర్ల పనితీరు, ఫీడర్లపై విద్యుత్ లోడ్‌ను తనిఖీ చేశారు. సబ్‌స్టేషన్‌లో ఎలాంటి లూజ్ కాంటాక్ట్స్ లేకుండా అవసరమైన మరమ్మతులు చేపట్టి, విద్యుత్ సరఫరాలో అంతరాయాలు కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు.

కుల్కచర్లలో కాంగ్రెస్‌లోకి భారీ చేరికలు: ఎమ్మెల్యే డాక్టర్ టి. రామ్మోహన్ రెడ్డి సమక్షంలో పార్టీలో చేరిన బీఆర్ఎస్ సర్పంచ్, బీజేపీ నాయకులు.

పరిగి /కుల్కచర్ల:ప్రజావాణి,అక్టోబర్ 28:కుల్కచర్ల మండలంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలపడింది. మండల కేంద్రంతో పాటు పలు గ్రామాలకు చెందిన బీఆర్ఎస్, బీజేపీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. పరిగి ఎమ్మెల్యే, టీపీసీసీ శిక్షణ కమిటీ చైర్మన్ డాక్టర్ టి. రామ్మోహన్ రెడ్డి (టీఆర్ఆర్) సమక్షంలో వీరంతా కాంగ్రెస్ పార్టీలో చేరారు.పటేల్ చెరువు తండాకు చెందిన బీఆర్ఎస్ సర్పంచ్ శాంతి తుల్జారాం తన అనుచరులతో కలిసి కాంగ్రెస్ గూటికి చేరగా, బీజేపీ కిసాన్ మోర్చా ఎగ్జిక్యూటివ్ సభ్యుడు ఏదుల సంతోష్ గౌడ్ కూడా భారీ సంఖ్యలో కార్యకర్తలతో కలిసి పార్టీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే టి. రామ్మోహన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. సంక్షేమ పాలనకు ఆకర్షితులై చేరికలు ఈ సందర్భంగా పార్టీలో చేరిన నాయకులు మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేపడుతున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నట్లు స్పష్టం చేశారు. పరిగి నియోజకవర్గ ప్రగతి కోసం ఎమ్మెల్యే డాక్టర్ టి. రామ్మోహన్ రెడ్డి అహర్నిశలు శ్రమిస్తున్నారని, ఆయన నాయకత్వంలో నియోజకవర్గం వేగంగా అభివృద్ధి చెందుతుందనే నమ్మకంతోనే ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు.కార్యకర్తలకు తగిన గుర్తింపు: ఎమ్మెల్యే టి. రామ్మోహన్ రెడ్డి అనంతరం ఎమ్మెల్యే డాక్టర్ టి. రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమం, నియోజకవర్గ సమగ్రాభివృద్ధే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకెళ్తోందని అన్నారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన, ప్రజలకు మెరుగైన పాలన అందించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని పేర్కొన్నారు.కాంగ్రెస్ విధానాలు నచ్చి పార్టీలోకి వస్తున్న ప్రతి నాయకుడికి, కార్యకర్తకు పార్టీలో సముచిత గౌరవం, గుర్తింపు ఉంటాయని ఆయన భరోసా ఇచ్చారు.

తాత బాటలో మనుమడు.. గ్రామసేవలో తనదైన ముద్ర!

- ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం.. జిల్లా కలెక్టర్ దృష్టికి పార్డి. బి గ్రామ తాగునీటి సమస్య
- 307 ఓట్ల మెజార్టీతో విజయం.. అభివృద్ధి పనులతో పాటు ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ

నిర్మల్ జిల్లా ప్రజావాణి బ్యూరో, కుబీర్, అక్టోబర్ 28:--తాత చూపిన బాటలో నడుస్తూ.. గ్రామ ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నారు కుబీర్ మండలం పార్డి. బి గ్రామపంచాయతీ సర్పంచ్ మాడి ప్రవీణ్. గ్రామాభివృద్ధికి నిధులు తీసుకురావడంతో పాటు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తూ తనదైన గుర్తింపు పొందుతున్నారు. ముఖ్యంగా తాగునీటి సమస్యను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడం, ఆయన స్పందించేలా చొరవ చూపడం సర్పంచ్‌గా ప్రవీణ్ వ్యవహరిస్తున్న తీరుకు నిదర్శనంగా నిలుస్తోంది. 2025 గ్రామపంచాయతీ సాధారణ ఎన్నికల్లో 307 ఓట్ల భారీ మెజార్టీతో సర్పంచ్‌గా ఎన్నికైన మాడి ప్రవీణ్.. గ్రామ ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేందుకు కృషి చేస్తున్నారు. గతంలో ఆయన తాత మాడి పోతన్న సర్పంచ్‌గా గ్రామానికి సేవలందించగా, ప్రస్తుతం మనుమడు అదే బాటలో పయనిస్తూ గ్రామాభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నారు.

కలెక్టర్ దృష్టికి తాగునీటి సమస్య.. పరిష్కారానికి ఆదేశాలు!

గ్రామంలో ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యను పరిష్కరించడంపై సర్పంచ్ మాడి ప్రవీణ్ ప్రత్యేక దృష్టి సారించారు. ఇటీవల భైంసా పట్టణానికి జిల్లా కలెక్టర్ అధికారిక కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన సందర్భంగా ఆయనను కలిసి పార్డి బి గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యను వివరించారు. గ్రామ ప్రజలకు ఎదురవుతున్న ఇబ్బందులను కలెక్టర్‌కు తెలియజేస్తూ, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామ ప్రజల సమస్యను సావధానంగా విన్న జిల్లా కలెక్టర్ స్పందిస్తూ, పార్డి బి గ్రామాన్ని సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలించాలని, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్లు తెలిసింది. గ్రామానికి సంబంధించిన సమస్యను జిల్లా స్థాయి అధికారి దృష్టికి తీసుకెళ్లి, అధికార యంత్రాంగం స్పందించేలా చొరవ చూపడం సర్పంచ్ ప్రవీణ్ ప్రత్యేకతగా చెప్పుకోవచ్చు. గ్రామంలో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనతో పాటు, తాగునీరు వంటి నిత్యావసర సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వడం ప్రజాప్రతినిధిగా ఆయన బాధ్యతాయుతమైన విధానాన్ని ప్రతిబింబిస్తోంది. అధికారుల ఆదేశాల మేరకు గ్రామంలో పర్యటించి సమస్యను పరిశీలించి, తగిన చర్యలు తీసుకుంటే ప్రజలకు ఉపశమనం కలగనుంది.

అభివృద్ధి పనులకు ప్రాధాన్యం.. ఎమ్మెల్యే సహకారంతో నిధుల సాధన

గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన మాడి ప్రవీణ్.. ప్రజాసేవను లక్ష్యంగా ఎంచుకొని రాజకీయాల్లోకి ప్రవేశించారు. స్థానిక ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ సహకారంతో గ్రామాభివృద్ధికి అవసరమైన నిధులు సాధించేందుకు కృషి చేస్తున్నారు.

గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.35 లక్షలు, డ్రైనేజీ పనులకు రూ.14 లక్షలు, మహిళా సంఘాల కోసం రెండు వీఓ భవనాల నిర్మాణానికి రూ.20 లక్షలు, వీఓ షెడ్‌కు రూ.20 లక్షలు, రైతుల కోసం గోదాం నిర్మాణానికి రూ.30 లక్షలు, పశువుల సంరక్షణకు గోశాల నిర్మాణం కోసం రూ.10 లక్షల నిధులు సాధించినట్లు తెలిపారు. అలాగే సామాజిక భవన నిర్మాణానికి రూ.13 లక్షలు, ప్రభుత్వ పాఠశాల ప్రహరీ గోడకు రూ.6 లక్షలు, ముస్లిం శ్మశానవాటిక ప్రహరీ గోడ నిర్మాణానికి రూ.20 లక్షల నిధులు మంజూరైనట్లు వివరించారు. ఈ అభివృద్ధి పనుల ద్వారా గ్రామంలో మౌలిక సదుపాయాలు మెరుగుపడే అవకాశం ఉంది.

పేదలకు సంక్షేమ పథకాలు.. రైతులకు సౌకర్యాలు

గ్రామంలోని నిరుపేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా లబ్ధి చేకూర్చేందుకు ప్రవీణ్ కృషి చేస్తున్నారు. మొదటి విడతలో 40, రెండో విడతలో 68 ఇళ్లు మంజూరయ్యేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. పేద కుటుంబాల ఆడబిడ్డల వివాహాలకు సంబంధించి షాదీ ముబారక్, కళ్యాణలక్ష్మి పథకాల కింద 24 మంది లబ్ధిదారులకు ప్రయోజనం చేకూరినట్లు పేర్కొన్నారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా 50 చెక్కులు అందేలా సహకరించారు. రైతులు తమ పొలాలకు వెళ్లేందుకు ఐదు పానాది రహదారులు మంజూరయ్యేలా కృషి చేశారు. గ్రామంలో లోవోల్టేజీ సమస్యను తగ్గించేందుకు మూడు కొత్త విద్యుత్ డీటీఆర్‌లను ఏర్పాటు చేయించారు.

విద్య, వైద్య రంగాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

గ్రామ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య 130 మందికి పైగా ఉండేలా విద్యా రంగానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. మన ఊరు--మనబడి కార్యక్రమంలో భాగంగా పాఠశాల అభివృద్ధికి కృషి చేయడంతో పాటు, కొత్త ప్రీ-ప్రైమరీ పాఠశాల మంజూరుకు కూడా ప్రయత్నించారు. గ్రామానికి చెందిన ఎనిమిది మంది విద్యార్థులు ఎంబీబీఎస్ చదువుతుండటం విశేషం. వీరితో చర్చించి, గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వారానికి రెండు రోజులు వైద్య సేవలు అందించే అవకాశాలను పరిశీలిస్తున్నట్లు ప్రవీణ్ తెలిపారు. తద్వారా గ్రామ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు.

తాత సేవా వారసత్వం.. మనుమడి ప్రజాసేవా సంకల్పం

గతంలో తాత మాడి పోతన్న సర్పంచ్‌గా గ్రామానికి సేవలందించగా, ప్రస్తుతం మనుమడు మాడి ప్రవీణ్ అదే వారసత్వాన్ని కొనసాగిస్తున్నారు. గ్రామానికి నిధులు తీసుకురావడం ఒకవైపు, తాగునీటి వంటి సమస్యలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయడం మరోవైపు ఆయన పనితీరులో కనిపిస్తున్న అంశాలు.గ్రామ ప్రజల సమస్యలను గుర్తించి సంబంధిత అధికారులకు తెలియజేయడం, వాటి పరిష్కారం కోసం నిరంతరం ప్రయత్నించడం ద్వారా ప్రజలకు అందుబాటులో ఉండే ప్రజాప్రతినిధిగా గుర్తింపు పొందాలనే లక్ష్యంతో ప్రవీణ్ ముందుకు సాగుతున్నారు. అభివృద్ధి పనులతో పాటు ప్రజల దైనందిన సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వడమే తన బాధ్యతగా భావిస్తున్నారు. గ్రామాభివృద్ధి అంటే కేవలం నిధులు తీసుకురావడమే కాదు.. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేయడం కూడా. పార్డి. బి గ్రామ తాగునీటి సమస్యను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లిన సర్పంచ్ మాడి ప్రవీణ్ చొరవ ఈ విషయాన్ని మరోసారి గుర్తుచేస్తోంది.

చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి

- మద్దూరు ఎస్సై మహమ్మద్ ఆసీఫ్

మద్దూరు అక్టోబర్28, ప్రజా వాణి, ఈ నెల 20.10.2026న దసరా పండుగ సందర్భంగా వల్లంపట్ల గ్రామంలోని నూతన ఇంటి వద్ద సుమారు 70--80 సంవత్సరాల వయస్సుగల గుర్తుతెలియని వ్యక్తి అపస్మారక స్థితిలో ఉండటాన్ని గజ్జల మహేందర్ గమనించి, వెంటనే 108 అంబులెన్స్ ద్వారా సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా,చికిత్స పొందుతూ 27.10.2026న మధ్యాహ్నం 2:36 గంటలకు మృతి చెందాడు.ఈ ఘటనపై అందిన పిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పై వ్యక్తికి చెందిన ఎలాంటి వివరాలు తెలిసిన మద్దూరు పోలీస్ స్టేషన్ ఎస్ఐ - 8712667357, 8712667474 లకు తెలియజేయాలని మద్దూరు ఎస్సై మహమ్మద్ ఆసీఫ్ ఒక ప్రకటనలో విలేఖర్లకు తెలిపారు.

యశోద సికింద్రాబాద్ హాస్పిటల్ లో క్యాన్సర్ పై ప్రత్యేక చికిత్స అందుబాటులో

మన సమగ్ర ప్రజావాణి వనపర్తి జిల్లా : యశోద సికింద్రాబాద్ హాస్పిటల్ నుండి క్యాన్సర్ స్పెషలిస్ట్ సర్జన్ డాక్టర్ స్రవంతి వనపర్తి లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ప్రస్తుతం క్యాన్సర్ రోగాలకు అనేక రకాల క్యాన్సర్ చికిత్స విధానాలు అందుబాటులో ఉన్నాయి.అందరికీ ఒకే విధమైన చికిత్స అవసరం ఉండదు.ప్రతి వ్యక్తి పరిస్థితిని బట్టి చికిత్స నిర్ణయించ బడుతుంది.చికిత్స యొక్క ముఖ్య ఉద్దేశాలు క్యాన్సర్‌ను పూర్తిగా నియం త్రించడం లేదా తగ్గించడం రోగి జీవితమెరుగు పరచడం.చికిత్స వల్ల వచ్చే సైడ్ ఎఫెక్ట్స్ తగ్గించడం అవసరమైన చికిత్సను తగ్గించ కుండా సైడ్ ఎఫెక్ట్స్ ను మినిమజ్ చేయడం.ఆధునిక టెక్నాలజీ ప్రయోజనాలుంద

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలి

- నిరవధిక సమ్మెకు బీఆర్ఎస్ పార్టీ పూర్తి మద్దతు
- మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ దాసరి మమతా రెడ్డి, జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్

ప్రజావాణి జిల్లా ప్రతినిధి పెద్దపల్లి అక్టోబర్ 28పెద్దపల్లి: నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) ఉద్యోగులు తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం చేపట్టిన నిరవధిక సమ్మెకు బీఆర్ఎస్ పార్టీ పూర్తి మద్దతు, సంఘీభావం ప్రకటించింది. ఈ మేరకు మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ దాసరి మమతా రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ సమ్మె శిబిరాన్ని సందర్శించి ఉద్యోగులకు తమ సంఘీభావాన్ని తెలిపారు.ఈ సందర్భంగా డాక్టర్ దాసరి మమతా రెడ్డి మాట్లాడుతూ.. కోవిడ్ మహమ్మారి సమయంలో తమ ప్రాణాలను సైతం పణంగా పెట్టి ప్రజల ప్రాణాలను కాపాడిన ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు, నేడు తమ భవిష్యత్తు కోసం, ఉద్యోగ భద్రత కోసం రోడ్డెక్కి పోరాటం చేయాల్సి రావడం విచారకరమని అన్నారు.కరోనా కష్టకాలంలో ప్రజలకు విశేష సేవలందించిన ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. ప్రజల ప్రాణాలను కాపాడిన ఉద్యోగులు నేడు తమ భవిష్యత్తు కోసం పోరాడుతున్నా ప్రభుత్వం స్పందించకపోవడం అన్యాయమని అన్నారు.ఐక్యతే మూలం.. హక్కుల సాధనే లక్ష్యంగా పోరాటం చేస్తున్న ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు తగిన భద్రత కల్పించి, వారి సమస్యలను పరిష్కరించే దిశగా ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు.ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల హక్కుల సాధన కోసం చేపట్టిన పోరాటానికి బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, ఎన్‌హెచ్‌ఎం జేఏసీ ప్రతినిధులు, ఆరోగ్య శాఖ ఉద్యోగులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

భూపాలపల్లి నియోజకవర్గంలో ఎన్ హెచ్ ఎం ఉద్యోగుల సమ్మెకు మద్దతు ప్రకటించిన శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనచారి

జయశంకర్ భూపాలపల్లి, బ్యూరో అక్టోబర్ 28 (మన ప్రజావాణి)భూపాలపల్లి నియోజకవర్గంలో సమ్మె చేస్తున్న ఎన్ హెచ్ ఎం ఉద్యోగులకు శాసనమండలి ప్రతిపక్ష నేత, మాజీ స్పీకర్ సిరికొండ మధుసూదనచారి మద్దతు ప్రకటించారు.వర్షంలో సైతం కాన్వాయ్ తో తరలివచ్చి సమ్మె శిబిరాన్ని సందర్శించిన ఆయన, ఉద్యోగుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం పోరాడుతున్న ఎన్ హెచ్ ఎం ఉద్యోగులకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "కరోనా వంటి కష్టకాలంలో ప్రాణాలకు తెగించి సేవలందించిన ఎన్ హెచ్ ఎం ఉద్యోగులను ప్రభుత్వం ఆదుకోవాలి. వారి న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలి" అని డిమాండ్ చేశారు.అనంతరం నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో పర్యటించి, ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. అంత్యక్రియలకు హాజరై నివాళులర్పించారు, కుటుంబ సభ్యులను పరామర్శించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

కుల్కచర్ల మండల కాంగ్రెస్ అధికార ప్రతినిధిగా మోత్కూర్ వెంకటేష్

పరిగి /కుల్కచర్ల, అక్టోబర్ 28(ప్రజావాణి)కుల్కచర్ల మండల కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధిగా మోత్కూర్ వెంకటేష్ నియమితులయ్యారు. పరిగి ఎమ్మెల్యే, టీపీసీసీ శిక్షణ కమిటీ చైర్మన్ డాక్టర్ టి. రామ్మోహన్ రెడ్డి సిఫార్సు మేరకు కాంగ్రెస్ అధిష్టానం ఈ నియామకాన్ని ఖరారు చేసింది. ఈ సందర్భంగా మోత్కూర్ వెంకటేష్ మాట్లాడుతూ.. తనపై విశ్వాసంతో ఈ బాధ్యతను అప్పగించిన ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డికి, పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లడంతో పాటు, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం శ్రమిస్తానని స్పష్టం చేశారు. మండలంలో పార్టీ బలోపేతానికి సీనియర్లను, కార్యకర్తలను సమన్వయం చేస్తూ ముందుకెళ్తానని చెప్పారు. ఆయన నియామకం పట్ల మండల కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

Printed, Published and Owned by RAYINIPATLA KUMARASWAMY, Printed at SRI VENKATESWARA PRINTING SOLUTIONS, peerzadi guda, GHMC, medchal malkaj giri AND PUBLICATIONS, , Rajanna Sircilla, TELANGANA-505405. RNI NO:TGTEL/25/A5443Editor : RAYINIPATLA KUMARASWAMY, MANAPRAJAVAANI BROAD CASTING AND PUBLICATIONSContact No : 9440032006. MAIL ID : prajavaani006@gmail.comepaper.prajavaani.net

అంబటి లచ్చవ్వ చిత్రపటానికి సీపీఐ రాష్ట్ర,జిల్లా నేతల నివాళి.విఠల్ గౌడ్ కుటుంబానికి పరామర్శ.

- మాతృమూర్తిని కోల్పోయిన విఠల్ గౌడ్‌కు మనోధైర్యం చెప్పిన నేతలు.
- లచ్చవ్వ ఆశయ సాధనకు అనుగుణంగా విఠల్ గౌడ్ కృషి చేయాలన్న నేతలు.

కోటగిరి/ప్రజావాణి:–కోటగిరి మండల సీపీఐ పార్టీ కార్యదర్శి విఠల్ గౌడ్ మాతృమూర్తి అంబటి లచ్చవ్వ ఇటీవల స్వర్గస్థులయ్యారు. ఈ నేపథ్యంలో బుధవారం కోటగిరిలోని విఠల్ గౌడ్ నివాసానికి సీపీఐ రాష్ట్ర,జిల్లా నాయకులు విచ్చేసి ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు పశ్య పద్మ,జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వై.ఓమయ్య,జిల్లా నాయకురాళ్లు స్వరూప రాణి,స్వప్న తదితరులు విఠల్ గౌడ్ ఇంటికి వెళ్లి వారి తల్లి అంబటి లచ్చవ్వ చిత్రపటానికి పూలమాలలు వేసి,విప్లవ జోహార్లు అర్పిస్తూ నివాళులర్పించారు.అనంతరం కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపి మనోధైర్యం కల్పించారు. ఈ సందర్భంగా సిపిఐ నాయకులు మాట్లాడుతూ.విఠల్ గౌడ్ తల్లి ఆశయాలకు అనుగుణంగా నడుచుకుంటూ సమాజంలో మంచి పేరు ప్రఖ్యాతలు గడించాలని ఆకాంక్షించారు.సీపీఐ పార్టీకి విఠల్ గౌడ్ అంది స్తున్న సేవలు ఎనలేనివని కొనియాడారు.నిత్యం పేద ప్రజల,గీత కార్మికుల సంక్షేమం కోసం పరితపించే గొప్ప నాయకులు తన తల్లిని కోల్పోవడం అత్యంత బాధాకరమని పేర్కొ న్నారు.

పాంబండ రామలింగేశ్వర స్వామి దేవస్థానానికి భక్తుల విరాళం: దాతలకు ఆలయ కమిటీ ఘన సన్మానం

పరిగి /కుల్కచర్ల అక్టోబర్ 28(ప్రజావాణి)కుల్కచర్ల మండల పరిధిలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం బండవెల్కిచెర్ల శ్రీ పాంబండ రామలింగేశ్వర స్వామి దేవస్థానానికి కుల్కచర్ల వాస్తవ్యులు పోతగల్ల నాగలక్ష్మి సత్తయ్య, అంజిలమ్మ దంపతులు భక్తిభావంతో సంగీత వాయిద్యాలను సమర్పించారు. స్వామివారి భజనలు, ఆలయ పూజా కార్యక్రమాల నిమిత్తం వారు ఒక హార్మోనియం, తబలాలు, తాళాలను విరాళంగా అందజేశారు.స్వామివారి సేవలో భాగంగా విలువైన వాయిద్యాలను కానుకగా అందించిన దాతలను ఆలయ కమిటీ చైర్మన్ కోట్ల మహిపాల్ రెడ్డి, పాలకమండలి సభ్యులు ఘనంగా సన్మానించారు. ఆలయం తరపున వారికి శాలువా కప్పి, ప్రత్యేక ఆశీర్వచనాలు అందించారు.ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు కె. నర్సింలు, సిహెచ్. ఆంజనేయులు, కొత్త లక్ష్మి, కె. నర్సింలు, ఎం. ప్రభాకర్, ప్రధాన అర్చకులు దశరథం, పాండుశర్మలతో పాటు గ్రామస్తులు పొట్టి రాములు, మంగలి సుభాన్ తదితరులు పాల్గొన్నారు. దాతల సేవా దృక్పథాన్ని ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేకంగా అభినందించారు.

షెడ్యూల్డ్ కులాలు--తెగల అభివృద్ధి పరిషత్ న్యూఢిల్లీ ఆధ్వర్యంలో పూజారులకు ఘన సన్మానం..

భద్రాద్రి జిల్లా బ్యూరో, అక్టోబర్ 28 (మన ప్రజావాణి): జాతీయ షెడ్యూల్డ్ కులాలు––షెడ్యూల్డ్ తెగల అభివృద్ధి పరిషత్, న్యూఢిల్లీ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలకు చెందిన శివశక్తి పూజారులు, మహిళలను తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మద్దిశెట్టి సామేలు ఘనంగా సన్మానించారు. హిందూ దేవాలయాల నిర్మాణానికి సంబంధించి జాతీయ షెడ్యూల్డ్ కులాల కమిషన్ ఇచ్చిన సూచనలను అమలు చేయాలని, తెలంగాణ రాష్ట్ర దేవాదాయ శాఖ కార్యాలయం నుంచి ఖమ్మం దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ కార్యాలయానికి పంపిన లేఖను అమలు చేయాలని ఈ సందర్భంగా పూజారులు కోరారు. ఈ అంశంపై చర్చించిన అనంతరం, కార్యక్రమంలో పాల్గొన్న పూజారుల సమక్షంలో 11 మందితో కూడిన కోర్ కమిటీని ఏర్పాటు చేశారు. దేవాలయాల నిర్మాణం, పూజారుల సమస్యలు, సంబంధిత సూచనల అమలు కోసం సమన్వయంతో పనిచేయాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో రాజులపాటి ఐలయ్య, ఊకే వెంకన్న, సూర్య, సీతారాములు, బిర్రు సామేలు, ఘంటసాల సారక్క, ఏసో, నాగలక్ష్మి, కొదురుపాక నిర్మల, భానోతు ద్యోతమ్మ, ఈదుల రవి, బానోతు శ్రీను నాయక్, పూజారుల సంఘం జిల్లా అధ్యక్షుడు, మండల అధ్యక్షులు, పలగాని శ్రీనివాస్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

సూపర్ ఎల్‌నినోను ఎదుర్కొనేందుకు సమష్టి కార్యాచరణ

- యాసంగిలో ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలి
- మంత్రి శ్రీధర్‌బాబు

మంథని నియోజకవర్గ ప్రతినిధి, అక్టోబర్ 28 (ప్రజావాణి):సూపర్ ఎల్‌నినో పరిస్థితులను ఎదుర్కొంటూ రైతుల సంక్షేమానికి ప్రాధాన్యమివ్వాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అధికారులను ఆదేశించారు. బుధవారం పెద్దపల్లి జిల్లా కలెక్టరేట్‌లో ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణారావు, కలెక్టర్ కోయ శ్రీహర్ష, రామగుండం ఎమ్మెల్యే మక్కన్‌సింగ్ రాజ్‌ఠాకూర్‌తో కలిసి వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు.భూగర్భ జలాలు తగ్గుతున్న నేపథ్యంలో యాసంగిలో వరి సాగును తగ్గించి, పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు, నూనెగింజలు, తక్కువ కాలపరిమితి గల ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించాలని సూచించారు. రైతులకు గ్రామస్థాయిలో అవగాహన కల్పించి, అందుబాటులో ఉన్న నీటిని సమర్థంగా వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు.రానున్న ఏడాది పాటు జిల్లాలోని అన్ని గ్రామాలు, పట్టణాల్లో తాగునీటి సరఫరాకు అంతరాయం కలగకుండా ముందస్తు ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. నీటి పొదుపుపై ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. ప్రధానమంత్రి సూర్యఘర్ పథకం కింద సోలార్ ప్యానెళ్ల ఏర్పాటును ప్రోత్సహించాలని, ప్రజాప్రతినిధులు తమ ఇళ్లపై సోలార్ ప్యానెళ్లు ఏర్పాటు చేసుకుని ఆదర్శంగా నిలవాలని కోరారు.ధాన్యం కొనుగోళ్లలో రైతులకు మద్దతు ధర అందేలా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను సిద్ధం చేయాలని స్పష్టం చేశారు.కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ జిల్లాలో జూన్ నుంచి అక్టోబర్ వరకు 863 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని, సాధారణం కంటే ఎనిమిది శాతం లోటు ఉందని తెలిపారు. జిల్లాలో భూగర్భ జలమట్టం తగ్గుతున్న నేపథ్యంలో యాసంగిలో సుమారు 1,53,586 ఎకరాల్లో పంటలు సాగయ్యే అవకాశం ఉండగా, 90,015 ఎకరాలు బీడుగా ఉండే పరిస్థితి ఉందన్నారు.శ్రీపాద ఎల్లంపల్లి రిజర్వాయర్‌లో 17.62 టీఎంసీల నీరు నిల్వ ఉందని, జిల్లాకు ఏడాదికి 1.85 టీఎంసీల తాగునీరు అవసరమవుతుందని వివరించారు. నవంబర్ రెండో వారంలో ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించి, 311 కేంద్రాల ద్వారా 2,75,316 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు.సమావేశంలో అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అన్నయ్య గౌడ్, రామగుండం మేయర్ మహంకాళి స్వామి, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఆల్విన్ కాలనీ డివిజన్‌లో అభివృద్ధికి మహర్దశ

- రూ.1.18 కోట్లతో ఆరు కాలనీల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన
- పనులు నాణ్యతతో, వేగంగా పూర్తి చేయాలి పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ

కూకట్పల్లి ఆల్విన్ కాలనీ: అక్టోబర్ 27 (ప్రజావాణి)శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలో మౌలిక వసతుల అభివృద్ధికి మరో ముందడుగు పడింది. తులసి నగర్, భూదేవి హిల్స్, గోవింద్ హోటల్ చౌరస్తా, ఛత్రపతి శివాజీ నగర్, మహంకాళి నగర్, ఇందిరా నగర్ కాలనీలలో మొత్తం రూ. 1 కోటి 18 లక్షల 80 వేల అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ శంకుస్థాపన చేశారు. తాజా మాజీ కార్పొరేటర్లు దొడ్ల వెంకటేష్ గౌడ్, నార్నె శ్రీనివాసరావుతో కలిసి ఆయన ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ ప్రజల సంక్షేమం, కాలనీల అభివృద్ధే ప్రధాన లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు. సీసీ రోడ్ల నిర్మాణంతో కాలనీవాసులకు మెరుగైన రవాణా సౌకర్యం కలుగుతుందని, రోడ్ల సమస్యలకు ఉపశమనం లభిస్తుందని పేర్కొన్నారు. నియోజకవర్గంలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యమిస్తూ అభివృద్ధి పనులను నిరంతరం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గదర్శకత్వంలో, మంత్రి శ్రీధర్ బాబు సహకారంతో శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని గాంధీ వెల్లడించారు. ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు తగ్గించి, సురక్షితమైన, సౌకర్యవంతమైన ప్రయాణానికి అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పిస్తామని చెప్పారు.అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, ఎక్కడా రాజీ పడకూడదని అధికారులకు సూచించారు. పనుల్లో జాప్యం జరగకుండా నిర్ణీత సమయంలో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పునరుద్ఘాటించారు.

కాలనీల వారీగా అభివృద్ధి పనుల వివరాలు
తులసి నగర్: రూ. 12 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం.
భూదేవి హిల్స్: రూ. 20 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం.
గోవింద్ హోటల్ చౌరస్తా: రూ. 38.80 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం. ఛత్రపతి శివాజీ నగర్: రూ. 15 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం. మహంకాళి నగర్: రూ. 10 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం. ఇందిరా నగర్: రూ. 23 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం.
ఈ ఆరు అభివృద్ధి పనులకు కలిపి మొత్తం రూ. 1 కోటి 18 లక్షల 80 వేల నిధులు కేటాయించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, కాలనీ అసోసియేషన్ సభ్యులు, మహిళలు, కాలనీవాసులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వేములవాడలో టౌన్ ప్లానింగ్ నిబంధనలు గాలికి..!

- పుణ్యక్షేత్రంలో అక్రమ కట్టడాల జాతర - నిబంధనలు మాయం, అంతస్తులు కాయం.

//వేములవాడ నియోజకవర్గం// అక్టోబర్ - 28 (ప్రజావాణి)రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన వేములవాడ పట్టణం ప్రస్తుతం అక్రమ కట్టడాలకు అడ్డాగా మారిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిబంధనలను తుంగలో తొక్కి, కొందరు అక్రమార్కులు యథేచ్ఛగా భవనాలు నిర్మిస్తుంటే మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారుల మౌనం వెనుక మతలబు ఏంటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

1) : సెట్ బ్యాక్ లు మాయం.. అంతస్తులు కాయం..!
ఒకవైపు ఎలాంటి అనుమతులు లేని కట్టడాలు, మరోవైపు ఒక అంతస్తుకు అనుమతి తీసుకుని మూడు, నాలుగు అంతస్తులు వేసేయడం వేములవాడలో సర్వసాధారణమైపోయింది. కనీస సెట్ బ్యాక్ నిబంధనలు పాటించకపోవడంతో భవిష్యత్తులో అగ్ని ప్రమాదాలు జరిగితే నష్టానికి ఎవరు బాధ్యత వహిస్తారని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

2) : హైవే పక్కనే ప్రమాదకర నిర్మాణం.. నిబంధనలు ఏవి..?
తాజాగా స్థానిక మహారాజా ఫంక్షన్ హాల్ సమీపంలో, సిరిసిల్ల వెళ్లే ప్రధాన రహదారి పక్కనే చేపడుతున్న ఓ టపాసుల విక్రయశాల భవన నిర్మాణమే ఇందుకు నిదర్శనం. అత్యంత ప్రమాదకరమైన ఇటువంటి వాణిజ్య సముదాయాలకు ఫైర్ సేఫ్టీ, ఇతర శాఖల అనుమతులు తప్పనిసరి అయినా, ఇక్కడ అవన్నీ గాలికి వదిలేసి నిర్మాణం సాగుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

3) : నోటీసులు కేవలం కంటి తుడుపేనా..? అధికారుల మౌనం వెనుక..?
స్థానికులు ఫిర్యాదు చేయగానే అధికారులు నామమాత్రంగా నోటీసులు జారీ చేసి చేతులు దులుపుకుంటున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. నోటీసులు ఇచ్చినా క్షేత్రస్థాయిలో పనులు మాత్రం ఆగడం లేదు. భవనం పూర్తయ్యే వరకు చూసీచూడనట్లు వ్యవహరించి ఆ తర్వాత చేతులెత్తేయడం వెనుక లోపాయికారీ ఒప్పందాలు ఉన్నాయనే గుసగుసలు వినిపిస్తున్నాయి. దీనివల్ల ప్రభుత్వ ఖజానాకు భారీగా ఆదాయ నష్టం వాటిల్లుతోందని ప్రజలు మండిపడుతున్నారు.
దీనిపై జిల్లా ఉన్నతాధికారులు, కలెక్టర్ జోక్యం చేసుకుని వేములవాడ పట్టణంలోని అక్రమ కట్టడాలపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను సందర్శించిన డి టి డబ్ల్యూ ఓ నాగసాగర్ - విద్యార్థులకు నాణ్యమైన విద్య, పౌష్టికాహారం అందించాలి

భూపాలపల్లి, బ్యూరో అక్టోబర్ 28 (మన ప్రజావాణి):-జయశంకర్ భూపాలపల్లి పట్టణంలోని గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాల ను బుధవారం జిల్లా గిరిజన సంక్షేమ అధికారి (డి టి డబ్ల్యూ ఓ) నాగసాగర్ సందర్శించి పాఠశాలలోని విద్యా, వసతి సౌకర్యాలను పరిశీలించారు.పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న విద్యాబోధన, ఉపాధ్యాయుల హాజరు, విద్యార్థుల హాజరు శాతం, తరగతి గదుల నిర్వహణ, బోధనాభ్యసన కార్యక్రమాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో స్వయంగా మాట్లాడి వారి చదువుల పురోగతి, సబ్జెక్టులపై అవగాహన, ఎదురవుతున్న సమస్యల గురించి తెలుసుకున్నారు.అనంతరం బాలికల వసతి గృహాన్ని సందర్శించి తాగునీరు, పారిశుధ్యం, మరుగుదొడ్లు, పరిసరాల పరిశుభ్రత, భోజనశాల, వంటగది తదితర అంశాలను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన, పౌష్టికాహారాన్ని నిర్ణీత మెనూ ప్రకారం అందించాలని సూచించారుఈ సందర్భంగా డి టి డబ్ల్యూ ఓ నాగసాగర్ మాట్లాడుతూ.. గిరిజన విద్యార్థినుల విద్యాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, విద్యార్థులు విద్యలో రాణించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి మెరుగైన ఫలితాలు సాధించేలా ప్రణాళికాబద్ధంగా బోధన నిర్వహించాలని తెలిపారు.
విద్యార్థినులకు చదువుతో పాటు క్రమశిక్షణ, పరిశుభ్రత, ఆరోగ్యం, వ్యక్తిత్వ వికాసం వంటి అంశాలపై అవగాహన కల్పించాలని సూచించారు. పాఠశాల మరియు వసతి గృహంలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉంచాలని, విద్యార్థుల సంక్షేమం విషయంలో నిర్లక్ష్యం వహించరాదని సిబ్బందికి సూచించారు.
ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సమ్మయ్య, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

అర్ధరాత్రి వేళల్లో నిర్మాణ పనులు!

- కనుమరుగవుతున్న ముక్కిడిదాని చెరువు
- సఫిల్‌గూడ చెరువు వద్ద అక్రమ కట్టడాల ఆరోపణలు
- ఆర్‌కే పురం బ్రిడ్జి కింద జరుగుతున్న పనులపై అధికారుల దృష్టి పడేదెప్పుడు?

మల్కాజిగిరి (ప్రతినిధి ప్రజావాణి అక్టోబర్ 28) సఫిల్‌గూడలోని ఆర్‌కే పురం బ్రిడ్జి సమీపంలో ముక్కిడిదాని చెరువు ప్రాంతం క్రమంగా కనుమరుగయ్యే పరిస్థితులు నెలకొన్నాయని స్థానికులు ఆందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ రాత్రివేళ గృహనిర్మాణ పనులు జరుగుతున్న దృశ్యాలు స్థానికంగా ఉన్న ప్రజల్లో ఆందోళనకు కారణమవుతున్నాయి. రాత్రి సమయంలో వెలుగుల మధ్య కార్మికులు నిర్మాణ పనుల్లో నిమగ్నమై ఉన్నట్లు ఫొటోలో కనిపిస్తోంది. ఈ నిర్మాణానికి అనుమతులు ఉన్నాయా? ఉంటే రాత్రిపూట పనులు చేయాల్సిన అవసరం ఏముందని ప్రజాలు వాపోతున్నారు.సంబంధిత ప్రాంతం చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలోకి వస్తుందా? అనే ప్రశ్నలకు అధికారులు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది.

రాత్రివేళ పనులు.. పర్యవేక్షణ ఏది?
చెరువు పరిధిలో నిర్మాణాలు జరుగుతున్నాయన్న ఆరోపణలు ఉన్న నేపథ్యంలో సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించాల్సిన అవసరం ఉంది. నిర్మాణానికి అనుమతులు ఉన్నాయా, ఆమోదిత ప్లాన్ ప్రకారమే పనులు జరుగుతున్నాయా, చెరువు భూమి లేదా బఫర్ జోన్‌లోకి నిర్మాణం విస్తరించిందా అనే అంశాలను అధికారిక రికార్డులతో పరిశీలించాలి.

హైడ్రా, టౌన్ ప్లానింగ్ అధికారులు స్పందించాలి
ఈ ప్రాంతంలో నిర్మాణానికి సంబంధించి గతంలో నోటీసులు జారీ అయ్యాయా? జారీ అయితే వాటి అనంతరం ఏ చర్యలు తీసుకున్నారు? నిర్మాణ పనులు కొనసాగుతున్నట్లయితే సంబంధిత అధికారులు పరిశీలించారా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.
హైడ్రా, టౌన్ ప్లానింగ్, సంబంధిత మున్సిపల్ అధికారులు సమన్వయంతో విచారణ చేపట్టి వాస్తవాలను వెల్లడించాలి. నిబంధనల ఉల్లంఘనలు నిర్ధారణ అయితే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి.

చెరువుల పరిరక్షణపై నిర్లక్ష్యం వద్దు
చెరువులు, జలవనరుల పరిరక్షణ ప్రజా ప్రయోజనాలకు సంబంధించిన అంశం. అందువల్ల ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకుండా నిర్మాణ స్థలాన్ని సర్వే చేసి, ఎఫ్‌టీఎల్ సరిహద్దులను నిర్ధారించి, అనుమతుల వివరాలను ప్రజలకు తెలియజేయాలి.
సఫిల్‌గూడ ఆర్‌కే పురం బ్రిడ్జి సమీపంలోని నిర్మాణంపై అధికారులు ఎప్పుడు స్పందిస్తారు? నిర్మాణం నిబంధనలకు విరుద్ధంగా ఉన్నట్లు తేలితే చర్యలు తీసుకుంటారా? ప్రజల సందేహాలకు సంబంధిత శాఖలు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది.

ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలి

- ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన డీఎంహెచ్ఓ డాక్టర్ బి. రవి రాథోడ్
- అనుమతులు లేకుండా ఇంజక్షన్లు, సెలైన్లు ఎక్కిస్తే కఠిన చర్యలు

డోర్నకల్ నియోజకవర్గ ప్రతినిధి, అక్టోబర్ 28, ప్రజావాణి : ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో వైద్య సిబ్బంది నిర్లక్ష్యం వహించరాదని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి. రవి రాథోడ్ సూచించారు. బుధవారం ఆయన వైద్య బృందంతో కలిసి బలుపాల, గంధంపల్లి, డోర్నకల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.
ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రాల్లో సిబ్బంది హాజరు పట్టికలు, మందుల నిల్వలు, నిర్వహిస్తున్న రికార్డులు, రోగులకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. ఆసుపత్రులకు వచ్చే రోగులకు సకాలంలో వైద్యం అందించాలని, అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలని వైద్య సిబ్బందికి సూచించారు. ప్రజారోగ్య పరిరక్షణకు ప్రాధాన్యమిస్తూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని స్పష్టం చేశారు.

అనుమతులు లేని వైద్య సేవలపై హెచ్చరిక

అనంతరం డోర్నకల్ మండల కేంద్రంలోని స్టేషన్ రోడ్డులో కలకత్తా మెడికల్స్‌కు చెందిన పి. సనత్ కుమార్ నిర్వహిస్తున్న ప్రథమ చికిత్స కేంద్రాన్ని డీఎంహెచ్ఓ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రథమ చికిత్స కేంద్రాల నిర్వాహకులు నిబంధనలకు అనుగుణంగానే సేవలు అందించాలని సూచించారు.
సరైన వైద్య అర్హతలు, అనుమతులు లేకుండా రోగులకు ఇంజక్షన్లు వేయడం, సెలైన్లు ఎక్కించడం, సూదుల ద్వారా చికిత్స చేయడం వంటి వైద్య ప్రక్రియలు చేపట్టరాదని స్పష్టం చేశారు. ప్రథమ చికిత్స కేంద్రాలు తమ పరిధిలోని సేవలకే పరిమితం కావాలని, అవసరమైన సందర్భాల్లో రోగులను అర్హత కలిగిన వైద్యుల వద్దకు పంపించాలని సూచించారు. నిబంధనలను ఉల్లంఘిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

తనిఖీల్లో పాల్గొన్న అధికారులు

ఈ కార్యక్రమంలో బలుపాల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ స్రవంతి, డోర్నకల్ వైద్యాధికారి డాక్టర్ సాద్విజ, డాక్టర్ మేఘన, గంధంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ ఉస్మాన్, సీహెచ్ఓ జ్ఞాన సుందరి, డిప్యూటీ డీఎంఈఓ రాజకుమార్, డీపీఓ నీలోహన తదితరులు పాల్గొన్నారు.

రామన్నగూడెం విద్యార్థులు రాష్ట్ర స్థాయికిఎంపిక

ఏటూరునాగారం అక్టోబరు 28 ప్రజావాణి : పీపుల్స్ ఎడ్యుకేషన్ కౌన్సిల్ ములుగు జిల్లా స్థాయి లిఫోక్ డాన్స్‌లికంపిటిషన్స్ తేదీ. 28.10.2026 న గౌట్ హై స్కూల్ గోవిందరావుపేట లో జరిగాయి, ఇందులో జిల్లా పరిషత్ రామన్నగూడెం విద్యార్థులు ఎన్ హర్ష వర్ధన్, గద్దల ఉమామహేశ్వర్, రిషి, జనగాం దినేష్, వరుణ్, భార్గవ్, అనిల్, కార్తీక్ ల బృందం పాల్గొని ఉత్తమప్రదర్శన తో జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతి గెల్చుకున్నారు, వీరు రాష్ట్ర స్థాయికి ఎంపిక అయినట్లు జిల్లా విద్యా శాఖ వారు ప్రకటించారు, కార్యక్రమ నిర్వాహకులు సోమారెడ్డి ,ఎస్ శ్రీనివాస్ రెడ్డి, అప్పని జయదేవ్ లు బహుమతులు అందచేశారు. ఈ విజయం పట్ల జెడ్ పి ఎస్ ఎస్ రామన్నగూడెం పాఠశాల హెడ్ మాస్టర్ ఏం ఈ వో ఏటూరునాగారం కొయ్యడ మల్లయ్య విద్యార్థులను అభినందించారు, శిక్షణ ఇచ్చిన డాన్స్ మాస్టర్ కోడి వెంకట్ కి, సహకరించిన ఉపాధ్యాయ బృందానికి శుభాకాంక్షలు తెలియచేసారు.

గోవిందరావుపేటలో మార్మోగిన కాకులమర్రి బ్రదర్స్ మానవత్వం

- రాజకీయాలకు అతీతంగా సేవ.. మొద్దులగూడెంలో ప్రశంసలు.
- కష్టంలో ఉన్నవాడికి కాకులమర్రి బ్రదర్స్ అండ. గ్రామస్థుల హర్షం.
- మాటలు కాదు.. చేతల్లో చూపించిన నాయకత్వం.
- బాధితుడికి భరోసాగా లక్ష్మణ్ బాబు, ప్రదీప్ రావు.

ములుగు జిల్లా ప్రతినిధి (ప్రజావాణి):- ప్రజాసేవ అంటే కేవలం మాటల్లో హామీలు ఇవ్వడం కాదు.. ఆపదలో ఉన్నవారి కష్టాన్ని గుర్తించి, వారి అవసరాలకు అనుగుణంగా తక్షణమే స్పందించి అండగా నిలవడంఅని మరోసారి నిరూపించారు కాకులమర్రి బ్రదర్స్ . ప్రజల జీవితాల్లో నిజమైన మార్పు తీసుకురావడమే ప్రజాసేవకు అసలైన అర్థంఅని ఈ సందేశాన్ని ప్రతిబింబించేలా ములుగు జిల్లా గోవిందరావు పేట మండలంలో మొద్దులగూడెం గ్రామంలో బీఆర్ఎస్ నాయకులు మానవతా దృక్పథం చాటుకున్నారు.నడుము విరిగి మంచానికే పరిమితమైన జల్లుల రమేష్‌కు ఎలక్ట్రిక్ వీల్‌చైర్ జీవనాధారం. అయితే దానికి సంబంధించిన బ్యాటరీలు, మోటార్లు పాడవడంతో ఆయన తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం తెలుసుకున్న లిములుగు జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్ బాబు స్పందించారు. ఆయన చొరవతో కాకులమర్రి ప్రదీప్ రావు సుమారు రూ.70,000 విలువైన రెండు బ్యాటరీలు, రెండు మోటార్లను రమేష్‌కు అందజేశారు.వారి సహాయం కేవలం పరికరాలను అందించడానికే పరిమితం కాదు. ఒక వికలాంగుడి స్వతంత్రంగా కదిలే అవకాశానికి తోడ్పడటంతో పాటు , రోజువారీ జీవితంలో ఎదురయ్యే ఇబ్బందులను తగ్గించడం, అతనిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడం దీని వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశం అని చెప్పారు
సహాయం విలువ దాని ధరలో కాదు.. అది ఒకరి జీవితంలో తీసుకొచ్చే మార్పులో ఉంటుందనీ చెప్పారు .
కూరగాయలు అమ్ముకుంటూ కుటుంబాన్ని పోషిస్తూ, తన కుమారుడికి నిరంతరం సేవలు చేస్తూ కంటికి రెప్పలా కాపాడుకుంటున్న రమేష్ తల్లి జీవితం ఎన్నో గ్రామీణ కుటుంబాలు ఎదుర్కొంటున్న కష్టాలకు ప్రతిబింబం. కుటుంబ బాధ్యతలు, జీవనోపాధి, కుమారుడి సంరక్షణ వంటి అనేక సవాళ్ల మధ్య ఆమె చేస్తున్న పోరాటాన్ని గుర్తించి వారు స్పందించడం మానవత్వానికి నిదర్శనం అని గ్రామస్థులు కొనియాడారు.
ప్రజాసేవకు పదవులు అవసరం కావచ్చు.. కానీ ప్రజల బాధను అర్థం చేసుకోవడానికి మానవత్వం అవసరం అని గ్రామ పార్టీ పేర్కొన్నారు.ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, స్వచ్ఛంద సంస్థలు, సామాజిక కార్యకర్తలు తమ పరిధిలో ఉన్న నిరుపేదలు, వికలాంగులు, వృద్ధులు, ఆపదలో ఉన్న కుటుంబాల సమస్యలను గుర్తించి స్పందించినప్పుడే సమాజంలో నిజమైన మార్పు సాధ్యమవుతుందనీ కాకుల మర్రి ప్రదీప్ రావు తెలిపారు.
ఈ సందర్భంగా కాకులమర్రి లక్ష్మణ్ బాబు, కాకులమర్రి ప్రదీప్ రావు స్పందన ద్వారా ప్రజాసేవలో సకాలంలో సహాయం అందించడం ఎంత ముఖ్యమో మరోసారి స్పష్టమైందో ఈరోజు రుజువైంది.రాజకీయాలకు అతీతంగా, మానవత్వమే ప్రాధాన్యంగా నిలిచినప్పుడే సేవకు సార్ధకత లభిస్తుంది పలువురు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో మొద్దులగూడెం బిఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షులు గజ్జి ఎలంధర్ గారు మండల నాయకులు పోరిక రవికిరణ్ గారు పస్రా జుఇ.ఎంపీటీసీ స్వరూప, జుఇ, ఎంపీటీసీ లకావత్ చందులల్ జుఇ. సర్పంచ్ మోహన్ రాథోడ్ , సర్పంచాలు మాలోత్ గాంధీ, బానోత్ సీతారాం,పస్రా 4వ ఏకుల ధనుజయ్ గారు ,13వ వార్డు కత్తుల సారయ్య గారు 14 వ వార్డు బక్క సరిత గారు. గోవిందరావుపేట గ్రామ శాఖ అధ్యక్షులు అక్కేనాపెల్లి రమేష్ గారు,లక్ష్మీపురం గ్రామపార్టీ అధ్యక్షులు జల్లెల్ల కొమురయ్య,కుమారస్వామి యూత్ అధ్యక్షులు రుద్రారపు శేఖర్ ఉపాధ్యక్షులు కొయ్యడ శ్రీకాంత్ సోషల్ మీడియా మంచికలపూడి అరుణ్ ఇస్లావత్ శేఖర్ మరియు సీనియర్ నాయకులు తోడుసు వెంకన్న మేడుదల వెంకన్న,మడికొండ రమేష్, ఆరే నరేష్,లకావత్ మమతా,గుగులోతు రమేష్, బుర్రి వీరయ్య, గుండె సోమయ్య, రుద్రారపు లింగయ్య, తుడుసు సారయ్య, బక్క బుచ్చయ్య, కత్తుల సమ్మయ్య, సాదుల ప్రసాద్ గడ్డి, పవన్ జలల మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

మూసాపేట్‌లో విద్యార్థినులకు పోక్సో చట్టంపై అవగాహన

- బాలల రక్షణ, వ్యక్తిగత భద్రతపై విద్యార్థినులకు న్యాయ అవగాహన

మూసాపేట్ : అక్టోబర్ 27 (ప్రజావాణి) మూసాపేట్: పిల్లలపై లైంగిక నేరాల నివారణ, బాలల హక్కుల పరిరక్షణ లక్ష్యంగా మూసాపేట్‌లోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో సురక్షిత్ బచ్‌పన్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ గౌరవ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ ఆదేశాల మేరకు, కూకట్‌పల్లి మండల న్యాయ సేవా కమిటీ చైర్మన్, ××× అదనపు జిల్లా జడ్జి శ్రీ ఎం. వెంకటేశ్వర రావు గారి ఆధ్వర్యంలో ఈ అవగాహన కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా విద్యార్థినులకు లైంగిక నేరాల నుంచి పిల్లలను రక్షించే పోక్సో (POCSO) చట్టం--2012 గురించి వివరించారు. బాలల భద్రత, వ్యక్తిగత రక్షణ, మంచి స్పర్శ--చెడు స్పర్శపై అవగాహన, అనుమానాస్పద పరిస్థితుల్లో అప్రమత్తంగా ఉండటం, సమస్యలు ఎదురైనప్పుడు నమ్మకమైన పెద్దలకు తెలియజేయడం వంటి అంశాలపై మార్గనిర్దేశం చేశారు. పిల్లలపై జరిగే లైంగిక వేధింపులను అరికట్టడంలో చట్టాలపై అవగాహన ఎంతో కీలకమని, ప్రతి విద్యార్థిని తన హక్కులు తెలుసుకొని భద్రత పట్ల అప్రమత్తంగా ఉండాలని ఈ కార్యక్రమం ద్వారా వివరించారు. బాలలకు సురక్షిత వాతావరణం కల్పించడంలో విద్యాసంస్థలు, తల్లిదండ్రులు, సమాజం సమష్టిగా బాధ్యత వహించాలని సూచించారు.

దంతేపల్లి గ్రామంలో బ్యాంకు సేవలపై అవగాహన కార్యక్రమం

- మహిళా సంఘాలకు రుణ సదుపాయాలు, ఈ-కేవైసీ, నామినీ నమోదు, బీమా పాలసీలపై వివరణ

దంతేపల్లి, ప్రజావాణి: మెదక్ జిల్లా రామాయంపేట మండలం దంతేపల్లి గ్రామపంచాయతీ పరిధిలో బుధవారం తెలంగాణ గ్రామీణ బ్యాంకు (టీజీబీ) లక్ష్మాపూర్ శాఖ బ్రాంచ్ మేనేజర్, ఫీల్డ్ ఆఫీసర్‌తో పాటు బీమా కంపెనీ ప్రతినిధులు గ్రామాన్ని సందర్శించి గ్రామ ప్రజలకు బ్యాంకు సేవలు, వివిధ ఆర్థిక పథకాల ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు బ్యాంకింగ్ సేవలపై పూర్తి అవగాహన కల్పించడంతో పాటు, బ్యాంకు ద్వారా అందుబాటులో ఉన్న సదుపాయాలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.
ఈ సందర్భంగా బ్యాంకు అధికారులు గ్రామ ప్రజలకు వివిధ బ్యాంకింగ్ సేవల గురించి వివరించారు. ముఖ్యంగా మహిళా స్వయం సహాయక సంఘాలకు అందించే రుణ సదుపాయాలు, రుణాల కోసం దరఖాస్తు చేసుకునే విధానం, బ్యాంకు ఖాతాలకు సంబంధించిన అవసరమైన వివరాలు, ఖాతాదారులు తప్పనిసరిగా పూర్తి చేసుకోవాల్సిన ఈ-కేవైసీ ప్రక్రియ గురించి అవగాహన కల్పించారు. మహిళా సంఘాలు బ్యాంకు రుణ సదుపాయాలను సద్వినియోగం చేసుకుని తమ ఆర్థిక అవసరాలను తీర్చుకోవడంతో పాటు, స్వయం ఉపాధి అవకాశాలను మెరుగుపరుచుకోవడానికి బ్యాంకు సేవలు ఎంతగానో ఉపయోగపడతాయని వివరించారు.
అలాగే బ్యాంకు ఖాతాలకు నామినీని నమోదు చేయడం యొక్క ప్రాధాన్యతను అధికారులు తెలియజేశారు. ఖాతాదారులు తమ బ్యాంకు ఖాతాలకు సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు సరిచూసుకోవాలని, అవసరమైన పత్రాలను సమర్పించి ఈ-కేవైసీ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని సూచించారు. బ్యాంకు సేవలను సక్రమంగా వినియోగించుకోవడం ద్వారా ఖాతాదారులకు కలిగే ప్రయోజనాలను వివరించి, బ్యాంకింగ్ లావాదేవీల విషయంలో ప్రతి ఒక్కరూ అవగాహనతో వ్యవహరించాలని తెలిపారు.

బీమా పాలసీలపై ప్రత్యేక అవగాహన

గ్రామ ప్రజలకు బీమా పథకాల ప్రాధాన్యతను కూడా బీమా కంపెనీ ప్రతినిధులు వివరించారు. అనుకోని పరిస్థితుల్లో కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించడంలో బీమా పాలసీలు కీలక పాత్ర పోషిస్తాయని తెలియజేశారు. అందుబాటులో ఉన్న వివిధ బీమా పాలసీలు, వాటి ప్రయోజనాలు, అర్హతలు, పాలసీలకు సంబంధించిన నిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ తమ అవసరాలకు, అర్హతలకు అనుగుణంగా పాలసీల వివరాలను తెలుసుకుని తగిన నిర్ణయం తీసుకోవాలని సూచించారు.గ్రామీణ ప్రాంతాల్లో నివసించే ప్రజలకు బ్యాంకింగ్ సేవలు, రుణ సదుపాయాలు, బీమా పథకాలపై అవగాహన ఉండటం ఎంతో అవసరమని ఈ సందర్భంగా వివరించారు. బ్యాంకు ఖాతాలు కలిగిన ప్రతి ఒక్కరూ తమ ఖాతాలకు సంబంధించిన వివరాలను సక్రమంగా ఉంచుకోవాలని, అవసరమైన నామినీ నమోదు, ఈ-కేవైసీ వంటి ప్రక్రియలను నిర్లక్ష్యం చేయకుండా పూర్తి చేసుకోవాలని తెలియజేశారు. మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు కూడా బ్యాంకు అధికారులు అందించే సమాచారాన్ని తెలుసుకుని, తమకు అందుబాటులో ఉన్న రుణ సదుపాయాలను నిబంధనల ప్రకారం వినియోగించుకోవాలని సూచించారు.
బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలి: గ్రామపంచాయతీ దంతేపల్లి గ్రామ ప్రజలు బ్యాంకు అధికారులు వివరించిన సేవలు, పథకాల ప్రయోజనాలను పూర్తిగా తెలుసుకుని సద్వినియోగం చేసుకోవాలని గ్రామపంచాయతీ పాలకవర్గం కోరింది. బ్యాంకు సేవలపై అవగాహన పెంపొందించుకోవడం ద్వారా ప్రజలు తమ ఆర్థిక అవసరాలకు తగిన సేవలను పొందేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ముఖ్యంగా మహిళా సంఘాల సభ్యులు, బ్యాంకు ఖాతాదారులు, అర్హులైన గ్రామ ప్రజలు సంబంధిత అధికారులను సంప్రదించి తమకు అవసరమైన సమాచారం తెలుసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో టీజీబీ లక్ష్మాపూర్ శాఖ బ్రాంచ్ మేనేజర్, ఫీల్డ్ ఆఫీసర్, బీమా కంపెనీ ప్రతినిధులు, దంతేపల్లి గ్రామ సర్పంచ్ ఎం. బాల్ రాజు, ఉపసర్పంచ్ శ్యామ్ రాజ్, గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు. గ్రామ ప్రజలకు బ్యాంకింగ్ సేవలపై అవగాహన కల్పించిన బ్యాంకు అధికారులు, బీమా ప్రతినిధులకు గ్రామపంచాయతీ తరపున కృతజ్ఞతలు తెలియజేశారు.

ఎమ్మెల్సీ ఓటర్ నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలి

- మండల పరిధిలోని నారాయణపురంలో ఎమ్మెల్సీ ఓటర్ నమోదు పత్రాలను పరిశీలిస్తున్న జానకి రామాచారి

చిలుకూరు అక్టోబర్28(ప్రజావాణి): మండల వ్యాప్తంగా బిఆర్ఎస్ నాయకులుఎంఎల్సి ఓటర్ నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు అక్కినపల్లి జానకి రామాచారి అన్నారు బుధవారం మండల పరిధిలోని పాలెం నారాయణపురం గ్రామాలలో ఎమ్మెల్సీ ఓటింగ్ నమోదు ప్రక్రియను ఆయన పరిశీలించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్క పట్టభద్రులు ఆన్లైన్లో ఓటు నమోదు చేసుకొని దస్త్రాలను తహాసిల్దార్ కార్యాలయంలో ఇవ్వాలని అన్నారు ఈ నమోదు ప్రక్రియలో పట్టభద్రులు వీలైనంత ఎక్కువమంది ఓటు హక్కును నమోదు చేసుకునేలా పట్టభద్రుల ఇన్చార్జి చొరవ తీసుకోవాలని అన్నారు అనంతరం గ్రామంలో బిఆర్ఎస్ వారు ఆన్లైన్ చేసిన పత్రాలను అధ్యక్షుడికి అందజేశారు కార్యక్రమంలో మాజీ జడ్పీ కోఆప్షన్ జానిమియా, నాయకులు సోమగాని రాజశేఖర్,వల్లబోయిన లక్ష్మీనారాయణ,గంద్ర సుధాకర్,కొండా నంద తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన పట్టభద్రులు ఎమ్మెల్సీ ఓటును నమోదు చేసుకోవాలి

- ప్రముఖ వైద్యులు డా వై రవీంద్రనాథ్

ఖమ్మం బ్యూరో ప్రతినిధి మన ప్రజావాణి అర్హులైన పట్టభద్రులందరూ ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకోవాలని ప్రముఖ వైద్యులు డా.వై రవీంద్రనాథ్ విజ్ఞప్తి చేశారు.స్థానిక త్రీ టౌన్ ప్రాంతంలోని గ్రెయిన్ మార్కెట్ ఎదురుగా ఉన్న ప్రజాసంఘాల కార్యాలయంలో పిడియఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కొల్లి సత్యనారాయణకు సంబంధించిన ఉచిత ఓటరు నమోదు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి ప్రసంగించారు.ఈ సందర్భంగా ప్రజాసంఘాల నాయకులు వజినేపల్లి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవాలంటే ముందుగా ఓటరుగా నమోదు చేసుకోవడం తప్పనిసరి అని తెలిపారు.వరంగల్--ఖమ్మం--నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ పరిధిలో ఓటు నమోదుకు నవంబర్ 6తేదీ చివరి రోజని, సమయం తక్కువగా ఉన్నందున అశ్రద్ధ చేయకుండా అర్హులైన ప్రతివారూ తమ ఓటును నమోదు చేసుకోవాలని ఆయన కోరారు.చివరి తేదీ వరకు వేచి ఉండకుండా వెంటనే దరఖాస్తు చేసుకోవాలని,ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు.ఓటరుగా నమోదు కాకపోతే ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసే అవకాశం కోల్పోయే పరిస్థితి ఏర్పడుతుందని, అందువల్ల పట్టభద్రులు, విద్యావంతులు ఈ విషయాన్ని తమ మిత్రులు, కుటుంబ సభ్యులు, సహోద్యోగుల దృష్టికి తీసుకెళ్లి అర్హులైన వారందరూ ఓటరుగా నమోదు చేసుకునేలా చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.అందుకోసం ప్రజాసంఘాలు ఏర్పాటు చేసిన ఉచిత ఓటరు నమోదు కేంద్రాలను వినియోగించుకోగలరని తెలిపారు.ఓటును నమోదు చేసుకున్న పట్టభద్రులు ప్రగతిశీల ప్రజాస్వామిక కూటమి(పీడీయఫ్) తరుపున పోటీ చేస్తున్న కొల్లి సత్యనారాయణకు మొదటి ప్రాధాన్యత ఓటును వేసి గెలిపించగలరని కోరారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ అభ్యర్థి కొల్లి సత్యనారాయణ,ప్రజాసంఘాలు,పౌర సంఘాల నాయకులు మాదినేని రమేష్,బండారు రమేష్,భుక్యా శ్రీనివాసరావు,బండారు యాకయ్య,యర్రా గోపి,యస్ కె సైదులు,యస్ కె ఇమాం,శీలం వీరబాబు,బండారు వీరబాబు,జార్జి,బండారు రవితేజ,సారంగి పాపారావు,యర్రా మల్లిఖార్జున్,బండారు సునీత,భుక్యా సుభద్ర తదితరులు పాల్గొన్నారు.

అమరవీరుల సంస్మరణ సభల వాల్ పోస్టర్ ల ఆవిష్కరణ

- భారతవిప్లవోద్యమంలో అమరులైన వీరులకు విప్లవ జోహార్లు
- నవంబర్ 1నుండి 9వరకు, గ్రామ గ్రామాన విస్తృతంగా అమరవీరుల సభలు

గూడూరు మండల ప్రతినిధి:- అక్టోబర్ 28. (మన సమగ్ర ప్రజావాణి):- మహబూబాబాద్ జిల్లా, భారత విప్లవద్యంలో అమరులైన వీరులకు జోహార్లు అర్పిస్తూ... నవంబర్ 1 నుండి 9 వరకు గ్రామ గ్రామాన సభలు సమావేశాలను విస్తృతంగా జరపాలని కోరుతూ.. ఈ రోజు మచ్చర్ల గ్రామంలో అమరవీరుల వాల్ పోస్టర్ లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ గూడూరు డివిజన్ కార్యదర్శి కామ్రేడ్ సూర్యం మాట్లాడుతూ.. భూమి భుక్తి పేద ప్రజల విముక్తి కోసం కొనసాగిన గోదావరి లోయ ప్రతిఘటన పోరాటంలో అమరులైన విప్లవ వీరులకు జోహార్లు అర్పిస్తూ.. నవంబర్ 1 నుండి 9 వరకు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా గ్రామ గ్రామాన సభలను విస్తృతంగా జరపాలని వారు అన్నారు. అదేవిధంగా 7న, ఫాఖాల కొత్తగూడ లో జరుగు పాలడుగు క్రిష్ణ స్మారక బహిరంగ సభను అలాగే 9న, మచ్చర్ల లో కామ్రేడ్ రాసూరి యాకన్నా, పెనుక వెంకన్న (విక్రమ్) చిన్నం కోటి ల స్మారక సభలను ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలనీ వారు పిలుపునిచ్చారు. ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ గూడూరు మండల కార్యదర్శి గజ్జి లింగయ్య, జిల్లా నాయకులు పుల్లన్న, శ్రీశైలం, కొట్టెం అచ్చన్న, కాడబోయిన నర్సయ్య, టేకుమట్ల సమ్మయ్య, ఒర్రె వెంకన్న, అడ్డూరి వెంకన్న, కొట్టెం వజ్జయ్య, తదితరులు పాల్గొన్నారు.

భద్రాచలం నూతన ఎంఈఓగా కొడెం పద్మ బాధ్యతల స్వీకరణ..

- ఉపాధ్యాయ సంఘాల సమన్వయంతో విద్యా పరిపాలన సాగించాలి.
- టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి విజయ్‌కుమార్

భద్రాచలం, అక్టోబర్ 28 (మన ప్రజావాణి): భద్రాచలం మండల నూతన మండల విద్యాధికారి గా (ఎంఈఓ) కొడెం పద్మ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా టీఎస్‌యూటీఎఫ్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి విజయ్‌కుమార్ మాట్లాడుతూ మండలంలోని అన్ని ఉపాధ్యాయ సంఘాలను సమన్వయం చేసుకుంటూ, వారి సహకారంతో విద్యా పరిపాలనను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. మండలంలోని ఉపాధ్యాయులందరినీ సమాన దృష్టితో చూస్తూ, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని, విద్యా రంగ అభివృద్ధికి అన్ని ఉపాధ్యాయ సంఘాల భాగస్వామ్యంతో ముందుకు సాగాలని ఆయన ఆకాంక్షించారు. ఉపాధ్యాయుల మధ్య సమన్వయం, పరస్పర సహకారం పెంపొందించడం ద్వారా మండలంలో విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరచవచ్చని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నూతన ఎంఈఓ కొడెం పద్మకు నాయకులు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేసి, ఆమె ఆధ్వర్యంలో మండలంలో విద్యా పరిపాలన మరింత సమర్థవంతంగా సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ మండల అధ్యక్షుడు కొమరం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ప్రసాద్‌బాబు, ఉపాధ్యక్షుడు కరుణకుమార్, కోశాధికారిణి ఆశలత, సాంస్కృతిక కన్వీనర్ భారతి ప్రసాద్, సీనియర్ నాయకులు రాజా శ్రీనివాస్, విజయబాబు, శ్రీనివాస్ తోపాటు సంఘ బాధ్యులు రమాదేవి, హేమ, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి కంటారెడ్డి తిరుపతిరెడ్డి ఆర్థిక సహాయం

చిన్నశంకరంపేట,అక్టోబర్ 28, మన ప్రజావాణి: చిన్న శంకరంపేట మండలం గజగట్లపల్లి గ్రామానికి చెందిన సుధ బాలయ్య బంధువుల ఇంటికి వెళ్లి అకస్మాత్తుగా రామయంపేట చెరువులో పడి మరణించడం జరిగింది. ఇట్టి విషయం స్థానిక బిఆర్ఎస్ నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న మెదక్ బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ రాష్ట్ర నాయకులు రాష్ట్ర నాయకులు కాంటారెడ్డి తిరుపతిరెడ్డి 5000 రూపాయల ఆర్థిక సహాయం అందించారు. సుధ బాలయ్య మృతి పట్ల ప్రగాఢ సంతాపం ప్రకటించారు. బాధ్యత కుటుంబానికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బండారు నాగభూషణం, ఉప సర్పంచ్ బర్మల రాజు, వార్డ్ మెంబర్స్ శ్యామయ్య గణేష్ మహేష్ ప్రసాద్ శ్రీకాంత్ గ్రామ పెద్దలు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ దండే విఠల్‌కు వినతి

- వేతనాల పెంపు, బకాయిల చెల్లింపునకు విజ్ఞప్తి
- ఉద్యోగ భద్రత, క్రమబద్ధీకరణ చేపట్టాలని కోరిన సిబ్బంది
- బదిలీలు, పదోన్నతులు, సర్వీస్ నిబంధనల సమస్యల పరిష్కారానికి వినతి

కాగజ్‌నగర్, (ప్రజావాణి): జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) పరిధిలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది తమ ఉద్యోగపరమైన సమస్యలను ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్ దృష్టికి తీసుకెళ్లారు. ఎన్నో ఏళ్లుగా ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్న తమకు వేతనాల పెంపు, బకాయిల చెల్లింపు, ఉద్యోగ భద్రత, ఉద్యోగాల క్రమబద్ధీకరణ, బదిలీలు,పదోన్నతుల విషయంలో ఎదురవుతున్న సమస్యలను వివరించారు. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని ఎమ్మెల్సీని కోరారు. ఈ కార్యక్రమంలో 16వ వార్డు కౌన్సిలర్ కచ్చకాయల జ్యోతి, ఎన్‌హెచ్‌ఎం సిబ్బంది పాల్గొన్నారు.

పుట్టినరోజు వేడుకలకు హాజరైన మండల బీజేపీ నాయకులు

ప్రజావాణి శాయంపేట మండలం తహరాపూర్ గ్రామంలో భారతీయ జనతా పార్టీ కుటుంబ సభ్యులు మౌనిక--మహేష్ దంపతుల కుమార్తె మొదటి పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ పుట్టినరోజు వేడుకలకు బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రాయరాకుల మొగిలి జిల్లా ప్రధాన కార్యదర్శి జయంత్ లాల్ తాడికొండ రవి కిరణ్ సీనియర్ నాయకులు తేనేటి రామకృష్ణారెడ్డి బీజేవైఎం నాయకులు శ్రీకాంత్ ప్రధాన కార్యదర్శి భూతం తిరుపతి , మండల కార్యదర్శి మేకల సుమన్ , జిల్లా కన్వీనర్ ఎర్ర రాకేష్ రెడ్డి హాజరై చిన్నారిని ఆశీర్వదించారు. ఈ సందర్భంగా చిన్నారికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆయురారోగ్యాలతో, సంతోషంగా ఎదగాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులతో కలిసి కేక్ కట్ చేసి చిన్నారి పుట్టినరోజు వేడుకల్లో అంగరంగ వైభవంగా జరిపారు

నీటి మళ్లింపుపై అధికారుల ఫిర్యాదు.. రంగంలోకి పోలీసులు

- అధికారుల ఫిర్యాదుతో రంగంలోకి పోలీసులు
- రైతులను విచారించిన ఏఎస్సై రాములు
- అక్రమంగా నీటిని వినియోగిస్తే చట్టపరమైన చర్యలు

సిర్పూర్(టి), (ప్రజావాణి): మండలంలోని లోనవెల్లి గ్రామపంచాయతీ పరిధిలోని కంచర్‌పేట్ గ్రామ శివారులో కొందరు రైతులు రాత్రివేళల్లో మిషన్ భగీరథ పైప్‌లైన్ వాల్వ్‌ను తెరిచి నీటిని పంట పొలాలకు మళ్లిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ వ్యవహారంపై మిషన్ భగీరథ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు బుధవారం ఏఎస్సై రాములు కంచర్‌పేట్ గ్రామానికి వెళ్లి రైతులను విచారించారు. ప్రజలకు తాగునీటిని అందించేందుకు ఏర్పాటు చేసిన పైప్‌లైన్ల నుంచి అనుమతి లేకుండా నీటిని మళ్లించడం చట్టవిరుద్ధమని హెచ్చరించారు. ప్రభుత్వ నీటి సరఫరాకు ఆటంకం కలిగించే చర్యలకు ఎవరూ పాల్పడవద్దని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించి నీటిని అక్రమంగా వినియోగిస్తే బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

రైతుల సమస్యల పరిష్కారానికి ఐకేపీ సిబ్బంది చొరవ

- ఆధార్ లింకింగ్‌తో మరో బ్యాంకు ఖాతాలోకి జమవుతున్న జొన్నల విక్రయ నగదు.. రైతులకు భరోసా కల్పిస్తున్న సీసీ విట్టల్, ధడవాయి విలాస్, ఆపరేటర్ భోజన్న

నిర్మల్ జిల్లా ప్రజావాణి బ్యూరో। కుబీర్, అక్టోబర్ 28: కుబీర్ మండలం పల్సి గ్రామంలో జొన్నలు విక్రయించిన కొంతమంది రైతుల బ్యాంకు ఖాతాల్లో ఆశించిన విధంగా నగదు కనిపించకపోవడంతో తలెత్తిన సమస్యపై ఐకేపీ సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించారు. రైతులకు రావాల్సిన పంట విక్రయాల సొమ్ము ఎక్కడ జమ అయింది? చెల్లింపులు ఆలస్యం కావడానికి అసలు కారణమేంటి? అనే సందేహాలకు సమాధానాలు తెలుసుకునే దిశగా ఐకేపీ సీసీ విట్టల్, ధడవాయి విలాస్, ఆపరేటర్ భోజన్న రైతులకు అందుబాటులో ఉంటూ సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నారు. ఆధార్ అనుసంధానం కారణంగా రైతులు అందించిన బ్యాంకు ఖాతాకు బదులుగా, ఆధార్‌తో అనుసంధానమైన మరో బ్యాంకు ఖాతాలో నగదు జమవుతున్న పరిస్థితిని గుర్తించి, రైతులకు వాస్తవ వివరాలను తెలియజేసేందుకు చర్యలు చేపడుతున్నారు.

ఖాతాలో నగదు కనిపించక రైతుల్లో ఆందోళన

ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో పండించిన పంటను విక్రయించిన రైతులకు నిర్ణీత ప్రక్రియ ప్రకారం నగదు చెల్లింపులు జరగాల్సి ఉంటుంది. అయితే పల్సి గ్రామానికి చెందిన కొంతమంది రైతులు జొన్నలను విక్రయించిన అనంతరం, తాము కొనుగోలు కేంద్రానికి అందించిన బ్యాంకు ఖాతాల్లో నగదు జమ అయినట్లు కనిపించకపోవడంతో ఆందోళనకు గురయ్యారు. పంట విక్రయించినప్పటికీ తమ ఖాతాల్లో డబ్బులు కనిపించకపోవడంతో చెల్లింపులు నిలిచిపోయాయా? లేక సాంకేతిక కారణాలతో జాప్యం జరుగుతోందా? అనే సందేహాలు వారిలో నెలకొన్నాయి.

రైతులకు పంట విక్రయాల ద్వారా అందే ఆదాయం వారి కుటుంబ అవసరాలకు, తదుపరి వ్యవసాయ పనులకు ఎంతో కీలకం. ఈ నేపథ్యంలో చెల్లింపుల విషయంలో స్పష్టత లేకపోవడం సహజంగానే రైతుల్లో ఆందోళనకు దారితీస్తుంది. ఇలాంటి పరిస్థితుల్లో రైతులకు సరైన సమాచారం అందించడం, బ్యాంకు లావాదేవీలను పరిశీలించడం, సమస్యకు అసలు కారణాన్ని గుర్తించడం అత్యంత అవసరం.

ఆధార్ అనుసంధానమే ప్రధాన కారణమా?

ప్రాథమికంగా గుర్తించిన వివరాల ప్రకారం, కొంతమంది రైతుల ఆధార్ నంబర్లు వారు ప్రస్తుతం నగదు జమ కావాలని కోరుకుంటున్న బ్యాంకు ఖాతాతో కాకుండా, గతంలో అనుసంధానమైన మరో బ్యాంకు ఖాతాతో లింక్ అయి ఉండటం ఈ సమస్యకు కారణమై ఉండవచ్చని తెలుస్తోంది. ఆధార్ ఆధారిత చెల్లింపుల వ్యవస్థ ద్వారా నగదు బదిలీ జరిగినప్పుడు, సంబంధిత రైతుకు ఆధార్‌తో అనుసంధానమైన బ్యాంకు ఖాతాలో సొమ్ము జమయ్యే అవకాశం ఉంటుంది.

దీంతో రైతులు కొనుగోలు కేంద్రానికి ఇచ్చిన ఖాతాలో నగదు కనిపించకపోయినా, అదే రైతు పేరుతో ఉన్న మరో బ్యాంకు ఖాతాలో సొమ్ము జమై ఉండవచ్చు. అయితే ప్రతి రైతు విషయంలోనూ ఇదే కారణమని నిర్ధారించకుండా, సంబంధిత బ్యాంకు స్టేట్‌మెంట్‌లు, చెల్లింపు వివరాలు, లావాదేవీ గుర్తింపు సంఖ్యలు, ఆధార్ ఆధారిత చెల్లింపుల స్థితిని పరిశీలించి వాస్తవ పరిస్థితిని నిర్ధారించాల్సి ఉంటుంది.

ముఖ్యంగా ఆధార్ అనుసంధానం, బ్యాంకు ఖాతా అనుసంధానం, పంట కొనుగోలు చెల్లింపుల ప్రక్రియలు ఒకే విధంగా ఉండవని రైతులకు వివరించాల్సిన అవసరం ఉంది. ఆధార్‌కు అనుసంధానమైన ఖాతా ఏదో తెలియకపోవడం వల్ల రైతులు తమకు రావాల్సిన నగదు అందలేదని భావించే అవకాశం ఉంది. అందువల్ల సంబంధిత బ్యాంకు ద్వారా ఖాతా వివరాలను ధృవీకరించుకోవడం సమస్య పరిష్కారంలో కీలకంగా మారనుంది.

రైతులకు అందుబాటులో ఐకేపీ సిబ్బంది

పల్సి గ్రామ ఐకేపీ సబ్ సెంటర్ పరిధిలో తలెత్తిన ఈ సమస్యను గుర్తించిన ఐకేపీ సీసీ విట్టల్, ధడవాయి విలాస్, ఆపరేటర్ భోజన్న రైతులతో మాట్లాడి వారి ఇబ్బందులను తెలుసుకుంటున్నారు. నగదు చెల్లింపులకు సంబంధించిన వివరాలను పరిశీలిస్తూ, రైతుల సందేహాలను నివృత్తి చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. అవసరమైన చోట సంబంధిత బ్యాంకు సిబ్బంది, అధికారుల సహకారంతో సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు సమాచారం.

రైతులకు కేవలం భరోసా ఇవ్వడమే కాకుండా, వారి పంట విక్రయాలకు సంబంధించిన చెల్లింపు ఏ దశలో ఉందో స్పష్టంగా తెలియజేయడం ముఖ్యం. నగదు ఇప్పటికే మరో ఖాతాలో జమైందా? చెల్లింపు ప్రక్రియలో ఉందా? సాంకేతిక కారణాలతో విఫలమైందా? అనే అంశాలను ఒక్కొక్క రైతు వారీగా పరిశీలిస్తే సమస్యకు సమగ్ర పరిష్కారం లభించే అవకాశం ఉంటుంది.

ఈ క్రమంలో ఐకేపీ సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండి వివరాలు సేకరించడం, సంబంధిత అధికారుల దృష్టికి సమస్యలను తీసుకెళ్లడం ప్రాధాన్యం సంతరించుకుంది. రైతులు అనవసర ఆందోళనకు గురికాకుండా, తమకు అందాల్సిన నగదు స్థితిగతులను తెలుసుకునేలా సహకరించడం అవసరమని స్థానికంగా అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఆరోపణలకు తావులేకుండా చెల్లింపులపై స్పష్టత ఇవ్వాలి

ఇటీవల జొన్న కొనుగోళ్లకు సంబంధించిన చెల్లింపులపై కొన్ని ఆరోపణలు, సందేహాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో, ప్రతి లావాదేవీకి సంబంధించిన వాస్తవాలను పారదర్శకంగా వెల్లడించాల్సిన అవసరం ఉంది. రైతుల ఖాతాల్లో నగదు కనిపించకపోవడాన్ని బట్టి చెల్లింపులు జరగలేదని వెంటనే నిర్ణయించలేం. అదే సమయంలో ఆధార్ అనుసంధానం కారణంగానే సమస్య ఏర్పడిందని నిర్ధారించాలన్నా, బ్యాంకు లావాదేవీల ఆధారాలు అవసరం.

అందువల్ల కొనుగోలు కేంద్రంలో జొన్నలు విక్రయించిన రైతుల వివరాలు, విక్రయించిన పరిమాణం, చెల్లించాల్సిన మొత్తం, చెల్లింపు జరిగిన తేదీ, నగదు జమ అయిన బ్యాంకు ఖాతా వంటి అంశాలను సంబంధిత రికార్డులతో సరిపోల్చాలి. నగదు జమ అయినట్లు నిర్ధారణ అయితే రైతుకు తగిన ఆధారాలతో వివరించాలి. చెల్లింపు విఫలమైతే లేదా ఇంకా పెండింగ్‌లో ఉంటే, దానికి గల కారణాన్ని గుర్తించి తదుపరి చర్యలు చేపట్టాలి.

ఈ విధమైన పారదర్శకత వల్ల రైతుల్లో నెలకొన్న సందేహాలు తగ్గడంతో పాటు, కొనుగోలు కేంద్రాలపై నమ్మకం మరింత బలపడే అవకాశం ఉంటుంది. సమస్య పరిష్కారంలో సంబంధిత సిబ్బంది సమన్వయంతో పనిచేయడం కూడా కీలకం.

రైతులకు అందాల్సిన సొమ్ముపై బాధ్యతాయుతమైన చర్యలు అవసరం

పల్సి గ్రామంలో జొన్నలు విక్రయించిన రైతులందరి చెల్లింపు వివరాలను సమగ్రంగా పరిశీలించి, ఎవరి ఖాతాలో ఎంత నగదు జమ అయిందనే విషయాన్ని స్పష్టంగా తెలియజేయాలని రైతులు కోరుతున్నారు. ఆధార్‌తో అనుసంధానమైన మరో ఖాతాలో నగదు జమై ఉంటే ఆ వివరాలను ధృవీకరించాలి. నగదు జమ కాని రైతుల విషయంలో సంబంధిత బ్యాంకు, కొనుగోలు కేంద్రం, చెల్లింపుల వ్యవస్థకు సంబంధించిన అధికారుల సమన్వయంతో సమస్యను పరిష్కరించాలి.

అలాగే రైతులు తమ బ్యాంకు ఖాతా వివరాలను పరిశీలించుకోవడం, అవసరమైతే బ్యాంకును సంప్రదించి ఆధార్ ఆధారిత చెల్లింపులకు అనుసంధానమైన ఖాతా వివరాలను తెలుసుకోవడం ఉపయోగకరంగా ఉంటుంది. బ్యాంకు పాస్‌బుక్, స్టేట్‌మెంట్ లేదా అధికారిక లావాదేవీ వివరాల ఆధారంగా నగదు జమను నిర్ధారించుకోవాలి. ఆధార్ నంబర్లు, బ్యాంకు ఖాతా వివరాలు వంటి వ్యక్తిగత సమాచారాన్ని బహిరంగంగా పంచుకోకుండా జాగ్రత్తలు పాటించాలి.

మొత్తంగా, పల్సి గ్రామంలో జొన్నల విక్రయ చెల్లింపులకు సంబంధించి తలెత్తిన సమస్య రైతుల దృష్టిలో ప్రాధాన్యమైన అంశంగా మారింది. ఈ నేపథ్యంలో ఐకేపీ సీసీ విట్టల్, ధడవాయి విలాస్, ఆపరేటర్ భోజన్న చేస్తున్న ప్రయత్నాలు రైతులకు సహాయకరంగా నిలుస్తున్నాయి. అయితే సమస్య పూర్తిగా పరిష్కారమైందని చెప్పాలంటే ప్రతి రైతుకు సంబంధించిన చెల్లింపు వివరాలు ధృవీకరించబడాలి. రైతులకు రావాల్సిన సొమ్ము సకాలంలో అందేలా చర్యలు తీసుకోవడంతో పాటు, చెల్లింపులపై నెలకొన్న సందేహాలకు ఆధారాలతో కూడిన స్పష్టత ఇవ్వడం సంబంధిత అధికారుల బాధ్యతగా నిలుస్తోంది.

పోలీస్ ఫ్లాగ్ డే సందర్భంగా అమరవీరుల త్యాగాలను ప్రజలకు గుర్తుచేస్తూ

- రక్తదానానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు.
- రక్తదానం ప్రాణదానంతో సమానం
- జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ఐపీఎస్

ప్రజా వాణి,వికారాబాద్ జిల్లా, అక్టోబర్ 28: పోలీస్ ఫ్లాగ్ డే కార్యక్రమాల్లో భాగంగా విధి నిర్వహణలో తమ ప్రాణాలను త్యాగం చేసిన పోలీస్ అమరవీరులకు ఘన నివాళులర్పిస్తూ వికారాబాద్ జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో వికారాబాద్ పట్టణంలోని కొండ బాలకృష్ణారెడ్డి ఫంక్షన్ హాల్‌లో భారీ ఎత్తున మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా,ఐపీఎస్ ఈ కార్యక్రమంలో పాల్గొని రక్తదాన శిబిరాన్ని పరిశీలించి,రక్తదానం చేస్తున్న దాతలను అభినందించారు.

సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణ,ప్రజల ప్రాణాలు,ఆస్తుల రక్షణ కోసం విధులు నిర్వర్తిస్తూ అమరులైన పోలీసు వీరుల త్యాగాలను స్మరించుకోవడం,వారి ఆశయాలకు అనుగుణంగా సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని జిల్లా పోలీస్ శాఖ పేర్కొంది. పోలీస్ ఫ్లాగ్ డే సందర్భంగా అమరవీరుల త్యాగాలను ప్రజలకు గుర్తుచేస్తూ,ఆపదలో ఉన్నవారికి ప్రాణదానం చేసే రక్తదానం వంటి సేవా కార్యక్రమాల ద్వారా సమాజానికి ఉపయోగపడేలా ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా,ఐపీఎస్ మాట్లాడుతూ,విధి నిర్వహణలో తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ప్రజల రక్షణ కోసం పోరాడి అమరులైన

పోలీసు వీరుల త్యాగాలు వెలకట్టలేనివని అన్నారు. వారి త్యాగాలను స్మరించుకోవడం అంటే కేవలం నివాళులు అర్పించడం మాత్రమే కాదని, వారు ఆశించిన సురక్షితమైన,శాంతియుతమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా కృషి చేయాలని సూచించారు. రక్తదానం ఒక గొప్ప మానవతా సేవ అని, ప్రమాదాలు, అత్యవసర వైద్య పరిస్థితులు, శస్త్రచికిత్సలు,ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న రోగులకు సకాలంలో రక్తం అందించడం ద్వారా వారి ప్రాణాలను కాపాడవచ్చని ఎస్పీ పేర్కొన్నారు. ఒక వ్యక్తి చేసే రక్తదానం అవసరంలో ఉన్నవారికి జీవించే అవకాశాన్ని కల్పిస్తుందని,ఆరోగ్య పరిస్థితులు అనుకూలంగా ఉన్న ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. పోలీస్ ఫ్లాగ్ డే కార్యక్రమాల ద్వారా పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకోవడంతో పాటు, ప్రజల్లో సామాజిక బాధ్యత, సేవాభావం, మానవతా విలువలను పెంపొందించడమే లక్ష్యమని తెలిపారు. పోలీస్ శాఖ ప్రజల భద్రతకే కాకుండా,ప్రజల సంక్షేమం కోసం కూడా నిరంతరం కృషి చేస్తుందని స్పష్టం చేశారు. ఈ మెగా రక్తదాన శిబిరంలో వైద్యులు,వైద్య సిబ్బంది రక్తసేకరణ ప్రక్రియను పర్యవేక్షించగా, వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు,యువత,స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు,ఇతర రక్తదాతలు ఉత్సాహంగా పాల్గొన్నారు. రక్తదాతలకు అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహిస్తూ, వైద్యుల పర్యవేక్షణలో రక్తసేకరణ చేపట్టారు. కార్యక్రమానికి హాజరైన దాతలు స్వచ్ఛందంగా రక్తదానం చేసి మానవతా సేవలో భాగస్వాములయ్యారు. ఈ సందర్భంగా రక్తదానం చేసిన వారిని జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించి,వారికి ప్రశంసాపత్రాలు అందజేశారు. అలాగే రక్తదాన శిబిరం విజయవంతం కావడానికి సహకరించిన వైద్యులు, వైద్య సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, విద్యార్థులు, యువతకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మొత్తం 467 యూనిట్ల రక్తాన్ని సేకరించడం జరిగింది. ఈ రక్తదాన శిబిరంలో రెడ్ క్రాస్,తలసేమియా మరియు సికిల్ సెల్ సొసైటీ ప్రతినిధులతో పాటు, వికారాబాద్ ప్రభుత్వ ఆసుపత్రి మరియు తాండూరు ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది పాల్గొని సహకరించారు. ఇట్టి కార్యక్రమం లో జిల్లా అదనపు ఎస్పీ శ్రీ రాజేష్ మీనా ఐపిఎస్, వికారాబాద్ డిఎస్పి అంజయ్య,ఏఆర్ డిఎస్పి వీరేష్,వికారాబాద్ టౌన్ ఇన్స్పెక్టర్ రఘు కుమార్, మోమిన్ పేట్ సిఐ వెంకట్, ధరూర్ సిఐ రఘు రాములు, తాండూర్ ఇన్స్పెక్టర్ పరమేశ్వర్,కరణ్ కోట్ సిఐ ప్రవీణ్ కుమార్, ఎస్ఐ లు, సిబ్బంది తదితరులు పాల్గొనడం జరిగింది.

ఘనంగా ఐఎఫ్‌డబ్ల్యూజే 76వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

- జర్నలిస్టుల హక్కుల పరిరక్షణకు ఐఎఫ్‌డబ్ల్యూజే నిరంతర పోరాటం
- కేక్ కట్ చేసి వేడుకల్లో పాల్గొన్న కూకట్‌పల్లి టీడబ్ల్యూజేఎఫ్ అధ్యక్షుడు ఎర్ర యాకయ్య

కుత్బుల్లాపూర్, అక్టోబర్ 28 (ప్రజావాణి) ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఐఎఫ్‌డబ్ల్యూజే) 76వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని సూరారం అంబేద్కర్ భవన్‌లో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి సంస్థ ఆవిర్భావ దినోత్సవాన్ని జరుపుకోవడంతో పాటు సీనియర్ జర్నలిస్టులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ఐఎఫ్‌డబ్ల్యూజే రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు మామిడి సోమయ్య, ప్రధాన కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్, కూకట్‌పల్లి టీడబ్ల్యూజేఎఫ్ అధ్యక్షుడు ఎర్ర యాకయ్య, ప్రధాన కార్యదర్శి నాగుల అంజిబాబు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎర్ర యాకయ్య మాట్లాడుతూ.. 1950 అక్టోబర్ 28న న్యూఢిల్లీలో స్థాపించబడిన ఐఎఫ్‌డబ్ల్యూజే, స్వతంత్ర భారతదేశంలో మీడియా ఉద్యోగుల హక్కుల పరిరక్షణ కోసం ఏర్పాటైన తొలి ట్రేడ్ యూనియన్లలో ప్రముఖ స్థానాన్ని సంపాదించుకుందని పేర్కొన్నారు. జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ, వేతనాల సవరణ, ఉద్యోగ భద్రత, మెరుగైన పని పరిస్థితుల

కల్పన కోసం సంస్థ దశాబ్దాలుగా నిరంతరం పోరాటం సాగిస్తోందని తెలిపారు. దేశవ్యాప్తంగా జర్నలిస్టులను ఏకతాటిపైకి తీసుకువస్తూ వారి సమస్యల పరిష్కారానికి ఐఎఫ్‌డబ్ల్యూజే కృషి చేస్తోందని అన్నారు. వేతన బోర్డులు, ప్రెస్ కౌన్సిల్, అక్రిడిటేషన్ కమిటీలు, మీడియా సంప్రదింపుల కమిటీల్లో సంస్థ ప్రతినిధులకు ప్రాతినిధ్యం లభించడం జర్నలిస్టుల సమస్యల పరిష్కారంలో సంస్థ పోషిస్తున్న కీలక పాత్రకు నిదర్శనమని పేర్కొన్నారు.

జర్నలిస్టుల పని గంటలు, సేవా పరిస్థితుల మెరుగుదల, వేతనాల సవరణ, పత్రికా స్వేచ్ఛ పరిరక్షణ వంటి అంశాల్లో ఐఎఫ్‌డబ్ల్యూజే చారిత్రక పాత్ర పోషించిందని తెలిపారు. గత 75 ఏళ్లుగా సాగించిన ఉద్యమాలు జర్నలిస్టుల హక్కుల సాధనకు బలమైన

పునాది వేశాయని వివరించారు. భవిష్యత్తులోనూ జర్నలిస్టుల సంక్షేమం, వృత్తిపరమైన అభివృద్ధి, ఉద్యోగ భద్రత కోసం ఐక్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ వేడుకల్లో మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి గడ్డమీద అశోక్, చైతన్య రెడ్డి, కార్యవర్గ సభ్యులు సుజాత, ఉజ్వల రెడ్డి, శివ, విష్ణుమూర్తి, పి. సురేష్, రాజ్‌కుమార్ యాదవ్‌తో పాటు పలువురు జర్నలిస్టులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

జనరల్ న్యూస్

తోటి జర్నలిస్ట్ మిత్రుడి కుటుంబానికి జర్నలిస్టుల అండ

- మరణించిన జర్నలిస్టు కుటుంబానికి అండగా నిలబడడం అభినందనీయం..
- డిపిఆర్ఓ పి రాజేంద్రప్రసాద్,
- కష్టకాలంలో జర్నలిస్టులు ఐక్యంగా ఉండాలి.
- పెద్దవంగర ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కుమ్మరి రామ్మూర్తి,
- 1,77,000 రూపాయల ఆర్థిక సహాయం, గ్రామ ప్రజలు, మిత్రులు, జర్నలిస్టులతో కలిసి కుటుంబ సభ్యులకు అందజేత

పెద్దవంగర అక్టోబర్ 28 ప్రజావాణి: విధి నిర్వహణలో లేదా ఆకస్మికంగా మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు తోటి జర్నలిస్టులు, గ్రామ ప్రజలు అండగా నిలవడం ఎంతో అభినందనీయమని జిల్లా పౌర సంబంధాల అధికారి పి. రాజేంద్రప్రసాద్ అన్నారు.బుధవారం మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలంలో గంట్లకుంట గ్రామానికి చెందిన జర్నలిస్ట్ చింతల ఐలయ్య ఈ మధ్యనే మరణించగా వారి కుటుంబాన్ని పరామర్శించి గ్రామ ప్రజలు, తోటి జర్నలిస్టులు, మిత్రులు, సంఘాలు, వాట్సాప్ గ్రూపుల సభ్యులు అందరూ కలిసి సేకరించిన లక్ష 77వేలు రూపాయల ఆర్థిక సహాయాన్ని స్థానిక సర్పంచ్ పాయిలి యాకలక్ష్మి జర్నలిస్టులు, గ్రామస్తులచే బాధితుడి కుటుంబ సభ్యులకు అందజేశారు.

1. బెస్ట్ ఫ్రెండ్స్ సొసైటీ -- రూ.46,000/-
2. ఫ్రెండ్లీ కేర్ ఫౌండేషన్ -- రూ.10,500/-
3. SSC 2007--08 బ్యాచ్ మిత్రులు -- రూ.36,000/-
4. గంట్లకుంట సూపర్ కింగ్స్ వాట్సాప్ గ్రూప్ సభ్యులు -- రూ.22,500/-
5. పెద్దవంగర జర్నలిస్టులు -- రూ.38,500/-
6. గంట్లకుంట 7వ తరగతి మిత్రులు -- రూ.23,700/-

ఈ సందర్భంగా డిపిఆర్ఓ పి. రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ.. ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు సమాజ అభివృద్ధి కోసం కృషి చేయాలని, యువత , ప్రజలు విలువలతో కూడిన మెరుగైన సమాజ స్థాపన కోసం ఉపయోగపడే మంచి వార్తలు సేకరించి ప్రజలకు అందించాలన్నారు,
ప్రస్తుత సమాజంలో మానవ సంబంధాలకు విలువలు లేకుండా పోతున్నాయని అలాంటి ఈ రోజులలో మరణించిన జర్నలిస్టు కుటుంబానికి గ్రామ ప్రజలు, మిత్రులు, జర్నలిస్టులు కలిసి సహాయం చేయడం ఎంతో అభినందనీయమని ప్రతి ఒక్కరూ సమాజంలో ఇలాంటి కార్యక్రమాలలో పాల్గొని ఇతరులకు ఆదర్శంగా నిలవాలన్నారు. ప్రభుత్వ సూచనల ప్రకారం జిల్లాలోని ప్రతి ఒక్క వర్కింగ్ జర్నలిస్టుల సంక్షేమం కోసం జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ ప్రత్యేక చొరవ తీసుకోవడం జరుగుతుందని అన్నారు.
కష్టకాలంలో ఉన్న కుటుంబానికి
ఈ ఆర్థిక సాయం కొంతైనా ఊరటనిస్తుందని, జర్నలిస్టు సంఘాలు, గ్రామస్థుల ఐక్యత ఇలాంటి సామాజిక కార్యక్రమాల ద్వారా చాటుకోవడం గొప్ప విషయమని కొనియాడారు. భవిష్యత్తులోనూ ఆ కుటుంబానికి అన్ని విధాలా తగిన సహకారం అందిస్తామని భరోసా కల్పించారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కుమ్మరి రామ్మూర్తి,గౌరవ అధ్యక్షులు సదానందం, ఉపాధ్యక్షులు రాయరపు రాజు,జర్నలిస్టులు ,బుచ్చన్న, బాలాజీ, సతీష్, రత్నాకర్ రెడ్డి, సమ్మయ్య,శ్రీకాంత్, మధు మురళి, మల్లేష్ గ్రామస్తులు రాజు, సోమన్న, సతీష్, అశోక్, శ్రీనాథ్, ప్రవీణ్, నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

మాలల రోస్టర్ పాయింట్ సవరించే వరకు ఉద్యమిస్తాం

- మాలల జేఏసీ చైర్మన్ ఆస లక్ష్మణ్.

రాయపోలు అక్టోబర్ 28 (ప్రజావాణి)మాల విద్యార్థులకు, నిరుద్యోగులకు, ఉద్యోగులకు అన్యాయం చేస్తున్న రోస్టర్ పాయింట్ ను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే సవరించి మాలలకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ నవంబర్ 5న భూంపల్లి-అక్బర్ పేట మండల కేంద్రంలో దుబ్బాక నియోజకవర్గ మాలల సదస్సు నిర్వహిస్తున్నట్లు సిద్దిపేట జిల్లా మాల జేఏసీ చైర్మన్ ఆస లక్ష్మణ్,డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ తెలిపారు.బుధవారం రాయపోల్ మండల కేంద్రం అంబేద్కర్ చౌరస్తాలో మాల జేఏసీ ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరణ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టు తీర్పుకు భిన్నంగా ఎస్సీ వర్గీకరణతో మాలలకు అన్యాయం జరుగుతుందన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ఎస్సీల జనాభా లెక్కల సామాజిక స్థితిగతులపై అధ్యయనం చేసి వర్గీకరణ చేయాలని కోర్టు ఆదేశించినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టు ఆదేశానికి భిన్నంగా వ్యవహరించిందన్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం మాలలు 17 లక్షలు ఉంటే 2026 లో 14 లక్షలకు మాలల జనాభాను తగ్గించి చూపడం రాజ్యాంగ వ్యతిరేకామన్నారు. దళితుల స్థితిగతులపై అధ్యయనం చేయకుండానే హడావిడిగా ఎస్సీలను మూడు గ్రూపులుగా వర్గీకరణ చేసి మాలలకు ఐదు శాతం రిజర్వేషన్లు కేటాయించినప్పటికీ రోస్టర్ పాయింట్ లో 22 పాయింటు కేటాయించడం వల్ల మాలలకు ఉన్నత విద్య ఉద్యోగాలలో అవకాశాలు లేకుండా అసలు రిజర్వేషన్లు లేకుండా కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేసిందని ఆరోపించారు.గత సంవత్సర కాలంగా ఇచ్చిన ప్రభుత్వ ఉద్యోగ నియామకాలలో రోస్టర్ పాయింట్ వల్ల ఉద్యోగ అవకాశాలు కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు.రోస్టర్ పాయింట్ 22 నుండి 10 లోపు కేటాయించాలని మాలలు ఆందోళన చేస్తున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం సిగ్గుచేటన్నారు.మాలలు ఉద్యమబాట పట్టక తప్పడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. రోస్టర్ పాయింట్ సవరించే వరకు ఉద్యమిస్తామని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు ఆస బాబు,జక్కుల రాజు,పల్లెటూరు ప్రసాద్,పుట్ట రాజు,సోక్కం స్వామి,దాతార్ పల్లి భాస్కర్,తూర్పు శ్రావణ్,తూర్పు లక్ష్మణ్,దాసరి బాల్ నర్స్,లింగం,స్వామి,కరుణాకర్,నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

ఏఐ యుగంలోనూ అందని 'సిగ్నల్'

- ఏజెన్సీలో డిజిటల్ చీకట్లు!

గంగారం మండల ప్రతినిధి:- అక్టోబర్ 28. (మన సమగ్ర ప్రజావాణి):- మహబూబాబాద్ జిల్లా, నేడు 5గా సాంకేతిక పరిజ్ఞానం తో శరవేగంగా దూసుకెళ్తోంది. ప్రతి చిన్న అవసరానికి డిజిటల్ వేదికలే మూలాధారమవుతున్నాయి. ఇలాంటి పరిస్థితులలో మహబూబాబాద్ జిల్లా, గంగారం మండలంలోని ఏజెన్సీ గ్రామాలలో మాత్రం పరిస్థితి ఇందుకు పూర్తిగా భిన్నంగా ఉంది. అక్కడ కనీస సెల్ ఫోన్ సిగ్నల్ కూడా అందక గిరిజనులు, రైతులు, విద్యార్థులు, నిరుద్యోగులు అనునిత్యం తీవ్ర నరకయాతన అనుభవిస్తున్నారు.సాంకేతిక ఫలాలు అందుబాటులోకి వచ్చాయని సంబరపడాలో...! లేక కనీస కనెక్టివిటీ లేక అల్లాడిపోవాలో ..! తెలియక స్థానిక ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
ఎరువుల బుకింగ్‌కు తిప్పలు రైతులకు తప్పని వెతలు
?ప్రస్తుత కాలంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు, సబ్సిడీలు, విత్తనాలు అలాగే ఎరువుల బుకింగ్ ప్రక్రియలన్నీ ఆన్‌లైన్ల మయమయ్యాయి. ఈ క్రమంలో గంగారం మండల ఏజెన్సీ రైతులకు నెట్‌వర్క్ రహిత వాతావరణం పెద్ద శాపంగా మారింది.
సమయం, ధనం వృథా
నిత్యం పొలం పనుల్లో నిమగ్నమయ్యే రైతులు, ఒక్క ఓటీపీ లేదా ఆన్‌లైన్ బుకింగ్ కోసం కిలోమీటర్ల కొద్దీ ప్రయాణించి పక్క గ్రామాలకో, కొండ గుట్టల పైకో వెళ్లాల్సి వస్తోంది.
విద్యార్థులు, నిరుద్యోగుల భవిష్యత్తుపై 'నెట్‌వర్క్' దెబ్బ
పోటీ పరీక్షల యుగం లో డిజిటల్ కనెక్టివిటీ లేకపోవడం విద్యార్థులు, ఉద్యోగార్థుల జీవితాలతో ఆడుకుంటోంది.
?నోటిఫికేషన్లు, దరఖాస్తుల సమస్య: ప్రభుత్వ ఉద్యోగ ప్రకటనలు, హాల్ టికెట్లు, ఆన్‌లైన్ దరఖాస్తుల గడువు, పరీక్షల ఫలితాలు వంటి కీలక సమాచారాన్ని సమయానికి తెలుసుకోలేకపోతున్నారు.
అవకాశాలు చేజారే ప్రమాదం:
నెట్‌వర్క్ అంతరాయం కారణంగా ఆన్‌లైన్ దరఖాస్తులు సమర్పించే సమయంలో సాంకేతిక లోపాలు తలెత్తి, చివరి క్షణాల్లో అవకాశాలు చేజారి పోతున్నాయని నిరుద్యోగ యువత తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తోంది.
డిజిటల్ విద్యకు దూరం
ఉన్నత విద్యనభ్యసించే విద్యార్థులు ఆన్‌లైన్ క్లాసులు, స్టడీ మెటీరియల్ డౌన్‌లోడ్ చేసుకోవడానికి కొండలు, చెట్లెక్కి సిగ్నల్ వెతుక్కోవాల్సిన దుస్థితి నెలకొంది.
అత్యవసర వేళల్లో ఆపద్బాంధవుడు 108 కీ అందని సిగ్నల్!
సిగ్నల్ కష్టాలు కేవలం సమాచార రంగానికే కాక, ప్రాణాల మీదికి తెచ్చే స్థాయికి చేరుకున్నాయి.
వైద్యసేవల్లో విపరీతమైన జాప్యం: గర్భిణులు, ప్రమాద బాధితులు, తీవ్ర అనారోగ్యానికి గురైన వారికి తక్షణమే 108 అంబులెన్స్ సేవలు అందించాలన్నా ఫోన్ కలవని పరిస్థితి ఉంది.
అధికారుల నిర్లక్ష్యం -- నెరవేరని హామీలు
ఏజెన్సీ ప్రాంతంలో ఏళ్ల తరబడిగా నెలకొన్న ఈ సిగ్నల్ సమస్యపై గిరిజనులు, స్థానిక ప్రజలు పలుమార్లు వినతిపత్రాలు అందించినా ఫలితం లేకుండా పోయింది.
సమస్యల పరిష్కారంలో లిలలసత్వం: టెలికాం సంస్థలు, సంబంధిత ప్రభుత్వ అధికారులు తాత్కాలిక హామీలతో సరిపెడుతున్నారే తప్ప, శాశ్వత పరిష్కారం చూపడం లేదని గిరిపుత్రులు ఆరోపిస్తున్నారు.
డిజిటల్ ఇండియా నినాదం ఎక్కడ?:
ఒకవైపు ప్రతి ఒక్కరికీ డిజిటల్ సేవలు అందిస్తున్నామని చెబుతున్న గంగారం ఏజెన్సీ గ్రామాల పట్ల మౌనం వహించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు.
బాధితుల డిమాండ్:
గంగారం మండలంలోని ఏజెన్సీ గ్రామాల ప్రజల కష్టాలను గుర్తించి, సంబంధిత టెలికాం అధికారులు అలాగే ప్రభుత్వం తక్షణమే స్పందించాలి.
మారుమూల ప్రాంతాల్లో కొత్త సెల్ టవర్లను నిర్మించాలి.
ప్రస్తుతం ఉన్న టవర్ల ప్రసార సామర్థ్యాన్ని పెంచాలి. ?రైతులు, విద్యార్థులు, సామాన్య ప్రజల అత్యవసర సేవల నిమిత్తం మౌలిక నెట్‌వర్క్ సౌకర్యాలను యుద్ధ ప్రాతిపదికన కల్పించాలి. ?డిజిటల్ యుగంలో తమను కూడా భాగస్వాములను చేసి, సమాన అవకాశాలు కల్పించాలని, గంగారం ఏజెన్సీ ప్రాంత ప్రజలు హృదయవిదారకంగా కోరుతున్నారు.

కొండేటి మరియ రాజుకు కీలక బాధ్యతలు

- భారతీయ జనతా పార్టీ (బీజేపీ) శేరిలింగంపల్లి డివిజన్ ఎస్సీ యువ మోర్చా జనరల్ సెక్రటరీగా కొండేటి మరియ రాజు

శేరిలింగంపల్లి,అక్టోబర్28(మన సమగ్ర ప్రజావాణి):- భారతీయ జనతా పార్టీ (బీజేపీ) శేరిలింగంపల్లి డివిజన్ ఎస్సీ యువ మోర్చా జనరల్ సెక్రటరీగా కొండేటి మరియ రాజు నియమితులయ్యారు. నూతన బాధ్యతలు చేపట్టిన సందర్భంగా పార్టీ నాయకులు,మహిళా కార్యకర్తలు, డివిజన్ కార్యకర్తలు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవి కుమార్ యాదవ్,శేరిలింగంపల్లి నియోజకవర్గం మాజీ కార్పొరేటర్ యల్లేష్, శేరిలింగంపల్లి అధ్యక్షులు బీమని కిషోర్ ముదిరాజ్ తదితర నాయకులు కొండేటి మరియ రాజును అభినందించారు.పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానని కొండేటి మరియ రాజు తెలిపారు.యువతను పార్టీ కార్యక్రమాల్లో భాగస్వాములను చేయడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు.బీజేపీ బలోపేతానికి,ఎస్సీ వర్గాల సంక్షేమానికి అంకితభావంతో పనిచేస్తానని పేర్కొన్నారు. నాయకులు మాట్లాడుతూ కొండేటి మరియ రాజు సేవా దృక్పథంతో పనిచేస్తూ యువతను మరింతగా పార్టీ వైపు ఆకర్షించి,పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు.నూతన బాధ్యతలు చేపట్టిన సందర్భంగా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవి కుమార్ యాదవ్,శేరిలింగంపల్లి మాజీ కార్పొరేటర్ యల్లేష్, అధ్యక్షులు బీమని కిషోర్ ముదిరాజ్,మహిళా కార్యకర్తలు,డివిజన్ కార్యకర్తలు తదితరులు ఆయనకు అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు.

నేడు బోడుప్పల్ లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

మేడిపల్లి అక్టోబర్ 28(మన ప్రజావాణి) విద్యుత్ వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సరఫరాను అందించేందుకు బోడుప్పల్ సబ్ స్టేషన్ లో టవర్లపైకి లైన్లను ఏర్పాటు పనుల కారణంగా గురువారం బోడుప్పల్ మల్లికార్జున్ నగర్ ఫీడర్ల పరిధిలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3:00 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు హేమ నగర్ ,నైగూడ, శివాలయం, ప్రభుత్వ పాఠశాల ప్రాంతం,న్యూ రామ్ నగర్,కుమ్మరికుంట వరకు చిలుకానగర్ ట్రాన్స్ కో అసిస్టెంట్ ఇంజినీర్ వినయ్ కుమార్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.ఈ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని వెల్లడించారు.విద్యుత్ సరఫరా అంతరాయం వల్ల కలిగే అసౌకర్యానికి చింతి స్తున్నామని,సరఫరా నిలిచిపోయే సమయంలో వినియోగదారులు సహకరించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని ఏఈ వినయ్ కుమార్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి: ఎమ్మెల్సీ దండే విఠల్

- ఓటరు జాబితాల్లో అవకతవకలపై సమగ్ర విచారణ జరపాలి
- ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతకు చర్యలు తీసుకోవాలి
- ఓటు హక్కు పరిరక్షణకు కాంగ్రెస్ పోరాటం
- పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేయాలి

కొమురంబీమ్, (ప్రజావాణి): ప్రజాస్వామ్య పరిరక్షణ, ఓటు హక్కు రక్షణే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ పోరాడుతోందని ఎమ్మెల్సీ దండే విఠల్ అన్నారు. జిల్లా డీసీసీ కార్యాలయంలో నిర్వహించిన 'ఓటు బచావో--దేశ్ బచావో', సంఘటన్ సృజన్ అభియాన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఓటరు జాబితాల్లో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి, ఎన్నికల వ్యవస్థపై ప్రజలకు విశ్వాసం కల్పించాలని డిమాండ్ చేశారు. ఓటు చోరీ ఆరోపణలకు బాధ్యత వహిస్తూ ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని కాంగ్రెస్ పక్షాన కోరారు. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును కాపాడుకోవడం ప్రతి పౌరుడి బాధ్యతని పేర్కొన్నారు. పార్టీని క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేస్తూ ప్రజాస్వామ్య పరిరక్షణకు నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. జిల్లా డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ఏఐసీసీ అబ్జర్వర్ మెయ్యప్పన్, కోఆర్డినేటర్ శ్రవణ్ రావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మాజీ డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్ రావు, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అనిల్ కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్లు, మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కౌన్సిలర్లు, మండల అధ్యక్షులు, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

శీనన్న జన్మదినోత్సవ వేళ..

- మానసిక దివ్యాంగుల మోముల్లో చిరునవ్వులు
- పెద్ద తండాలోని మెఫీ కేంద్రంలో పండ్ల పంపిణీ

ఖమ్మం బ్యూరో ప్రతినిధి మన ప్రజావాణి రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని కాంగ్రెస్ శ్రేణులు సేవా కార్యక్రమాలు నిర్వహించాయి. ఇందులో భాగంగా బుధవారం పెద్దతండాలోని మెఫీ మానసిక దివ్యాంగుల కేంద్రంలో పండ్లు పంపిణీ చేశారు. ఏదులాపురం మున్సిపల్ ఛైర్‌పర్సన్ పోక బత్తిని అనిత, వైస్ ఛైర్మన్ తమ్మినేని నవీన్, మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బానోత్ కిషోర్ నాయక్ తదితరులు కేంద్రంలోని వారికి పండ్లు అందజేశారు. ఈ సందర్భంగా వారిలో కనిపించిన ఆనందం అందరినీ ఆకట్టుకుంది. కార్యక్రమం నిర్వహించిన వారికి కేంద్రం నిర్వాహకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మంత్రి పొంగులేటి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని టీసీవీ రెడ్డి ఫంక్షన్ హాల్‌లో కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం మంత్రి చేస్తున్న కృషిని నాయకులు కొనియాడారు.ఈ కార్యక్రమాల్లో పలువురు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ కమిటీ బాధ్యులు, అనుబంధ సంఘాల నాయకులు, డివిజన్ అధ్యక్షులు, పార్టీ శ్రేణులు, పొంగులేటి అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కన్నీటి వేళ.. అండగా గాజుల నాని

- కష్టం వస్తే ముందుండే నాయకుడు నాని.
- తండా బిడ్డకు తోడు
- పాపయ్యపల్లికి భరోసా .

ములుగు జిల్లా ప్రతినిధి (ప్రజావాణి):- ములుగు జిల్లా వెంకటాపూర్ రామప్ప మండలం పాపయ్యపల్లి గ్రామానికి చెందిన గ్రామ పంచాయతీ రెండో వార్డు సభ్యులు ధర్మసోత్ ప్రేమ్ సింగ్ తండ్రి సమ్మలాల్ మంగళవారం రాత్రి 7 గంటలకు అకాల మరణం చెందారు.బుధవారం జరిగిన వారి అంతిమయాత్ర, దహన సంస్కారాల్లో బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా వారియర్, సీనియర్ నాయకులు గాజుల నాని పాల్గొని పార్థివ దేహానికి నివాళులర్పించి శ్రద్ధాంజలి ఘటించారు.అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కుటుంబంలో పెద్దదిక్కును కోల్పోయినప్పుడు ధైర్యంగా ఉండాలని, కుటుంబానికి అండగా ఉంటామని మనోధైర్యం కల్పించారు.ఈ కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యులు బానోత్ స్వామి నాయక్, పార్టీ నాయకులు బోడ శ్రీనివాస్, లావుడియా సురేష్, బంధువులు, తండా పెద్దలు, గ్రామ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

సమతుల్యంగా ఎరువులు వాడాలి

- సూరయ్యపల్లిలో "ఖేతీ బచావో అభియాన్"
- వ్యవసాయ సహాయ సంచాలకులు అంజనీ మిశ్రా

మంథని నియోజకవర్గ ప్రతినిధి, అక్టోబర్ 28, ప్రజావాణి: మంథని మండలం సూరయ్య పల్లె గ్రామంలో "ఖేతీ బచావో అభియాన్" కార్యక్రమాన్ని నిర్వహించి రైతులకు నేల ఆరోగ్యం, సమతుల్య ఎరువుల వినియోగం, ప్రకృతి వ్యవసాయం, పంటల వైవిధ్యం మరియు ఎల్‌నినో ప్రభావాలపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయ సంచాలకులు అంజని మిశ్రా మాట్లాడుతూ నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవడం ఎంతో ముఖ్యమని, పంట అవసరాలకు అనుగుణంగా సమతుల్యంగా ఎరువులను వినియోగించడం ద్వారా భూసారం పెంపొందించడంతో పాటు నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చని వివరించారు.మండల వ్యవసాయ అధికారి డాక్టర్ నవ్య మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని, రసాయన ఎరువుల మితిమీరిన వినియోగాన్ని తగ్గించాలని, సాగు ఖర్చులను తగ్గించి రైతులకు మెరుగైన ఆదాయం అందించేందుకు పంటల వైవిధ్యాన్ని పాటించాలని సూచించారు.కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ వినోద్ మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావం వల్ల వ్యవసాయ రంగంలో ఎదురయ్యే అవకాశమున్న సమస్యలను వివరించారు. నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని తక్కువ నీటితో సాగు చేయగల పంటలను ఎంపిక చేసుకోవాలని, రబీ సీజన్‌లో ఆరుతడి పంటలను సాగు చేయడం ద్వారా నీటిని ఆదా చేసుకోవడంతో పాటు పంట నష్టాలను తగ్గించుకోవచ్చని రైతులకు సూచించారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు, ప్రజాప్రతినిధులు, మహిళా రైతులు పాల్గొన్నారు.

పోలీస్ విధులపై విద్యార్థులకు అవగాహన

- చింతలమానేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఓపెన్‌హౌస్ కార్యక్రమం
- పోలీసుల విధులు, పనితీరుపై అవగాహన
- స్టేషన్ రికార్డుల నిర్వహణపై వివరాలు

చింతలమానేపల్లి, (ప్రజావాణి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఓపెన్‌హౌస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై కమలాకర్ పోలీసుల విధులు, పనితీరు, ప్రజలకు అందించే సేవల గురించి వివరించారు. పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించే రికార్డులను విద్యార్థులకు పరిచయం చేసి, పోలీస్‌శాఖ పనితీరుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బందితోపాటు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎడ్ల తిరుపతి, ఉపాధ్యాయుడు రవి పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ట్రాన్స్ఫార్మర్

చేర్యాల అక్టోబర్ 28 ప్రజావాణి చేర్యాల మండలంలోని ఆకునూరు గ్రామంలో పోల్కమ్మ చెరువు కట్ట ప్రక్కన ఉన్న విద్యుత్ ఎస్ ఎస్ టు ట్రాన్స్ఫార్మర్ ప్రమాదకరంగా ఉండి ఎప్పుడు కూలిపోతుందోనని భయాందోళనలో రైతులు ఆందోళన చెందుతున్నారు ఈ ట్రాన్స్ఫార్మర్ గత 60 , 70 సంవత్సరాల క్రితం ఏర్పాటు చేశారు దీంతో ట్రాన్స్ఫార్మర్ కు ఏర్పాటుచేసిన కరెంటు పోల్స్ మొత్తం సలాకల్ తేలి కూలిపోయే పరిస్థితి నెలకొంది ప్రమాదం జరిగే పరిస్థితి వెంటనే సంబంధిత అధికారులు చొరవ తీసుకొని కొత్త స్తంభాలు ఏర్పాటు చేసి అట్టి ట్రాన్స్ఫార్మర్ బిగించాలని రైతులు కోరుతున్నారు

ఈ నెల 30న చిన్నంబావిలో మండల సర్వసభ్య సమావేశం

- ఉదయం 10.30 గంటలకు సమావేశం.. ప్రజాప్రతినిధులు, అధికారులు, విలేకరులకు ఆహ్వానం

చిన్నంబావి, అక్టోబర్ 28 (ప్రజావాణి): వనపర్తి జిల్లా చిన్నంబావి మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 30వ తేదీ శుక్రవారం ఉదయం 10.30 గంటలకు మండల సర్వసభ్య సమావేశం (జనరల్ బాడీ మీటింగ్) నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. మండల స్పెషల్ ఆఫీసర్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి మండల పరిధిలోని అన్ని గ్రామాల ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, పత్రికా విలేకరులు హాజరుకావాలని కోరారు. మండల పరిధిలోని గ్రామాలకు సంబంధించిన అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సమస్యలు, వివిధ శాఖల పనితీరు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు వంటి అంశాలపై సమావేశంలో చర్చించే అవకాశం ఉంది. ఆయా శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పాల్గొని మండల అభివృద్ధికి సహకరించాలని కోరారు. కావున మండల పరిధిలోని అన్ని గ్రామాల ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, పత్రికా విలేకరులు నిర్ణీత సమయానికి సమావేశానికి హాజరుకావాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

ఐదవ రోజు జోరుగా పట్టబద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమం

మల్కాజిగిరి ప్రతినిధి (ప్రజావాణి అక్టోబరు 28) మహబూబ్ నగర్, హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలకు త్వరలో జరగబోయే పట్టభద్రుల ఎన్నికల నేపథ్యంలో అర్హులైన పట్టభద్రులు ఓటరు జాబితాలో తమ ఓటును నమోదు చేసుకోవాలని గౌతమ్ నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్ పిలుపునిచ్చారు . మల్కాజిగిరి శాసనసభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఇన్చార్జి నందికంటి శ్రీధర్ ఆదేశాల మేరకు గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని మల్లికార్జున నగర్ ఫ్రెండ్స్ అసోసియేషన్ గ్రౌండ్ సమీపంలో ఓటర్ బుధవారం ఐదవ రోజు రోజు పట్టభద్రుల ఓటరు నమోదు కేంద్రాన్ని ఆమె ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలని పత్రాలను సైతం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మేకల రామ్ యాదవ్ మాట్లాడుతూ ఇంకా పది రోజులే గడువు ఉందని అర్హులైన పట్టభద్రులు ఓటర్ జాబితాలో పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సిద్ది రాములు,బైరు అనిల్ కుమార్,మర్రి శ్రీను,శంకర్,మల్లేష్,దత్తు,మణికంఠ,మౌనిక తదితరులు పాల్గొన్నారు.

చేపూర్‌లో సీఐ పల్లె నిద్ర

- గ్రామమంతా పర్యటించి క్షేత్రస్థాయి పరిస్థితుల పరిశీలన

ఆర్మూర్ టౌన్, అక్టోబర్ 28 (మన సమగ్ర ప్రజావాణి): గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు చేరువగా ఉంటూ, క్షేత్రస్థాయిలో నెలకొన్న పరిస్థితులను స్వయంగా తెలుసుకునే కార్యక్రమంలో భాగంగా ఆర్మూర్ సీఐ కొండి చంద్రశేఖర్ రెడ్డి మంగళవారం చేపూర్ గ్రామంలో పల్లె నిద్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ సారంగి శాంతి కుమార్‌తో కలిసి సీఐ గ్రామంలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. గ్రామంలోని పరిస్థితులను స్వయంగా పరిశీలించడంతో పాటు, స్థానిక సమస్యలు, ప్రజల పరిస్థితులపై సర్పంచ్‌ను అడిగి తెలుసుకున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పోలీసుల పర్యటన ద్వారా ప్రజలతో మమేకమై, స్థానిక పరిస్థితులను క్షేత్రస్థాయిలో తెలుసుకోవడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ వి. రజినీకాంత్, గ్రామ పోలీస్ అధికారి రాములు, ఉపసర్పంచ్ చేరత్, వీడీసీ అధ్యక్షుడు నాగరాజు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

మధిరలో ఘనంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జన్మదిన వేడుకలు

- కె.వి.ఆర్ హాస్పిటల్ ఆవరణలో ఘనంగా కేక్ కటింగ్, తలసేమియా బాధితుల కొరకు భారీ రక్తదాన శిబిరం
- నిర్వహించిన ప్రముఖ వైద్యులు డాక్టర్ కోట రాంబాబు
- తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ మరియు సమాచార పౌర సంబంధాల శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- జన్మదినాన్ని పురస్కరించుకుని మధిర పట్టణంలోని కె.వి.ఆర్ హాస్పిటల్ ఆవరణలో జన్మదిన వేడుకలు అత్యంత ఘనంగా నిర్వహించబడ్డాయి.

మన ప్రజావాణి మధిర ఆర్ సి అక్టోబర్ 28 మధిర కె.వి.ఆర్ హాస్పిటల్ అధినేత, ప్రముఖ వైద్యులు, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు డాక్టర్ కోట రాంబాబుల ఘనంగా నిర్వహించారు. అనంతరం కె.వి.ఆర్ హాస్పిటల్ ఆవరణలో కేక్ కట్ చేసి, నాయకులంతా ఒకరికొకరు కేక్ తినిపించుకుంటూ "శ్రీనన్న నాయకత్వం వర్ధిల్లాలి" అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కోట రాంబాబు మాట్లాడుతూ.. నిత్యం ప్రజాసేవలో నిమగ్నమవుతూ, ప్రజల్లోంచి వచ్చిన నిజమైన ప్రజా నాయకుడిగా, పేదల పెన్నిధిగా నిలిచిన పొంగులేటి శ్రీనివాసరెడ్డి రాష్ట్రాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. ప్రతి ఇంట్లో పెద్ద కొడుకులా నిలిచే సీనన్న మరెన్నో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, భగవంతుడు వారికి సంపూర్ణ ఆయురారోగ్యాలు ప్రసాదించాలని ఆకాంక్షించారు. అనంతరం కె.వి.ఆర్ హాస్పిటల్ నందు తలసేమియా చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన భారీ రక్తదాన శిబిరాన్ని డాక్టర్ కోట రాంబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ కోట రాంబాబు మరియు ఆయిలూరి వెంకటేశ్వర్ రెడ్డి స్వయంగా రక్తదానం చేసి యువతలో గొప్ప ఉత్సాహాన్ని నింపారు. స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేసిన యువకులను, కాంగ్రెస్ శ్రేణులను నేతలు స్వయంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం ట్రస్ట్ బోర్డ్ మాజీ చైర్మన్ & డీసీసీబీ డైరెక్టర్ అయిలూరి వెంకటేశ్వర్ రెడ్డి ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్ రెడ్డి మధిర టౌన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు దేవిశెట్టి రంగారావు ఎర్రుపాలెం మాజీ జెడ్పీటీసీ అంకశాల శ్రీనివాసరావు మధిర మాజీ ఎంపీపీ ఎర్రగుంట రమేష్, మధిర మార్కెట్ యార్డ్ మాజీ వైస్ చైర్మన్ శీలం వీరవెంకటరెడ్డి, అమరవాది సత్యనారాయణరెడ్డి తక్కెళ్ళపాడు గ్రామ సర్పంచ్ ముక్కర రామకృష్ణారెడ్డి లక్ష్మీపురం గ్రామ సర్పంచ్ తక్కళ్ళపల్లి నాగిరెడ్డి , సిద్దినేనిపురం సర్పంచ్ వేంపటి రమేష్ , ఎర్రుపాలెం మాజీ సర్పంచ్ మొగిలి అప్పారావు యాదవ్ రేమిడిచర్ల మాజీ సర్పంచ్ పురుషోత్తమ రాజు మీనవోలు ఉప సర్పంచ్ ముక్కర సందీప్ రెడ్డి, తక్కెళ్ళపాడు మాజీ ఉప సర్పంచ్ కూరపాటి రమేష్ మీనవోలు సొసైటీ అధ్యక్షులు కుడుముల మధుసూదన్ రెడ్డి జిల్లా రజక సంఘం ప్రధాన కార్యదర్శి తలుపుల విజయ్ బాబు , కాంగ్రెస్ పార్టీ నాయకులు అక్కినపల్లి నాగేశ్వరరావు సత్యనారాయణ రాజు బాలకృష్ణ చిలక రాజేంద్ర , యశోద విజయరాణి , మల్లెల లక్ష్మణరావు బుర్రా నారాయణ మారపోగు జమలయ్య , వెంకటేశ్వర్ రెడ్డి , జాన్ రెడ్డి , నారాయణ రెడ్డి , ప్రభాకర్ రావు వెంకటేశ్వరరావు యూత్ కాంగ్రెస్ శ్రేణులు కూరపాటి వరుణ్ , శీలం ప్రసన్నకుమార్ , గద్దల విజయ్ , గుండ్ల రత్న బాబు , శ్రీనివాస్ రెడ్డి , మహిళలు మరియు సీనన్న అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

స్వర్ణ పతకాల వేటలో పోత్కపల్లి పాఠశాల ప్రభంజనం !

- జిల్లాస్థాయి పీఎం శ్రీ క్రీడోత్సవాల్లో ఎనిమిది మంది విద్యార్థులకు బంగారు పతకాలు
- రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విజేతలు.. విద్యార్థులను ఘనంగా సన్మానించిన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు

ఓదెల,పెద్దపల్లి ప్రజావాణి ప్రతినిధి పోత్కపల్లి క్రీడా మైదానంలో అద్భుత ప్రతిభను చాటుతూ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పోత్కపల్లి విద్యార్థులు విజయదుందుభి మోగించారు. జిల్లాస్థాయి పీఎం శ్రీ పాఠశాలల క్రీడోత్సవాల్లో ఎనిమిది మంది విద్యార్థులు బంగారు పతకాలు సాధించి రాష్ట్రస్థాయి పీఎం శ్రీ క్రీడా పోటీలకు ఎంపికైన పాఠశాల కీర్తి ప్రతిష్టలను మరింత ఇనుమడింపజేశారు. విద్యార్థులు సాధించిన ఈ అసాధారణ విజయం పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, గ్రామస్తుల్లో ఆనందాన్ని నింపింది. ఒకేసారి ఎనిమిది మంది విద్యార్థులు స్వర్ణ పతకాలు సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించడం పాఠశాల క్రీడా ప్రతిభకు నిదర్శనంగా నిలిచింది. విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికితీసి, వారిని సరైన మార్గంలో నడిపిస్తే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని పోత్కపల్లి పాఠశాల విద్యార్థులు తమ విజయంతో నిరూపించారు. జిల్లాస్థాయి పీఎం శ్రీ క్రీడోత్సవాల్లో విద్యార్థులు తమ ప్రతిభ, పట్టుదల, క్రమశిక్షణతో పోటీల్లో రాణించి బంగారు పతకాలను కైవసం చేసుకున్నారు. ప్రత్యర్థులకు దీటుగా నిలుస్తూ తమలోని క్రీడా సామర్థ్యాన్ని చాటిన విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం పాఠశాలకు గర్వకారణంగా మారింది. క్రీడల్లోనూ చదువుతో సమానంగా రాణించ విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధిలో క్రీడలు కీలక పాత్ర పోషిస్తాయి. చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ కనబరిచే విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకునే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. క్రీడలు శారీరక దృఢత్వాన్ని పెంపొందించడంతో పాటు మానసిక స్థైర్యం, క్రమశిక్షణ, సమయపాలన, ఆత్మవిశ్వాసం, ఓటమిని అంగీకరించే మనోధైర్యాన్ని అలవర్చుతాయి. ఈ లక్షణాలను అలవరుచుకుంటూ పోత్కపల్లి పాఠశాల విద్యార్థులు జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపిక కావడం అభినందనీయమని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. విద్యార్థులు సాధించిన ఈ విజయం వెనుక వారి నిరంతర సాధన, కఠోర శ్రమ, క్రీడల పట్ల ఆసక్తి, ఉపాధ్యాయుల ప్రోత్సాహం కీలకంగా నిలిచాయి. విద్యార్థుల్లోని ప్రతిభను గుర్తించి వారికి తగిన శిక్షణ, మార్గదర్శకత్వం అందించడం ద్వారా మంచి ఫలితాలను సాధించవచ్చని ఈ విజయం మరోసారి నిరూపించింది. విజేతలకు ఘన సన్మానం ఎనిమిది మంది విద్యార్థులు బంగారు పతకాలు సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థులను ఘనంగా సన్మానించి అభినందించారు. విద్యార్థులు సాధించిన విజయం స్ఫూర్తిగా భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. రాష్ట్రస్థాయి పోటీల్లోనూ ఇదే పట్టుదలతో పాల్గొని పతకాలు సాధించి పాఠశాలకు, పెద్దపల్లి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ, విద్యార్థులు సాధించిన విజయాలు పాఠశాలకు ఎంతో గర్వకారణమని తెలిపారు. విద్యార్థుల్లో క్రీడా ప్రతిభను ప్రోత్సహించేందుకు పాఠశాల స్థాయిలో నిరంతర కృషి చేస్తామని పేర్కొన్నారు. క్రీడల్లో పాల్గొనడం వల్ల విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, జట్టుగా పనిచేసే సామర్థ్యం, లక్ష్యాన్ని చేరుకునే పట్టుదల పెరుగుతాయని వివరించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యతనిస్తూ ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలని సూచించారు. వ్యాయామ ఉపాధ్యాయులు వేల్పుల హరికృష్ణకు ప్రత్యేక అభినందనలు విద్యార్థులు సాధించిన ఈ విజయంలో కీలక పాత్ర పోషించిన వ్యాయామ ఉపాధ్యాయులు వేల్పుల హరికృష్ణ ను ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థుల్లోని క్రీడా నైపుణ్యాన్ని గుర్తించి, వారిని పోటీలకు సిద్ధం చేయడంలో ఆయన అందించిన శిక్షణ, ప్రోత్సాహం ప్రశంసనీయమని కొనియాడారు. విద్యార్థులు క్రీడల్లో రాణించేందుకు వ్యాయామ ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం ఎంతో అవసరమని,సరైన శిక్షణతో పాటు క్రమశిక్షణ,నిరంతర సాధన ఉంటే మరిన్ని విజయాలు సాధించవచ్చని పేర్కొన్నారు. విద్యార్థులను రాష్ట్రస్థాయి పోటీలకు సిద్ధం చేయడంలో ఆయన చేసిన కృషి అభినందనీయమని తెలిపారు. భవిష్యత్తులోనూ విద్యార్థులు క్రీడారంగంలో ఉన్నత స్థాయికి ఎదిగేలా మరింత ప్రోత్సాహం అందించాలని ఆకాంక్షించారు. రాష్ట్రస్థాయిలోనూ విజయ పరంపర కొనసాగించాలి రాష్ట్రస్థాయిలో బంగారు పతకాలు సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన ఎనిమిది మంది విద్యార్థులు తదుపరి పోటీల్లోనూ ఉత్తమ ప్రతిభ కనబరిచి మరిన్ని పతకాలు సాధించాలని పాఠశాల కుటుంబం ఆకాంక్షిస్తోంది. జిల్లాస్థాయిలో సాధించిన విజయాన్ని స్ఫూర్తిగా తీసుకుని రాష్ట్రస్థాయిలోనూ ఆత్మవిశ్వాసంతో పోటీపడి విజయాలు అందుకోవాలని ఉపాధ్యాయులు సూచించారు. పోత్కపల్లి పాఠశాల విద్యార్థులు సాధించిన ఈ విజయం ఇతర విద్యార్థులకు సైతం స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది. కృషి, పట్టుదల, క్రమశిక్షణ తోడు సరైన మార్గదర్శకత్వం ఉంటే విద్యార్థులు ఉన్నత విజయాలు సాధించవచ్చని ఈ విజయం చాటిచెబుతున్నాయి. ఎనిమిది మంది విద్యార్థులు బంగారు పతకాలు సాధించి రాష్ట్రస్థాయికి ఎంపిక కావడం పాఠశాల క్రీడా ప్రస్థానంలో ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలిచింది. ఎనిమిది మంది విజేతలు.. ఎనిమిది స్వర్ణ పతకాలు.. రాష్ట్రస్థాయిపై కొత్త ఆశలు! పోత్కపల్లి పాఠశాల విద్యార్థులు తమ విజయ పరంపరను రాష్ట్రస్థాయిలోనూ కొనసాగించి మరిన్ని పతకాలు సాధించాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆకాంక్షించారు.

ఎల్‌నినో పై పోరుకు సిద్ధం - మంత్రి సీతక్క

- అలసత్వానికి చెక్ - గ్రామాభివృద్ధే లక్ష్యం. సీతక్క వార్నింగ్.
- ప్రతి పంచాయతీకి పశువుల నీటి తొట్టె - కీలక ఆదేశం.

ములుగు జిల్లా ప్రతినిధి (ప్రజావాణి): —ఎల్‌నినో సవాళ్లను అధిగమించేలా గ్రామాలను ముందస్తుగా సన్నద్ధం చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అధికారులను ఆదేశించారు. బుధవారం బీఆర్‌కే భవన్‌లోని సెర్ప్ కార్యాలయం నుంచి రాష్ట్రవ్యాప్తంగా సర్పంచులు, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఉపాధి హామీ పనులను జల సంరక్షణతో అనుసంధానించి గ్రామీణ కూలీలకు స్థానికంగానే ఉపాధి కల్పించాలని సూచించారు. రాష్ట్రంలోని 12,516 పంచాయతీల్లో పనుల ప్రారంభమయ్యాయని, మిగిలిన 244 చోట్ల వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. ఫామ్ పాండ్లు, ఇంకుడు గుంతలు, చెక్‌డ్యాంలు, చెరువుల పునరుద్ధరణకు ప్రాధాన్యత ఇవ్వాలని, ఈ సందర్భంగా జలనిధి వీడియోను ఆవిష్కరించారు. ప్రతి గ్రామ పంచాయతీలో పశువుల దాహార్తి తీర్చేందుకు నీటి తొట్టెలను నిర్మించాలని, మహిళా సంఘ భవనాలను నవంబర్ 19 నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామాభివృద్ధి పనుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు ములుగు కలెక్టరేట్ నుంచి అదనపు కలెక్టర్ సంపత్ రావు, డీఆర్డీఓ రవీందర్, డీపీఓ వెంకయ్య తదితర అధికారులు పాల్గొన్నారు.

కొత్తపల్లి గోరి పోలీస్ స్టేషన్ పరిధిలో చెంచుపల్లి గ్రామంలో కార్డన్ అండ్ సెర్చ్

కొత్తపల్లి గోరి, మండల రిపోర్టర్ అక్టోబర్ 28(మన ప్రజావాణి):- కొత్తపల్లి గోరి పోలీస్ స్టేషన్ పరిధిలోని చెంచుపల్లి గ్రామంలో ఎస్సై త్రిలోక్‌నాథ్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బందితో కలిసి కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని వాహనాలను తనిఖీ చేసి, సరైన పత్రాలు లేని వాహనాలకు చలాన్లు విధించారు. ప్రతి ఒక్కరూ వాహనాలకు సంబంధించిన అన్ని చట్టబద్ధమైన పత్రాలను కలిగి ఉండాలని ఎస్సై సూచించారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ సురక్షితంగా ప్రయాణించాలని ప్రజలకు అవగాహన కల్పించారు. యువత మాదకద్రవ్యాలకు, గంజాయికి దూరంగా ఉండాలని, వాటి అక్రమ రవాణా, వినియోగం నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. గ్రామంలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణలో ప్రజలు పోలీసులకు సహకరించాలని ఎస్సై త్రిలోక్‌నాథ్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

మునుగోడు పోలీస్ స్టేషన్‌ను వార్షిక తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్..

- నేరాల నియంత్రణకు ముందస్తు చర్యలు చేపట్టాలి.. ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించొద్దు -- జిల్లా ఎస్పీ..

నల్గొండ జిల్లా ప్రతినిధి ప్రజావాణినల్లగొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్ మునుగోడు పోలీస్ స్టేషన్‌ను వార్షిక తనిఖీలో భాగంగా సందర్శించి స్టేషన్ పనితీరు, సిబ్బంది విధుల నిర్వహణ, కేసుల దర్యాప్తు పురోగతిని సమీక్షించారు. పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న ఎస్పీ కి సిబ్బంది గౌరవ వందనం సమర్పించారు. అనంతరం స్టేషన్ పరిసరాలు, రిసెప్షన్ కౌంటర్, రికార్డుల నిర్వహణ, సిబ్బంది విధుల వివరాలు, సీసీ కెమెరాల పనితీరును పరిశీలించి పోలీస్ స్టేషన్ నిర్వహణపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, పోలీస్ స్టేషన్ కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారుడికి న్యాయం జరుగుతుందనే నమ్మకం కల్పించేలా సిబ్బంది పనిచేయాలని సూచించారు. బాధితుల సమస్యలను ఓపికగా విని, ఫిర్యాదులపై చట్టప్రకారం తక్షణ చర్యలు తీసుకోవాలని, ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ పోలీస్ శాఖ ప్రతిష్టను పెంపొందించాలని తెలిపారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో ప్రతి పోలీస్ అధికారి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. మునుగోడు పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన కేసులు, దర్యాప్తులో ఉన్న కేసులు, దీర్ఘకాలంగా పెండింగ్ లో ఉన్న కేసుల వివరాలను సమీక్షించారు. కేసుల దర్యాప్తులో జాప్యం జరగకుండా సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రతి కేసులో శాస్త్రీయ పద్ధతులను అనుసరిస్తూ అవసరమైన సాక్ష్యాధారాలను సేకరించాలని సూచించారు. నేరస్థులకు శిక్ష పడేలా పకడ్బందీగా దర్యాప్తు పూర్తి చేసి, నిర్ణీత గడువులో చార్జిషీట్లు దాఖలు చేయాలని ఆదేశించారు. పెండింగ్ కేసుల పరిష్కారానికి కార్యాచరణ రూపొందించి నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తులపై నిరంతర నిఘా ఉంచాలని, పాత నేరస్తులు, రౌడీషీటర్లు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారి కదలికలను పర్యవేక్షించాలని ఎస్పీ సూచించారు. గ్రామాల్లో బీట్ వ్యవస్థను మరింత బలోపేతం చేస్తూ ప్రజలతో నిరంతరం సంబంధాలు కొనసాగించాలని, అనుమానాస్పద వ్యక్తులు కనిపించినప్పుడు స్థానిక ప్రజలు పోలీసులకు సమాచారం అందించేలా అవగాహన కల్పించాలని తెలిపారు. రాత్రి వేళల్లో పెట్రోలింగ్ ను పటిష్టం చేసి దొంగతనాలు, ఇతర నేరాలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గంజాయి, ఇతర మాదకద్రవ్యాల అక్రమ రవాణా, వినియోగం వంటి కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని, యువత మాదకద్రవ్యాలకు బానిస కాకుండా గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. సైబర్ నేరాల పట్ల ప్రజలను అప్రమత్తం చేస్తూ, ఆన్‌లైన్ మోసాలు, నకిలీ లింకులు, అనుమానాస్పద ఫోన్ కాల్స్ ద్వారా జరిగే మోసాలపై విస్తృతంగా ప్రచారం చేపట్టాలని తెలిపారు. మహిళలు, బాలికల భద్రత విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని, మహిళలపై నేరాలకు సంబంధించిన ఫిర్యాదులపై వెంటనే స్పందించి బాధితులకు అండగా నిలవాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ, హెల్మెట్ ధరించడం,మద్యం సేవించి వాహనాలు నడపకపోవడం, అతివేగాన్ని నియంత్రించడం వంటి అంశాలపై ప్రజలకు వివరించాలని తెలిపారు. పోలీస్ స్టేషన్ లోని క్రైమ్ రికార్డులు, కేసు డైరీలు, జనరల్ డైరీ, ఎఫ్ఐఆర్ రిజిస్టర్లు, కోర్టు కేసుల వివరాలు, ఇతర ముఖ్యమైన రికార్డులను పరిశీలించి వాటిని ఎప్పటికప్పుడు నవీకరించాలని సూచించారు. విధుల నిర్వహణలో క్రమశిక్షణ, సమయపాలన పాటిస్తూ ప్రతి అధికారి తనకు కేటాయించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని తెలిపారునేరాల నివారణ, శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజల సమస్యల సత్వర పరిష్కారమే లక్ష్యంగా మునుగోడు పోలీస్ స్టేషన్ పరిధిలోని అధికారులు, సిబ్బంది సమర్థవంతంగా విధులు నిర్వహించాలని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్ ఆదేశించారు. ఈ వార్షిక తనిఖీలో జిల్లా ఎస్పీ వెంట నల్లగొండ చండూర్ సీఐ రాము, డీసీఆర్‌బీ సీఐ శ్రీను నాయక్, మునుగోడు ఎస్ఐ శోభన్ బాబు, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సబ్సిడీ లో పొద్దుతిరుగుడు మొక్కజొన్న విత్తనాలు పంపిణీ

రాయపోల్ , అక్టోబర్ 28(ప్రజావాణి) సిద్దిపేట జిల్లా రాయపోల్ మండల పరిధిలో 625 కేజీల పొద్దుతిరుగుడు జాతీయ నూనె గింజల ఉత్పత్తి పథకం లో 100% సబ్సిడీలో మరియు మొక్కజొన్న 100 కేజీల విత్తనాలు జాతీయ ఆహార భద్రత మరియు పోషకాహార మిషన్ (చీఖీూచీవీ) పథకంలో 52% సబ్సిడీలో 4 కేజీల బ్యాగ్ రూ.360 సబ్సిడీ (మొత్తం ధర 760)పోను రైతులకు గజ్వేల్ ఏ డి ఏ బాబు నాయక్ రాయిపోల్ సర్పంచ్ మాసంపల్లి రాజు చేతులమీదుగా రైతులకు సరఫరా చేయడం జరిగిందన్నారుబాబు నాయక్ మాట్లాడుతూ యాసంగిలో రైతులు ఎలినినోను దృష్టిలో ఉంచుకొని ఆరుతడి పంటలు ఎంచుకొని సబ్సిడీని వినియోగించుకోవాలి అని సూచించారు. రైతులు వాతావరణ పరిస్థితులను భూగర్భ జలాలను దృష్టిలో ఉంచుకొని యాసంగిలో పంటలు సాగు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఆర్ నరేష్, ఉప సర్పంచ్ రాజు, ఎఎమ్ సి డైరెక్టర్లు మల్లేష్, ఆదిరెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారులు రజిత, శిరీష, మాధవి, స్వర్ణలత , రైతులు పాల్గొన్నారు.

అత్యవసర వైద్య సేవల్లో నిర్లక్ష్యం వహించొద్దు

- గరిడేపల్లిలో 108 అంబులెన్స్‌ను తనిఖీ చేసిన అధికారులు

గరిడేపల్లి, అక్టోబర్ 28 (ప్రజావాణి):అత్యవసర సమయాల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా గరిడేపల్లి మండల కేంద్రంలోని 108 అంబులెన్స్‌ను బుధవారం అధికారులు క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అంబులెన్సులో అందుబాటులో ఉన్న వైద్య పరికరాలు, అత్యవసర చికిత్సకు ఉపయోగించే సామగ్రి, వాటి పనితీరును పరిశీలించారు.తనిఖీల్లో భాగంగా ఆక్సిజన్ సిలిండర్లు, ప్రథమ చికిత్సకు అవసరమైన వైద్య సామగ్రి, రోగుల ప్రాణాలను కాపాడేందుకు ఉపయోగించే అత్యవసర వైద్య పరికరాల పనితీరును అధికారులు పరిశీలించారు. ప్రతి పరికరం ఎల్లప్పుడూ అందుబాటులో ఉండటంతోపాటు, అత్యవసర పరిస్థితుల్లో సక్రమంగా పనిచేసేలా చూసుకోవాలని సిబ్బందికి సూచించారు.ప్రమాదాలు, గుండెపోటు, ఇతర అత్యవసర ఆరోగ్య సమస్యలు ఎదురైనప్పుడు 108 అంబులెన్స్ సేవలు ఎంతో కీలకమని అధికారులు పేర్కొన్నారు. బాధితులకు సకాలంలో స్పందించి, అవసరమైన వైద్య సహాయం అందించడంలో అంబులెన్స్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు.అంబులెన్సులో అవసరమైన మందులు, వైద్య పరికరాలు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని, విధుల నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వకూడదని స్పష్టం చేశారు. నిరంతర తనిఖీల ద్వారా అత్యవసర వైద్య సేవల నాణ్యతను మరింత మెరుగుపరచవచ్చని తెలిపారు.ఈ తనిఖీల్లో క్వాలిటీ హెడ్ ఆఫీస్ అధికారి కిషోర్, ఉమ్మడి నల్గొండ జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ ఎస్.కె. సలీం, సూర్యాపేట జిల్లా అధికారి ఎల్లావుల మధు, అంబులెన్స్ సిబ్బంది పంగ ముత్తయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేలతల్లి పులకింత.. పల్లెల్లో ప్రగతి కాంతులు!

- కేసముద్రం మండలంలో సరికొత్త చరిత్ర సృష్టించిన 'సమీకృత' గ్రామ సభలు... ఒక్కటైన రైతన్నలు, మహిళా లోకం!

కేసముద్రం అక్టోబర్ 28,ప్రజావాణి.పచ్చని పొలాలు.. కష్టపడే చేతులు.. కానీ, ఏటా పెరిగిపోతున్న పెట్టుబడులు, కలిసిరాని దిగుబడులతో సతమతమవుతున్న రైతన్నల జీవితాల్లో సరికొత్త ఆశల పొద్దు పొడిచింది.మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలంలోని కాట్రపల్లి, అర్పణపల్లి, భవానిగడ్డ తండా గ్రామాలు సరికొత్త వ్యవసాయ విప్లవానికి వేదికలయ్యాయి.అక్టోబర్ 28న ఈ మూడు గ్రామాల్లో సమీకృత వ్యవసాయ క్లస్టర్ సమూహం ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామ సభలు పల్లెల్లో ఒక కొత్త ఉత్సాహాన్ని, ఆలోచనను రేకెత్తించాయి.ఇవి కేవలం కుర్చీలు వేసి, మైకులు పట్టి మాట్లాడే రొటీన్ సభలు కావు. పల్లె ముఖచిత్రాన్ని మార్చేందుకు, రైతన్నను రాజును చేసేందుకు జరిగిన మేధోమథనాలు!సభలో అధికారులు, నిర్వాహకులు చెప్పిన మాటలు ప్రతి ఒక్కరినీ ఆలోచనలో పడేశాయి. సంప్రదాయ వ్యవసాయానికి ఆధునికతను జోడిస్తే అద్భుతాలు సృష్టించవచ్చని ఈ సభలు నిరూపించాయి.

నేలకు ఊపిరి – పంటల మార్పిడి: ఏటా ఒకే పంట వేసి భూమిని నిస్సారంగా మార్చవద్దని, పంటల మార్పిడితో నేలతల్లి జీవశక్తిని ఎలా కాపాడుకోవచ్చో రైతన్నలకు కళ్లకూ కట్టినట్లు వివరించారు.

ఆరోగ్య విప్లవం – సేంద్రియ సాగు: కెమికల్స్ వాడకం తగ్గించి, ప్రకృతి ఇచ్చిన సేంద్రియ ఎరువులతో తక్కువ పెట్టుబడితోనే విషరహితమైన, నాణ్యమైన పంటలు పండించే రహస్యాలను పంచుకున్నారు.

బంగారమైన నీటి చుక్క: నీటి కొరతను అధిగమించేందుకు ఆధునిక నీటి పొదుపు పద్ధతులను ఎలా పాటించాలో నేర్పారు.

ఆదాయానికి మరో దారి: కేవలం పంటలపైనే కాకుండా, పశు పోషణ మరియు పెరటి కూరగాయల సాగు ద్వారా నిరంతరం జేబు నిండే అదనపు ఆదాయ మార్గాలను చూపారు.

ఒక్కటైన పల్లె జనం.. గళం విప్పిన మహిళా లోకం!

ఈ సభల ప్రత్యేకత ఏంటంటే.. అధికారులు వేదికపై నుంచి చెప్పడం ఒకెత్తయితే, పల్లె మహిళలు, రైతులు స్వయంగా చర్చల్లోకి రావడం మరో ఎత్తు. ఎపియం కృష్ణమూర్తి, అర్పణపల్లి ఉప సర్పంచ్ రాధిక, సిసిలు నళిని, వెంకటనారాయణ పల్లె అభివృద్ధికి రోడ్ మ్యాప్ ఇస్తుంటే.. క్షేత్రస్థాయిలో మార్పు కోసం తహతహలాడుతున్న విఓఎ లు గంధసిరి, లావణ్య, విమల, నవీన్, స్వాతి లు, గ్రామ సంఘ అధ్యక్షురాలు జ్యోతి, రమ, రజినిలు సభను ముందుండి నడిపించారు.అందరినీ ఆకట్టుకున్న అంశం ఏంటంటే, సభలో కూర్చున్న సంఘ సభ్యులు హసీనా, జానీ బేగం, రమ, ఆమని, సృజన, నవీన, మణెమ్మ, కొమురమ్మ, మౌనిక, యాకమ్మ, లచ్చమ్మ, స్రవంతి, కనకమ్మ తదితరులు కేవలం శ్రోతలుగా మిగిలిపోలేదు.తమ ఇంట్లో, తమ పొలంలో ఎదుర్కొంటున్న కష్టాలను ధైర్యంగా పంచుకున్నారు. కొత్త పద్ధతులను నేర్చుకోవడానికి తామంతా సిద్ధంగా ఉన్నామని చాటిచెప్పారు.

ఐరన్ లేడీ సీతక్క - కన్నీటిలోంచి పుట్టిన కరుణామూర్తి!

- పోరాటమే పునాది. మానవత్వమే ఊపిరి. ప్రజాసేవే పరమావధి.

ములుగు జిల్లా ప్రతినిధి (ప్రజావాణి):-పసితనంలోనే కష్టాలతో పరిచయం... బాల్యమంతా కన్నీళ్లతో సహవాసం... కన్నీటిని కసిగా మార్చుకుని, కష్టాలనే మెట్లుగా మలుచుకుని, అడుగడుగునా అడ్డంకులను దాటిన అగ్నిపర్వతం... మన సీతక్క.ఆమె కథ ఒక సాధారణ కథ కాదు, ఆమె జీవితం ఓ అసాధారణ పోరాటం!ఆమె సహజత్వమే సౌందర్యం ఆమె సహనమే సముద్రం,ఆమె ఓపికే పర్వతం.ఆమె పోరాటమే చరిత్రకు పాఠం.పదవులు వచ్చాయని పొంగిపోలేదు, ప్రశంసలు వచ్చాయని మురిసిపోలేదు... మట్టి మనుషుల మధ్య మమేకమై, మానవత్వపు చిరునవ్వులు పంచే మహోన్నత మనసు... మన సీతక్క.కరోనా కాలంలో, కన్నీళ్లకు కవచమైన కరుణామూర్తి,

ప్రపంచమే ప్రాణభయంతో వణికిన వేళ, ఆకలి కేకలు ఆకాశాన్ని తాకిన వేళ, అభయమిచ్చే ఆపన్నహస్తమై నిలిచింది.అది ప్రచారం కోసం చేసిన సేవ కాదు..పరాయి కన్నీటిని తన కన్నీరుగా భావించిన మమతల మానవత్వం.ఉక్కు సంకల్పం... ఉప్పొంగే మాతృహృదయం!

బయటకు ఉక్కు సంకల్పం... లోపల వెన్నలాంటి హృదయం

అన్యాయంపై అగ్నిజ్వాల అభాగ్యులపై అమ్మ ప్రేమ

సీతక్క అంటే ఓ పేరు కాదు..సహనానికి నిలువెత్తు రూపం!

సీతక్క అంటే ఓ పదవి కాదు... సేవకు సజీవ స్వరూపం.

సీతక్క అంటే ఓ నాయకత్వం కాదు. నలిగిన జీవితాలకు నమ్మకపు దీపం.

చట్టాలపై అవగాహనతోనే హక్కులకు రక్షణ!

- విద్యార్థులు బాధ్యతాయుత పౌరులుగా ఎదగాలి
- ఉచిత న్యాయ సేవలను సద్వినియోగం చేసుకోవాలి: సీనియర్ సివిల్ జడ్జి బి. సౌజన్య
- ముత్తంగి, ఇంద్రేశం గురుకులాల్లో న్యాయ అవగాహన సదస్సులు

పటాన్చెరువు, అక్టోబర్ 28 (ప్రజావాణి): ప్రతి ఒక్కరూ తమ హక్కులు, బాధ్యతలతో పాటు చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని సంగారెడ్డి జిల్లా సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. సౌజన్య సూచించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ముత్తంగి, ఇంద్రేశంలోని మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాసంస్థల్లో న్యాయ అవగాహన కార్యక్రమాలు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆర్థిక పరిస్థితులు న్యాయం పొందేందుకు అడ్డంకి కాకూడదని, అర్హులైన ప్రతి ఒక్కరూ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అందిస్తున్న ఉచిత న్యాయ సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రాజ్యాంగం కల్పించిన హక్కులు, చట్టాల ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. హైకోర్టు న్యాయవాది డాక్టర్ ఐలాపూర్ మాణిక్ యాదవ్ మాట్లాడుతూ చట్టాలపై అవగాహనే హక్కుల పరిరక్షణకు తొలి మెట్టని పేర్కొన్నారు. మహిళల రక్షణ చట్టాలు, పని ప్రదేశాల్లో లైంగిక వేధింపుల నిరోధక చట్టం, బాలల హక్కులు, సైబర్ నేరాల నివారణ, రాజ్యాంగ ప్రాథమిక హక్కులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు చిన్న వయస్సు నుంచే చట్టాలపై అవగాహన పెంచుకుని సమాజంలో బాధ్యతాయుత పౌరులుగా ఎదగాలని పిలుపునిచ్చారు. మహిళలు, బాలల హక్కుల పరిరక్షణతో పాటు బాధితులకు న్యాయ సహాయం అందించడమే ఇలాంటి కార్యక్రమాల ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ ఎస్సై సునీత, సంబంధిత అధికారులు, గురుకుల ప్రధానాచార్యులు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సభ్యులు, పోలీసు సిబ్బంది, కటకం శివ తదితరులు పాల్గొన్నారు.

కరువు మండలాల్లో రైతులకు రుణమాఫీ చేయాలి

- రైతు సంఘం జిల్లా అధ్యక్షులు నెల్లూరి నాగేశ్వరరావు డిమాండ్
- కరువు సహాయక చర్యలు చేపట్టాలి.. కూలీలకు ఉపాధి కల్పించాలి

డోర్నకల్ నియోజకవర్గ ప్రతినిధి , అక్టోబర్ 2, ప్రజావాణి: ఖరీఫ్ సీజన్‌లో వర్షాభావ పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావంతో పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రైతు సంఘం మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు నెల్లూరి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. కరువు ప్రాంతాలుగా గుర్తించిన మండలాల్లో రైతులకు రుణమాఫీ అమలు చేయడంతో పాటు కరువు సహాయక చర్యలు చేపట్టాలని కోరారు.బుధవారం డోర్నకల్ మండలంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దేశానికి అన్నం పెట్టే రైతన్న కష్టాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించాలని అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని కరువు పరిస్థితుల నుంచి రైతులను గట్టెక్కించాలని కోరారు.మహబూబాబాద్ జిల్లాలో కరువు ప్రాంతాలుగా గుర్తించిన డోర్నకల్, కురవి, గూడూరు, నెల్లికుదురు, సీరోల్, కొత్తగూడ, ఇనుగుర్తి మండలాల్లో రైతులకు తక్షణ సహాయం అందించాలని డిమాండ్ చేశారు. పంటలు సాగు చేయలేక, పెట్టుబడులు తిరిగి రాక ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులకు రుణమాఫీ ద్వారా ఊరట కల్పించాలని పేర్కొన్నారు.అదేవిధంగా వ్యవసాయ పనులు లేక ఇబ్బందులు పడుతున్న కూలీలకు ఉపాధి హామీ పనులు కల్పించి, వారి కుటుంబాలకు జీవనాధారం చూపాలని ప్రభుత్వాన్ని కోరారు. కరువు పరిస్థితులపై ప్రభుత్వం తక్షణమే స్పందించి రైతులు, వ్యవసాయ కూలీలను ఆదుకునే చర్యలు చేపట్టాలని నెల్లూరి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు

జవహర్‌నగర్ డంపింగ్ యార్డు తరలింపే లక్ష్యం.. ఈటల రాజేందర్ పాదయాత్రలో వడ్డేపల్లి రాజేశ్వరరావు

- ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పాదయాత్ర.. స్థానికుల ఇబ్బందులపై క్షేత్రస్థాయి పరిశీలన

కూకట్పల్లి :అక్టోబర్ 27 (ప్రజావాణి)జవహర్‌నగర్: జవహర్‌నగర్ డంపింగ్ యార్డును తరలించాలని డిమాండ్ చేస్తూ మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పాదయాత్ర రెండో రోజు కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు పాల్గొన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గానికి చెందిన బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి పాదయాత్రలో పాల్గొని ఈటల రాజేందర్‌కు సంఘీభావం తెలిపారు.డంపింగ్ యార్డు కారణంగా పరిసర ప్రాంతాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకోవడంతో పాటు, వారి ఇబ్బందులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ, స్థానికుల జీవన ప్రమాణాలపై ప్రభావం చూపుతున్న సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన ఈ పాదయాత్రకు వడ్డేపల్లి రాజేశ్వరరావు మద్దతు ప్రకటించారు.

రెండో రోజు పాదయాత్రలో భాగంగా అన్నోజీగూడ, ఘట్కేసర్, యమ్నంపేట్, ఇస్మాయిల్ ఖాన్ గూడ, రాంపల్లి, కరీంగూడ, రాంపల్లి దాయారా, కీసర తదితర ప్రాంతాల్లో పర్యటిస్తూ స్థానికుల సమస్యలను తెలుసుకున్నారు. డంపింగ్ యార్డు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలన్న డిమాండ్‌తో ప్రజల తరఫున పోరాటాన్ని కొనసాగించాల్సిన అవసరాన్ని ఈ సందర్భంగా నాయకులు ప్రస్తావించారు.

ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి నియోజకవర్గ బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని పాదయాత్రకు తమ మద్దతు తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారం, పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా చేపట్టిన ఈ ఉద్యమంలో వడ్డేపల్లి రాజేశ్వరరావు పాల్గొనడం ప్రాధాన్యత సంతరించుకుంది.

కరువు మండలాల జాబితాలో రాయపోల్ మండలం చేర్చకపోవడం చాలా దారుణం..

● రాష్ట్ర యువజననాయకులు రాజిరెడ్డి.

రాయపోల్ అక్టోబర్28(ప్రజావాణి)ప్రభుత్వం ప్రకటించిన కరువు మండలాల జాబితాలో సిద్దిపేట జిల్లాలోని రాయపోల్ మండలానికి చోటు కల్పించకపోవడం పట్ల బీఆర్ఎస్ పార్టీ యువజన విభాగం రాష్ట్ర నాయకులు రాజిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని రైతులు ఎదుర్కొంటున్న వ్యవసాయ సంబంధిత ఇబ్బందులను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకొని, కరువు పరిస్థితులపై సమగ్రంగా పరిశీలన జరపాలని ఆయన డిమాండ్ చేశారు.కరువు ప్రభావంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులకు ప్రభుత్వం అండగా నిలవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలించకుండా కరువు మండలాల జాబితాను ప్రకటించడం వల్ల అర్హులైన రైతులకు నష్టం జరిగే అవకాశం ఉందని అన్నారు.రాయపోల్ మండలంలోని వ్యవసాయ పరిస్థితులను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, నిబంధనల ప్రకారం మండలాన్ని కరువు మండలాల జాబితాలో చేర్చేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. రైతులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం తక్షణమే స్పందించి, సహాయాన్ని అందించాలని కరువు మండల జాబితాలో రాయపోల్ మండలం చేర్చక పోతే అతి త్వరలోనే దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి ఆదేశాల ప్రకారం పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతాం అని బీఆర్ఎస్ పార్టీ యువజన విభాగం రాష్ట్ర నాయకులు రాజిరెడ్డి హెచ్చరించారు..

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటు నమోదుపై పందిరి ఫౌండేషన్ అవగాహన

చిలుకూరు, అక్టోబర్ 28 (ప్రజావాణి): రాబోయే 2027 పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అర్హులైన పట్టభద్రులందరూ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని పందిరి ఫౌండేషన్ చైర్మన్ పందిరి నాగిరెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం చిలుకూరు మండల కేంద్రంలోని స్థానిక గ్రంథాలయంలో ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఓటరు నమోదు అవగాహన కరపత్రాన్ని ఆయన విడుదల చేశారు.ఈ సందర్భంగా నాగిరెడ్డి మాట్లాడుతూ శ్రీ సాయి వికాస్ డిగ్రీ కళాశాల, తేజ ఫార్మసీ కళాశాల విద్యార్థులతో పాటు డిగ్రీ పూర్తి చేసిన అర్హులైన ప్రతి ఒక్కరూ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు కీలకమని, మేధావులు, పట్టభద్రులు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఓటు నమోదు ప్రక్రియకు సంబంధించిన వివరాల కోసం ఎమ్మెస్ కళాశాల కార్యాలయాన్ని సంప్రదించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో పందిరి ఫౌండేషన్ గౌరవ సలహాదారు సెక్ శ్రీనివాసరావు, అధ్యాపకులు గంగాధర్ రావు, అంజయ్య, పిల్లుట్ల కృష్ణ, కొండ నరసింహారావు, రామకృష్ణ, వీరబాబు, విష్ణు, గోవర్ధన్, సిద్ధు తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లి గోరి పోలీస్ స్టేషన్ పరిధిలో చెంచుపల్లి గ్రామంలో కార్డన్ అండ్ సెర్చ్

కొత్తపల్లి గోరి, మండల రిపోర్టర్ అక్టోబర్ 28(మన ప్రజావాణి):- కొత్తపల్లి గోరి పోలీస్ స్టేషన్ పరిధిలోని చెంచుపల్లి గ్రామంలో ఎస్సై త్రిలోక్‌నాథ్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బందితో కలిసి కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని వాహనాలను తనిఖీ చేసి, సరైన పత్రాలు లేని వాహనాలకు చలాన్లు విధించారు. ప్రతి ఒక్కరూ వాహనాలకు సంబంధించిన అన్ని చట్టబద్ధమైన పత్రాలను కలిగి ఉండాలని ఎస్సై సూచించారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ సురక్షితంగా ప్రయాణించాలని ప్రజలకు అవగాహన కల్పించారు. యువత మాదకద్రవ్యాలకు, గంజాయికి దూరంగా ఉండాలని, వాటి అక్రమ రవాణా, వినియోగం నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. గ్రామంలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణలో ప్రజలు పోలీసులకు సహకరించాలని ఎస్సై త్రిలోక్‌నాథ్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

మృతుడి కుటుంబానికి అండగా నిలిచిన కాంటారెడ్డి తిరుపతి రెడ్డి

● మృతి చెందిన వడ్డే ఎల్లప్ప కుటుంబానికి 5 వేల రూపాయల సహాయం

చిన్నశంకరంపేట,అక్టోబర్ 28, మన ప్రజావాణి: చిన్న శంకరంపేట మండలం సూరారం గ్రామంలో వడ్డే ఎల్లప్ప అనారోగ్య కారణంతో మృతి చెందడం జరిగింది. ఇట్టి విషయం స్థానిక బిఆర్ఎస్ నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న మెదక్ బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ రాష్ట్ర నాయకులు రాష్ట్ర నాయకులు కాంటారెడ్డి తిరుపతిరెడ్డి దహన సంస్కారాల నిమిత్తం 5000 రూపాయల ఆర్థిక సహాయం అందించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సంతాపం ప్రకటించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చిలుక నాగరాజు, ఉప సర్పంచ్ రవణబోయిన మల్లేశం, మరియు పంచాయతీ పాలకవర్గ సభ్యులు గ్రామస్తులు ఎక్కడ ఎల్లయ్య పోచయ్య ఎల్లయ్య రాములు యాదగిరి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అర్నబ్ తుఫాన్ బీభత్సం నేలకొరిగిన వరి పంట

చిలుకూరు అక్టోబర్28 (ప్రజావాణి) చిలుకూరు మండల వ్యాప్తంగా అర్నబ్ తుఫాన్ ప్రభావంతో భారీ గాలులు, వర్షాలకు వందలాది ఎకరాల్లో వరి పంట నేలకొరిగింది.కోతకు సిద్ధంగా ఉన్న వరి పంట పూర్తిగా నేలకొరగడంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. చిలుకూరు,బేతవోలు, జెర్రిపోతులగూడెం, నారాయణపురం గ్రామాలలో దాదాపు వందకు పైగా ఎకరాలలో ఇదే పరిస్థితి నెలకొంది. ఎల్ లీనో ప్రభావం ఉండడంతో మోటర్లు సక్రమంగా నడవకపోయినా అష్టకష్టాలు పడి వరి పంట సాగు చేస్తే తీరా పంట చేతికోచ్చే సమయంలో తుపాను ప్రభావంతో పంట నష్టం జరగడంతో అన్నదాతలు ఆందోళనకు గురయ్యారు. పెట్టుబడి పెట్టి సాగు చేసిన కౌలు రైతులకు ఈ నష్టం మరింత భారంగా మారింది పంట నీటిలో మునిగి, రంగు మారి, దిగుబడి తగ్గే ప్రమాదం ఉందన్నారు.తుఫాన్ వల్ల నష్టపోయిన పంటను అధికార యంత్రాంగం ఆదుకోవాలని రైతులు కోరారు.

పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన వశిష్ఠ పాఠశాల విద్యార్థులు

● ఓపెన్ హౌస్ కార్యక్రమంతో పోలీసుల విధులపై అవగాహన

పోత్కపల్లి, అక్టోబర్ 28: ప్రజావాణి ప్రతినిధి:పోలీసుల విధులు, శాంతిభద్రతల పరిరక్షణ, చట్టాల అమలు, ప్రజల రక్షణ వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించే ఉద్దేశంతో నిర్వహించిన ఓపెన్ హౌస్ కార్యక్రమంలో భాగంగా పోత్కపల్లిలోని వశిష్ఠ ఇంగ్లీష్ మీడియం పాఠశాలకు చెందిన 5, 6, 7వ తరగతుల విద్యార్థినీ విద్యార్థులు పోత్కపల్లి పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు.ఈ సందర్భంగా విద్యార్థులు పోలీస్ స్టేషన్‌లోని వివిధ విభాగాలను పరిశీలించి, పోలీసుల విధులు, బాధ్యతలు, ప్రజలకు అందించే సేవల గురించి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదులు వచ్చినప్పుడు వాటిని ఎలా స్వీకరిస్తారు? కేసుల నమోదు ప్రక్రియ ఎలా ఉంటుంది? ప్రజల భద్రత కోసం పోలీసులు ఎలాంటి చర్యలు చేపడతారు? అనే అంశాలపై ఆసక్తిగా వివరాలు తెలుసుకున్నారు.అలాగే సమాజంలో శాంతిభద్రతలను కాపాడటంలో పోలీసుల పాత్ర ఎంత కీలకమో విద్యార్థులకు వివరించారు. చట్టాలను గౌరవించడం, క్రమశిక్షణతో మెలగడం, సమాజంలో బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగడం ప్రతి ఒక్కరి కర్తవ్యమని తెలియజేశారు. అత్యవసర పరిస్థితుల్లో పోలీసుల సహాయం ఎలా పొందాలి, అపరిచిత వ్యక్తుల పట్ల ఎలా అప్రమత్తంగా ఉండాలి, సైబర్ నేరాల బారిన పడకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి అనే అంశాలపై కూడా అవగాహన కల్పించడం ఇటువంటి కార్యక్రమాల ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు.

పాఠశాల స్థాయిలోనే విద్యార్థులకు పోలీస్ వ్యవస్థపై అవగాహన కల్పించడం ద్వారా వారిలో చట్టాల పట్ల గౌరవం, సామాజిక బాధ్యత, క్రమశిక్షణ పెంపొందుతాయని ఉపాధ్యాయులు అభిప్రాయపడ్డారు. పుస్తకాల ద్వారా నేర్చుకునే విషయాలను ప్రత్యక్షంగా పరిశీలించే అవకాశం లభించడంతో విద్యార్థులు ఈ సందర్శన పట్ల ఆసక్తి కనబరిచారు.

ఓపెన్ హౌస్ కార్యక్రమం విద్యార్థులకు విజ్ఞానంతో పాటు సమాజం పట్ల బాధ్యతను పెంపొందించే మంచి అవకాశంగా నిలిచింది. ఇటువంటి కార్యక్రమాలు భవిష్యత్తులో విద్యార్థులు చట్టాలను గౌరవించే ఉత్తమ పౌరులుగా ఎదగడానికి దోహదపడతాయని పలువురు అభిప్రాయపడ్డారు.

పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా దాట్ల శ్రీనివాస్ రక్తదానం

- అమరవీరుల త్యాగాలకు ఘనమైన నివాళి
- ప్రాణాలను కాపాడే మహత్తర సేవలో టీఆర్‌పీ జిల్లా కార్యదర్శి
- రక్తదానం చేయడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత యువతకు పిలుపు
- ఏసీపీ వాసంశెట్టి మాధవి జమ్మికుంట పట్టణ సీఐ రామకృష్ణ గౌడ్ వీణవంక ఎస్సై ఆవుల తిరుపతి రూరల్ సీఐ పులి వెంకట్ ఆధ్వర్యంలో పోలీస్ శాఖ

జమ్మికుంట అక్టోబర్ 28 (ప్రజావాణి)పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో టీఆర్‌పీ జిల్లా కార్యదర్శి దాట్ల శ్రీనివాస్ ఉత్సాహంగా పాల్గొని రక్తదానం చేశారు. సమాజ సేవలో భాగంగా రక్తదానం చేసి, ఆపదలో ఉన్నవారి ప్రాణాలను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు హుజూరాబాద్ ఏసీపీ వాసంశెట్టి మాధవి జమ్మికుంట పట్టణ సీఐ రామకృష్ణ గౌడ్ వీణవంక ఎస్సై ఆవుల తిరుపతి, రూరల్ సీఐ పులి వెంకట్ ఆధ్వర్యంలో పోలీస్ శాఖ నిర్వహించిన ఈ కార్యక్రమంలో దాట్ల శ్రీనివాస్ రక్తదానం చేసి తన సేవాభావాన్ని చాటుకున్నారు. పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ నిర్వహించిన ఈ కార్యక్రమంలో రక్తదానం చేయడం ఎంతో ప్రాధాన్యత కలిగిన విషయమని ఆయన పేర్కొన్నారుప్రతి రక్తపు చుక్కా ఒక నిండు ప్రాణానికి ఆధారం

ఈ సందర్భంగా దాట్ల శ్రీనివాస్ మాట్లాడుతూరక్తదానం అనేది కేవలం ఒక సామాజిక కార్యక్రమం మాత్రమే కాదని అది మరొకరి ప్రాణాలను కాపాడే మహత్తర సేవ అని అన్నారు. ప్రమాదాల్లో గాయపడినవారికి అత్యవసర శస్త్రచికిత్సలు చేయించుకునే రోగులకు, ప్రసవ సమయంలో రక్తం అవసరమయ్యే మహిళలకు వివిధ వైద్య సమస్యలతో బాధపడుతున్న వారికి సకాలంలో రక్తం అందించడం ఎంతోకీలకమనివివరించారుమనం చేసే రక్తదానం మరొక కుటుంబంలో ఆనందాన్ని నింపగలదుఒక తల్లి కడుపుకోతను నివారించగలదు ఒక చిన్నారి జీవితానికి భరోసా కల్పించగలదుఒక కుటుంబానికి పెద్ద దిక్కుగా నిలిచే వ్యక్తి ప్రాణాలను నిలబెట్టగలదు అని పేర్కొన్నారు. అందుకే రక్తదానాన్ని ప్రతి ఒక్కరూ మానవతా దృక్పథంతో చూడాలని, రక్తదానం పట్ల ప్రజల్లో మరింత అవగాహన పెంచాల్సిన అవసరం ఉందని అన్నారుయువత రక్తదానానికి ముందుకు రావాలిప్రస్తుత సమాజంలో రక్తం అవసరమైన వారికి సకాలంలో రక్తం అందించడం ఎంతో ముఖ్యమని దాట్ల శ్రీనివాస్ అన్నారు. రక్తదానం చేయడం వల్ల కలిగే ప్రయోజనాలపై యువతకు అవగాహన కల్పించాలని రక్తదానం పట్ల ఉన్న అపోహలను తొలగించాలని సూచించారు. వైద్యపరంగా అర్హత కలిగిన ప్రతి యువకుడు యువతి స్వచ్ఛందంగా రక్తదాన శిబిరాల్లోపాల్గొనాలని కోరారుఎక్కడ రక్తదాన శిబిరం నిర్వహించినా యువత బాధ్యతగా భావించి ముందుకు రావాలని, అత్యవసర పరిస్థితుల్లో రక్తం కోసం ఇబ్బందులు పడుతున్న వారికి అండగా నిలవాలని పిలుపునిచ్చారు. రక్తదానం ద్వారా ఎలాంటి స్వార్థం లేకుండా తోటి మనిషికి సహాయం చేసే అవకాశం లభిస్తుందని, ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజంలో మానవత్వాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు.

అమరవీరుల త్యాగాలకు ఘనమైన నివాళి

సమాజ శాంతి భద్రతల పరిరక్షణ కోసం తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా విధులు నిర్వహించి అమరులైన పోలీసుల త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని దాట్ల శ్రీనివాస్ అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా నిర్వహించే సేవా కార్యక్రమాలు ప్రజల్లో సామాజిక బాధ్యతను పెంపొందించేందుకు దోహదపడతాయని పేర్కొన్నారుప్రజల ప్రాణాలు ఆస్తుల రక్షణ కోసం పోలీసులు అందిస్తున్న సేవలు అభినందనీయమని, వారి త్యాగాలను స్మరించుకుంటూ ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాల్లో భాగస్వాములు కావడం ప్రతి పౌరుడి బాధ్యతఅనిఅన్నారురక్తదానం చేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ రక్తదానంపై ప్రజల్లో చైతన్యం పెంచేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, అవసరమైన సమయంలో రక్తం అంద ుబాటులో ఉండేలా స్వచ్ఛంద రక్తదాతలు ముందుకు రావాలని కోరారురక్తదానం చేయండిప్రాణదాతలుగా నిలవండిమానవత్వాన్ని చాటండి అనే సందేశంతో ప్రతి ఒక్కరూ ఈ మహత్తర సేవలో భాగస్వాములు కావాలని దాట్ల శ్రీనివాస్ పిలుపునిచ్చారు

ఎమ్మార్పీ స్టిక్కర్ల మాటున మద్యం దందా

- జమ్మికుంటవావిలాల నాగంపేట వైన్స్‌లో ఒకే బాటిల్‌కు ఒక్కో ధరా
- ఒకసారి రూ.2,450.. గంట తర్వాత రూ.2,610 వసూలు చేశారంటూ ఆరోపణలు
- ఇదెక్కడి న్యాయం అని ప్రశ్నిస్తే కస్టమర్లపై దూషణలా అధికారుల పర్యవేక్షణ ఏది
- ఒకే బ్రాండ్, ఒకే పరిమాణం కలిగిన బాటిల్‌కు వేర్వేరు ధరలు వసూలు చేస్తున్నారా
- బాటిళ్లపై ఉన్న ఎమ్మార్పీకి అనుగుణంగానే విక్రయాలు

జమ్మికుంట, అక్టోబర్ 28 (ప్రజావాణి)మద్యం బాటిళ్లపై గరిష్ఠ చిల్లర ధర (ఎమ్మార్పీ) స్టిక్కర్లు ఉన్నప్పటికీ, వాటి విక్రయాల్లో పారదర్శకత ఎక్కడా కనిపించడం లేదనే ఆరోపణలు కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండల పరిధిలో వినిపిస్తున్నాయి. జమ్మికుంట పట్టణంతో పాటు వావిలాల, నాగంపేట ప్రాంతాల్లోని కొన్ని వైన్స్ దుకాణాల్లో ఒకే రకం మద్యం బాటిల్‌కు ఒక్కో ధర వసూలు చేస్తున్నారనే ఫిర్యాదులు మద్యం వినియోగదారుల్లో ఆందోళన కలిగిస్తున్నాయి. ఎమ్మార్పీ ధరలపై స్పష్టత ఇవ్వాల్సిన దుకాణాలే వినియోగదారులకు ప్రశ్నార్థకంగా మారుతున్నాయనే విమర్శలువ్యక్తమవుతున్నాయి.ఒకే షాపులో గంట వ్యవధిలో ధర మారిందాఒకే వైన్స్ దుకాణంలో ఫుల్ బాటిల్‌కు మొదట రూ.2,450 వసూలు చేశారని, అదే బాటిల్‌ను సుమారు గంట తర్వాత కొనుగోలు చేసేందుకు వెళ్లగా రూ.2,610 అడిగారని ఓ వినియోగదారుడు ఆరోపించినట్లు సమాచారం. గంట వ్యవధిలోనే రూ.160 వ్యత్యాసం ఎందుకు వచ్చిందని ప్రశ్నిస్తే సమాధానం చెప్పాల్సిన దుకాణ సిబ్బంది దురుసుగా మాట్లాడి దూషించారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయిఅయితే, ఈ ధరల వ్యత్యాసానికి సంబంధించిన బిల్లు బాటిల్ వివరాలు, ఎమ్మార్పీ స్టిక్కర్‌తో పాటు సంబంధిత దుకాణం వివరణను అధికారులు పరిశీలించిన తర్వాతే వాస్తవాలు నిర్ధారణ కావాల్సి ఉంది అయినప్పటికీ వినియోగదారుడు లేవనెత్తిన ప్రశ్నకు స్పష్టమైన సమాధానం ఇవ్వాల్సిన బాధ్యత దుకాణ నిర్వాహకులపై ఉందిఒక దుకాణంలో ఒక ధరమరో దుకాణంలోమరోధరజమ్మికుంట, వావిలాల నాగంపేట ప్రాంతాల్లోని కొన్ని వైన్స్ దుకాణాల్లో మద్యం ధరల విషయంలో ఏకరీతి కనిపించడం లేదని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. ఒకే బ్రాండ్, ఒకే పరిమాణం కలిగిన బాటిల్‌కు వేర్వేరు ధరలు వసూలు చేస్తున్నారా బాటిళ్లపై ఉన్న ఎమ్మార్పీకి అనుగుణంగానే విక్రయాలు జరుగుతున్నాయా లేక ధరల విషయంలో వినియోగదారులను గందరగోళానికి గురిచేస్తున్నారా అనేప్రశ్నలుతలెత్తుతున్నాయిమద్యం బాటిల్‌పై ముద్రించిన గరిష్ఠ చిల్లర ధరను వినియోగదారులు పరిశీలించే అవకాశం ఉన్నప్పటికీ, వాస్తవంగా వసూలు చేస్తున్న ధరకు సంబంధించి స్పష్టత లేకపోతే సాధారణ ప్రజలు నష్టపోయే ప్రమాదం ఉంది. ముఖ్యంగా ఒకే దుకాణంలో వేర్వేరు సమయాల్లో వేర్వేరు మొత్తాలు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు నిజమైతే, దీనిపై సంబంధిత అధికారులు సమగ్ర విచారణ జరపాల్సిన అవసరం ఉందిప్రశ్నిస్తే దూషణలా వినియోగదారులకు గౌరవం ఇవ్వరాతాము చెల్లిస్తున్న డబ్బుకు సరైన ధరను అడగడం వినియోగదారుల హక్కు. బాటిల్‌పై ఉన్న ఎమ్మార్పీ ఎంత బిల్లులో ఎంత నమోదు చేశారు వాస్తవంగా ఎంత వసూలు చేస్తున్నారుఅనే వివరాలు అడిగినప్పుడు దుకాణ సిబ్బంది మర్యాదగా సమాధానం చెప్పాలి. ధరను ప్రశ్నించిన కస్టమర్లను దూషించారనే ఆరోపణలు నిజమైతే, అది మరింత ఆందోళనకరమైన విషయంవ్యాపారం నిర్వహిస్తున్న యజమానులు, సిబ్బంది వినియోగదారులతో బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. ధరలపై వివాదం తలెత్తినప్పుడు వాగ్వాదానికి దిగడం కాకుండా బిల్లు, ఎమ్మార్పీ ఆధారంగా వివరణ ఇవ్వాలి. వినియోగదారులను అవమానించే విధంగా ప్రవర్తించారనే ఫిర్యాదులపై కూడా అధికారులు దృష్టి సారించాలిఎక్సైజ్ శాఖ తనిఖీలు ఎక్కడజమ్మికుంట మండల పరిధిలోని వైన్స్ దుకాణాల్లో విక్రయ ధరలు, ఎమ్మార్పీ స్టిక్కర్లు, బిల్లుల జారీ, వినియోగదారులతో సిబ్బంది వ్యవహరిస్తున్న తీరుపై సంబంధిత ఎక్సైజ్ అధికారులు తనిఖీలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారుముఖ్యంగా ఒకే బ్రాండ్, ఒకే పరిమాణం కలిగిన బాటిల్‌కు వేర్వేరు మొత్తాలు వసూలు చేశారనే ఆరోపణలపై బిల్లులు, స్టాక్ రికార్డులు, ధరల వివరాలను పరిశీలిస్తే వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. ఎమ్మార్పీకి మించి వసూలు చేసినట్లు నిర్ధారణ అయితే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని వినియోగదారులు కోరుతున్నారుప్రజల ప్రశ్న ఒక్కటే: బాటిల్‌పై ఉన్న ధర ఒకటైతే, కౌంటర్ వద్ద వసూలు చేసే ధర మరొకటిగా ఎందుకు ఉండాలి? ధరను అడిగిన కస్టమర్‌కు సమాధానం చెప్పాల్సింది పోయి దూషణలకు దిగుతున్నారనే ఆరోపణలపై అధికారులు ఎందుకు స్పందించకూడదు వినియోగదారుల జేబులకు చిల్లు పడకుండా, మద్యం విక్రయాల్లో పారదర్శకత ఉండేలా సంబంధిత శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఈ ఆరోపణలపై వైన్స్ యజమానుల వివరణతో పాటు అధికారుల విచారణ ఫలితాలు వెల్లడైతేనే పూర్తి వాస్తవాలు స్పష్టమవుతాయి.

రైతు పండించిన ప్రతి గింజనూ కొనుగోలు చేయాలి

- ధాన్యం సేకరణలో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలి -- ఎమ్మెల్యే చింత ప్రభాకర్.
- సన్న వడ్లకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ అందించాలి.. రైతులకు సకాలంలో చెల్లింపులు చేయాలి.

కొండాపూర్ అక్టోబర్ 28(ప్రజావాణి): ఆరుగాలం శ్రమించి రైతులు పండించిన వరి ధాన్యాన్ని చివరి గింజ వరకు కొనుగోలు చేసి, వారికి న్యాయంగా దక్కాల్సిన మద్దతు ధర అందించాలని సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ అధికారులను కోరారు. ధాన్యం కొనుగోళ్లలో ఎలాంటి జాప్యం జరగకుండా, కొనుగోలు కేంద్రాలకు వచ్చే రైతులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించి, సకాలంలో ధాన్యం సేకరణ పూర్తి చేయాలని సూచించారు.

కొండాపూర్ మండలంలోని మల్కాపూర్ పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ప్రారంభించారు. అనంతరం మారేపల్లి--తొగర్‌పల్లి పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కూడా ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ, కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు.

రైతులు రోజుల తరబడి వేచి ఉండే పరిస్థితి రావొద్దు

రైతులు పండించిన ధాన్యాన్ని విక్రయించేందుకు కొనుగోలు కేంద్రాల వద్ద రోజుల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి తలెత్తకూడదని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ధాన్యం సేకరణలో జాప్యం జరిగితే రైతులు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని పేర్కొన్నారు. అందువల్ల కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేసి, ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని సూచించారు.

కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తూకం, తేమ శాతం నిర్ధారణ, గన్నీ సంచుల సరఫరా, టార్పాలిన్లు, ధాన్యం రవాణా వంటి సౌకర్యాలను అందుబాటులో ఉంచాలని అన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సంబంధిత అధికారులు, పీఏసీఎస్ ప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. కొనుగోలు కేంద్రాల్లో పారదర్శకత పాటిస్తూ, రైతులకు అన్యాయం జరగకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.

సన్న వడ్లకు రూ.500 బోనస్ అందించాలి

సన్న వడ్లు పండించిన రైతులకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ అందించాలనే ప్రకటించిన మేరకు ఆ ప్రయోజనం రైతులకు చేరాలని చింత ప్రభాకర్ కోరారు. రైతులు కష్టపడి పండించిన పంటకు గిట్టుబాటు ధర లభించడం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించిన డబ్బులను రైతుల బ్యాంకు ఖాతాల్లో సకాలంలో జమ చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

దళారుల బారిన పడకుండా కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి

రైతులు తమ ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలని ఎమ్మెల్యే సూచించారు. దళారుల కారణంగా రైతులకు నష్టం కలగకుండా కొనుగోలు ప్రక్రియను పర్యవేక్షించాలని అన్నారు. ధాన్యం సేకరణ నుంచి తూకం, రవాణా, చెల్లింపుల వరకు ప్రతి దశను సమర్థంగా నిర్వహించి రైతులకు సకాలంలో న్యాయం జరిగేలా చూడాలని పేర్కొన్నారు.

వ్యవసాయ రంగంపై ఆధారపడి జీవించే రైతు కుటుంబాలకు పంట విక్రయాల ద్వారా వచ్చే ఆదాయం ఎంతో కీలకమని, ధాన్యం కొనుగోళ్లలో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవడం ద్వారా రైతులకు ఉపశమనం కలుగుతుందని ఆయన అన్నారు. రైతులు పండించిన ప్రతి గింజనూ కొనుగోలు చేసి, వారికి అందాల్సిన ప్రయోజనాలు పూర్తిస్థాయిలో అందేలా అధికారులు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో పాల్గొన్నవారు

ఈ కార్యక్రమాల్లో పీఏసీఎస్ చైర్మన్లు ఆకుల పవన్, మున్నూరు రాజు, వైస్ చైర్మన్లు, డైరెక్టర్లు, మండల పార్టీ అధ్యక్షుడు మ్యాకం విట్టల్, కార్యదర్శి గోవర్ధన్ రెడ్డి, సర్పంచులు రామాగౌడ్, మహేష్, అనిల్, డి.కృష్ణ, పాండురంగం, దేవేందర్, అమరేందర్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ ప్రేమానందం, రామచంద్రయ్య, ఉక్కుద్దీన్, రవి, బుచ్చయ్య, నరేందర్ రెడ్డి, జగదీశ్వర్, మోహన్ గౌడ్, శేఖర్, కృష్ణారెడ్డి, ఆంజనేయులు గౌడ్, సంషోద్దీన్, ప్రభాకర్ గౌడ్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

రామాపురంలో అయ్యప్ప స్వామికి పాలాభిషేకం.. ఘనంగా పల్లకి సేవ

చిలుకూరు, అక్టోబర్ 28 (ప్రజావాణి): చిలుకూరు మండలం రామాపురం గ్రామంలో అయ్యప్ప స్వామి పుట్టినరోజు సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు, పాలాభిషేకం, పల్లకి సేవ కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. అయ్యప్ప స్వామి మందిరంలో బసవయ్య గురుస్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అయ్యప్ప స్వామి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.ముందుగా అయ్యప్ప స్వామివారికి పాలు తదితర పూజా ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి భక్తుల మధ్య పల్లకి సేవను వైభవంగా నిర్వహించారు. స్వామివారి నామస్మరణలు, భక్తుల పూజలతో ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకున్నాయి. అయ్యప్ప మాలధారణ చేసిన భక్తులు భక్తిశ్రద్ధలతో పూజల్లో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు.ఈ కార్యక్రమానికి అభిషేకాల దాతగా పోలంపల్లి సైదులు గౌడ్ సహకారం అందించారు. ఆయన స్వయంగా స్వామివారి అభిషేక కార్యక్రమంలో పాల్గొని పూజలు నిర్వహించారు. అయ్యప్ప స్వామి పుట్టినరోజును పురస్కరించుకుని నిర్వహించిన ఈ ప్రత్యేక పూజలు, పల్లకి సేవతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.ఈ కార్యక్రమంలో బసవయ్య గురుస్వామి, అయ్యప్ప మాలధారణ చేసిన భక్తులు, గ్రామ ప్రజలు, స్వామివారి భక్తులు తదితరులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ విద్యార్థి జిల్లా స్థాయి ప్రథమ బహుమతి సాధించిన మనశ్విని

అక్టోబర్ 28 ప్రజావాణి న్యూస్/సంగెం

సంగెం మండలం గవిచర్ల.వరంగల్ జిల్లా లోని 16 పియం శ్రీ పాఠశాలలకు ఈ రోజు శంభునిపేట పాఠశాలలో మాక్ పార్లమెంట్, క్రాఫ్ట్, మ్యూజిక్, జానపద నృత్యం, పాటలు, స్పెల్ బీ - ఇంగ్లీషు మొదలైన పోటీలు నిర్వహించారు. ఇందులో పియం శ్రీ తెలంగాణ మోడల్ స్కూల్ గవిచర్ల విద్యార్థులు చక్కగా పాల్గొని ప్రతిభను కనపర్చినారు.

జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతి పొందిన విద్యార్థులు

క్రాఫ్ట్ లో S.మనశ్విని 9 వ తరగతి

మ్యూజిక్ లో ధనుష్ 8 వ తరగతి

మ్యూజిక్ లో కీబోర్డ్ A .ప్రణవి 8 వ తరగతి , మాక్ పార్లమెంట్ లో

బెస్ట్‌రావీ గా వీణ షాహిద్ 9 వ తరగతి . వీరికి

ప్రశంశ పత్రంతో పాటు బహుమతులు ఇచ్చి సన్మానించారు . ఈ విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీలకు ఎంపికైనారు. ఈ విద్యార్థులను ప్రిన్సిపాల్ యస్. పి.ప్రసన్న లక్ష్మి గారు, ఇన్చార్జి ప్రిన్సిపాల్ చాడ.విజేందర్ రెడ్డి, గైడ్ టీచర్లు, మరియు పీఎం శ్రీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ప్రసన్నలక్ష్మి.ఉపాధ్యాయ బృందం విద్యార్థులను అభినందించారు.

పదవులన్నీ అనుభవించి వెన్నుపోటు పొడిచిన ద్రోహివి నువ్వు కడియం

- బెదిరిస్తే ఊరుకునేది లేదు బిడ్డా.. నీ బెదిరింపులకు భయపడేది లేదు..!
- జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి ఫైర్

జనగామ జిల్లా ప్రతినిధి జె.ఉపేందర్, అక్టోబర్ 28(ప్రజావాణి): కడియం శ్రీహరిపై జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి ఘాటు వ్యాఖ్యలు చేశారు. పదవులన్నీ అనుభవించి వెన్నుపోటు పొడిచిన ద్రోహివి నువ్వు కడియం.. గులాబీ జెండా అండతో ఎదిగి నేడు మా గులాబీ బిడ్డలనే బెదిరిస్తావా? గులాబీ జెండా కోసం కష్టపడిన కార్యకర్తలే నాయకులను గెలిపించారు. గెలిచిన మా గులాబీ బిడ్డలను బెదిరిస్తే ఊరుకునేది లేదు బిడ్డా.. నీ బెదిరింపులకు భయపడేది లేదు..! అంటూ స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ రాజకీయాలపై కడియం శ్రీహరి తీరుపై పల్లా తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేశారు.

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ తాటికొండ రాజయ్య ఆధ్వర్యంలో బుధవారం వేలేరు మండలంలోని సోడాశపల్లి గ్రామంలో పల్లా నివాసం వద్ద వేలేరు, ధర్మసాగర్, చిల్పూర్ మండలాల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లా మాట్లాడుతూ

కేసీఆర్ నాయకత్వంలో అన్ని పదవులు అనుభవించి, రాజకీయంగా గుర్తింపు పొందిన కడియం శ్రీహరిపై పల్లా రాజేశ్వర్ రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. కడియం శ్రీహరి గెలుపు కోసం తాటికొండ రాజయ్య, తాను కలిసి పనిచేశామని పల్లా గుర్తుచేశారు. ఆయనకు రాజకీయంగా గుర్తింపు రావడం వెనుక గులాబీ పార్టీ శ్రేణుల కృషి ఎంతో ఉందన్నారు. గులాబీ జెండా కోసం అహర్నిశలు శ్రమించిన కార్యకర్తలే నాయకులను గెలిపించారని పేర్కొన్నారు.

“ఒకప్పుడు గులాబీ జెండా అండతో పదవులు పొంది, రాజకీయంగా ఎదిగిన నాయకుడివి నువ్వు.. నేడు మా నాయకులను బెదిరిస్తున్నావా? పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తల శ్రమను మరిచిపోయావా?” అంటూ ప్రశ్నించారు.

ప్రజాస్వామ్యంలో ప్రజల తీర్పును గౌరవించాలని, రాజకీయాల్లో వ్యక్తిగత ఆధిపత్య ధోరణులకు తావివ్వకూడదన్నారు. స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ రాజకీయాల విషయంలో కడియం శ్రీహరి అనుసరిస్తున్న వైఖరిపై మండిపడ్డారు.

వ్యక్తిగత రాజకీయ ప్రయోజనాల కంటే పార్టీ కోసం పనిచేసిన కార్యకర్తల గౌరవం, బీఆర్ఎస్ బలోపేతమే ముఖ్యమని పేర్కొన్నారు. గతంలో కేసీఆర్ నాయకత్వంలో పార్టీ శ్రేణులంతా క్రమశిక్షణతో పనిచేసి ఎన్నికల్లో విజయాలు సాధించామని పల్లా గుర్తుచేశారు. వరంగల్ ప్రాంతంలో గులాబీ జెండాకు బలమైన పునాది ఉందని, గతంలో నిర్వహించిన సభలు, ఎన్నికల్లో సాధించిన విజయాలు పార్టీ ఐక్యతకు నిదర్శనమని పేర్కొన్నారు. చిల్పూర్, రఘునాథపల్లి, జఫర్‌గఢ్ తదితర మండలాల్లో పార్టీ శ్రేణులు సమష్టిగా పనిచేసి బీఆర్ఎస్‌కు మెజారిటీ సాధించడంలో కీలక పాత్ర పోషించాయని తెలిపారు.

కేసీఆర్ నాయకత్వంలో పదవులు పొందిన నాయకులు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. గ్రామస్థాయిలో సర్పంచులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు పార్టీ కోసం ఎంతో కష్టపడ్డారని, వారి కృషిని గుర్తించి గౌరవించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు.కేసీఆర్ ప్రభుత్వ హయాంలో స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గంలో రహదారులు, తాగునీరు, సాగునీటి సౌకర్యాల అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు ఖర్చు చేసి పలు పనులు చేపట్టామని పల్లా గుర్తుచేశారు. చిల్పూర్, ధర్మసాగర్ తదితర ప్రాంతాల్లో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రస్తావిస్తూ, గత ప్రభుత్వం నియోజకవర్గ అభివృద్ధికి చేసిన కృషిని ప్రజలకు వివరించాలని పార్టీ శ్రేణులకు సూచించారు.

దేవాదుల ప్రాజెక్టు ద్వారా సాగునీరు అందించేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వేల కోట్ల రూపాయలతో టన్నెల్స్, కాలువల నిర్మాణ పనులు చేపట్టామని తెలిపారు. గత ప్రభుత్వం సాగునీటి సౌకర్యాల కల్పనకు ప్రాధాన్యమిచ్చిందని పేర్కొన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో రైతులు సాగునీరు, విద్యుత్, రైతుబంధు వంటి అంశాల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు.పార్టీలో వేర్వేరు వర్గాలు లేవని, మనందరిదీ కేసీఆర్ గ్రూపు, బీఆర్ఎస్ గ్రూపు మాత్రమేనని జనగామ ఎమ్మెల్యే స్పష్టం చేశారు. వ్యక్తిగత విభేదాలను పక్కనపెట్టి పార్టీ ఐక్యత, బలోపేతమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని పిలుపునిచ్చారు.రాబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి విజయానికి ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని పల్లా పిలుపునిచ్చారు. ప్రతి గ్రామంలో అర్హులైన పట్టభద్రులను గుర్తించి, వారి ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ఓటరు నమోదు విషయంలో ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని, కాంగ్రెస్ పార్టీని ఓడించి బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించుకునే దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు.

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను పార్టీ శ్రేణులంతా సమన్వయంతో ఎదుర్కోవాలని సూచించారు. గతంలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ, స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు కష్టపడి విజయాలు సాధించారని గుర్తుచేశారు.

“నేను ఎప్పటికీ జనగామలోనే ఉంటా.. ఎల్లప్పుడూ మీకు అందుబాటులో ఉంటా. కార్యకర్తల సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తాను. పార్టీ కోసం కష్టపడిన ప్రతి ఒక్కరికీ తగిన గుర్తింపు లభించేలా సమష్టిగా పనిచేయాలి. కేసీఆర్ నాయకత్వంపై విశ్వాసంతో, గులాబీ జెండా విజయమే లక్ష్యంగా పార్టీ శ్రేణులంతా ఐక్యంగా ముందుకు సాగాలి” అని పల్లా రాజేశ్వర్ రెడ్డి కోరారు.

ఈ సమావేశంలో జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే వినయ్ భాస్కర్ , స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జి నాగూర్ల వెంకటేశ్వర్లు, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పుట్టినరోజు సందర్భంగా ఉచిత మెగా వైద్య శిబిరం

- ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే జారె

దమ్మపేట, ప్రజావాణి న్యూస్ అక్టోబర్ 28:రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణం సమాచార మరియు పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని దమ్మపేట మండల కేంద్రంలోని శ్రీ వినాయక ఫంక్షన్ హాల్‌లో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు.రాష్ట్ర మాజీ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మువ్వా విజయబాబు సారథ్యంలో వారి కుమారుడు ధనుష్ ప్రణవ్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌కు చెందిన ఇండస్ ఇంటర్నేషనల్ స్కూల్ సహకారంతో ఈ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే జారె ఆదినారాయణ హాజరయ్యారు.ఈ సందర్భంగా ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరంలో పాల్గొని కార్యక్రమ నిర్వాహకులను అభినందించారు. ప్రజలకు ఆరోగ్య సేవలు అందుబాటులోకి తీసుకురావడంలో ఇటువంటి శిబిరాలు ఉపయోగకరంగా ఉంటాయని పేర్కొన్నారు.ముందుగా మందలపల్లి సాయిబాబా మందిరంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. మందలపల్లి సెంటర్‌లో యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కేక్ కటింగ్ కార్యక్రమంలో పాల్గొని జన్మదిన వేడుకల్లో భాగస్వాములయ్యారు.ఈ కార్యక్రమాల్లో మండల ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ నాయకులు యువజన కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో అరుదైన ఘనత

- ఇద్దరు రోగులకు విజయవంతంగా మోకీలు మార్పిడి శస్త్రచికిత్సలు
- పేదలకు వరంగా మారుతున్న అత్యాధునిక వైద్య సేవలు

ప్రజావాణి జిల్లా ప్రతినిధి పెద్దపల్లి: అక్టోబర్ 28

పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి మరో అరుదైన ఘనతను సాధించింది. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె. శ్రీధర్ పర్యవేక్షణలో ఇద్దరు రోగులకు అత్యాధునిక టోటల్ నీ రీప్లేస్‌మెంట్ (మోకీలు మార్పిడి) శస్త్రచికిత్సలను వైద్యుల బృందం విజయవంతంగా నిర్వహించింది.

తీవ్రమైన మోకాళ్ల నొప్పులతో నడవడానికి ఇబ్బందులు పడుతున్న ఇద్దరు రోగులకు ఆసుపత్రిలోని అత్యాధునిక ఆపరేషన్ థియేటర్‌లో ఈ శస్త్రచికిత్సలు నిర్వహించారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో అధిక వ్యయంతో కూడుకున్న ఈ చికిత్సను ప్రభుత్వ ఆసుపత్రిలోనే అందించడం పేద, మధ్యతరగతి ప్రజలకు ఎంతో ప్రయోజనకరంగా మారింది.ఈ శస్త్రచికిత్సల విజయవంతానికి ఆర్థోపెడిక్ నిపుణులు డాక్టర్ కుమార్ బృందం, అనస్థీషియా విభాగానికి చెందిన డాక్టర్ చంద్రశేఖర్ బృందం, ఆపరేషన్ థియేటర్ సిబ్బంది సమన్వయంతో కృషి చేశారు.

ప్రభుత్వ సహకారంతో మెరుగైన వైద్య సేవలు

ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె. శ్రీధర్ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వ సహకారంతో పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన మౌలిక వసతులు, ఆధునిక వైద్య పరికరాలు, నిపుణులైన వైద్యుల సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో అధిక ఖర్చుతో కూడుకున్న అనేక శస్త్రచికిత్సలను ప్రభుత్వ ఆసుపత్రిలోనే నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.

మోకాళ్ల నొప్పులు, కీళ్ల సమస్యలతో బాధపడుతున్న ప్రజలు ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లి ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

వైద్యుల పర్యవేక్షణలో కోలుకుంటున్న రోగులు

ప్రస్తుతం మోకీలు మార్పిడి శస్త్రచికిత్సలు చేయించుకున్న ఇద్దరు రోగులు వైద్యుల పర్యవేక్షణలో కోలుకుంటున్నారని ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ప్రభుత్వ ఆసుపత్రిలో అత్యాధునిక వైద్య సేవలు అందుబాటులోకి రావడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.పేద, మధ్యతరగతి ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను అందించడంలో పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రి ముందంజలో ఉండటం విశేషం.

ఆరుట్ల తెలంగాణ పబ్లిక్ పాఠశాలను సందర్శించిన మాజీ మంత్రి జి. చిన్నారెడ్డి

- కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా పాఠశాల నిర్మాణం అద్భుతం: మాజీ మంత్రి జి. చిన్నారెడ్డి

ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అక్టోబర్ 28 (ప్రజావాణి):

మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో నిర్మించిన తెలంగాణ పబ్లిక్ పాఠశాలను తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా సంఘం మాజీ చైర్మన్, మాజీ మంత్రి జి. చిన్నారెడ్డి, ప్రొఫెసర్ జలంధర్ రెడ్డి, వారి బృందం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణమంతా కలియతిరిగి, అక్కడి సౌకర్యాలు, తరగతి గదులు, క్రీడా మైదానాలు, పాఠశాల నిర్వహణ తీరును పరిశీలించారు.అనంతరం మాజీ మంత్రి జి. చిన్నారెడ్డి మాట్లాడుతూ, ఆరుట్ల తెలంగాణ పబ్లిక్ పాఠశాల నిర్మాణం కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా, విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలతో ఎంతో అద్భుతంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు. ఈ పాఠశాలలో విద్యనభ్యసించే ప్రాంత విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు.పాఠశాలలోని ఆహ్లాదకరమైన వాతావరణం, చక్కటి సౌకర్యాలు, మెరుగైన నిర్వహణ తనను ఎంతగానో ఆకట్టుకున్నాయని తెలిపారు. ఇలాంటి పాఠశాలలో చదువుకునే విద్యార్థులు నిజంగా అదృష్టవంతులని తన అభిప్రాయాన్ని వెల్లడించారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ పబ్లిక్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సిద్ధగోని గిరిధర్ గౌడ్, తెలంగాణ ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ జలవర్ష రాములు, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మోహన్ గౌడ్, పాఠశాల ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులు, ప్రజాగలం దామర భూపాల్ తదితరులు పాల్గొన్నారు.

అనంతగిరి ఎంఈఓగా మిర్యాల వెంకటయ్యకు పదోన్నతి

అనంతగిరి మండలం పాలారం గ్రామంలోప్రధాన ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న మిర్యాల వెంకటయ్యకు అనంతగిరి మండల విద్యాధికారిగా (ఎంఈఓ) పదోన్నతి లభించినట్లు సమాచారం. ఆయన పదోన్నతి పొందడంపై విద్యాశాఖ వర్గాలు, ఉపాధ్యాయులు, పాలారం గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. విద్యారంగంలో ఆయన అందించిన సేవలకు గుర్తింపుగా ఈ పదోన్నతి లభించడం ఆనందంగా ఉందని పలువురు పేర్కొంటున్నారు. మండల విద్యాధికారిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం విద్యాభివృద్ధికి, ప్రభుత్వ పాఠశాలల అభ్యున్నతికి కృషి చేయాలని ఆకాంక్షిస్తున్నారు.

రహదారి పనులు వెంటనే పూర్తి చేయాలి

- దుమ్ము, ధూళితో ప్రజలు ఉక్కిరిబిక్కిరి.. అధికారుల నిర్లక్ష్యంపై చిరంజీవి ఆగ్రహం

నారాయణఖేడ్ ఆర్సీ, అక్టోబర్ 28 (ప్రజావాణి) నారాయణఖేడ్ నియోజకవర్గంలోని నిజాంపేట నుంచి బీదర్‌కు వెళ్లే ప్రధాన రహదారి నిర్మాణ పనులను తక్షణమే పూర్తి చేయాలని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ సంగారెడ్డి జిల్లా కన్వీనర్ చిరంజీవి సంబంధిత అధికారులను డిమాండ్ చేశారు. రహదారి పనులను అసంపూర్తిగా వదిలేయడంతో దుమ్ము, ధూళి విపరీతంగా వ్యాపించి ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రహదారిని తవ్వి పనులు పూర్తి చేయకుండా వదిలేయడం వల్ల నిత్యం ఈ మార్గంలో ప్రయాణించే ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదన్నారు. వాహనాలు వెళ్లిన ప్రతిసారీ దుమ్ము పెద్దఎత్తున లేస్తుండటంతో రాకపోకలకు అంతరాయం కలుగుతోందని పేర్కొన్నారు. రహదారి దుస్థితితో ప్రయాణికులు అవస్థలు పడుతున్నా పనులు ఎప్పుడు పూర్తవుతాయో స్పష్టత లేకపోవడం ఆందోళన కలిగిస్తోందన్నారు.

"ప్రజల ఇబ్బందులు పట్టించుకోరా"?

ప్రజలకు సౌకర్యవంతమైన రహదారులు కల్పించడం అధికారుల బాధ్యత అని చిరంజీవి స్పష్టం చేశారు. నిర్మాణ పనుల్లో జాప్యాన్ని నివారించి, పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. అప్పటివరకు దుమ్ము, ధూళి నియంత్రణకు చర్యలు తీసుకుని ప్రజలకు ఉపశమనం కల్పించాలని కోరారు. ప్రజల సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా అధికారులు తక్షణమే స్పందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ నాయకులు లక్ష్మణ్, సోయల్, దత్తు తదితరులు పాల్గొన్నారు.

ఇసోజిపేటలో వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం

- రైతులు కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి: సర్పంచ్ విజయేందర్ రెడ్డి

మన ప్రజావాణి । పుల్కల్, ।అక్టోబర్ 28: జిల్లా ప్రతినిధి సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండలం ఇసోజిపేట గ్రామంలో డి ఆర్ డి ఏ అనుబంధ సంస్థ ఐకేపీ కేంద్రాల ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని గ్రామ సర్పంచ్ విజయేందర్ రెడ్డి, ఉపసర్పంచ్ రవికుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ విజయేందర్ రెడ్డి మాట్లాడుతూ.. రైతులు కష్టపడి పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించి, రైతుల వద్దనే ధాన్యాన్ని కొనుగోలు చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తోందని తెలిపారు. రైతులు తమ పంటను కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చి, సంబంధిత అధికారులకు సహకరిస్తూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రైతులు తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి ప్రభుత్వ మద్దతు ధరను పొందాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మండల ఏపీఎం చంద్రశేఖర్, సీసీ చిరంజీవి, లక్ష్మి, గ్రామానికి చెందిన రామచంద్రారెడ్డి, కమ్మరి సదాశివుడు, మున్నూరు మాణిక్యం, మంగళ బుచ్చయ్య, చాకలి శంకర్, మినుపూరు ప్రభు, కుమ్మరి రవి, కుమ్మరి కిరణ్, వార్డు సభ్యులు గొల్ల పద్మ, శివనోళ్ల విజయ్ కుమార్, గణపతి, తలారి యాదగిరి, గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

ముందు నుయ్యి.. వెనుక గొయ్యి అన్న చందంగా ప్రభుత్వ పెన్షనర్ల పరిస్థితి!

- పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించాలి
- పీఆర్సీ అమలు చేసి న్యాయం చేయాలి
- ప్రభుత్వ పెన్షనర్ రవీందర్ రెడ్డి డిమాండ్

చిన్నంబావి, ప్రజావాణి: అక్టోబర్ 28 ప్రభుత్వ పెన్షనర్ల పరిస్థితి ముందు నుయ్యి.. వెనుక గొయ్యి అన్న చందంగా మారిందని, కాంగ్రెస్ ప్రభుత్వంలో తమ సమస్యలు పరిష్కారమవుతాయని ఆశించినప్పటికీ నేటికీ నిరాశే మిగిలిందని ప్రభుత్వ పెన్షనర్ రవీందర్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. చిన్నంబావి మండల పరిధిలోని ప్రభుత్వ ఎస్సీ బాలురవసతిగృహంలో హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్‌గా పనిచేసి ఇటీవల పదవీ విరమణ పొందిన ఆయన చిన్నంబావి మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ పెన్షనర్లుఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. ప్రభుత్వ పెన్షనర్లకు న్యాయంగా రావాల్సిన అనేక బకాయిలు ఇప్పటికీ పెండింగ్‌లోనే ఉన్నాయని, వాటి చెల్లింపులో జరుగుతున్నజాప్యం పెన్షనర్లను ఆర్థిక ఇబ్బందులకు గురిచేస్తోందని తెలిపారు. మరో రెండేళ్లలో ఎన్నికలు రానున్న నేపథ్యంలో రాజకీయ పార్టీలు ప్రచారకార్యక్రమాల్లో నిమగ్నమయ్యే పరిస్థితిఉంటుందని, ఈలోగానే ప్రభుత్వం పెన్షనర్లసమస్యలను పరిష్కరించి పెండింగ్ బకాయిలన్నీ చెల్లించాలని కోరారు. ముఖ్యంగా ప్రభుత్వం వెంటనే పీఆర్సీ నివేదికను తెప్పించుకుని, దానిని అమలు చేయడంలో ఎలాంటి జాప్యం చేయకుండా తగిన నిర్ణయం తీసుకోవాలని సూచించారు. కాలికేస్తే మెడకు, మెడకేస్తే కాలుకు అన్న చందంగా పెన్షనర్లను ఇబ్బందులకు గురిచేయకుండా, వారికి ఎలాంటి అన్యాయం జరగకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. రోజురోజుకూ పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలను దృష్టిలో ఉంచుకుని పెన్షనర్లు,ఉద్యోగులకు న్యాయంగా రావాల్సిన మెరుగైన ఫిట్‌మెంట్ ప్రకటించాలని కోరారు.

చివరి ఆయకట్టు రైతులకు సాగునీరు అందించడమే లక్ష్యం

- సింగోటం--గోపాలదిన్నె లింక్ కెనాల్ పనులను పరిశీలించిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు

చిన్నంబావి, అక్టోబర్ 28 (ప్రజావాణి): సింగోటం--గోపాలదిన్నె లింక్ కెనాల్ పనులను బుధవారం వల్లభాపురం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా కెనాల్ పనుల పురోగతిని సమీక్షించి, ప్రాజెక్టు ప్రాధాన్యతను వివరించారు. లింక్ కెనాల్ పనులు పూర్తయితే మూడు మండలాల పరిధిలోని రైతులకు సాగునీటి సౌకర్యం మెరుగు పడటంతో పాటు వ్యవసాయ రంగానికి ఎంతో ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. చివరి ఆయకట్టు రైతులకు సైతం సాగునీరు అందేలా కెనాల్ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. రైతులకు సాగునీటి ఇబ్బందులు లేకుండా ప్రాజెక్టు పనులను సకాలంలో పూర్తి చేయాల్సిన అవసరంఉందన్నారు. మంత్రి జూపల్లి కృష్ణారావు రైతుల సంక్షేమం, సాగునీటి సౌకర్యాల అభివృద్ధికిప్రాధాన్యత ఇస్తున్నారని పేర్కొన్నారు. ఈ మేరకు ప్రాజెక్టు పనులు త్వరితగతిన పూర్తయ్యే లా సంబంధిత ప్రాజెక్టు మేనేజర్ ప్రసాద్‌కు సూచనలు చేశారు. ప్రకృతివైపరీత్యాలను రాజకీయాలతో ముడిపెట్టడం సరికాదు ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు లేక కరువు పరిస్థితులు ఏర్పడితే, ప్రతిపక్ష నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వం వల్లే కరువు వచ్చిందని విమర్శించడం సరికాదని కాంగ్రెస్ నాయకులు అన్నారు. ప్రకృతి వైపరీత్యాల కారణంగా కరువు ఏర్పడినప్పుడు ప్రజలకు భరోసా కల్పించి, రైతులకు అవసరమైన సహాయ చర్యలపై సూచనలు చేయాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉంటుందని పేర్కొన్నారు. గతంలో కరోనా సమయంలో కూడా ప్రతిపక్ష నాయకులే అధికారంలో ఉన్నారని గుర్తుచేస్తూ, ప్రకృతి వైపరీత్యాలను ప్రభుత్వాలకు ఆపాదిస్తూ విమర్శలు చేయడం అవివేకమని వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో కొల్లాపూర్ మాజీ మార్కెట్ చైర్మన్ సుబ్బేటి రామచంద్రారెడ్డి. మాజీ జెడ్పిటిసి కృష్ణ ప్రసాద్ యాదవ్. మండల సీనియర్ నాయకులు జంగం బీచుపల్లియాదవ్. కొప్పునూరు సర్పంచ్ వడ్డేమాన్ బిచ్చన్న. మండల రైతు సమన్వయ సమితి మాజీ అధ్యక్షుడు పెబ్బేటి తేజ రెడ్డి. పసుల భరత్. అశోక్ తదితరులు పాల్గొన్నారు.

భూసారాన్ని కాపాడుదాం.! ప్రకృతి సాగు ప్రోత్సహిద్దాం..

- ఏ డిఏ, శాస్త్రవేత్త
- ఇనుగుర్తిలోఖేత్ బచావో అభియాన్ పై అవగాహన

ప్రజావాణి,ఇనుగుర్తి: మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి మండల కేంద్రంలోని రైతు వేదికలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఖేత్ బచావో అభియాన్ పై మండలంలోని రైతులకు ప్రజాప్రతినిధులకు బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దీనికి స్థానిక సర్పంచి తమ్మడపల్లి కుమార్,ఏ డి ఏ శ్రీనివాసరావు,కృషి విజ్ఞాన కేంద్రం సైంటిస్టు సుహాసిని ఎంపీడీవో పార్థసారథి మండల వ్యవసాయాధికారి షేక్ యాస్మిన్ ప్రభృతులు హాజరయ్యారు.

భూసారాన్ని పరిరక్షిద్దాం..

రసాయన ఎరువుల మితిమీరిన వాడకం వల్ల దెబ్బతింటున్న భూమిని కాపాడుకోవడానికి, పంట దిగుబడిని పెంచుకోవడానికి రాన్ని పెంపొందించుకోవడం అత్యంత అవసరమని ఏడిఏ అజ్మీర శ్రీనివాసరావు అన్నారు. సేంద్రియ, సహజ పద్ధతుల ద్వారా నేల ఆరోగ్యాన్ని సుదీర్ఘకాలం కాపాడుకోవచ్చని రైతులకు ప్రజాప్రతినిధులకు సూచించారు. ఎప్పుడూ ఒకే పంట కాకుండా పంటల మార్పిడికి పాల్పడాలన్నారు. పంట వ్యర్థాలను కాల్చకుండా భూసారాన్ని పెంపొందించుకోవాలన్నారు.

ఎల్ నినో ప్రభావం ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా రైతులు ఆరుతడి పంటల వైపు మొగ్గు చూపాలని ఏడిఏ సూచించారు. నీటి ఆధారిత పంటలు సాగు చేసి నష్టపోవద్దన్నారు.

పలు అంశాలపై సైంటిస్ట్ అవగాహన

రైతులు పంటల వైవిధ్యీకరణ,నానో యూరియా వినియోగంపై అవగాహన పెంపొందించుకోవాలని, ఎరువులను శాస్త్రీయ పద్ధతిలో వినియోగించాలని,నీటి వినియోగ సామర్థ్యాన్ని పెంచే పద్ధతులను అనుసరించాలని సైంటిస్ట్ సుహాసిని సూచించారు. కార్యక్రమంలో గ్రామాల సర్పంచులు దిశ సభ్యులు బాబురావు, ఉద్యానవన అధికారి స్రవంతి, వెటర్నరీ డాక్టర్ రవీందర్,ఇరిగేషన్ ఏ ఈ విజయ్ ఏ ఈ ఓ భాస్కర్ రైతులు తదితరులు పాల్గొన్నారు.

చాప్టా (కె)లో ఘనంగా వాల్మీకి మహర్షి విగ్రహావిష్కరణ

- సర్వేశ్వర అంబికా శివయోగి మహారాజ్ మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ నీలం మధు ముదిరాజ్, చంద్రశేఖర్‌రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరణ

నారాయణఖేడ్ ఆర్సీ, అక్టోబర్ 28 (ప్రజావాణి): నారాయణఖేడ్ నియోజకవర్గం కంగ్టి మండల పరిధిలోని చాప్టా (కె) గ్రామంలో వాల్మీకి మహర్షి విగ్రహావిష్కరణ మహోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి సర్వేశ్వర అంబికా శివయోగి మహారాజ్ మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి నీలం మధు ముదిరాజ్, డీసీసీ అధ్యక్షుడు పట్లోళ్ల చంద్రశేఖర్‌రెడ్డి,ముఖ్య అతిథులుగా హాజరై వాల్మీకి మహర్షి విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ, వాల్మీకి మహర్షి జీవితం, ఆయన రచించిన రామాయణం తరతరాలకు స్ఫూర్తినిస్తుందని పేర్కొన్నారు. ధర్మం, సత్యం, న్యాయం, మానవతా విలువల ప్రాధాన్యాన్ని వాల్మీకి మహర్షి జీవితం చాటిచెబుతుందని నీలం మధు అన్నారు. సమాజంలో ఐకమత్యాన్ని పెంపొందిస్తూ, మహనీయుల ఆశయాలను ఆచరణలో పెట్టినప్పుడే వారి సేవలకు నిజమైన గౌరవం లభిస్తుందని అభిప్రాయపడ్డారు. మహనీయుల చరిత్రను భావితరాలకు అందించడం ద్వారా యువతలో స్ఫూర్తి, సామాజిక బాధ్యత పెంపొందుతాయని తెలిపారు. విగ్రహావిష్కరణలు కేవలం వేడుకలకే పరిమితం కాకుండా, మహనీయులు చూపిన మార్గంలో నడిచేందుకు ప్రేరణ కలిగించాలని ఆయన సూచించారు. విద్య, సామాజిక అభివృద్ధి, సమానత్వానికి ప్రాధాన్యమిస్తూ అన్ని వర్గాల ప్రజలు ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ వేడుకతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శివాజీ పాటిల్,ఉప సర్పంచ్ మోహన్, వార్డ్ సభ్యులు సర్వేశ్వర అంబికా శివయోగి మహారాజ్, గుండు లక్ష్మణ్ స్టేట్ (పిఆర్టియు) మాజీ అధ్యక్షులు, గుండు మోహన్ మాజీ జెడ్పీటీసీ, సత్యనారాయణ మాజీ ఎంపీపీ, కౌన్సిలర్ రామకృష్ణ, సర్పంచులు శివరాజ్ పటేల్, కృష్ణ, సాయిలు పటేల్, వెంకటేష్, భూమయ్య, నాయకులు ప్రకాష్ రాథోడ్, వెంకట రాములు, రవి, వెంకన్న, ముచందర్,ముదిరాజ్ సంఘం నాయకులు, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, యువకులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో తదితరులు పాల్గొన్నారు.

జమ్మికుంటలో వెటర్నరీ ఆస్పత్రి వెనుక వెలిసిన పోచమ్మ తల్లి

- 24వ వార్డులో పొదల్లో బయటపడిన పోచమ్మ తల్లి స్థలం
- రెండు నెలలుగా విశేష పూజలు చేస్తున్న మహిళలు నీడ సదుపాయం కల్పించాలని విజ్ఞప్తి

జమ్మికుంట అక్టోబర్ 28 (ప్రజావాణి) కరీంనగర్ జిల్లా జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని 24 వార్డ్ లోని వెటర్నరీ హాస్పటల్ వెనుక టేకు చెట్ల మధ్యల పోషమ్మ తల్లి వెలిసి ఉన్నది గత 2 నెలల క్రితం వెలసింది గాజులరాజ్యలక్ష్మి మహిళా ఆమెకు కళ్ళు కనిపించవు ఆమె ఒక్కతే నడుచుకుంటు వెళ్లుచుండగా ఇక్కడ మహిళలు కొంతమంది ఆమె వెనుకబడి వెళ్ళిపోతుండగా ఏమైంది కళ్ళు కనబడు ఇలా పూనకంతో ఆమె నడుస్తున్నది. ఎవరైనా సహాయం ఉంటేనే బయటకు వచ్చే మహిళ ఈరోజు ఏంటిదని వెనకాల నడుచుకుంటూ మహిళలు వెళ్లిపోయారు సిదా వెటర్నరీ హాస్పిటల్ వెనకాల చెట్లకు పొదల్లోకి వెళ్లి అమ్మవారు ఉందని చెప్పి అక్కడవున్న ఆడవారికి ఇక్కడ మట్టి తవ్వండి అని చెప్పింది దేవుడు వచ్చి చెప్పినారు ఇక్కడే అమ్మ వారు కొలువైవుంది ఇక్కడే పూజలు జరుపుకోవాలి అని చెప్పింది అప్పటినుండి 2నెలలుగా బుధవారం శుక్రవారం ఆదివారం పూజలు చేస్తున్నారు వచ్చిన మహిళలకు వారికి పూనకాలు వస్తున్నది పోచమ్మ తల్లికి ప్రతి వారాలు బోనం కళ్ళు పానకం పెడుతూ పూజలు చేస్తున్నారు. అమ్మవారి మీద దయతలచి కొంచెం అమ్మ వారికి నీడ కావాలి ఇక్కడ వున్నా అధికారులు నాయకులు స్పందించాలనికోరుకుంటున్నారు ఈకార్యక్రమంలో గాజుల రాజ్యలక్ష్మి. బామాండ్లపల్లి సుగుణ. కొడిమ్యాల సరిత రాధా పద్మ. శారదా. వాణి. వనిత. మాదవి. రాజ్యలక్ష్మి. వార్డు మహిళలంతా కలిసి పూజలు చేస్తున్నారు

ఎన్నికల నేపథ్యంలో పోలీస్ ఫ్లాగ్ మార్చ్.

తిరుపతి, అక్టోబర్ 28: స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంతంగా, స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు తిరుపతి జిల్లా పోలీస్ శాఖ పటిష్ట భద్రతా చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, ఐపీఎస్ నేతృత్వంలో బుధవారం బైరాగిపట్టెడలోని ఎంజీఎం స్కూల్ నుంచి పోస్టల్ కాలనీ వరకు పోలీస్ ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ మార్చ్‌లో స్పెషల్ పార్టీ, ఏఆర్, స్థానిక పోలీసులు, బ్లాక్ కమాండోలు, ఎస్టీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఎన్నికల విధుల్లో పోలీసులు అప్రమత్తంగా, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని, ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఓటర్లను భయపెట్టినా, ప్రలోభాలకు గురిచేసినా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. ప్రజలు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని, ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు పోలీసులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అనంతపురం అభివృద్ధి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తోనే సాధ్యం...

- ఎన్నికల ప్రచారంలో అనంత, శైలజానాథ్, నరేష్ కుమార్ రెడ్డి, మేయర్ అభ్యర్థి సి.రమేష్.

అనంతపురం, అక్టోబర్ 28 ప్రజా వాణి 37, 38వ డివిజన్ లలో మేయర్ అభ్యర్థి సి. రమేష్, కార్పొరేటర్ అభ్యర్థులు బలరాం రామ్, సందీప్ కుమార్ లతో కలసి ఎన్నికల ప్రచారం నిర్వహించిన పార్టీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి, పార్లమెంట్ పరిశీలకులు నరేష్ కుమార్ రెడ్డి, మాజీ మంత్రి సాకే శైలజానాథ్. ప్రజలతో మమేకమవుతూ ఈ ఎన్నికల్లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరిన అనంత వెంకటరామిరెడ్డి, నరేష్ కుమార్ రెడ్డి, సాకే శైలజానాథ్. ఇంటింటికీ వెళ్లి గత ఐదేళ్ల పాలనను, ఈ రెండున్నరేళ్ల పాలనను వివరించిన నాయకులు. చంద్రబాబు ఇచ్చిన హామీలు..అమలు చేయని వైనాన్ని, నిత్యావసర సరుకుల ధరలను గుర్తు చేసిన నాయకులు. అనంతపురం అభివృద్ధి వైయస్సార్ సీపీ తోనే సాధ్యం అంటూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేస్తే అనంతపురం నగరాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకెళ్తామన్న మేయర్ అభ్యర్థి రమేష్ గౌడ్. వైసిపి పార్టీతోనే అనంతపురం నగరం అభివృద్ధి చెందుతున్నది అని వైసిపి మేయర్ అభ్యర్థి రమేష్ గౌడ్ ప్రజలకు తెలియజేశారు.

ప్రత్యర్థిని మడత పెట్టాలా... ఎన్డీఏ ఎన్నికల మేనిఫెస్టో

- ఇదే - కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అనంత సంకల్ప పత్రం
- ప్రచారంతో దూకుడు పెంచిన మేయర్ అభ్యర్థి అజేష్ బాబు
- రోజురోజుకు పెరుగుతున్న ప్రముఖ మద్దతుదారులు
- జోరు ప్రచారాలతో జనసంద్రంగా అనంత ప్రధాన వీధులు

అనంతపురం , బ్యూరో అక్టోబర్ 28 ప్రజా వాణి స్వచ్ఛ అనంతపురం, సుందర అనంతపురం, స్వర్ణ అనంతపురం అంటూ అనంత నగర సమగ్ర అభివృద్ధి కోసం ఎన్డీఏ కూటమి తన అనంత సంకల్ప పత్రాన్ని (ఎన్నికల మేనిఫెస్టో)లి విడుదల చేసింది.కేంద్రంలో, రాష్ట్రంలో అధికారంలో ఉన్న మేమే ఈ హామీలను నమ్మి తీరాల్సిందే అన్నట్టుగా అమలు చేస్తామని ప్రభుత్వ పెద్దలు స్పష్టంగా మాట ఇచ్చారు. అనంతపురం నగరాన్ని ఆహ్లాద వాతావరణంతో అద్భుతంగా తీర్చిదిద్దుతామని ప్రకటించారు. సంకల్ప పత్రంలోని ముఖ్య హామీలు:

1. ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీరు
2. ఆధునిక భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ
3. సుందరీకరణతో పర్యాటక కేంద్రంగా అనంతసాగర్
4. నగర పార్కుల సుందరీకరణ
5. డంపింగ్ యార్డ్ రహిత అనంతపురం
6. మహాప్రస్థానం – గౌరవప్రదమైన అంతిమ సంస్కారాలు
7. ఇంటింటికి పైప్ లైన్ ద్వారా వంట గ్యాస్
8. నడిమివంక, మరువంక ముంపు నివారణ చర్యలు
9. స్వచ్ఛమైన, పచ్చని, సురక్షితమైన అనంతపురం
10. ఎలక్ట్రికల్ ఛార్జింగ్ స్టేషన్లు
11. నగరంలోని ప్రముఖ కూడళ్లలో పబ్లిక్, పింక్ టాయిలెట్లు
12. అనంతపురం నగరాభివృద్ధి కమిటీ
13. స్కిల్ డెవలప్మెంట్, డిజిటల్ లైబ్రరీలు, ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా విశాలమైన రోడ్లు

సంకల్ప పత్రంలో లేని మరెన్నో సంక్షేమ ఫలాలను కూడా తీసుకొస్తామని ఓటర్లకు వివరిస్తున్నారు.

ఎన్డీఏ అభ్యర్థుల ప్రచారం చూసి చూపరులు సైతం ఓటు వేయాలనిపించేలా ప్రచారం ముమ్మరంగా సాగుతోందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ప్రతి డివిజన్ లో పర్యటిస్తూ కార్పొరేటర్ అభ్యర్థులకు సైకిల్, గ్లాసు గుర్తులకు, కూటమి మేయర్ అభ్యర్థి కె. అజేష్ బాబు కమలం గుర్తుకు ఓటు వేయాలని ముకుళిత హస్తాలతో విన్నవించుకుంటున్నారు

గంభీరావుపేటను కరువు మండలంగా ప్రకటించాలి

- తహసీల్దార్‌కు బీజేపీ నాయకుల వినతి

ప్రజావాణి , గంభీరావుపేటరాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలాన్ని వెంటనే కరువు మండలంగా ప్రకటించాలని బీజేపీ మండల అధ్యక్షుడు కోడె రమేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం బీజేపీ గంభీరావుపేట మండల శాఖ ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కోడె రమేశ్ మాట్లాడుతూ.. మండలంలో సాధారణ వర్షపాతం కంటే 30 నుంచి 35 శాతం తక్కువ వర్షాలు కురిశాయని తెలిపారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. కరువు మండలాల ప్రకటనకు ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రాతిపదికను స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి, వర్షాభావ పరిస్థితులపై సమగ్ర సర్వే నిర్వహించి గంభీరావుపేటను కరువు మండలంగా ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ధార్మిక సెల్ కన్వీనర్ డాక్టర్ సత్యనారాయణ, మండల ప్రధాన కార్యదర్శి మల్లేష్ యాదవ్, ఓబీసీ మోర్చా జిల్లా కార్యవర్గ సభ్యుడు సర్వోత్తమ్, ఎస్సీ మోర్చా నాయకులు, ఐటీ సెల్ కన్వీనర్ రవీందర్ నాయక్, సోషల్ మీడియా కన్వీనర్ దేవేందర్ యాదవ్, నాయకులు కృష్ణకాంత్ యాదవ్, రవీందర్, తిరుపతి, ఎల్లం యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ ఖేల్ ఖతం

- రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత
- జగన్ పై ప్రజలకే కాదు వైసీపీ శ్రేణులకూ నమ్మకం లేదు
- స్థానిక ఎన్నికల్లో ఓటమి భయంతో జగన్ లో తీవ్ర అసహనం
- ప్రజలను, అధికారులను భయభ్రాంతులకు గురిచేసేలా వ్యాఖ్యలు
- వైసీపీ శ్రేణులను రెచ్చగొడుతున్న గొడ్డలి పార్టీ నాయకుడు
- స్థానికం'లో స్వీప్ చేయబోతున్నాం
- ట్రిపుల్ సర్కార్ తో అభివృద్ధి, సంక్షేమం పరుగులు : మంత్రి సవిత

అనంత పురం బ్యూరో అక్టోబర్ 28 ప్రజా వాణి రాష్ట్రంలో వైసీపీ పని ఖేల్ ఖతమైందని, స్థానిక సంస్థల ఎన్నికల్లో స్వీప్ చేయబోతున్నామని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. జగన్ ను ప్రజలే కాదు చివరికి వైసీపీ శ్రేణులు సైతం నమ్మడం లేదని, అందుకే స్థానిక సంస్థల ఎన్నికల్లో గొడ్డలి పార్టీ తరపున నామినేషన్లు వేయడానికి ఆసక్తి చూపడం లేదని అన్నారు. వైసీపీని 11 సీట్లకే పరిమితం చేసి జగన్ కు గుణపాఠం చెప్పినా, ఆయన తీరు మారడం లేదని మండిపడ్డారు. చొక్కా మడత పెడితే అంటూ ప్రజలను, అధికారులను భయపెడుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండలోని క్యాంపు కార్యాలయంలో బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. మున్సిపల్ ఎన్నికలతో పాటు జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లోనూ కూటమి పార్టీలు సత్తా చాటాయన్నారు. 17 మున్సిపాల్టీలను, 77 జెడ్పీటీసీలను కూటమి పార్టీలు ఏకగ్రీవంగా గెలుచుకున్నాయన్నారు. పులివెందుల నియోజకవర్గంలో పులివెందుల నియోజక వర్గంలో ఏడు జడ్పీటీసీ స్థానాలకుగాను మూడు ఏకగ్రీవంగా గెలుచుకున్నామన్నారు. అదే నియోజక వర్గంలో 65 ఎంపీటీసీ స్థానాలకు 64 ఏకగ్రీవంగా సొంతం చేసుకున్నామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలతో కడప జిల్లా వాసులకు ఫ్యాక్షనిస్టులు, గూండాల నుంచి విముక్తి లభించిందన్నారు. రాష్ట్రంతో పాటు కడపలో అభివృద్ధి అంటే ఏమిటో చూపిస్తామన్నారు. కడప సహా రాయలసీమ వ్యాప్తంగా పెద్ద ఎత్తున పరిశ్రమలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. కడప, పులివెందులలో తాగునీటి ప్రాజెక్టులు చేపడుతున్నామన్నారు. ట్రిపుల్ సర్కార్ తో అభివృద్ధి, సంక్షేమాన్ని రాష్ట్రంలో పరుగులు పెట్టిస్తామని మంత్రి సవిత తెలిపారు.

జగన్ పై వైసీపీ కేడర్ కు నమ్మకం లేదు...

జగన్ ను ప్రజలే కాదు చివరికి వైసీపీ శ్రేణులు సైతం నమ్మడం లేదని మంత్రి సవిత తెలిపారు. ఆయనెంత ఒత్తిడి తీసుకొచ్చినా స్థానిక సంస్థల ఎన్నికల్లో నామినేషన్లు వేయడానికి వైసీపీ శ్రేణులు ముందుకు రావడం లేదన్నారు. దేశ రాజకీయాల్లో నాయకుడిని నమ్మని క్యాడర్ వైసీపీలో మాత్రమే ఉందన్నారు. రాష్ట్రంలో వైసీపీ పని ఖేల్ ఖతం దుకాణం బందయ్యిందన్నారు. మున్సిపల్, పరిషత్ ఎన్నికల్లో వైసీపీ శ్రేణులు పలు చోట్ల నామినేషన్లు వేయకపోవడ వల్లే ఏకగ్రీవాలు జరిగాయన్నారు. ఇది వైసీపీకి, జగన్ కు సిగ్గుచేటని మంత్రి సవిత అన్నారు.

ఓటమి భయంతో జగన్ లో అసహనం

స్థానిక సంస్థల ఎన్నికల రూపంలో మరో ఘోర ఓటమి ఖాయం కావడంతో జగన్ లో అసహనం పెరిగిపోయిందని మంత్రి సవిత అన్నారు. చొక్కా మడత పెడితే...అంటూ ప్రజలు, అధికారులను భయపెట్టేలా మాట్లాడుతున్నారన్నారు. రాబోయే పంచాయతీ ఎన్నికల్లోనైనా పార్టీ ఉనికిని కాపాడుకోడానికి కిందా మీదా పడుతున్నారని ఎద్దేవా చేశారు. గతంలో ఇదే మాదిరిగా, సీఎంగా ఉన్నప్పుడు తలపై వెంట్రుక కూడా పీకలేరని రెచ్చగొట్టేలా మాట్లాడారన్నారు. దీంతో ప్రజలు వైసీపీని 11 సీట్లకు పరిమితం చేసి తగిన గుణపాఠం చెప్పారన్నారు. అయినా జగన్ నైజం మారడం లేదన్నారు. గొడ్డలి పార్టీ నాయకుడి మాటలతో రెచ్చిపోతే నష్టపోయేది వారేనని మంత్రి సవిత హితవు పలికారు.'స్థానికం'లో స్వీప్ చేయబోతున్నాం స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి పార్టీలు స్వీప్ చేయబోతున్నాయని మంత్రి సవిత ధీమా వ్యక్తంచేశారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునేలా సీఎం చంద్రబాబునాయుడు పాలన సాగిస్తున్నారన్నారు. సూపర్ సిక్స్ పథకాల అమలుతో పాటు అభివృద్ధి కార్యక్రమాలను పెద్ద ఎత్తున చేపడుతున్నామన్నారు.సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పనితీరు పై ప్రజల్లో పూర్తిస్థాయి సంతృప్తి వ్యక్తమవుతోందని, గ్రామాల్లో తమకు బ్రహ్మరథం పడుతున్నారని మంత్రి సవిత తెలిపారు

ప్రజా సమస్యల పరిష్కారానికి సమిష్టిగా పోరాడుదాం

- ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ పట్టణ కన్వీనర్
- కుక్క శ్రావణ్ కుమార్

ప్రజావాణి జిల్లా ప్రతినిధి పెద్దపల్లి:అక్టోబర్ 28 పెద్దపల్లి నియోజకవర్గ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం అన్ని రాజకీయ పార్టీలు సమిష్టిగా కలిసి పోరాడాలని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ పట్టణ కన్వీనర్ కుక్క శ్రావణ్ కుమార్ పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన ఏఐఎంఐఎం పార్టీ పట్టణ అధ్యక్షుడు సయ్యద్ ఉమైర్, ఉపాధ్యక్షుడు, లీగల్ అడ్వైజర్ ఇమ్రాన్, జాయింట్ సెక్రటరీ ఎండీ మోహిద్‌తో పాటు నూతన కార్యవర్గ సభ్యులకు ప్రజా సమస్యలపై సమిష్టిగా పోరాడాల్సిన అవసరాన్ని వివరించారు.ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా అన్ని రాజకీయ పార్టీలు కలిసికట్టుగా పనిచేయాలని, ప్రజలకు అండగా నిలవాలని కోరారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన ఏఐఎంఐఎం కార్యవర్గ సభ్యులను శాలువాలతో ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో ఎండీ షఫీ, నూనె వెంకటేష్, ఎండీ మెహరాజ్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం - మెదక్ DSP కార్యాలయంలో మెగా రక్తదాన శిబిరంలో

- 45వ సారి రక్తదానం చేసిన సంతోష్ రావు పాటిల్

ప్రజా వాణి న్యూస్ అక్టోబర్ 21 సంగారెడ్డి జిల్లామెదక్: పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా మెదక్ DSP కార్యాలయంలో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరంలో రేగోడ్ మండలం టీ. లింగంపల్లి కి చెందిన సంతోష్ రావు పాటిల్ 45 వసారి రక్తదానం చేశారు. అల్లాదుర్గం సి ఐ శ్రీమతి రేణుక రెడ్డి ఎస్ ఐ పోచయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో పాల్గొని రక్తదానం చేశారు. విధి నిర్వహణలో అమరులైన పోలీసు జవాన్లకు నివాళులర్పిస్తూ, వారి స్ఫూర్తితో రక్తదానం చేయడం గర్వకారణమని వారు తెలిపారు. రక్తదానం ప్రాణదానంతో సమానమని, ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా ముందుకు రావాలని సి ఐ రేణుక రెడ్డి పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మెదక్ పోలీస్ శాఖ అధికారులు, సిబ్బంది పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

నగరంలో హోరెత్తిన కూటమి నాయకుల ప్రచారాలు

- 52, 58 డివిజన్లలో కూటమి నాయకుల భారీ రోడ్ షో
- కేంద్రం నుంచి నిధులు కావాలంటే ఎన్డీఏని గెలిపించండి.. మంత్రి సత్య కుమార్

అనంత పురం బ్యూరో అక్టోబర్ 28 ప్రజా వాణి అనంతపురం నగరంలో కూటమి నాయకుల ప్రచారాలతో పోరెత్తింది. 52, 58 డివిజన్లలో నిర్వహించిన రోడ్డు షో కి ప్రజలు బ్రహ్మరథం పట్టారు. ఈ కార్యక్రమంలో మంత్రి సత్యకుమార్ , అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, హిందూపురం ఎంపీ పార్థసారథి, ఎమ్మెల్సీ దళవాయి రమాదేవి సంయుక్తంగా పాల్గొన్నారు. 52వ డివిజన్ కార్పొరేటర్ అభ్యర్థి దలవాయి కుమార్, నరేంద్ర డివిజన్ కార్పొరేటర్ అభ్యర్థి నాగరత్నమ్మ, మేయర్ అభ్యర్థి అజేష్ బాబు కు ఓటు వేసి గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ రోడ్ షోకు వేలాది సంఖ్యలో ప్రజలు, మహిళలు, యువకులు స్వచ్ఛందంగా తరలివచ్చి నేతలకు గజమాలలతో అపూర్వ స్వాగతం పలికారు. ప్రచారం పొడవునా ఎటు చూసినా "జై చంద్రబాబు, జై మోడీ, జై పవన్ కళ్యాణ్" అనే నినాదాలతో నగర వీధులు హోరెత్తాయి. ఈ ప్రచార కార్యక్రమంలో మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ గత ఐదేళ్ల వైసిపి అరాచక పాలనలో దాడులు, దౌర్జన్యాలు చేసి ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేశారన్నారు. అందుకే సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు ఆ పార్టీకి గట్టి తీర్పు ఇచ్చి కూటమి ప్రభుత్వానికి అవకాశం ఇచ్చారని గుర్తు చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సమాంతరంగా పెద్ద ఎత్తున వేగవంతం చేశామన్నారు. రాష్ట్రానికి రూ. 20 లక్షల కోట్ల వరకు అభివృద్ధి నిధులు తేవడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని చెప్పారు. గతంలో చంద్రబాబు నాయుడు హయాంలో కియా పరిశ్రమ వస్తే, ప్రస్తుతం పుట్టపర్తి ప్రాంతానికి యుద్ధ విమానాలు తయారు చేసే భారీ పరిశ్రమ కూడా వచ్చిందన్నారు. వైసిపి హయాంలో అక్రమ మద్యం, గంజాయి దందా విచ్చలవిడిగా సాగాయని, ఆస్తి పత్రాల మీద కూడా జగన్మోహన్ రెడ్డి తన బొమ్మ వేసుకున్నారని విమర్శించారు. చివరకు ఇళ్లలోని చెత్తపై కూడా పన్ను వేసి ప్రజలను పీడించారని, ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఆ చెత్త పన్నును పూర్తిగా తొలగించిందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా వృద్ధులకు భారీగా పింఛన్లు ఇస్తున్నామని, ఆరోగ్య శాఖలో ఎన్నో విప్లవాత్మక మార్పులు తెచ్చి ఆసుపత్రుల్లో సౌకర్యాలు మెరుగుపరిచామని చెప్పారు. మహిళా సాధికారత దిశగా అనేక పథకాలను నేరుగా మహిళల పేరు మీదే ఇస్తున్నామని వివరించారు. ప్రస్తుతం కేంద్రంలో, రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వం ఉంది కాబట్టి నగరంలోనూ ఎన్డీఏ అభ్యర్థులను గెలిపిస్తేనే నిధులు వస్తాయని, వైసిపికి వేసే ఓటు పూర్తిగా వృథా అవుతుందని మంత్రి అన్నారు. అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ ఒక సాధారణ పార్టీ కార్యకర్తగా, క్లస్టర్ ఇన్‌ఛార్జ్‌గా పనిచేసిన వడ్డెర కులానికి చెందిన దలవాయి రమాదేవికి ఎమ్మెల్సీ పదవి ఇచ్చి గౌరవించారన్నారు. ఇది బీసీల పట్ల కూటమి ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. జగన్ మోహన్ రెడ్డికి రాష్ట్రంలో ఏ ఎన్నికలూ జరగకూడదనే దురుద్దేశం ఉందని, అందుకే స్థానిక సంస్థల ఎన్నికల్లో అల్లర్లు సృష్టిస్తున్నారని మండిపడ్డారు. పులివెందుల, పుంగనూరు వంటి వైసిపి ఎమ్మెల్యేలు ఉన్న చోట్లే గొడవలు జరుగుతున్నాయని, ఒకవేళ ఎన్నికలు ఆగిపోతే కేంద్ర నిధులు రావని, తద్వారా అభివృద్ధి ఆగిపోతే ప్రభుత్వానికి చెడ్డపేరు తేవాలనే కుట్ర వైసీపీ చేస్తోందన్నారు. బీసీలకు 34% రిజర్వేషన్లు ఇవ్వాలని తాము భావిస్తే గతంలో వైసిపి నేతలు హైకోర్టు, సుప్రీంకోర్టులకు వెళ్లి అడ్డుకున్నారని, అయినప్పటికీ తాము పార్టీ పరంగా 34% కంటే ఎక్కువ సీట్లను బీసీలకే కేటాయించామన్నారు. అనంతపురంలో మేయర్ అభ్యర్థిగా అజేష్ బాబు గెలిస్తే నగరానికి ఔటర్ రింగ్ రోడ్డు, ఎయిర్‌పోర్ట్ కనెక్టివిటీ, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వస్తాయని స్పష్టం చేశారు. ప్రస్తుతం ఉన్న డంపింగ్ యార్డును అక్కడి నుండి తొలగించి వేస్ట్ మేనేజ్మెంట్ ప్లాంట్ తెస్తామని, అక్కడ సుందరమైన పార్కును ఏర్పాటు చేస్తామన్నారు. అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ..ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఆధ్వర్యంలో అనంతపురం నగరం అత్యంత వేగంగా ప్రగతి పథంలో పయనిస్తోందన్నారు. కేవలం రహదారులు, డ్రైనేజీలు వంటి కనీస మౌలిక వసతుల కోసమే నగరంలో రూ. 300 కోట్లకు పైగా ఖర్చు చేశామని వెల్లడించారు. నరేంద్ర మోడీ ఆలోచన, చంద్రబాబు యుక్తి, పవన్ కళ్యాణ్ శక్తి కలిస్తే ఒక మహాశక్తిగా మారి అభివృద్ధి, సంక్షేమాన్ని నడిపిస్తున్నాయన్నారు. నగరం మరింత అభివృద్ధి చెందాలంటే బీజేపీ మేయర్ అభ్యర్థితో పాటు 62 స్థానాల్లో కూటమి గెలవడం చారిత్రాత్మక అవసరమన్నారు.హిందూపురం ఎంపీ పార్థసారథి మాట్లాడుతూ, తాము ఎన్నికల ముందు చెప్పిన హామీలే కాకుండా, చెప్పని హామీలను సైతం నెరవేరుస్తున్నామని, అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు రాకెట్ వేగంతో సాగుతున్నాయన్నారు. అనంతపురం జిల్లాకు కీలకమైన హంద్రీనీవా సుజల స్రవంతి ప్రాజెక్టు కాలువ విస్తరణ పనులను రూ. 3,500 కోట్లతో చేపట్టి నాలుగు వేల క్యూసెక్కుల నీరు వచ్చేలా మార్పులు చేశామన్నారు.ఈ అభివృద్ధి ఇలాగే నిరంతరాయంగా కొనసాగాలంటే నగర ప్రజలంతా ఆలోచించి మేయర్ అభ్యర్థి అజేష్ బాబుతో పాటు కూటమి కార్పొరేటర్ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

అప్పుల ఊబి వద్దు.. ఆరు తడి పంట ముద్దు

చెన్నారావుపేట అక్టోబర్ 28 ప్రజావాణి రాబోయే యాసంగి సీజన్‌లో ఎల్ నినో ప్రభావం వల్ల వాతావరణంలో మార్పులు వచ్చే అవకాశం ఉన్నందున, రైతులు ముందస్తు ప్రణాళికతో ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించాలని మండల వ్యవసాయ అధికారి గోపాల్ రెడ్డి సూచించారు. మండల కేంద్రంలోని కోనాపురం గ్రామంలో బుధవారం నిర్వహించిన 'ఖేత్ బచావో అభియాన్ భూ సంరక్షణ అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.ఈ సందర్భంగా ఆయన రైతులకు పలు కీలక సూచనలు చేశారు. అందుబాటులో ఉన్న నీటి వనరులను, నీటి లభ్యతను ముందే అంచనా వేసుకుని దానికి అనుగుణంగానే పంటలను ఎంచుకోవాలి.వరి సాగులో నీటి వినియోగాన్ని తగ్గించడానికి ఆధునిక జీరో వరి సాగు పద్ధతులపై రైతులు అవగాహన పెంచుకోవాలి.పంట కోతల తర్వాత మిగిలిపోయే వ్యర్థాలను, అవశేషాలను తగులబెట్టకూడదు. వాటిని భూమిలోనే కలియదున్నడం వల్ల భూసారం పెరగడమే కాకుండా పర్యావరణ కాలుష్యాన్ని నివారించవచ్చు. లేనిపోని ఆర్భాటాలకు పోయి, ఎక్కువ పెట్టుబడులు పెట్టి నష్టపోవద్దని, తద్వారా అప్పుల ఊబిలో చిక్కుకుని రైతులు కష్టాల పాలు కావద్దని హితవు పలికారు.ఈ అవగాహన కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మైదాం రాకేష్, సుధాకర్, వెటర్నరీ డాక్టర్ జూనిల్, ఉప సర్పంచ్ నర్సింరాములు, పీఏసీఎస్ డైరెక్టర్ ఆవుల రాములు, వ్యవసాయ విస్తరణ అధికారి శశి, మరియు గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.ం

గల్లావాళ్ల ఊరు , తడకరలో టీడీపీ జడ్పీటీసీ అభ్యర్థి వెంకటేశ్వర్ చౌదరి ప్రచారం

తవణంపల్లి, అక్టోబర్ 28:తవణంపల్లి మండలంలోని గల్లా వాళ్ల ఊరు,తడకర గ్రామాల్లో బుధవారం తెలుగుదేశం పార్టీ జడ్పీటీసీ అభ్యర్థి వెంకటేశ్వర్ చౌదరి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థులను కలిసి సైకిల్ గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. తాను విజయం సాధిస్తే మండల అభివృద్ధికి కృషి చేయడంతో పాటు ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తానని వెంకటేశ్వర్ చౌదరి తెలిపారు. గ్రామాల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తానని పేర్కొంటూ ఓటర్లను కలిసి ప్రచారం కొనసాగించారు. ఆయనతోపాటు తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నాలుగోసారి రక్తదానం చేసిన వార్డు సభ్యుడు తొగరి హరీష్

జగిత్యాల జిల్లా, మేడిపల్లి అక్టోబర్ 28 (ప్రజావాణి):అత్యవసర సమయంలో స్పందిస్తూ సమాజ సేవలో ముందంజలో ఉంటున్నాడు మేడిపల్లి మండలం కట్లకుంట గ్రామానికి చెందిన 11వ వార్డు సభ్యుడు తొగరి హరీష్. తాజాగా ఓ బాధితుడికి అత్యవసరంగా రక్తం అవసరం కాగా, ఆయన ముందుకు వచ్చి నాలుగోసారి రక్తదానం చేసి తన ఉదారతను, మానవత్వాన్ని చాటుకున్నారు. ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడానికి రక్తదానం చేయడం ద్వారా ప్రాణదానం చేయవచ్చనే గొప్ప ఉద్దేశంతో ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. సమయానికి స్పందించి రక్తం అందించి ప్రాణదాతగా నిలిచిన హరీష్‌ను గ్రామస్థులు, పలువురు ప్రముఖులు అభినందించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ... ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేయడం ఎంతో పుణ్యకార్యమని, హరీష్‌ను స్ఫూర్తిగా తీసుకుని ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేయడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

గురువారం,
అక్టోబర్ 29, 2026
ప్రజావాణి
తెలుగు దినపత్రిక

మూడు ఆసియా పారా గేమ్స్ స్వర్ణాలు సాధించిన నీరజ్ యాదవ్ మృతి

డోపింగ్ సస్పెన్షన్‌తో ఇటీవల పోటీలకు దూరం.. మృతిపై దర్యాప్తు

న్యూఢిల్లీ, అక్టోబర్ 28: భారత పారా క్రీడా రంగంలో విషాదం చోటుచేసుకుంది. మూడుసార్లు ఆసియా పారా గేమ్స్‌లో స్వర్ణ పతకాలు సాధించిన ప్రముఖ పారా అథ్లెట్ నీరజ్ యాదవ్ మృతి చెందారు. ఆయన తన నివాసంలో విషం తీసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ప్రాథమిక సమాచారం. ఈ విషయాన్ని భారత పారా అథ్లెటిక్స్ జట్టు ప్రధాన కోచ్ ఎస్. సత్యనారాయణ ధ్రువీకరించారు. ఆయన మృతదేహానికి ఢిల్లీలోని ఆసుపత్రిలో శవపరీక్ష నిర్వహించేందుకు తరలించినట్లు సమాచారం.

క్రీడా జీవితంలో ఎన్నో విజయాలు ఉత్తరప్రదేశ్‌కు చెందిన నీరజ్ యాదవ్ చిన్నతనంలోనే పోలియో బారినపడినప్పటికీ, క్రీడలపై ఆసక్తితో ముందుకు సాగారు. తొలుత వీల్‌చైర్ టెన్నిస్‌లో పాల్గొన్న ఆయన, 2015లో పారా అథ్లెటిక్స్ వైపు అడుగులు వేశారు. జావెలిన్ త్రో, డిస్కస్ త్రో, షాట్‌పుట్ విభాగాల్లో ప్రతిభ చాటారు. 2015లో ఢిల్లీలో జరిగిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో మూడు విభాగాల్లో స్వర్ణ పతకాలు సాధించి గుర్తింపు పొందారు. 2018లో ఇండోనేషియాలో జరిగిన ఆసియా పారా గేమ్స్‌లో పురుషుల ఎఫ్55 జావెలిన్ త్రో విభాగంలో స్వర్ణ పతకం సాధించడంతో పాటు ఆసియా రికార్డు నెలకొల్పారు. అనంతరం 2023లో చైనాలోని హాంగ్‌జౌలో జరిగిన ఆసియా పారా గేమ్స్‌లో జావెలిన్ త్రో, డిస్కస్ త్రో విభాగాల్లో మరో రెండు స్వర్ణ పతకాలను గెలుచుకున్నారు. దీంతో ఆసియా పారా గేమ్స్‌లో ఆయన సాధించిన స్వర్ణ పతకాల సంఖ్య మూడుకు చేరింది.

డోపింగ్ కేసుతో నిలిచిన క్రీడా ప్రయాణం 2023లో జాతీయ డోపింగ్ నిరోధక సంస్థ నిర్వహించిన పరీక్షలో ఆయన నమూనాలో నిషేధిత పదార్థం ఉన్నట్లు తేలడంతో డోపింగ్ వ్యవహారం తెరపైకి వచ్చింది. ఈ పరీక్ష ఫలితాలను నీరజ్ యాదవ్ సవాలు చేసినట్లు వార్తా కథనాలు పేర్కొన్నాయి. ఈ వ్యవహారంలో ఆయనపై తాత్కాలిక సస్పెన్షన్ విధించారు. దీంతో ఈ ఏడాది అక్టోబర్‌లో జరిగిన ఐచినగోయా ఆసియా పారా గేమ్స్‌లో ఆయన పాల్గొనలేకపోయారు. పోటీలకు దూరం కావడం వల్ల ఆయన తీవ్ర మానసిక ఒత్తిడికి గురై ఉండవచ్చని కోచ్ అభిప్రాయపడినట్లు వార్తా కథనాలు వెల్లడించాయి. అయితే, నీరజ్ యాదవ్ మృతికి ఇదే కారణమని నిర్ధారించే అధికారిక సమాచారం ఇంకా వెలువడలేదు.

కారణాలపై కొనసాగుతున్న ఉత్కంఠ నీరజ్ యాదవ్ మృతికి సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. ఘటనకు దారితీసిన పరిస్థితులు, ఇతర అంశాలపై అధికారులు దర్యాప్తు చేయనున్నారు. చిన్నతనంలో ఎదురైన శారీరక సవాళ్లను అధిగమించి అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన అథ్లెట్ మృతి భారత పారా క్రీడా రంగంలో విషాదాన్ని నింపింది.

టీమిండియా చాలా ప్రమాదకరమైన జట్టు!

• అందుకే మా జట్టును ప్రశంసించా.. వెస్టిండీస్ కోచ్ డారెన్ శామీ

హైదరాబాద్, అక్టోబర్ 28: న్యూజిలాండ్‌తో జరుగుతున్న టీ20 సిరీస్‌లో టీమిండియా దూకుడైన ఆటతీరుపై వెస్టిండీస్ జట్టు ప్రధాన కోచ్ డారెన్ శామీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. భారత్ అత్యంత ప్రమాదకరమైన జట్టని, అలాంటి జట్టుతో భారత్‌లోనే తలపడి తమ జట్టు సాధించిన ఫలితం గొప్పదని పేర్కొన్నాడు. న్యూజిలాండ్‌తో జరిగిన మూడో టీ20లో భారత బ్యాటర్లు చెలరేగిన తీరు తన అభిప్రాయాన్ని మరోసారి గుర్తు చేసిందని సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా స్పందించాడు.

బౌలర్లకు సవాలుగా పరిస్థితులు చిన్న బౌండరీలు, బ్యాటింగ్‌కు అనుకూలమైన పిచ్‌లు, తడి బంతితో బౌలింగ్ చేయాల్సిన పరిస్థితులు బ్యాటర్లకు కలిసొస్తాయని శామీ పేర్కొన్నాడు. ఇలాంటి పరిస్థితుల్లో టీమిండియాను ఎదుర్కోవడం ఎంత కష్టమో తాజా మ్యాచ్ మరోసారి నిరూపించిందని తెలిపాడు. ఇటీవల భారత్‌తో జరిగిన ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్ వర్షం కారణంగా చివరి మ్యాచ్ రద్దు కావడంతో 22తో ముగిసింది. ఈ నేపథ్యంలో తమ జట్టు ప్రదర్శనను ప్రశంసించడంలో తప్పేమీ లేదని శామీ వ్యాఖ్యల సారాంశం.

అభిషేక్ శర్మ విధ్వంసకర ఇన్నింగ్స్ న్యూజిలాండ్‌తో వెల్లింగ్టన్‌లో జరిగిన మూడో టీ20లో భారత్ అద్భుత విజయాన్ని అందుకుంది. 199 పరుగుల లక్ష్యాన్ని కేవలం 13.2 ఓవర్లలోనే ఛేదించి ఆరు వికెట్ల తేడాతో గెలిచింది. యువ బ్యాటర్ అభిషేక్ శర్మ కేవలం 38 బంతుల్లోనే 113 పరుగులు చేసి ప్రత్యర్థి బౌలర్లపై విరుచుకుపడ్డాడు. మరో ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ 19 బంతుల్లో 45 పరుగులు సాధించి జట్టు విజయానికి కీలక సహకారం అందించాడు. వీరిద్దరూ కలిసి 7.1 ఓవర్లలోనే 133 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు.

భారత్ జోరుకు కివీస్ కళ్లెం వేయగలదా? ఈ విజయంతో ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో భారత్ 30 ఆధిక్యాన్ని సాధించి సిరీస్‌ను కైవసం చేసుకుంది. వరుస విజయాలతో భారత జట్టు దూకుడు ప్రదర్శిస్తుండగా, మిగిలిన మ్యాచ్‌ల్లోనైనా గెలిచి పరువు నిలబెట్టుకోవాలని న్యూజిలాండ్ భావిస్తోంది. మరోవైపు, భారత్‌తో జరిగిన సిరీస్‌లో తమ జట్టు చూపిన పోరాటాన్ని సమర్థించుకునేలా శామీ వ్యాఖ్యలు చేశాడు. ఆధునిక టీ20 క్రికెట్‌లో బ్యాటర్ల దూకుడు, మైదాన పరిస్థితులు బౌలర్లకు ఎలాంటి సవాళ్లు విసురుతున్నాయో ఈ పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి.

పాక్ గడ్డపై చరిత్ర సృష్టించిన లంక బౌలర్!

• 30 ఏళ్ల రికార్డు బద్దలు.. ఐదు వికెట్లతో దిల్షాన్ మదుషంక సంచలనం

లాహోర్, అక్టోబర్ 28: శ్రీలంక యువ పేసర్ దిల్షాన్ మదుషంక పాకిస్థాన్ గడ్డపై చరిత్ర సృష్టించాడు. వన్డే ముక్కోణపు సిరీస్‌లో భాగంగా పాకిస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లో అద్భుత బౌలింగ్‌తో అదరగొట్టాడు. 8.3 ఓవర్లలో 34 పరుగులు మాత్రమే ఇచ్చి ఐదు వికెట్లు పడగొట్టాడు. దీంతో పాకిస్థాన్ గడ్డపై ఆతిథ్య జట్టుపై అత్యుత్తమ బౌలింగ్ గణాంకాలు నమోదు చేసిన విదేశీ పేసర్‌గా రికార్డు సాధించాడు. ఈ క్రమంలో న్యూజిలాండ్ బౌలర్ క్రిస్ హారిస్ పేరిట ఉన్న 30 ఏళ్ల రికార్డును అధిగమించాడు.

పాక్ బ్యాటింగ్ పతనం లాహోర్‌లోని గడాఫీ స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన పాకిస్థాన్ శ్రీలంక బౌలర్ల ధాటికి 25.3 ఓవర్లలో 110 పరుగులకే ఆలౌటైంది. బాబర్ ఆజమ్ 29 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. మిగతా బ్యాటర్లు పెద్దగా రాణించలేకపోయారు. మదుషంక ఫఖర్ జమాన్, సాద్ బేగ్, అరాఫత్ మిన్హాస్, షాహీన్ షా అఫ్రిది, హారిస్ రవూఫ్‌లను పెవిలియన్‌కు పంపాడు. అతడి ధాటికి పాక్ బ్యాటింగ్ కుప్పకూలింది.

క్రిస్ హారిస్ రికార్డు బద్దలు 1996లో న్యూజిలాండ్ బౌలర్ క్రిస్ హారిస్ పాకిస్థాన్‌పై 42 పరుగులిచ్చి ఐదు వికెట్లు పడగొట్టాడు. అప్పటి నుంచి కొనసాగుతున్న రికార్డును మదుషంక 5/34 గణాంకాలతో తిరగరాశాడు. పాకిస్థాన్ గడ్డపై ఆతిథ్య జట్టుపై విదేశీ పేసర్లు సాధించిన అత్యుత్తమ బౌలింగ్ ప్రదర్శనగా ఇది నిలిచింది.

శ్రీలంక ఘన విజయం బౌలింగ్‌లో సత్తా చాటిన శ్రీలంక, బ్యాటింగ్‌లోనూ అదరగొట్టింది. 111 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని 18.1 ఓవర్లలో రెండు వికెట్లు కోల్పోయి ఛేదించింది. కమిందు మెండిస్ అజేయంగా 62 పరుగులు చేయగా, పావన్ రత్నాయకే 23 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. దీంతో శ్రీలంక ఎనిమిది వికెట్ల తేడాతో ఘన విజయం సాధించి ముక్కోణపు సిరీస్ ఫైనల్‌కు అర్హత సాధించింది. అద్భుత బౌలింగ్ ప్రదర్శన చేసిన మదుషంకకు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది.

రాణించిన అభిరథ్, రాహుల్

- పంజాబ్‌పై హైదరాబాద్ దీటైన పోరు.. తొలి ఇన్నింగ్స్‌లో 193/2

హైదరాబాద్, అక్టోబర్ 28: రంజీ ట్రోఫీ మూడో రౌండ్ పోటీల్లో భాగంగా పంజాబ్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో హైదరాబాద్ జట్టు దీటుగా బదులిస్తోంది. పంజాబ్ తొలి ఇన్నింగ్స్‌లో 431 పరుగులకు ఆలౌట్ కాగా, రెండో రోజు ఆట ముగిసే సమయానికి హైదరాబాద్ 54 ఓవర్లలో రెండు వికెట్ల నష్టానికి 193 పరుగులు చేసింది. అభిరథ్ రెడ్డి, రాహుల్ రాదేశ్ అర్ధశతకాలతో రాణించి జట్టును పోటీలో నిలిపారు.

సెంచరీకి మూడు పరుగుల దూరంలో అభిరథ్ హైదరాబాద్ ఓపెనర్ అభిరథ్ రెడ్డి అద్భుత బ్యాటింగ్‌తో ఆకట్టుకున్నాడు. 140 బంతులు ఎదుర్కొని 12 ఫోర్లు, ఒక సిక్సర్‌తో 97 పరుగులు సాధించాడు. సెంచరీకి కేవలం మూడు పరుగుల దూరంలో ఉండగా ఉమేశ్ యాదవ్ బౌలింగ్‌లో వికెట్ కీపర్ సలీల్ అరోరాకు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. మరోవైపు రాహుల్ రాదేశ్ నిలకడగా ఆడుతూ 154 బంతుల్లో తొమ్మిది ఫోర్లతో 72 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు.

రెండో వికెట్‌కు కీలక భాగస్వామ్యం తొలి వికెట్‌గా తన్మయ్ అగర్వాల్ రెండు పరుగులకే ఔటవడంతో హైదరాబాద్ 15 పరుగుల వద్ద వికెట్ కోల్పోయింది. ఆ తర్వాత అభిరథ్, రాహుల్ కలిసి పంజాబ్ బౌలర్లను సమర్థంగా ఎదుర్కొన్నారు.

రెండో వికెట్‌కు 154 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పి జట్టుకు బలమైన పునాది వేశారు. ఆట ముగిసే సమయానికి రాహుల్‌తో పాటు కొడిమెల హిమతేజ ఎనిమిది పరుగులతో క్రీజులో ఉన్నాడు.

సాలిల్ అరోరా శతకం.. పంజాబ్ భారీ స్కోరు అంతకుముందు పంజాబ్ వికెట్ కీపర్ బ్యాటర్ సాలిల్ అరోరా 268 బంతుల్లో 11 ఫోర్లు, నాలుగు సిక్సర్లతో 151 పరుగులు చేసి జట్టుకు భారీ స్కోరు అందించాడు. ఉమేశ్ యాదవ్ 37 పరుగులతో అజేయంగా నిలిచాడు. చివరి వికెట్‌కు వీరిద్దరూ 116 పరుగులు జోడించడం విశేషం. హైదరాబాద్ బౌలర్లలో కెప్టెన్ సీవీ మిలింద్ నాలుగు వికెట్లు, రక్షణ్ రెడ్డి మూడు వికెట్లు పడగొట్టారు. రెండో రోజు ఆట ముగిసే సమయానికి హైదరాబాద్ ఇంకా 238 పరుగుల వెనుకంజలో ఉంది. తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం సాధించాలంటే మూడో రోజు హైదరాబాద్ బ్యాటర్లు మరింత బాధ్యతగా ఆడాల్సి ఉంది.

వైష్ణవి శర్మ సంచలనం.. ఐదు వికెట్లతో అదరగొట్టింది!

- జింబాబ్వే బ్యాటింగ్ పతనం.. భారత మహిళల జట్టు క్లీన్‌స్వీప్‌పై కన్ను

వడోదర, అక్టోబర్ 28: భారత మహిళల క్రికెట్‌లో యువ స్పిన్నర్ వైష్ణవి శర్మ అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకుంది. జింబాబ్వేతో జరుగుతున్న మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా బుధవారం జరిగిన చివరి వన్డేలో ఐదు వికెట్లు పడగొట్టి ప్రత్యర్థి జట్టు పతనాన్ని శాసించింది. ఆమె ధాటికి జింబాబ్వే మహిళల జట్టు 39.5 ఓవర్లలో 131 పరుగులకే కుప్పకూలింది. వైష్ణవి 39 పరుగులిచ్చి ఐదు వికెట్లు తీసుకుంది. అంతర్జాతీయ వన్డే క్రికెట్‌లో ఆమెకు ఇదే తొలి ఐదు వికెట్ల ఘనత కావడం విశేషం.

వరుసగా వికెట్లు తీసి.. ప్రత్యర్థికి షాక్ ఎడమచేతి వాటం స్పిన్నర్ వైష్ణవి తన బౌలింగ్‌తో జింబాబ్వే బ్యాటర్లను తీవ్రంగా ఇబ్బంది పెట్టింది. బెలన్డ్ బిజా (1), మోడెస్టర్ ముపాచిక్వా (37), చిడెజా ధురురు, మిషెల్ మవుంగా, న్యాషా గ్యాంజురాలను పెవిలియన్‌కు పంపింది. దీంతో జింబాబ్వే భారీ స్కోరు సాధించే అవకాశాలు దెబ్బతిన్నాయి. భారత బౌలర్లలో సయాలి సత్ఘరే, క్రాంతి గౌడ్ చెరో రెండు వికెట్లు పడగొట్టి తమ వంతు సహకారం అందించారు.

రెండో వన్డేలోనూ మెరిసిన వైష్ణవి ఈ సిరీస్‌లో వైష్ణవి నిలకడైన ప్రదర్శన చేస్తోంది. రెండో వన్డేలోనూ నాలుగు వికెట్లు తీసి జింబాబ్వే బ్యాటింగ్ లైనప్‌ను దెబ్బతీసింది. ఆ మ్యాచ్‌లో భారత జట్టు 121 పరుగుల తేడాతో విజయం సాధించి మూడు వన్డేల సిరీస్‌లో 20తో తిరుగులేని ఆధిక్యాన్ని సాధించింది. చివరి వన్డేలోనూ వైష్ణవి ఐదు వికెట్లతో చెలరేగడంతో భారత బౌలింగ్ బలం మరోసారి బయటపడింది.

క్లీన్‌స్వీప్‌కు భారత్ సిద్ధం మూడో వన్డేలో జింబాబ్వేను 131 పరుగులకే పరిమితం చేయడంతో భారత్ ముందు 132 పరుగుల లక్ష్యం నిలిచింది. ఈ మ్యాచ్‌లోనూ విజయం సాధిస్తే మూడు వన్డేల సిరీస్‌ను 30తో క్లీన్‌స్వీప్ చేసినట్లవుతుంది. యువ బౌలర్ వైష్ణవి శర్మ ప్రదర్శన భారత మహిళల జట్టుకు మరింత ఆత్మవిశ్వాసాన్ని అందించింది.

ఏఐ ప్రమాదకరం

: డీప్ ఫేక్ వీడియోలపై కృతి సనన్ పోరాటం

ప్రముఖ బాలీవుడ్ నటి కృతి సనన్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) దుర్వినియోగంపై న్యాయపోరాటానికి దిగారు. తన వ్యక్తిత్వ, ప్రచార హక్కులను (పర్సనాలిటీ అండ్ పబ్లిసిటీ రైట్స్) కాపాడాలంటూ ఆమె ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఏఐ టెక్నాలజీని ఉపయోగించి తన అనుమతి లేకుండా డీప్‌ఫేక్ వీడియోలు, ఫేక్ ఎండార్స్‌మెంట్లు సృష్టించకుండా అడ్డుకోవాలని ఆమె కోరారు.

ఈ పిటిషన్‌పై జస్టిస్ పురుషైంద్ర కుమార్ కౌరవ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. వ్యక్తిత్వ హక్కులకు సంబంధించిన అంశాలపై మరిన్ని వివరాలు, గత తీర్పులను సమర్పించాలని కృతి తరఫు న్యాయవాదులను ఆదేశిస్తూ, తదుపరి విచారణను రేపటికి వాయిదా వేసింది.

ఇటీవల ఒక కార్యక్రమంలో మాట్లాడిన కృతి సనన్, ఏఐ టెక్నాలజీ తనను తీవ్రంగా భయపెడుతోందని వ్యాఖ్యానించారు. "ఏఐ ఒక పదునైన కత్తి లాంటిది, అది ఎంత పదునుగా ఉంటే అంత ప్రమాదకరం" అని ఆమె అన్నారు. సోషల్ మీడియాలో ఏఐ ద్వారా సృష్టించిన తన ఫొటోలను రిపోర్ట్ చేయడానికి సరైన నిబంధనలు కూడా లేవని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలోనే ఆమె కోర్టును ఆశ్రయించడం ప్రాధాన్యత సంతరించుకుంది.

నవీన్ చంద్ర హీరోగా నటిస్తున్న 51వ సినిమా షూటింగ్ పూర్తి

విలక్షణ నటుడు నవీన్ చంద్ర హీరోగా నటిస్తున్న కొత్త సినిమా షూటింగ్ పూర్తయింది. ఆయన కెరీర్‌లో ఇది 51వ చిత్రం కావడంతో, తాత్కాలికంగా 'ఎన్‌సీ 51' అనే టైటిల్‌తో ఈ ప్రాజెక్ట్‌ను పిలుస్తున్నారు. ఆర్.పి. బాల దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా చిత్రీకరణ చెన్నైలో ముగిసింది. ఈ విషయాన్ని నవీన్ చంద్ర స్వయంగా సోషల్ మీడియా ద్వారా వెల్లడించాడు.

ఈ చిత్రంలో నవీన్ చంద్ర సరసన హరిప్రియ రోషిణి హీరోయిన్‌గా నటిస్తుండగా, బాల శరవణన్, కాళీ వెంకట్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఓ వినూత్నమైన కథాంశంతో ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని పంచేలా ఈ సినిమాను రూపొందిస్తున్నట్లు చిత్ర యూనిట్ తెలిపింది. దర్శకుడు ఆర్.పి. బాల ఈ చిత్రానికి నిర్మాతగా కూడా వ్యవహరిస్తుండగా, ప్రముఖ సినిమాటోగ్రాఫర్ పి.జి. ముత్తయ్య మరో నిర్మాతగా ఉంటూ సినిమాకు ఛాయాగ్రహణం అందిస్తున్నారు. శక్తి బాలాజీ సంగీతం, అజయ్ మనోజ్ ఎడిటింగ్ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ప్రస్తుతం సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పనులు వేగంగా జరుగుతున్నాయి. త్వరలోనే అన్ని కార్యక్రమాలు పూర్తి చేసి సినిమాను థియేటర్లలో విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. అధికారిక టైటిల్, ఫస్ట్ లుక్ వివరాలను త్వరలో ప్రకటించనున్నారు.

'దొంగ నా కొడుకు' నుంచి 'ఓ మై గాడ్' సాంగ్ రిలీజ్!

పాన్ ఇండియా నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై వస్తున్న వినూత్న చిత్రం 'దొంగ నా కొడుకు'. మౌళి తనూజ్ ప్రశాంత్ హీరోగా నటిస్తున్న ఈ క్రైమ్ కామెడీ సినిమాకు శ్రీను కంబాల దర్శకుడిగా పరిచయమవుతున్నారు. నవంబర్ 13న ఈ చిత్రం థియేటర్లలో విడుదల కానుంది. ఈ నేపథ్యంలో సినిమాపై అంచనాలను పెంచేలా మేకర్స్ మ్యూజికల్ ప్రమోషన్స్‌ను ప్రారంభిస్తూ తాజాగా 'ఓ మై గాడ్' ఫస్ట్ సింగిల్‌ను విడుదల చేశారు. ఆ విశేషాలు ఇప్పుడు చూద్దాం! రామ్ మిరియాల ఎనర్జిటిక్ వాయిస్‌తో మ్యాజిక్: సింజిత్ ఎర్రమిల్లి స్వరపరిచిన 'ఓ మై గాడ్' పాట రొమాంటిక్‌గా, జోష్ నింపేలా ఉంది. ఆకట్టుకునే మ్యూజిక్, కొత్త తరహా బీట్స్ ఈ పాటకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఇక సింగర్ రామ్ మిరియాల తనదైన ఎనర్జీ, ప్రత్యేకమైన వాయిస్‌తో ఈ పాటకు మరింత జోష్ తీసుకొచ్చారు. ఆయన డైనమిక్ వోకల్స్ పాటను మరో లెవెల్‌కి తీసుకెళ్లాయని చెప్పవచ్చు. భాస్కరభట్ల చక్కటి సాహిత్యం: ప్రేమలో పడిన హీరో తన మనసులోని ఫీలింగ్స్ భాస్కరభట్ల సాహిత్యం ద్వారా అందంగా పలికించారు. తన జీవితంలోకి ప్రేయసి వచ్చిన తర్వాత ఎలాంటి మార్పులు చోటుచేసుకున్నాయి, ఆమెతో గడిపే ప్రతి క్షణం ఎందుకు ప్రత్యేకంగా అనిపిస్తుందో ఈ పాటలో చూపించారు. ప్రేమలో కలిగే కొత్త ఉత్సాహం, అనుభూతులను ఈ పాట ఆకట్టుకునేలా రాసారు. అదిరిపోయే కొరియోగ్రఫీ: ఈ పాటకు ఆట సందీప్ అందించిన కొరియోగ్రఫీ చాలా అందంగా ఉంది. హీరో మౌళి తనూజ్ ప్రశాంత్ తన ఎనర్జిటిక్ డ్యాన్స్‌తో ఆకట్టుకోగా, హీరోయిన్ సుష్మిత శెట్టితో ఆయన ఆన్‌స్క్రీన్ కెమిస్ట్రీ ఎంతో క్యూట్‌గా ఉంది. ఇక యూత్‌ఫుల్ రొమాంటిక్ వైబ్‌తో సాగిన ఈ పాట మ్యూజిక్ లవర్స్‌ను ఆకట్టుకుంటోంది. ప్రస్తుతం సోషల్ మీడియాలోనూ ఈ సాంగ్ ట్రెండ్ అవుతోంది. భారీ తారాగణం.. త్వరలోనే రిలీజ్: ఇప్పటికే ఫస్ట్ లుక్ పోస్టర్, టీజర్‌తో మంచి బజ్ క్రియేట్ చేసిన మూవీ ఇప్పుడు ఈ మెలోడీ సాంగ్‌తో సినిమా ప్రమోషన్లను జోరుగా కొనసాగిస్తోంది. ఈ చిత్రంలో అలీ, రజిత, రఘుబాబు, ప్రియా, గుండు సుదర్శన్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఇక నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు.

లాస్ ఏంజిల్స్‌లో 'రామాయణ' స్పెషల్ స్క్రీనింగ్..

భారత సినీ పరిశ్రమలోనే అత్యంత భారీ బడ్జెట్‌తో, ఎన్నో అంచనాల నడుమ తెరకెక్కుతున్న చిత్రం 'రామాయణ'. నితేశ్ తివారీ దర్శకత్వంలో, రణ్‌బీర్ కపూర్, సాయిపల్లవి, యశ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ సినిమా కోసం ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

నవంబర్ 5న దీపావళి కానుకగా మొదటి భాగం ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న నేపథ్యంలో చిత్ర బృందం అక్టోబర్ 27న లాస్ ఏంజిల్స్‌లో ఒక ప్రత్యేక ప్రీమియర్ షోను ఏర్పాటు చేసింది. ఈ ప్రదర్శన అనంతరం సినిమాపై తొలి రివ్యూలు సోషల్ మీడియాలో వచ్చేశాయి.

సినిమా చూసిన వారిలో చాలామంది దీన్ని ఒక అద్భుతమైన దృశ్యకావ్యంగా అభివర్ణించారు. విజువల్స్, సంగీతం, యాక్షన్ సన్నివేశాలు కనీవినీ ఎరుగని రీతిలో ఉన్నాయని కొనియాడారు. ఒక నెటిజన్ రాస్తూ.. ""రామాయణ: రైజ్ ఆఫ్ ఏ లెజెండ్' అద్భుతంగా ఉంది. విజువల్స్, నృత్యాలు, సంగీతం, యాక్షన్ అన్నీ భారీ స్థాయిలో ఉన్నాయి. రణ్‌బీర్ కపూర్ నటన అమోఘం, యశ్ చాలా ఆకర్షణీయంగా కనిపించారు. ఈ ఏడాది అత్యంత గొప్ప సినిమాటిక్ అనుభవాలలో ఇదొకటి" అని పోస్ట్ చేశారు. మరొకరు "వచ్చే వారం బాక్సాఫీస్ వద్ద విధ్వంసం ఖాయం. బ్లాక్‌బస్టర్ గ్యారెంటీ! నటీనటులందరూ అద్భుతంగా నటించారు" అంటూ ప్రశంసించారు. ముఖ్యంగా శ్రీరాముడి పాత్రలో రణ్‌బీర్ కపూర్ నటనకు ప్రేక్షకులు భావోద్వేగానికి గురయ్యారని పలువురు పేర్కొన్నారు. "రామాయణ చిత్రం ప్రేక్షకులను కంటతడి పెట్టించింది. రణ్‌బీర్ ఒక అసాధారణ నటుడు. మేం గెలిచేశాం!" అంటూ ఒక అభిమాని తన ఆనందాన్ని పంచుకున్నారు. ఈ ప్రత్యేక ప్రదర్శనకు నిర్మాత నమిత్ మల్హోత్రా, దర్శకుడు నితేశ్ తివారీ దంపతులు, రణ్‌బీర్ కపూర్, యశ్, సాయిపల్లవి వంటి తారలందరూ సంప్రదాయ దుస్తుల్లో హాజరై ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

కాగా, సినిమాలో ఆత్మ లోపించిందని, దైవిక భావన లేదని, సంగీతం ఆశించిన స్థాయిలో లేదని కొందరు అభిప్రాయపడ్డారు. ఈ సినిమాను రెండు భాగాలుగా, సుమారు రూ.4000 కోట్ల భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నట్లు నిర్మాత నమిత్ మల్హోత్రా గతంలో వెల్లడించారు. "ఏడెనిమిదేళ్ల క్రితం ఈ ప్రాజెక్ట్ మొదలుపెట్టినప్పుడు అందరూ నన్ను పిచ్చివాడిలా చూశారు. ప్రపంచంలోనే గొప్ప ఇతిహాసాన్ని ప్రపంచ ప్రేక్షకుల ముందుకు తీసుకెళుతున్నాం. హాలీవుడ్ సినిమాలతో పోలిస్తే మేం చాలా అద్భుతంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాం" అని ఆయన తెలిపారు.

మొత్తం మీద 'రామాయణ' చిత్రం అద్భుతమైన విజువల్స్, నటీనటుల ప్రతిభతో ప్రశంసలు అందుకుంటోంది. ఈ స్పందనల నడుమ నవంబర్ 5న విడుదల కానున్న ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద ఎలాంటి అద్భుతాలు సృష్టిస్తుందో వేచి చూడాలి.

సందీప్ కిషన్ 'పవర్ పేట'..

'పడమటి వీధి జానకి'గా రితికా నాయక్..

యంగ్ హీరో సందీప్ కిషన్ నటిస్తున్న ఆసక్తికర చిత్రం 'పవర్ పేట'. ఈ సినిమా నుంచి హీరోయిన్ రితికా నాయక్ పుట్టినరోజు (అక్టోబర్ 27) సందర్భంగా ఆమె పాత్రను పరిచయం చేస్తూ చిత్రబృందం ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేసింది. ఇందులో ఆమెను 'పడమటి వీధి జానకి' అనే విభిన్నమైన పేరుతో పరిచయం చేశారు. విడుదలైన పోస్టర్‌లో రితికా నాయక్ ఎంతో సాంప్రదాయబద్ధంగా, హోమ్లీ లుక్‌లో ఆకట్టుకుంటున్నారు. క్రీమ్ కలర్ హాఫ్ శారీ, పింక్ దుపట్టా, స్లీవ్‌లెస్ బ్లౌజ్‌తో పాటు సాంప్రదాయ ఆభరణాలు ధరించి, పాతకాలం నాటి ఇంట్లో హుందాగా కూర్చుని కనిపించారు. ఈ లుక్ ఆమె పాత్రపై ఆసక్తిని రేకెత్తిస్తోంది. అయితే, పోస్టర్‌లో డీగ్లామర్‌గా కనిపిస్తున్నప్పటికీ, సినిమాలో ఆమె కొన్ని గ్లామరస్ సన్నివేశాల్లో కూడా నటిస్తున్నట్లు సమాచారం. ముఖ్యంగా వర్షంలో కొన్ని సీన్లు ఉన్నాయని ప్రచారం జరుగుతోంది. రాజకీయం, ప్రేమ, అధికార పోరాటం వంటి అంశాల నేపథ్యంలో ఈ సినిమాను టాలెంటెడ్ డైరెక్టర్ కృష్ణ చైతన్య తెరకెక్కిస్తున్నారు. సందీప్ కిషన్ ఇందులో 'సేనాపతి రవి' అనే పవర్‌ఫుల్ పాత్రలో నటిస్తున్నారు. మణిశర్మ సంగీతం అందిస్తుండగా, 70ఎంఎం ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై విజయ్ చిల్లా, శశి దేవిరెడ్డి నిర్మిస్తున్నారు. ఇప్పటికే సినిమా షూటింగ్ 60 శాతం పూర్తయింది. 'మిరాయ్', 'కొరియన్ కనకరాజు' వంటి విజయాలతో మంచి ఫామ్‌లో ఉన్న రితికా నాయక్ ఈ చిత్రంలో కథానాయికగా ఎంపిక కావడం విశేషం. గతంలో ఈ ప్రాజెక్ట్ పలువురు హీరోల వద్దకు వెళ్లినప్పటికీ, చివరికి సందీప్ కిషన్‌తో ఖరారైంది. తాజాగా విడుదలైన 'పడమటి వీధి జానకి' గ్లింప్స్ సినిమాపై అంచనాలను పెంచింది. సందీప్, రితికా మధ్య కెమిస్ట్రీ ఎలా ఉండబోతుందోనని ప్రేక్షకులు ఎదురుచూస్తున్నారు.

Printed, Published and Owned by RAYINIPATLA KUMARASWAMY, Printed at SRI VENKATESWARA PRINTING SOLUTIONS, peerzadi guda, GHMC, medchal malkaj giri AND PUBLICATIONS, , Rajanna Sircilla, TELANGANA-505405. RNI NO:TGTEL/25/A5443Editor : RAYINIPATLA KUMARASWAMY, MANAPRAJAVAANI BROAD CASTING AND PUBLICATIONSContact No : 9440032006. MAIL ID : prajavaani006@gmail.comepaper.prajavaani.net